
'పేద ప్రజల ఆరోగ్యమే నాకు మహాభాగ్యం. రాజీవ్ ఆరోగ్యశ్రీ సంజీవనిలా పనిచేస్తోంది. ఈ తృప్తి చాలు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 190

శనివారం 30-9-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పతకాల మోత...

ఆసియా క్రీడల్లో శుక్రవారం భారత క్రీడాకారులు ఎనిమిది పతకాలతో అదరగొట్టారు. షూటింగ్‌లో రెండు స్వర్ణాలు, మూడు రజత పతకాలు వచ్చాయి. పురుషుల టెన్నిస్ డబుల్స్‌లో సాకేత్-రామ్ జోడీ రజతం నెగ్గగా... అథ్లెటిక్స్, స్క్వాష్‌లో ఒక్కో కాంస్య పతకం లభించింది. ఓవరాల్‌గా భారత్ 33 పతకాలతో నాలుగో స్థానానికి ఎగబాకింది.

- వివరాలు 14లో



'ఇండియా' కూటమిలోనే ఉంటాం

ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు.

- వివరాలు 6లో



మహిళా బిల్లుకు ఆమోదం

చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా బిల్లుకు రాష్ట్రపతి ముర్ము ఆమోద ముద్ర వేశారు.

- వివరాలు 6లో



పాక్‌లో ఆత్మాహుతి దాడులు..

పాకిస్తాన్‌లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఆత్మాహుతి దాడుల్లో 58 మంది చనిపోగా, వంద మంది గాయపడ్డారు.

- వివరాలు 6లో



2029 నుంచి జమిలి ఎన్నికలు!

జమిలి ఎన్నికలు 2029 నుంచి నిర్వహించడానికి వీలుగా లా కమిషన్ ఓ ఫార్ములాను ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది.

- వివరాలు 6లో

బాలుడి కిడ్నాప్, హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష



డబ్బు సంపాదించాలనే అత్యాశతో స్నేహితుడి కుమారుడిని చంపిన కేసులో నిందితుడికి రూ.33వేల జరిమానా, ఉరిశిక్ష విధిస్తూ మహబూబాబాద్ జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ సంచలన తీర్పు ఇచ్చారు. 2020లో ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు దీక్షిత్‌ను మంద సాగర్ అనే యువకుడు కిడ్నాప్ చేసి హతమార్చిన విషయం తెలిసిందే.

- వివరాలు 5లో

వరల్డ్ కప్ కాదు.. టెర్రర్ కప్

భారత్‌కు ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపట్వంత్ సింగ్ పన్నూ హెచ్చరిక

వివరాలు 6లో

పేద్ద టెలిస్కోప్!

గ్రహాంతరవాసుల గుట్టు విప్పేందుకు.. శరవేగంగా సిద్ధం చేస్తున్న నాసా

- వివరాలు 6లో

2 రోజులు రూ. 21,566 కోట్లు



రాష్ట్రంలో హైవేలు, రైల్వే ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రేపు మహబూబ్‌నగర్ జిల్లాలో, 3న నిజామాబాద్ జిల్లాలో పర్యటనలు

రెండు చోట్ల బహిరంగ సభల్లో మోదీ ప్రసంగం

- మీడియాకు వెల్లడించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- కేసీఆర్‌కు సీఎంగా ఉండే నైతికహక్కు లేదని మండిపాటు
- ప్రధాని కార్యక్రమాల్లో పాల్గొనని, ప్రాజెక్టులకు భూమి ఇవ్వని ముఖ్యమంత్రి అవసరమా?
- కేంద్రం గత 9 ఏళ్లలో రాష్ట్రానికి రూ.9 లక్షల కోట్లకుపైగా ఇచ్చింది.. ఎవరేం చేశారో చర్చిద్దాం.. సీఎం కేసీఆర్ అమరవీరుల స్తూపం వద్దకు రావాలని సవాల్

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రెండు రోజులపాటు పర్యటించనున్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రూ.21,566 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. రహదారులు, రైలు మార్గాలు, పెట్రోలియం, సహజ వాయువు, ఉన్నత విద్య తదితర రంగాలకు సంబంధించిన ప్రాజెక్టులు ఇందులో ఉన్నాయి. వచ్చే నెల 1న మహబూబ్‌నగర్ జిల్లాలో, 3న నిజామాబాద్ జిల్లాలో ప్రధాని మోదీ పర్యటిస్తారు. ఆయా రోజుల్లో అధికారిక కార్యక్రమాల అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభల్లో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ మేరకు ప్రధాని రాష్ట్ర పర్యటన షెడ్యూల్ ఖరారైంది. ఈ వివరాలను కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.

9 ఏళ్లలో 9 లక్షల కోట్లకుపైగా ఇచ్చాం

కేంద్ర ప్రభుత్వం గత తొమ్మిదేళ్లలో తెలంగాణ అభివృద్ధి కోసం వివిధ రూపాల్లో రూ.9 లక్షల కోట్లకుపైగా ఖర్చు చేసిందని కిషన్‌రెడ్డి చెప్పారు. ''మేం అనేక కొత్త ప్రాజెక్టులు తీసుకొచ్చాం. రూ.26 వేల కోట్లతో రీజనల్ రింగు రోడ్డు నిర్మించేందుకు ముందుకొస్తే.. కేసీఆర్ సర్కారు ఇంతవరకు గజం భూమి కూడా సేకరించి ఇవ్వలేదు. ప్రధాని అభివృద్ధి కార్యక్రమాల కోసం వస్తుంటే వాటికి హాజరుకాని కేసీఆర్‌కు ముఖ్యమంత్రిగా ఉండే నైతిక హక్కు లేదు. ఇలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు అవసరమా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలి'' అని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్లపై బీఆర్ఎస్ పార్టీ మాట్లాడటం హాస్యాస్పదమని.. తొలి ఐదేళ్లు ఒక్క మహిళా మంత్రి లేకుండా రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ, కల్వకుంట్ల కుటుంబం ఇప్పుడు మహిళలపై ఎక్కడలేని ప్రేమ ఒలకబోస్తున్నాయని విమర్శించారు. ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో ఎందరు మహిళలున్నారో



మీడియాతో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶

పాలమూరు పర్యటన ఇలా..

ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు ప్రధాని మోదీ మహబూబ్‌నగర్‌కు చేరుకుని, సుమారు రూ.13,545 కోట్ల విలువచేసే అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు.

- మునీరాబాద్-మహబూబ్‌నగర్ ప్రాజెక్టులో భాగంగా రూ.505 కోట్లతో నిర్మించిన 'జక్లేర్-కృష్ణ' కొత్త రైల్వే లైన్‌ను జాతికి అంకితం చేస్తారు. దీనిద్వారా హైదరాబాద్-గోవా మధ్య 102 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. ఇక కృష్ణ స్టేషన్ నుంచి 'కాచిగూడ -రాయచూర్- కాచిగూడ' డీజిల్, ఎలక్ట్రికల్ మల్టిపుల్ యూనిట్ (డెమూ) రైల్వే సర్వీస్‌ను ప్రారంభిస్తారు.
- జాతీయ రహదారులకు సంబంధించి రూ.6,404 కోట్ల విలువైన ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. ఎన్‌హెచ్ 365 బీబీలో భాగంగా రూ.2,457 కోట్లతో నిర్మించిన సూర్యాపేట-ఖమ్మం 4 లేన్ల రహదారిని ప్రారంభిస్తారు.
- రూ.2,661 కోట్ల విలువైన హసన్ (కర్ణాటక)-చర్లపల్లి హెచ్‌పీసీఎల్ ఎల్పీజీ పైప్‌లైన్‌ను జాతికి అంకితం చేస్తారు. రూ.1,932 కోట్లతో చేపడుతున్న కృష్ణపట్నం (ఏపీ)- హైదరాబాద్ 'మల్టి ప్రొడక్ట్ పైప్‌లైన్ (డీజిల్, పెట్రోల్, కిరోసిన్, జెట్ ఫ్యూయల్)'కు శంకుస్థాపన చేస్తారు.
- హెచ్‌సీయూలో రూ.81.27 కోట్లతో నిర్మించిన స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్, స్కూల్ ఆఫ్ మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్, స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్స్ భవనాలను వర్చువల్‌గా ప్రారంభిస్తారు.

ఊహ తెలియకముందే అమ్మ ప్రేమకు దూరమయ్యాడు.. నాలుగేళ్లకే మంటలంటుకొని కాళ్లు, చేతులు, శరీరం కాలిపోయింది.. 60 శాతం గాయాలతో ఆస్పత్రికి తీసుకెళితే.. బతకడమే కష్టమని డాక్టర్లు అన్నారు.. ఆరేళ్ల ప్రాయంలోనే 3 మేజర్ సర్జరీలు జరిగాయి.

ఇంకా పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌లోకి రాలేదు... ఈ పరిచయమంతా ఓ నల్లమల కుర్రాడి గురించి... లోకం పోకడనే తెలియని.. ఇప్పటికీ నాగరికతకు దూరంగా ఉండే చెంచుల నుంచి ఓ చిచ్చర పిడుగు జాతీయస్థాయిలో ప్రతిభ చాటాడు. పదిలక్షల మంది విద్యార్థులు పోటీ పడగా, అందరికంటే ముందువరుసలో నిలిచాడు.. అతడే 'మిలియనీర్ 'దినేశ్.



● పది లక్షల మందిలో ప్రథముడు

'చెంచు' చిచ్చరపిడుగు

- వ్యక్తిగత పరిశుభ్రతపై జాతీయస్థాయి పరీక్ష నిర్వహించిన డెటాల్ సంస్థ
- 2,500 పాఠశాలల నుంచి పది లక్షల మంది విద్యార్థులు హాజరు
- యాభై మార్కులకు ఆబ్జెక్టివ్ పరీక్ష
- ప్రథమ స్థానంలో నిలిచిన మన్ననూరు విద్యార్థి దినేశ్

సాక్షి, ప్రత్యేకప్రతినిధి/నాగర్‌కర్నూల్ : వ్యక్తిగత పరిశుభ్రతపై దేశవ్యాప్తంగా నిర్వహించిన పరీక్షలో నల్లమలకు చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. అపోలో హాస్పిటల్, డెటాల్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహించిన టోటల్ హెల్త్ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతపై పరీక్ష జరగ్గా, ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న

మిగతా 11వ పేజీలో ▶



● వారంటీ లేని పార్టీ ఇచ్చే

గ్యారంటీని నమ్మొద్దు

రాష్ట్ర మున్సిపల్, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్

- కాంగ్రెస్‌కు అధికారమిస్తే కన్నీళ్లే గతి
- 'కృష్ణా'లో రాష్ట్రానికి 575 టీఎంసీల వాటా రావాలి
- పాలమూరు- రంగారెడ్డికి జాతీయహోదా ఇవ్వాలి
- ఓట్ల వేటకొస్తున్న మాయగాడు ప్రధాని మోదీ

వనపర్తి: 'కాంగ్రెస్‌కు కాలం చెల్లింది..వారంటీ లేని ఆ పార్టీ ఇచ్చే గ్యారంటీలను ప్రజలు నమ్మొద్దు.. ప్రజల సంక్షేమాన్ని వదిలేసి స్కామ్‌లపై దృష్టి సారించిన చరిత్ర ఉన్న కాంగ్రెస్‌ను నమ్మితే కన్నీళ్లే గతి' అని మంత్రి కేటీఆర్ అన్నారు. వనపర్తి జిల్లాలో రూ.669.67 కోట్ల అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు శుక్రవారం జరిగాయి. అనంతరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల

మిగతా 11వ పేజీలో ▶

అడ్వెంట్ @ రూ.16,550 కోట్లు

- 'లైఫ్‌సైన్సెస్'లో భారీ పెట్టుబడి
- మంత్రి కేటీఆర్‌తో ఆ సంస్థ ప్రతినిధుల భేటీ

3లో

3 గంటలు కావాలా?.. 24 గంటలు కావాలా?

ఎన్ని గంటల కరెంటు కావాలో ఆలోచించండి.. వారు పేరుకే పెద్ద మనుషులు, చేసే పనులు చిన్నవి

- జిల్లాను పట్టించుకోకుండా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారు
- కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్, జానారెడ్డిపై మంత్రి హరీశ్ ఫైర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ/రామన్నపేట/తుంగతుర్తి: 'మీ ఇంటి ముందున్న అభివృద్ధిని చూడండి.. మీ కళ్ల ముందుండే అభ్యర్థిని చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయండి' అని వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. నకిరేకల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి లింగయ్యను గెలిపించి సీఎం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంను చేయాలన్నారు. నకిరేకల్ పట్టణంలో ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి పాల్గొన్నారు. హరీశ్‌రావు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

మిగతా 2వ పేజీలో ▶



అభివాదం చేస్తున్న హరీశ్. పక్కన మంత్రి జగదీశ్ రెడ్డి

24 గంటలు కరెంటు ఇచ్చినట్టు నిరూపిస్తే రాజీనామా

ఎన్నికల్లో కూడా పోటీ చేయను

కేటీఆర్, హరీశ్‌కు కోమటిరెడ్డి సవాల్




2లో

క్లుప్తంగా...

విద్యార్థులకు ఉచిత ఇంటర్నెట్


ఆటో డ్రైవర్లకు ప్రత్యేక పథకం.. మేనిఫెస్టో కమిటీలో నిర్ణయం: చైర్మన్ శ్రీధర్‌బాబు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని విద్యార్థులందరికీ ఉచిత ఇంటర్నెట్ సేవలు లభించేలా ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధ్యక్షతన శుక్రవారం గాంధీభవన్‌లో మేనిఫెస్టో కమిటీ సమావేశం జరిగింది. ఆటో డ్రైవర్లకు ఉపయోగపడేలా ప్రత్యేకంగా ఓ సంక్షేమపథకం అమలు చేయాలని కూడా నిర్ణయించారు. ఈ సమావేశంలో కమిటీ కోచైర్మన్, మాజీమంత్రి గడ్డం ప్రసాదకుమార్, ఎమ్మెల్యే సీతక్క పాల్గొన్నారు. సమావేశ అనంతరం శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమానికి మేనిఫెస్టోలో రూపొందించాల్సిన అంశాలపై మాట్లాడామని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులు తెలుసుకొని అవగాహన చేసుకునేందుకుగాను అక్టోబర్ 2వ తేదీ నుంచి కమిటీ జిల్లాలకు వెళుతుందని, 2న ఉదయం ఆదిలాబాద్, సాయంత్రం నిజామాబాద్ జిల్లాల్లో పర్యటిస్తామని చెప్పారు. కాగా, తమ సమస్యలను కూడా కాంగ్రెస్ మేనిఫెస్టోలో చేర్చాలని సీఆర్పీఎఫ్ మాజీ జవాన్లు మేనిఫెస్టో కమిటీని కలిసి వినతిపత్రం అందజేశారు.

రేవంత్.. నిజాయితీ నిరూపించుకో


మహేశ్వరం టికెట్ ఆరోపణలపై రేవంత్‌కు కొత్త మనోహర్‌రెడ్డి సవాల్



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'గతంలో ఈటల రాజేందర్ చేసిన ఆరోపణలపై ఎలాగైతే.. స్పందించావో ఇప్పుడూ అదే విధంగా స్పందించాలి. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారిపై ప్రమాణం చేసి, నిజాయితీని మరోసారి నిరూపించుకోవాలి. లేదంటే ప్రస్తుతం పార్టీలో జరుగుతున్న ప్రచారమే నిజమని నమ్మాల్సి వస్తుంది'అని కాంగ్రెస్ పార్టీ బహిష్కృత నేత కొత్త మనోహర్‌రెడ్డి టీపీసీసీ రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. మహేశ్వరం టికెట్ కేటాయింపు విషయంలో భారీగా డబ్బులు చేతులు మారినట్లు రేవంత్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని ఆరోపించారు. శుక్రవారం నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ...టికెట్ కోసం రేవంత్‌కు భారీగా డబ్బులు ముట్టజెప్పినట్లు బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహ్మారెడ్డి చెప్పుకుంటున్నారని, ఆయనతో పాటు డబ్బులు తీసుకున్న రేవంత్‌ను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. మహేశ్వరంతో పాటు రేవంత్‌రెడ్డి పోటీ చేసే నియోజకవర్గంలోనూ తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఆయన్ను ఓడిస్తానని శపథం చేశారు.

ఏ సర్కారూ పరీక్షలే పెట్టనట్లు కమిషన్ కాకమ్మ కథలు

ఎక్స్(ట్విట్టర్)లో వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల ఆగ్రహం



సాక్షి, హైదరాబాద్: ఇప్పటిదాకా ఏ సర్కారూ పరీక్షలే పెట్టనట్లు.. ఎవరూ ఉద్యోగాలే ఇవ్వనట్లు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీఎస్‌పీఎస్సీ) కాకమ్మ కథలు చెబుతోందని శుక్రవారం ఎక్స్(ట్విట్టర్) వేదికగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మండిపడ్డారు. నచ్చినోళ్లకు పదవులు, కావాల్సినోళ్లకు ఉద్యోగాలు.. ఇదే దొర తెచ్చిన బంగారు తెలంగాణ అని విమర్శించారు. చెప్పాలంటే తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కాస్త.. దొరలు ప్రగతిభవన్ సర్వీస్ కమిషన్ గా మార్చారన్నారు. 'గ్రూప్ 1 పరీక్షలు ఎంత మంది రాశారో ముందొక లెక్క... ఓఎంఆర్ షీట్స్ లెక్కిస్తే మరో లెక్క.. ఇది చాలా కామన్ అట. ప్రశ్నపత్రాలనే అంగట్లో సరుకుల్లా అమ్ముకున్నోళ్లకు ఓఎంఆర్ షీట్స్ తారుమారుచేయడం ఒక లెక్కనా'అని అన్నారు. బయోమెట్రిక్ విధానం అమలు చేస్తే కమిషన్‌కు వచ్చిన నష్టం ఏంటని షర్మిల సూటిగా ప్రశ్నించారు.

ఇదండీ సంగతి



వర్రీ ఎందుకు సార్! ప్రస్తుతం మనం చేస్తున్న పనులు కూడా అలాగే ఉన్నాయి!

3 గంటలు కావాలా?.. | 24 గంటలు కావాలా?

▶ మొదటి పేజీ తరువాయి

సిగ్గులేకుండా 3 గంటల కరెంట్ చాలని మాట్లాడారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే 3 గంటల కరెంటే ఉంటుందని, బీఆర్‌ఎస్ వస్తే 24 గంటలు వస్తుందని, ఏది కావాలో ప్రజలు ఆలోచించాలని సూచించారు. 3 గంటల కరెంటు కావాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని, 24 గంటల కరెంటు కావాలంటే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలన్నారు.

కోమటిరెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌రెడ్డిలు పేరుకే పెద్దమనుషులు

నల్లగొండ జిల్లాకు చెందిన కొందరు సిగ్గులేకుండా మాట్లాడుతున్నారని, వారు పేరుకే పెద్దమనుషులని హరీశ్ వ్యాఖ్యానించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జానారెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్లు పెద్దవే తప్ప వాళ్లు చేసే పనులు చిన్నవన్నారు. వారు జిల్లాను ఏనాడైనా పట్టించుకున్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వారి పాలనలో శవాన్ని కాల్చేసి స్నానం చేద్దామంటే కరెంట్ లేని పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితి మారిందన్నారు. ఆనాడు ఉచిత కరెంట్ అని ఉత్త కరెంట్ ఇచ్చారని విమర్శించారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని ట్రిక్కులు చేసినా హ్యాట్రిక్ కొట్టేది బీఆర్‌ఎస్ పార్టీయేనని, నకిరేకల్ అభివృద్ధి కొనసాగాలంటే ఎమ్మెల్యేగా లింగయ్యను గెలిపించాలని పిలుపునిచ్చారు.

వంద రకాలుగా తెలంగాణకు ద్రోహం చేసిన కాంగ్రెస్: జగదీశ్‌రెడ్డి

రాష్ట్ర ప్రజల ముఖాల్లో వెలుగులు నింపిన ఘనత సీఎం కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీదేనని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణకు కాంగ్రెస్ పార్టీ వంద రకాలుగా ద్రోహం చేస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం వంద మంచి పనులు చేసిందన్నారు.

ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే మేనిఫెస్టో వస్తుంది

ప్రతిపక్షాలకు దిమ్మతిరిగే విధంగా బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో రాబోతుందని హరీశ్‌రావు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి 35 నియోజకవర్గాల్లో అభ్యర్థులు కరువయ్యారని, మనం పనికిరారంటూ పక్కన పెట్టిన వారిని పార్టీలో చేర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు.



నకిరేకల్ సభలో మాట్లాడుతున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి తదితరులు


తెలంగాణ వారంటీ అయినా గ్యారంటీ అయినా కేసీఆరే

తెలంగాణ వారంటీ అయినా గ్యారంటీ అయినా కేసీఆరే అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. తుంగతుర్తి సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ టికెట్లను కాంగ్రెస్ పార్టీ రూ.15 కోట్లకు అమ్ముకుంటోందని ఆరోపించారు. రేపు అధికారంలోకి వస్తే రాష్ట్రాన్ని అమ్ముకుంటారని హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో, నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలంలో, నకిరేకల్‌లో, సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి హరీశ్ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

24 గంటల కరెంటు నిరూపిస్తే ఎంపీ పదవికి రాజీనామా

ఎన్నికల్లో కూడా పోటీ చేయను

- మంత్రులు కేటీఆర్, హరీశ్‌లకు ఇదే సవాల్
- కర్ణాటక పథకాల అమలును చూడాలనుకుంటే మంత్రివర్గం మొత్తాన్ని తీసుకెళతాం
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: 24 గంటల పాటు ఉచిత కరెంటు ఇస్తానని చెప్పిన సీఎం కేసీఆర్ మోసం చేసి రైతుల నోట్లో మట్టి కొట్టాడని, ఆయన హామీ నమ్మి లక్షల ఎకరాల్లో పంటలు వేస్తే ఎండిపోతున్నాయని టీపీసీసీ స్టార్ క్యాంపెయినర్, భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతాంగానికి 14 గంటలకు మించి కరెంటు ఇవ్వడం లేదన్నారు. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులకు తాను సవాల్ విసురుతున్నానని, ఏ సబ్‌స్టేషన్ వద్దకు రమ్మంటారో చెపితే వస్తానని, అక్కడ 24 గంటలు కరెంటు ఇస్తున్నట్టు నిరూపిస్తే తన ఎంపీ పదవికి రాజీనామా చేయడమే కాకుండా, వచ్చే ఎన్నికల్లో పోటీ కూడా చేయనన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. అధికారంలో ఉండే ఈ నెలరోజుల పాటైనా రైతులకు 24 గంటల పాటు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ ఎన్ని స్కీములు పెట్టినా జనం నమ్మే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. కర్ణాటకలో తమ కాంగ్రెస్ పథకాలు ఎలా అమలవుతున్నాయో చూసేందుకు బీఆర్‌ఎస్ నేతలు వస్తానంటే ప్రత్యేక విమానం పెట్టి తీసుకెళ్తామని, మంత్రివర్గం వచ్చినా ఫర్వాలేదన్నారు. పథకాల అమలును వివరించేందుకు సీఎం కేసీఆర్ రావాలని కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఆహ్వానించాలని కోరుతానని చెప్పారు.

తుంగతుర్తి ఎమ్మెల్యే అకౌంట్‌లోకే రూ.60 కోట్లు


దళిత బంధు పథకానికి సంబంధించిన ఒక్క తుంగతుర్తి ఎమ్మెల్యే అకౌంట్‌లోకే రూ. 60 కోట్లు వెళ్లాయని కోమటిరెడ్డి ఆరోపించారు. దళితబంధులో బీఆర్‌ఎస్ నేతలు దోచుకున్న సొమ్ముతోనే ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయవచ్చని చెప్పారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తామనీ, అమలు చేయలేకపోతే దిగిపోతామన్నారు.

బాబు అరెస్టు ఎపిసోడ్ ఫాలో కావడం లేదు

ఏపీ మాజీ సీఎం చంద్రబాబు అరెస్టు ఎపిసోడ్‌ను తాను ఫాలో కావడం లేదని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. టీవీ చూస్తున్నప్పుడు ఆ వార్తలు వస్తున్నా చానల్ మారుస్తున్నానని, తమ బాధలు తమకున్నాయని, తెలంగాణలో అధికారం దక్కించుకోవడమెలా అనే దానిపైనే దృష్టి పెట్టినట్లు చెప్పారు. తాను 30 స్థానాల్లో గెలిపించడంతో పాటు కాంగ్రెస్ పార్టీకి 80 సీట్లు ఎలా తీసుకురావాలన్న దానిపైనే ప్రణాళికలు రచిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్‌లోకి చేరికలపై మాట్లాడుతూ పార్టీ అంతర్గత వ్యవహారాలను బయట మాట్లాడబోనని, వచ్చే నెల 1న ఢిల్లీలో జరిగే సమావేశంలోనే అన్ని విషయాలను మాట్లాడుతానని వెల్లడించారు.


ఓట్ల కోసమే తెలంగాణలో | తమాషా రాజకీయాలు

ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు



బూర్గంపాడు: వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో ఓట్లు సాధించేలా రాజకీయ పార్టీలు తమాషా రాజకీయాలు చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. భద్రాద్రి రామయ్య దర్శనానికి వచ్చిన ఆయన శుక్రవారం సారపాకలోని ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఒకప్పుడు చంద్రబాబు పెద్ద అవినీతిపరుడని విమర్శించిన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు ఏపీలో చంద్రబాబు అరెస్టును తప్పుపట్టడం గర్హనీయమన్నారు. ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్‌ను పదేళ్లు ప్రకటించినా, ఓటుకు కోట్లు కేసులో చంద్రబాబును విజయవాడకు బీఆర్‌ఎస్ పంపించగా.. ఇప్పుడు అదే పార్టీకి చెందిన కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు మద్దతుగా నిలవడం ఓటు బ్యాంకు రాజకీయాలేనన్నారు. చంద్రబాబు అరెస్ట్ సక్రమంగా జరగలేదని తెలంగాణలోని పార్టీల నాయకులు మాట్లాడడం ఒక సామాజికవర్గానికి చెందిన ఓట్ల కోసమేనని కొమ్మినేని తెలిపారు. చంద్రబాబుకు ఎవరు మద్దతు ఇచ్చినా, ఇవ్వకున్నా ఆయన కేసులు ఎదుర్కోవాల్సిందేనని, అవినీతి చేసిన వారికి శిక్ష పడడం ఖాయమని చెప్పారు. ఖమ్మంజిల్లాతో పాటుగా కొన్నిచోట్ల ఎక్కువగా ఉన్న ఓ సామాజిక వర్గం ఓట్ల కోసం చంద్రబాబు అరెస్టు తప్పుపడుతున్న పార్టీలకు, ఇతర సామాజికవర్గాల నుంచి వ్యతిరేకత వస్తుందనే విషయం గుర్తించాలని సూచించారు. చంద్రబాబు అరెస్టును ఖండిస్తున్న కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలతో పాటు కమ్యూనిస్టులు గతంలో ఆయనపై చేసిన అవినీతి ఆరోపణలను ఉపసంహరించుకుంటారా అని ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌లోని పరిణామాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు తెలంగాణలోని పార్టీలు ప్రయత్నించడం సరికాదన్నారు.

వానాకాలం సీఎంఆర్ గడువు పెంపు



సాక్షి, హైదరాబాద్: గత వానాకాలం (2022–23) కస్టమ్ మిల్లింగ్ గడువును నవంబర్ 30 వరకు పొడిగిస్తూ కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ డిప్యూటీ సెక్రెటరీ జై ప్రకాశ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెలాఖరుతో పూర్తవుతున్న సీఎంఆర్ గడువు పెంచాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 25న కేంద్రానికి లేఖ రాసింది. గత సంవత్సరం వానాకాలానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్‌ను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. సీఎంఆర్ విషయంలో మిల్లర్లు రీసైక్లింగ్ బియ్యం అప్పగించకుండా ఎఫ్‌సీఐ, రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. షెడ్యూల్ ప్రకారం పెండింగ్ సీఎంఆర్‌ను డెలివరీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరింది. మిల్లుల వారిగా రాతపూర్వకంగా షెడ్యూల్‌ను తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలనీ, ప్రొటోకాల్ ప్రకారం సీఎంఆర్ డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి ఎప్పటి బియ్యమో నిర్ధారించాలని ఎఫ్‌సీఐని ఆదేశించింది.

బాబు అరెస్టుపై రేవంత్‌కు ఉలుకెందుకు: దేశపతి

జనగామ: అవినీతి ఆరోపణలతో అరెస్టయిన ఏపీ మాజీ సీఎం చంద్రబాబు కోసం తెలంగాణలో నిరసనల పంచాయితీ ఎందుకని కేటీఆర్ చేసిన వ్యాఖ్యపై టీపీసీసీ చీఫ్ రేవంత్‌కు ఉలికి పాటెందుకని.. సీఎం ఓఎస్‌డీ, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. జనగామ జిల్లాకేంద్రంలో శుక్ర వారం జరిగిన బీఆర్‌ఎస్ నియోజకవర్గస్థాయి సోషల్ మీడియా ప్రతినిధుల పరిచయ సభలో ఆయన మాట్లాడారు. టీడీపీలో ఉన్న సమయంలో చంద్రబాబు నాడు ఇచ్చిన బ్రీఫ్ కేసులు గుర్తుకొచ్చి, ఆయన తరపున వకాల్తా పుచ్చుకుంటున్నాడని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో తెలంగాణ పదాన్ని నిషేధించిన చంద్రబాబుకు మద్దతుగా రేవంత్‌రెడ్డి సన్నాయి నొక్కులు నొక్కడాన్ని తెలంగాణ గమనిస్తోందన్నారు.

అధికారమే లక్ష్యంగా కొట్లాడండి

- మైనంపల్లి సహా ఇతర నేతలతో రాహుల్‌గాంధీ
- పార్టీలో సముచిత గౌరవం ఉంటుందని భరోసా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా నేతలంతా కలిసికట్టుగా కొట్లాడాలని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ రాష్ట్ర నేతలకు సూచించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఆయన కుమారుడు రోహిత్ సహా మాజీ ఎమ్మెల్యే వేముల వీరేశం, మేడ్చల్ నేత నక్కా ప్రభాకర్ గౌడ్, భువనగిరి నేత కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఉదయం రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ థాక్రే, పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌ను ఆయన నివాసంలో కలిశారు. నేతలందరినీ రాహుల్‌కు రేవంత్ పరిచయం చేశారు. ఈ సందర్భంగా పార్టీలోకి నేతలను ఆహ్వానించిన రాహుల్, వారికి పార్టీలో సముచిత స్థానం ఉంటుందని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని, ఇప్పటికే పార్టీ ప్రకటించిన గ్యారంటీ స్కీమ్‌లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లగలిగితే పార్టీ విజయం తథ్యమన్నారు. కొత్త, పాత తారతమ్యాలను పక్కనపెట్టి నేతలంతా ఒక్కటిగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.



శుక్రవారం ఢిల్లీలో రాహుల్ గాంధీతో భేటీ అయిన మైనంపల్లి. చిత్రంలో థాక్రే, రేవంత్‌రెడ్డి

ఆరు గ్యారంటీలపై 'వ్యూహం'

- ఆరు గ్యారంటీలతోపాటు పొత్తులపై జాగ్రత్త పడితే అధికారం ఖాయం
- టీపీసీసీ ఎన్నికల స్ట్రాటజీ కమిటీ సమావేశంలో చర్చ

సాక్షి, హైదరాబాద్: విజయభేరి బహిరంగసభ వేదికగా ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలపై రాష్ట్ర ప్రజల్లో విశ్వాసం కలిగించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. వచ్చే ఎన్నికల్లో అధికార సాధనే లక్ష్యంగా వ్యూహం రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ఈ ఆరు గ్యారంటీలను కాంగ్రెస్ పార్టీ తప్పకుండా అమలు చేస్తుందన్న భావన ప్రజల్లో కలిగేలా కసరత్తు చేస్తోంది. ఈ మేరకు టీపీసీసీ స్ట్రాటజీ కమిటీ హైదరాబాద్‌లో సమావేశమై చర్చించింది. కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అధ్యక్షతన శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సభ్యులు వీర్లపల్లి శంకర్, జంగయ్య యాదవ్, ఆడం సంతోశ్, లోకేశ్‌యాదవ్ పాల్గొన్నారు. ప్రచార వ్యూహం, ఇతర పార్టీలతో పొత్తులు, బహిరంగసభల నిర్వహణ వంటి అంశాలపై చర్చించారు. అనంతరం మీడియాతో ప్రేంసాగర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే తెలంగాణలో అభివృద్ధి జరిగిందని, మళ్లీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాతే అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమం సాధ్యమవుతాయన్నారు. తొమ్మిదిన్నరేళ్ల కేసీఆర్ పాలనలో మహిళా సాధికారత కుంటుపడిందని, కొత్తగా ఒక్క ఇల్లు కూడా నిర్మించలేకపోయారని, బంధుల పేరుతో పెట్టిన పథకాలన్నింటికీ నిధులు నిలిపివేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ప్రజల్లోంచి మంచి స్పందన వస్తోందని, ఎప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ 75 నుంచి 80 సీట్లు సాధించి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పొత్తుల కోసం లెఫ్ట్ పార్టీలతో చర్చలు జరుగుతున్నాయని, ఆ విషయాన్ని అధిష్టానం చూసుకుంటుందని చెప్పారు. ఎన్నికల్లో సరైన వ్యూహాలను అమలు చేసి కేసీఆర్‌ను మట్టికరిపిస్తామని ప్రేంసాగర్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

2 రోజులు.. రూ.21,566 కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

చెప్పాలని నిలదీశారు.

దమ్ముంటే చర్చకు రావాలి..

వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెడతామని కేంద్రం ఎన్నడూ చెప్పలేదని కిషన్‌రెడ్డి చెప్పారు. కేసీఆర్ కుటుంబం పథకం ప్రకారం కుట్రలు పన్నుతోందని, తెలంగాణ ప్రజల మనసుల్లో విషబీజాలు నాటుతోందని ఆరోపించారు. కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఉండవని స్పష్టంగా చెప్పినా మళ్లీ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ''సీఎం కేసీఆర్‌కు దమ్ముంటే తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద బహిరంగ చర్చకు రావాలి. గత 9 ఏళ్లలో తెలంగాణకోసం కేంద్రం ఏం చేసిందో నేను చెబుతా.. రాష్ట్రం ఏ చేసిందో ఆయన్ను చెప్పమనండి..'' అని కిషన్‌రెడ్డి సవాల్ చేశారు. ప్రధాని మోదీ రాష్ట్ర పర్యటనలో పాల్గొనే కార్యక్రమాలు, చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాల వివరాలను వెల్లడించారు.

రాష్ట్రంలో జాతీయ రహదారుల కోసం రూ.1.10 లక్షల కోట్ల ఖర్చు

దేశంలో మౌలిక వసతుల కల్పనను వేగవంతం చేసేందుకు ప్రధాని మోదీ 'హీరా' మోడల్ (హెచ్– హైవేస్, ఐ– ఇన్వేస్, ఆర్– రైల్వేస్, ఏ– ఎయిర్‌వేస్ అభివృద్ధి)తో ముందుకెళ్తున్నారని కిషన్‌రెడ్డి తెలిపారు. తెలంగాణకు రికార్డు స్థాయిలో రూ.లక్షా పదివేల కోట్ల విలువైన జాతీయ రహదారులను ఇప్పటికే కేటాయించామని చెప్పారు. ఎయిర్‌పోర్టుల నిర్మాణం విషయంలోనూ కేంద్రం చిత్తశుద్ధితో ఉందని.. దేశవ్యాప్తంగా 2014కు ముందు వినియోగంలో ఉన్న 75 విమానాశ్రయాల సంఖ్యను ఈ తొమ్మిదేళ్లలో 150కి పెంచిందని వివరించారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సహకరించకపోవడంతో రాష్ట్రంలో మాత్రం ఒక్కటి నిర్మాణం కాలేదన్నారు. ఎన్నికలు వస్తుండటంతో వరంగల్ విమానాశ్రయానికి భూసేకరణ చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఏదో కంటితుడుపు ప్రకటన చేసిందని విమర్శించారు.



సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీకే అరుణ, చింతల రామచంద్రారెడ్డి తదితరులు

3న నిజామాబాద్ జిల్లా పర్యటనలో..

ప్రధాని మోదీ ఈ నెల 3న మధ్యాహ్నం 2.55 గంటలకు నిజామాబాద్‌కు చేరుకుని.. రూ.8,021 కోట్ల విలువైన ప్రాజెక్టులను ప్రారంభిస్తారు.

- రామగుండంలో ఎన్టీపీసీ రూ.6వేల కోట్లతో చేపట్టిన థర్మల్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల తొలి యూనిట్‌ను ప్రారంభిస్తారు.
- ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ మిషన్ (పీఎం–ఏబీహెచ్‌ఐఎం)లో భాగంగా రాష్ట్రంలోని 20 జిల్లా కేంద్ర ఆస్పత్రుల్లో రూ.516.5 కోట్లతో చేపట్టే 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్‌లకు శంకుస్థాపన చేస్తారు.
- రూ.305 కోట్లతో 348 కిలోమీటర్ల మేర చేపట్టిన 'ధర్మాబాద్ (మహారాష్ట్ర)–మనోహరాబాద్, మహబూబ్‌నగర్– కర్నూల్ రైల్వే లైన్ల విద్యుదీకరణ (ఎలక్ట్రిఫికేషన్) ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తారు.
- రూ.1,200 కోట్లతో 76 కిలోమీటర్ల పొడవునా నిర్మించిన మనోహరాబాద్–సిద్దిపేట రైల్వేలైన్‌ను ప్రారంభిస్తారు.

ఎంఐఎం తాటాకు చప్పుళ్లకు భయపడం..

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ నివాసంపై మజ్లిస్ కార్యకర్తలు దాడి చేయడం సరికాదని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. బీఆర్‌ఎస్, దాని మిత్రులు కలసి చేస్తున్న ఈ తాటాకు చప్పుళ్లకు భయపడే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు.

ప్రధాని పర్యటనకు భారీగా భద్రత: సీఎస్

వచ్చే నెల 1న ప్రధాని మోదీ పర్యటన ముందే ఖరారుకాగా, 3న పర్యటన మాత్రం శుక్రవారమే ఖరారైంది. ప్రధాని ఆరోజున మధ్యాహ్నం 2.55 గంటలకు సైనిక హెలికాప్టర్‌లో నిజామాబాద్‌కు చేరుకుంటారు. 3.35 గంటల వరకు వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారు. తర్వాత 3.45 గంటల నుంచి 4.45 గంటల వరకు నిజామాబాద్‌లోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహించే బహిరంగసభలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు సైనిక హెలికాప్టర్‌లో తిరుగు ప్రయాణం అవుతారు. దీనికి సంబంధించి సీఎస్ శాంతి కుమారి శుక్రవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రధాని పర్యటన కోసం పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

రెండు వేదికలు.. 'మహిళా' స్వాగతం!

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ప్రధాని మోదీ పాలమూరు జిల్లా పర్యటన కోసం ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఇక్కడి భూత్పూర్ మండల పరిధిలోని అమిస్తాపూర్‌లో సిద్ధం చేస్తున్న సభా ప్రాంగణంలోనే అధికారిక కార్యక్రమాలతోపాటు బీజేపీ సభ జరగనున్నాయి. ఇందులో రెండు స్టేజీలను ఏర్పాటు చేస్తున్నారు. ఒక స్టేజీ మీద నుంచి ప్రధాని అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. తర్వాత ప్రజలకు అభివాదం చేస్తూ రెండో వేదిక వద్దకు రానున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన ఓపెన్ టాప్ జీపును గుజరాత్ నుంచి తెప్పిస్తున్నారు. మహిళా బిల్లును ఆమోదించిన నేపథ్యంలో వందలాది మంది మహిళలతో ప్రధానికి ప్రత్యేకంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్‌రెడ్డి ఈ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. సభకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల నుంచి రెండు లక్షల మందికిపైగా జన సమీకరణ చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. కాగా.. రానున్న అసెంబ్లీ ఎన్నికలకు బీజేపీ పాలమూరు సభ నుంచే శంఖారావం పూరించనుందని నేతలు చెప్తున్నారు. ప్రధాని హోదాలో మోదీ రెండోసారి పాలమూరుకు వస్తున్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల సమయంలో ఆయన ఇక్కడ నిర్వహించిన సభకు హాజరయ్యారు.

ఓట్ల కోసం కేసీఆర్ కపట నాటకం

- పదేళ్లు రాష్ట్ర సంపదను దోచుకుతిన్నారు
- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ధ్వజం



మధిర: పదేళ్లు అధికారంలో ఉండి చేయలేని పనులను పదిరోజుల్లో చేస్తామని సీఎం కేసీఆర్ చెప్పడం ప్రజలను మోగించడమేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క మండిపడ్డారు. ఖమ్మం జిల్లా మధిరలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తశుద్ధితో పనిచేసే సీఎం కావాలా, ఫామ్‌హౌస్‌లో పడుకునే సీఎం కావాలో ప్రజలే ఆలోచించుకోవాలన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రతిరోజు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు క్యాంప్ ఆఫీసులో ప్రజల సమస్యలు తెలుసుకుని, వినతిపత్రాలు స్వీకరించడమే కాక అన్ని పార్టీల ఎమ్మెల్యేల సమస్యలు వినేవారని, సచివాలయంలో అధికారులతో సమీక్షలు చేసేవారని గుర్తుచేశారు. ఇందులో ఏ ఒక్కటీ చేయలేని కేసీఆర్, ఆరు నెలలకోసారి అసెంబ్లీని మూడు రోజులు తూతూమంత్రంగా నడుపుతున్నారని ఎద్దేవా చేశారు.

ఎవరు సీఎం అయితే ఏంటీ?

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఎవరు సీఎం అయితే ఏంటీ.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, పేదలకు ఇళ్లు, పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలు అమలవుతాయా, లేదా అన్నదే ముఖ్యమని భట్టి అన్నారు. కేసీఆర్ అనవసరంగా సీఎం గోల ఎత్తుకున్నారని మండిపడ్డారు. దోపిడీ, కమీషన్లు లేకుండా ప్రతీపైసా ప్రజల కోసం ఖర్చు పెడితే కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలుకు నిధుల సమస్య రాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే అన్ని హామీలను అమలు చేస్తామన్నారు. కాగా, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపికలో పార్టీపరంగానే తప్ప వ్యక్తిగత నిర్ణయాలు ఉండవని స్పష్టం చేశారు. ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ జిల్లాల్లోని అన్ని అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని భట్టివిక్రమార్క ధీమా వ్యక్తం చేశారు.

స్వేచ్ఛ కోసమే ప్రజలు మార్పు కోరుకుంటున్నారు

మాజీ ఎంపీ మల్లు రవి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో ప్రజాస్వామిక పాలన సాగడం లేదని, స్వేచ్ఛ కోసమే ఇక్కడి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి వ్యాఖ్యానించారు. బ్రిటిష్ పాలనలోనూ దేశంలో అన్ని రంగాల అభివృద్ధి జరిగినా నాడు స్వేచ్ఛ లేని కారణంగానే ప్రజలు తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం తెచ్చుకున్నారని చెప్పారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ... నిజాం పాలన నుంచి కూడా తెలంగాణ ప్రజలు స్వేచ్ఛ కోరుకునే ఉద్యమించారన్నారు. రాష్ట్రంలో పోలీసు రాజ్యం నడుస్తుందని, ప్రజలు ఈసారి బీఆర్‌ఎస్‌ను బంగాళాఖాతంలో పడేయాలని నిర్ణయించుకున్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలు అమలు కావని బీఆర్‌ఎస్ నేతలు చెప్పడం విడ్డూరంగా ఉందని, అమలుసాధ్యం కాని హామీలు ఇచ్చేది బీఆర్‌ఎస్ పార్టీనేనని చెప్పారు.

సీఈసీ పర్యటనకు వివరాలతో సిద్ధంగా ఉండాలి

అధికారులకు సీఎస్ ఆదేశం

- అసెంబ్లీ ఎన్నికలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలి
- ఒకే పద్ధతిలో వివరాలు సమర్పించాలి
- ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయండి
- ఉన్నతాధికారులతో సీఎస్ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్‌తోపాటు, కమిషన్ సభ్యులు వచ్చే నెల 3వ తేదీన రాష్ట్రానికి రానున్నారు. 5వ తేదీవరకు కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) సభ్యులు రాష్ట్రంలో పర్యటిస్తారు. ఈ నేపథ్యంలో ఎన్నికలకు సంబంధించి పూర్తి వివరాలతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతికుమారి అధికారులను ఆదేశించారు. సీఈసీ పర్యటన నేపథ్యంలో సీఎస్ శుక్రవారం సచివాలయంలో సీనియర్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కేంద్ర ఎన్నికల సంఘం సభ్యులు తమ మూడు రోజుల పర్యటనలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలు, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు/సీపీలతో పాటు రాష్ట్ర ప్రభుత్వ సీనియర్ అధికారులతో సమావేశాలు నిర్వహిస్తారని సీఎస్ అధికారులకు తెలిపారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్నందున వాటికి సంబంధించిన అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, అధికారులు అన్ని వివరాలను ఒకే పద్ధతిలో అందించాలని ఆమె సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాల వివరాలను నివేదికల్లో పొందుపరచాలని, సంక్షేమ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్లతో చర్చించి దివ్యాంగుల కోసం వీల్‌చైర్‌లు కొనుగోలు చేసి పోలింగ్ కేంద్రాల వద్ద ఉంచాలని చెప్పారు. అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఏఈఆర్ఓ), ఎలక్షన్ రిటర్నింగ్ ఆఫీసర్ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, సమీకృత సరిహద్దు చెక్‌పోస్టుల వివరాలను కూడా కేంద్ర ఎన్నికల సంఘానికి అందుబాటులో ఉంచాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో సీఈవో వికాస్ రాజ్, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సునీల్ శర్మ, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిత్తల్, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా, జీఏడీ కార్యదర్శి శేషాద్రి, విద్యాశాఖ కార్యదర్శి వి.కరుణ, మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి భారతి హోళికేరి, సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సందేహాలు తీర్చే 'ఓటరు సహాయమిత్ర'

చాట్‌బాట్‌ను అందుబాటులోకి తెచ్చిన ఈసీ

సాక్షి, హైదరాబాద్: కొత్త ఓటర్లు, ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు, రాజకీయపక్షాలు.. తమ సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవడానికి వీలుగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయం 'ఓటరు సహాయమిత్ర'ను అందుబాటులోకి తెచ్చింది. రాష్ట్రప్రధానకార్యాలయం వెబ్‌సైట్ https://ceotelangana.nic.in లో ఈ చాట్‌బాట్‌ను సంప్రదించవచ్చని ఈసీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఎపిక్ కార్డు, పోలింగ్ బూత్, బూత్‌స్థాయి అధికారులు.. తదితర వివరాలను ఎలా, ఎక్కడ వెతకాలో 'ఓటరు సహాయమిత్ర'సూచనలు అందిస్తుందని పేర్కొంది. కొత్త ఓటరుగా నమోదు కావాలనుకున్నా, ఇప్పటికే నమోదై దానిలో మార్పులు, చేర్పులు చేసుకోవాలనుకున్నా, ఇతర ఏదైనా అంశంపై ఫిర్యాదు చేయాలనుకున్నా, పోటీలో ఉండే అభ్యర్థులు ఎవరో తెలుసుకోవాలనుకున్నా, అభ్యర్థుల అఫిడవిట్ల నమూనాలను పొందాలనుకున్నా ఈ చాట్‌బాట్ సాయం చేస్తుందని వివరించింది. దివ్యాంగులైన ఓటర్ల కోసం ఎన్నికల సంఘం అందించే వీల్‌చైర్ వంటి ప్రత్యేక సౌకర్యాల గురించి తెలుసుకోవడంలో ఇది తోడ్పడుతుందని పేర్కొంది. ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అందించే సమాచారాన్ని ఇది అందిపుచ్చుకుని అడిగినవారికి తాజా సమాచారాన్ని అందచేయడంలో సహాయకారిగా ఉంటుందని ప్రకటనలో వెల్లడించింది.

ఎన్నికల నిర్వహణకు ప్రణాళికలు


జిల్లాల వారీగా నివేదికలు రూపొందించాలని డీజీపీ ఆదేశం



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల ఏర్పాట్లకు సంబంధించిన ప్రణాళికలు రూపొందించడంపై పోలీస్ ఉన్నతాధికారులు దృష్టి పెట్టారు. అక్టోబర్ 3 నుంచి 5వ తేదీ వరకు హైదరాబాద్‌లో కేంద్ర ఎన్నికల సంఘం పర్యటించనున్న నేపథ్యంలో పోలీస్ శాఖ సన్నద్ధతపై శుక్రవారం డీజీపీ అంజనీకుమార్ సీనియర్ పోలీస్ అధికారులు, యూనిట్ అధికారులు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎన్నికల నిర్వహణా ఏర్పాట్లపై సీపీలు, ఎస్పీలకు పలు సూచనలు చేశారు. ప్రతి జిల్లా ఎస్పీ, పోలీస్ కమిషనర్ తమ యూనిట్ పరిధిలోని పరిస్థితులపై ప్రత్యేక నివేదిక రూపొందించాలని డీజీపీ ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఇప్పటివరకు చేపట్టిన ముందస్తు ఏర్పాట్లను వివరించారు. కేంద్ర ఎన్నికల సంఘం సమావేశంనాటికి వివరాలు సిద్ధం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషనల్ డీజీలు మహేశ్ భగవత్, స్వాతి లక్రా, సంజయ్ కుమార్ జైన్‌తోపాటు ఐజీ రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత గ్రామీణాభివృద్ధి కోసం కృషి చేయాలి


కేంద్ర మంత్రి నిరంజన్ జ్యోతి పిలుపు



సాక్షి, హైదరాబాద్: గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా యువత నడుం బిగించాల్సిన అవసరం ఉందని కేంద్ర గ్రామీణాభివృద్ధి సహాయ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి ఉద్బోధించారు. గ్రామ పంచాయతీల స్వయం సమృద్ధిలో భాగస్వామ్యం కావాలని సూచించారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ (ఎన్ఐఆర్‌డీపీఆర్) సంస్థ 17వ స్నాతకోత్సవం శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మంత్రి ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గ్రామీణాభివృద్ధిపై విద్యను పూర్తి చేసిన విద్యార్థులు పంచాయతీల్లో ప్రజలు ఎన్నుకున్న సర్పంచ్‌ల సాధికారత కోసం కృషి చేయాలన్నారు. గ్రామీణ మహిళలకు హక్కులు, రాజ్యాంగ స్వేచ్ఛపై అవగాహన కల్పించాలని కోరారు. 2047 నాటికి దేశంలో గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కేంద్రం అడుగులేస్తోందని కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ మామిడాల జగదీశ్‌కుమార్ అన్నారు. వ్యవసాయ టూరిజం, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు యువత కృషి చేయాలన్నారు. గత రెండేళ్లలో ఎన్ఐఆర్‌డీపీఆర్‌లో రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీరాజ్ విభాగంలో పీజీ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు ఈ సందర్భంగా మంత్రి, యూజీసీ చైర్మన్ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఆర్‌డీపీఆర్ డైరెక్టర్ డాక్టర్ జి. నరేంద్రకుమార్, పలువురు ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు నిధుల విడుదలపై నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు నియోజకవర్గానికి నిధులు మంజూరు చేసి.. ఎందుకు విడుదల చేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల అభివృద్ధి నిధుల విడుదలకు సంబంధించి నివేదిక అందజేయాలని ఆదేశించింది. పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని స్పష్టం చేస్తూ నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ అక్టోబర్ 9వ తేదీకి వాయిదా వేసింది. నియోజకవర్గాల అభివృద్ధి నిధుల మంజూరులో రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని, ప్రతిపక్షంలో బలంగా వాణి వినిపించే ఎమ్మెల్యేల నియోజకవర్గాలకు నిధులు ఇవ్వడం లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సుమలత శుక్రవారం విచారణ చేపట్టారు. రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాలకు నిధులు ఇచ్చిన ప్రభుత్వం ములుగుకు ఇవ్వలేదని సీతక్క తరఫు సీనియర్ న్యాయవాది శ్రీపాద ప్రభాకర్, న్యాయవాది కృష్ణకుమార్‌గౌడ్ వాదనలు వినిపించారు. 2022లో నియోజకవర్గ అభివృద్ధి నిధుల కింద రూ.2.6 కోట్లు మంజూరు చేసినట్టు ఉత్తర్వులు ఇచ్చి, విడుదల చేయలేదని చెప్పారు. త్వరలో శాసనసభకు ఎన్నికలు రానున్నాయని, తక్షణమే నిధులు మంజూరు చేసేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ములుగు నియోజకవర్గానికి అభివృద్ధి నిధుల విడుదలపై వివరాలు వెల్లడించేందుకు నాలుగు వారాలు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. నాలుగు వారాలు సమయం ఇస్తే ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, అంత సమయం ఇవ్వకూడదని విజ్ఞప్తి చేశారు. దీనికి న్యాయమూర్తి స్పందిస్తూ, అక్టోబర్ 9లోగా పూర్తి వివరాలు సమర్పించాలని ఆదేశించింది.

అడ్వెంట్ @ రూ.16,550 కోట్లు

- లైఫ్‌సైన్సెస్ రంగంలో అతిపెద్ద పెట్టుబడి
- సువెన్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో రూ.9,589 కోట్లు
- జీనోమ్ వ్యాలీలో ఆర్ అండ్ డీ ల్యాబ్ ఏర్పాటు
- మంత్రి కేటీఆర్‌తో అడ్వెంట్ ప్రతినిధుల సమావేశం



మంత్రి కేటీఆర్‌తో అడ్వెంట్ ప్రతినిధులు. చిత్రంలో జయేశ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ ప్రైవేటు ఈక్విటీ పెట్టుబడిదారు సంస్థ 'అడ్వెంట్ ఇంటర్నేషనల్' హైదరాబాద్ కేంద్రంగా తన కార్యకలాపాలు విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ లైఫ్ సైన్సెస్ రంగంలో రూ.16,550 కోట్లు (రెండు బిలియన్ డాలర్లు) భారీ పెట్టుబడులు పెడుతున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీ రామారావుతో శుక్రవారం అడ్వెంట్ మేనేజింగ్ డైరెక్టర్ పంకజ్ పట్వారీ, ఆపరేటింగ్ భాగస్వామి వైదీష్ అన్నస్వామి ప్రగతిభవన్‌లో భేటీ అయ్యారు. కేటీఆర్‌తో జరిగిన ఈ భేటీలో తమ సంస్థ పెట్టుబడులు, విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. లైఫ్‌సైన్సెస్ రంగంలో ఆసియా ఖండంలోనే అడ్వెంట్ పెట్టుబడిని అతి పెద్దదిగా భావిస్తున్నారు. యాక్టివ్ ఫార్మా ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐ), కాంట్రాక్ట్ డెవలప్‌మెంట్, మాన్యుఫాక్చరింగ్ రంగంలో అగ్రస్థానంలో నిలిచేందుకు తమ పెట్టుబడి దోహదం చేస్తుందని అడ్వెంట్ అంచనా వేస్తోంది.

50 వేల చదరపు అడుగుల్లో ల్యాబ్

ఇదిలా ఉంటే హైదరాబాద్ శివారులోని జీనోమ్ వ్యాలీలో 50 వేల చదరపు అడుగుల్లో పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (ఆర్ అండ్ డీ ల్యాబ్)ను అడ్వెంట్ ఏర్పాటు చేస్తోంది. తమ అధీనంలోని ఆర్ఏ కెమ్ ఫార్మా, జెడీఎస్ కెమికల్స్, అవ్రా లేబొరేటరీ వంటి సంస్థలకు హైదరాబాద్ కేంద్ర స్థానంగా ఉంటుంది. హైదరాబాద్ సువెన్ ఫార్మాస్యూటికల్ కంపెనీలో రూ.9,589 కోట్లతో పాటు ఇతర సంస్థల్లోనూ అడ్వెంట్ పెట్టుబడులు పెడుతుంది.

ఐటీ, లైఫ్‌సైన్సెస్ బలానికి నిదర్శనం

అడ్వెంట్ ఇంటర్నేషనల్ హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను భారీగా విస్తరించడం ఇక్కడి లైఫ్‌సైన్సెస్, ఐటీ రంగాల బలానికి అద్దం పడుతోందని కేటీఆర్ పేర్కొన్నారు. భారీ పెట్టుబడులతో వస్తున్న అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహకరిస్తామన్నారు. తన అమెరికా పర్యటనలో భాగంగా అడ్వెంట్ ఇంటర్నేషనల్ మేనేజింగ్ పార్ట్‌నర్ జాన్ మల్డోనాతో జరిగిన సమావేశాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ భేటీలో రాష్ట్ర పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ లైఫ్ సైన్సెస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శక్తి నాగప్పన్ పాల్గొన్నారు.

అలిశెట్టి కుటుంబానికి 'డబుల్ బెడ్‌రూం'

సాక్షి, హైదరాబాద్: కవిత్వాన్ని నిర్భాగ్యుల గొంతుకగా మలచిన ప్రజాకవి అలిశెట్టి ప్రభాకర్ కుటుంబానికి హైదరాబాద్‌లో డబుల్ బెడ్‌రూం ఇల్లును ప్రభుత్వం కేటాయించింది. జగిత్యాల జిల్లాకు చెందిన అలిశెట్టి చిత్రకారుడిగా, ఫొటోగ్రాఫర్‌గా, అభ్యుదయకవిగా సామాజిక మార్పు కోసం నిరంతరం శ్రమించారు. అక్షరపోరులో తన జీవితాన్నే త్యాగం చేసి తనువు చాలించిన అలిశెట్టి కుటుంబం పేదరికంలో మగ్గుతోందని, ఆయన భార్య భాగ్యమ్మ అనారోగ్యంతో బాధపడుతోందని తెలుసుకున్న సీఎం కేసీఆర్ వారికి అండగా నిలిచారు. సీఎం ఆదేశాల మేరకు మంత్రి కేటీఆర్ వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడారు. జియాగూడలో నిర్మించిన డబుల్ బెడ్రూం కేటాయిస్తూ హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

కర్మలు చేయడంలోనే నీకు అధికారం ఉన్నది.
కర్మ ఫలాలపైన ఎప్పుడూ లేదు. కర్మ ఫలానికి కారకుడివి కావద్దు.
అలాగని కర్మలు చెయ్యడము మానవద్దు.
– హిందూ ధర్మం

సాక్షి
శనివారం, 30 సెప్టెంబర్ 2023

మనిషికేమైంది?

ఈ వారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో, దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన రెండు వేర్వేరు ఉదంతాలు మన సమాజం ఉనికిని ప్రశ్నిస్తున్నాయి. ఇక్కడ మానవత్వం ఉందా, కన్నుమూసిందా అన్న సందేహాన్ని రేకెత్తిస్తున్నాయి. ఉజ్జయిని నగర వీధుల్లో మొన్న సోమవారం ఉదయం ఒంటిపై సరైన బట్టలు కూడా లేకుండా నెత్తురోడుతున్న పన్నెండేళ్ల బాలిక తనను కాపాడాలంటూ ఇల్లిల్లూ తిరిగి విన్నవించుకున్నా ఒక్కరంటే ఒక్కరు స్పందించలేదు. ఇలా రెండున్నర గంటలు గడిచి ఆమె స్పృహ కోల్పోయి రోడ్డుపై పడిపోగా ఒక ఆశ్రమం నుంచి బయటికొస్తున్న యువకుడు గమనించి చొరవ తీసుకున్నాడు. తన పైపంచె తీసి కప్పి ఆమెను ఆసుపత్రిలో చేర్చి పోలీసులకు సమాచారం అందించాడు. ఆమెపై అత్యంత దారుణంగా అత్యాచారం జరిగిందని వైద్య పరీక్షలో తేలింది. బహుశా ఆ యువకుడు కూడా స్పందించకపోయి వుంటే రక్తస్రావంతో ఆమె మరణించేది కూడా. ఎందుకంటే అత్యాచారం చేసిన దుర్మార్గుడు ఆమె అవయవాలను తీవ్రంగా గాయపరిచాడు. గర్భాశయానికైతే అత్యవసరంగా శస్త్ర చికిత్స చేయాల్సి వచ్చింది కూడా. దశాబ్దం క్రితం ఢిల్లీలో నిర్భయ అనుభవించిన నరక యాతననే ఈ బాలిక కూడా చవిచూసింది. తాను ఉజ్జయిని ఎలా చేరిందో చెప్పలేని స్థితిలో ఉంది. బాలిక తప్పిపోయిందని అంతక్రితం ఆమె తాత సాత్నాలో ఫిర్యాదు చేశాడంటున్నారు. ఉజ్జయినికి 720 కిలోమీటర్ల దూరంలోని సాత్నా నుంచి ఆ బాలికను తరలించిందెవరు అన్నది ఇంకా తేల్చాల్సి వుంది. ఘటనకు సంబంధించి ప్రధాన నిందితుడితోపాటు మరో అయిదుగురిని అరెస్టు చేశారు. దేశ రాజధాని నగరంలో మంగళవారం జరిగిన ఉదంతం కూడా అమానుషమైనది. ప్రసాదం దొంగిలించాడన్న అనుమానంతో మతిస్థిమితం లేని ఒక ముస్లిం యువకుణ్ణి అందరూ ఏకమై కరెంటు స్తంభానికి కట్టి, తీవ్రంగా కొట్టి ప్రాణం తీశారు. ఒంటినిండా గాయాలతో తీవ్ర రక్తస్రావమై అతను మరణించాడని శవపరీక్షలో తేలింది. ఈ ఉదంతంలో అరెస్టయిన ఏడుగురూ పాతికేళ్ల లోపువారే కాగా, అందులో ఒకడు మైనర్. ఈ రెండు ఉదంతాల్లోనూ సమాజం ప్రేక్షక పాత్ర వహించింది. బాధితులను ఆదుకోవాలన్న స్పృహ లేకుండా ప్రవర్తించింది.

ఉజ్జయిని నగరానికి ఉజ్వల చరిత్ర వుంది. ఒకనాడది వైభవోపేతంగా వర్ధిల్లిన సాంస్కృతిక కేంద్రం. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో మౌర్య చంద్రగుప్తుడి విశాల సామ్రాజ్యంలో భాగం. తన తండ్రి బిందుసారుడి కాలంలో అశోకుడు స్వయంగా పర్యవేక్షించిన ప్రాంతం. నాలుగో శతాబ్దంలో రెండో చంద్రగుప్త విక్రమాదిత్యుడి రాజధాని. అది కాళిదాస మహాకవీంద్రుడు నడయాడిన నేల. అక్కడే శూద్రకుడు, ధన్వంతరి, వరరుచి, వరాహమిహిరుడు, బ్రహ్మగుప్తుడు వంటివారు వివిధ శాస్త్రాల్లో ఉద్దండ పండితులుగా ప్రఖ్యాతి గడించారు. అంతటి గొప్ప చరిత్ర కలిగినచోట పట్టపగలు నగర వీధుల్లో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతూ ఒక బాలిక కాపాడమని అర్థిస్తే ఆడ, మగ అందరూ తలుపులేసుకున్నారంటే... పదో పరకో ఇచ్చి తమ అపరాధ భావనను కప్పిపుచ్చుకునేందుకు ప్రయత్నించారంటే ఎలాంటి వారికైనా మనసు వికలమవుతుంది. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులను ఆసుపత్రికి తరలించటానికీ, కనీసం పోలీసులకు ఫోన్ చేసి చెప్పటానికీ ఎవరూ ముందుకు రాకపోవటం తరచు గమనిస్తూనే ఉంటాం. చట్టపరమైన ఇబ్బందుల్లో చిక్కుకుంటామనీ, కోర్టుల చుట్టూ తిరగాల్సివస్తుందనీ ఇప్పటికీ అనేకులు వెనకడుగేయటం కనబడుతూనే ఉంటుంది. కానీ అర్ధనగ్న స్థితిలో ఆపన్నహస్తం కోసం ఎదురుచూసిన బాలికకు వైద్య సాయం అందేలా చూడటం సంగతి అటుంచి కనీసం ఒంటిని కప్పుకోవటానికి బట్టలిచ్చేందుకు కూడా ఎవరూ సిద్ధపడకపోవటం దిగ్భ్రాంతి కలిగిస్తుంది. ఈ అమానవీయతకు సీసీ టీవీ కెమెరాలు సాక్ష్యంగా నిలిచాయి.

సమాజం మొత్తాన్ని కాపలా కాయటం ఏ ప్రభుత్వానికైనా అసాధ్యమన్నది వాస్తవం. లక్షల్లో జనాభా ఉండేచోట వందల్లో మాత్రమే రక్షకభటులుంటారు. అయితే ఉన్న ఆ కొద్దిమందీ కూడా కొన్ని సందర్భాల్లో నేరగాళ్లకు సాయపడుతున్నారనీ, రాజకీయ ప్రాపకం కోసం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనీ ఆరోపణలు ఎదుర్కొంటూనే ఉన్నారు. రెండున్నర గంటలపాటు ఆ బాలిక ఎక్కడో మారుమూల పల్లెటూరులో కాదు... కేంద్రం స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేస్తున్న నగర వీధుల్లో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో సంచరిస్తున్నప్పుడు ఒక్క కానిస్టేబులైనా ఆమెను గమనించి ఆదుకోలేకపోవటం పోలీసుల పనితీరును పట్టిచూపిస్తోంది. ఇక గోవధ జరిగిందనో, జరగబోతున్నదనో అనుమానంతో కొందరు దుండగులు మారణాయుధాలతో దాడిచేసి చంపుతున్న ఉదంతాల్లో నేరగాళ్లకు ప్రభుత్వాల ఆశీస్సులుంటున్న సంగతి బహిరంగ రహస్యం. కానీ సమాజం ఏమైపోతోంది? పట్టపగలు కళ్లెదుట జరుగుతున్న దురంతాలపై కూడా కనీస స్పందన కొరవడటం, సహానుభూతి వ్యక్తం కాకపోవటం ఏమిటి? ఎన్నికల్లో ఓటేయటంతోనే పౌరులుగా తమ బాధ్యత తీరిందని జనం అనుకుంటున్నారా? కుల మత చట్రాల్లో, రాజకీయ రొదలో కూరుకుపోయి మనుషులుగా తమ నైతిక బాధ్యతను విస్మరిస్తున్నారా? ఎవరికి వారే ప్రశ్నించుకోవాలి. ఆపత్సమయాల్లో మానవీయతను ప్రదర్శించటం, సహానుభూతి వ్యక్తపరచటం, బాధితులకు అండగా నిలవటం మనుషుల కనీస లక్షణాలని తెలుసుకోలేని సమాజం శవప్రాయమైనది. అలాంటిచోట ఎవరికీ రక్షణ ఉండదు. సమాజం సంఘటితంగా ఉన్నప్పుడే, అన్యాయాన్ని ప్రశ్నించే తత్వాన్ని ఒంటబట్టించుకున్నప్పుడే ఇలాంటి దురంతాలకు అడ్డుకట్ట పడుతుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, **తిథి:** బ.పాడ్యమి ప.2.03 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** రేవతి రా.12.07 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** ప.12.44 నుండి 2.14 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.5.53 నుండి 7.29 వరకు, **అమృతఘడియలు:** రా.9.49 నుండి 12.21 వరకు

సూర్యోదయం: 5.53
సూర్యాస్తమయం: 5.51
రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు
యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు

సంక్షోభాన్ని పెంచిన ఆ అంతర్యుద్ధం

విశ్లేషణ



మేజర్ జనరల్ అశోక్ కె. మెహతా (రిటైర్డ్)

జీ20 శిఖరాగ్ర సదస్సు విజయవంతం కావడంపై భారత్‌లో వెల్లువెత్తిన ఉత్సాహం... సంఘర్షణలతో అట్టుడుకుతున్న మణిపుర్‌ను వ్యూహాత్మకంగా విస్మరించడానికి దారితీసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీవ్ర నిష్క్రియాత్మకత వల్లే ఈశాన్య ప్రాంతంలో ఇంత పతనం సంభవించింది. మయన్మార్‌లో 28 నెలల నాటి అంతర్యుద్ధం పాక్షికంగా మణిపుర్ మంటలను పెంచి పోషించింది. ఫలితంగా 200 మందికి పైగా మరణించారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 4,000 ఆయుధాల చోరీ జరిగింది. మయన్మార్ నుండి వచ్చిన శరణార్థుల వెల్లువతో పాటు, కుకీలు లేని ఇంఫాల్ లోయ, మైతేయిలు లేని కుకీ–నివాస కొండ ప్రాంతాలు అనే జాతి ప్రక్షాళన మణిపుర్‌ను నిలువునా విభజించింది.

కుకీలు, మైతేయిల జాతి ప్రక్షాళన ధోరణి మణిపుర్‌ను నిట్టనిలువున చీల్చింది. తీవ్రమైన ఈ విభజనే, విద్రోహం(ఇన్‌సర్జెన్సీ) మళ్లీ చెలరేగుతుందన్న భయాలను రేకెత్తించింది. రాష్ట్ర ఆయుధాగారాల నుండి కొల్లగొట్టిన ఆయుధాలు అందుబాటులో ఉండటమే ఈ భయాలకు కారణం. గత నెలలో అస్సాం రైఫిల్స్ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ పిసి నాయర్ ఇలా చెప్పారు: ''పరిస్థితి అసాధారణంగా ఉంది. మేము ఎప్పుడూ ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోలేదు.'' ఇంఫాల్‌లోని నాలుగు జిల్లాల్లో గల 39 పోలీస్ స్టేషన్లలోని 16 స్టేషన్లలో సాధారణ స్థితి ఏర్పడినట్లు చూపడానికి కేంద్ర హోం మంత్రి అమిత్ షా, సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని మార్చి 25న ఉపసంహరించుకున్న తర్వాత పరిస్థితి ఇలా ఉంది. ఈ చర్యను మళ్లీ వెనక్కి తీసుకోలేదు.

''విద్రోహాన్ని గణనీయంగా తగ్గించేశాం. దాదాపుగా లేదు'' అని మాజీ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్ జనరల్ ఎం.ఎం. నరవణే చెప్పారు. ఈ పరిస్థితి ఉత్తరం వైపు సైన్యాన్ని తిరిగి సమతుల్యం చేయడానికి, అలాగే ఈశాన్య ప్రాంతంలో సైనిక చర్యల బాధ్యతను అస్సాం రైఫిల్స్‌కు బదిలీ చేయడానికి వీలు కల్పిస్తుంది. ఇది సాధారణ ఆచరణకు భిన్నం. ఒక్క 1965, 1971 యుద్ధాల సమయంలో మాత్రమే ఇలా చేశారు.

మయన్మార్‌లో మిలిటరీ జుంటాకూ, దానిని వ్యతిరేకిస్తున్న శక్తుల (నేషనల్ యూనిటీ గవర్నమెంట్–ఎన్‌యూజీ, ఇంకా ప్రతిఘటన)కూ మధ్య అంతర్యుద్ధం దాని మూడవ సంవత్సరంలోకి ప్రవేశించింది. నాగాలాండ్, మిజోరాం, మణిపుర్‌లకు సమీపంలోని సగాయింగ్ ప్రాంతం, చిన్ రాష్ట్రం ప్రధాన పోరాట వేదికలుగా ఉంటున్నాయి. సైనిక జుంటా ఈ ప్రాంతంలో అధికారం కోల్పోయినందున, అది నాపాం బాంబులను ప్రయోగించడం, గ్రామాలను దోచుకోవడం, తగలబెట్టడంతోపాటు వైమానిక బాంబులను ఆశ్రయిస్తోంది. పర్యవసానంగా, దాదాపు 60,000 మంది చిన్, కుకి, జోమి శరణార్థులు మిజోరం, మణిపుర్‌లకు పారిపోయారు. వీరిలో కొందరు ఎన్‌యూజీకి చెందిన శాసనసభ్యులు కూడా ఉన్నారు. మయన్మార్‌తో 1,600 కి.మీ. పొడవైన అంతగా గస్తీ ఉండని సరిహద్దుతోపాటు, ఇరువైపులా 16 కి.మీ. మేర స్వేచ్ఛా కదలికలకు అనుమతిస్తున్న పాలన కారణంగా ఆయుధాలు, మాదక ద్రవ్యాలు, బంగారం, విలువైన రాళ్లు మణిపూర్‌లోకి అక్రమంగా రవాణా అవుతున్నాయి.

'గోల్డెన్ ట్రయాంగిల్' గుర్తుందిగా? మాదకద్రవ్యాల అక్రమ రవాణా మణిపుర్‌కు కొత్తేమీ కాదు. భద్రతా సిబ్బందికి కూడా ఇందులో ప్రమేయం ఉన్నదన్న ఆరోపణలు ఉన్నాయి. 2013 ఫిబ్రవరిలో రూ.6 కోట్ల విలువైన డ్రగ్స్‌తో దొరికిన సైనిక కల్నల్‌ను అరెస్టు చేశారు. సెప్టెంబర్ 15న 'గోవా క్రానికల్'లో ప్రచురితమైన కథనంలో, మణిపుర్‌లోని జటిలమైన మాదకద్రవ్యాల వ్యాపార నెట్‌వర్క్ వివరాలను ఇచ్చారు. 2021 నుంచి మణిపుర్‌లో గసగసాల సాగు 33 శాతం పెరిగిందని ఐరాస నివేదిక పేర్కొంది. ఇది కుకీలకు నగదు పండించే పంట అని మైతేయిలు ఆరోపిస్తున్నారు. కానీ గోవా క్రానికల్ కథనం ప్రకారం, ముస్లిం పంగల్లతో సహా ప్రతి సమాజానికీ ఈ పంటలో వాటా ఉంది.



భారతదేశ 'యాక్ట్ ఈస్ట్ పాలసీ'ని మయన్మార్ వివాదం తీవ్రంగా దెబ్బతీసింది. ఇది ఆసియాన్ (ఆగ్నేయాసియా దేశాల సంఘం)తో వాణిజ్యం, పరస్పర చర్యలను ముందుకు తీసుకెళ్లేందుకు రూపొందించిన విధానం. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ సెప్టెంబర్ ప్రారంభంలో మీడియాతో మాట్లాడుతూ, ''భారతదేశ అత్యంత ప్రతిష్ఠాత్మకమైన మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఆగ్నేయాసియాతో ఉన్నాయి. మయన్మార్ అంతర్గత భద్రతా వ్యవస్థ విచ్ఛిన్నమైపోయిన కారణంగా అవి పెద్ద సవాళ్లను ఎదుర్కొంటున్నాయి,'' అని చెప్పారు. మిజోరం మార్గంలో తిరుగుబాటు సోకిన రాఖైన్ రాష్ట్రం గుండా వెళుతున్న దాదాపు రెండు దశాబ్దాల నాటి మల్టీమోడల్ కలాదాన్ ప్రాజెక్టును అరాకాన్ సైన్యం (మయన్మార్) కాలానుగుణంగా నిరోధిస్తూ వచ్చింది. మణిపుర్‌లోని మోరేతో థాయ్‌లాండ్‌లోని మయీ సాట్‌తో కలిపే భారతదేశం, మయన్మార్, థాయ్‌లాండ్ త్రైపాక్షిక హైవే ప్రాజెక్టును సగాయింగ్(మయన్మార్) ప్రాంతంలో జరిగిన పోరాటాల కారణంగా నిలిపివేశారు. ఈ నెలలోనే జరిగిన ఆసియాన్ విదేశాంగ మంత్రుల సమావేశంలో జైశంకర్ మయన్మార్ విదేశాంగ మంత్రి థాన్ స్వేతో సమావేశమయ్యారు. భారతదేశం, మయన్మార్ సరిహద్దుకు సమీపంలో జరిగిన పోరాటాలు, వైమానిక దాడులు కలిగిస్తున్న ప్రమాదకరమైన ప్రభావాల గురించి థాన్ స్వేకి వివరించారు.

'ఎన్‌యూజీ'కి చెందిన పీపుల్స్ డిఫెన్స్ ఫోర్సెస్ (పీడీఎఫ్) సగాయింగ్ ప్రాంతంలో ఆధిపత్యం చలాయిస్తోంది. అంతర్యుద్ధ ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో 'అన్ని ఫలాలను జుంటా బుట్టలో' ఉంచే విధానాన్ని ఢిల్లీ సమీక్షించుకోవాలి. దేశ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల నిర్మాణాన్ని సులభతరం చేయడానికి చిన్ నేషనల్ ఫ్రంట్, అరకాన్ సైన్యాన్ని భారత ఏజెన్సీలు సిద్ధం చేయాలి. ప్రజాస్వామ్య శక్తులతో సంబంధాలను పునరుద్ధరించడం, ఆయుధాల సరఫరాతో సహా ఎన్‌యూజీ/పీడీఎఫ్‌తో సమాచార మార్గాలను ఏర్పాటు చేయడం ఆచరణీయమైన ఎంపికలు.

ఇది సమస్యను నిరోధించవలసిన చర్యను ఆలస్యంగా చేపట్టడం లాంటిదే అయినప్పటికీ, భారతదేశ యాక్ట్ ఈస్ట్ పాలసీకి కీలకంగా ఉన్న మణిపుర్ సమస్యకు తక్షణ చికిత్స అవసరం. వాస్తవానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మణిపుర్‌ను రక్తసిక్తం చేయడానికి అనుమతించాయి, కొత్త తిరుగుబాట్లకు బీజాలు నాటడానికి అనుమతించాయి. అంతకుమించి సైన్యం, అస్సాం రైఫిల్స్, ఇతర భద్రతా దళాల నిష్పాక్షికతకు సవాలు విసిరే అవాంఛనీయమైన దుస్థితిలో ఉంచాయి.

ఒక సీఆర్పీఎఫ్ భద్రతా సలహాదారు మణిపుర్ సీఎం బీరెన్ సింగ్‌కు మార్గనిర్దేశం చేస్తుండగా, భద్రతా దళాల ప్రత్యేక రక్షణ చట్టం పరిధిలోకి రాని ప్రాంతాల్లో పౌర అధికారులకు సైన్యం, కేంద్ర పారామిలటరీ బలగాలు సాయం చేస్తున్నాయి. కుకీల పట్ల పక్షపాతం చూపుతున్నాయని ఆరోపిస్తూ అస్సాం రైఫిల్స్‌పై మణిపుర్ పోలీసులు రెండు ఎఫ్ఐఆర్‌లు దాఖలు చేయడం, అస్సాం రైఫిల్స్‌ను తొలగించాలని మైతేయిలు డిమాండ్ చేయడం, మరోవైపున నిషేధిత ఉగ్రవాద గ్రూపులను సైన్యం, అస్సాం రైఫిల్స్ విడుదల చేయడంపై లేవనెత్తుతున్న ప్రశ్నలు మణిపుర్ వాస్తవికతను ప్రతిబింబిస్తున్నాయి.

ఇప్పుడు ఆర్మీ, అస్సాం రైఫిల్స్ ప్రధాన పని లూటీకి గురైన ఆయుధాలను తిరిగి పొందడమే. వివిధ ప్రదేశాలలో ఆయుధ డిపాజిట్ పెట్టెలను ఉంచినప్పటికీ, మెజారిటీ ప్రజలు వాటి పక్కన సెల్ఫీలు తీసుకుంటున్నారు. మణిపుర్, ఈశాన్య ప్రాంతాలపై జరుగుతున్న సెమినార్లలో పరిస్థితిని వివరించడానికి వాడుతున్న మాటలు: 'అరాచకం', 'మరో కంబోడియా', 'సమాజాల మధ్య పూర్తి అపనమ్మకం'. ఆశ్చర్యకరంగా, ప్రధానమంత్రి లాగే, ఆర్మీ చీఫ్ గానీ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ గానీ మణిపుర్‌ను ఇంతవరకూ సందర్శించలేదు. జరుగుతున్న తిరుగుబాటును మొగ్గలోనే తుంచివేసే విషయంలో ప్రభుత్వం తన రాజకీయ సంకల్ప లేమిని ప్రస్ఫుటంగా చూపిందని అక్కడి నిపుణులు అంటున్నారు. ఈశాన్యం నుండి 25 మంది లోక్‌సభ ఎంపీలు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరిలో ఎక్కువ మంది బీజేపీ, దాని మిత్రపక్షాలకు చెందినవారే. మణిపుర్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ప్రాంతంలో తిరుగుబాట్లు ఎప్పటినుంచో ఉన్నాయి. రాజకీయ పరిష్కారం సాధించాలంటే, ముందుగా చేయాల్సిన విధులు: హింసను అరికట్టడం, రాష్ట్రపతి పాలన విధించడం.

వ్యాసకర్త సైనిక వ్యవహారాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

కలిసి ఆడుదాం!



పాకిస్తాన్ క్రికెట్ జట్టుకు ఇండియాలో దక్కిన స్వాగతానికి సంతోషం కలిగింది. క్రీడల్లోని అందం అది. దాదాపుగా ఒక దశాబ్దంగా మనం ఏం కోల్పోతున్నామో ఇది ఒకలాంటి ఆలోచన ఇస్తుంది.

– షోయబ్ అఖ్తర్, మాజీ క్రికెటర్

లిట్మస్ పరీక్ష



నిజమైన స్నేహితులు ముఖాన వెక్కిరించి, వెనక పొగుడుతారు. అబద్ధపు స్నేహితులు ముఖాన పొగిడి, వెనక చెడ్డగా మాట్లాడుతారు. నువ్వు అక్కడ లేనప్పుడు నీ గురించి వాళ్లు ఏం మాట్లాడారన్న దాన్నిబట్టి నీ స్నేహితులు ఎవరో తెలుసుకోవచ్చు.

– అలెక్స్ హార్మోజీ, రచయిత

భిన్నత్వంతో సామరస్యం



కన్‌ఫ్యూషియస్ (తత్వవేత్త) 2,574వ జయంతి (సెప్టెంబర్ 28) సందర్భంగా, తూర్పు చైనాలోని షాండాంగ్ ప్రావిన్స్‌లో ఆయన జీవించిన కుఫు నగరంలో జరిగిన ఉత్సవానికి హాజరయ్యాను. చైనా నాగరికత బలమంతా కన్‌ఫ్యూషియస్ ప్రవచించిన 'సామరస్యం'లో ఉంది. పాశ్చాత్యుల 'జీరో–సమ్' సిద్ధాంతం (ఒకరు గెలిస్తే ఇంకొకరు ఓడిపోవడం) కన్నా, 'ఏకరూపత లేకుండానే సామరస్యం' అనే భావన చాలా గొప్పది.

– హు షిజిన్, సంపాదకుడు

అంతా కలా?



1. నేను లేచాను. 2. కాలేజీకి వెళ్లాను. 3. ఆమెను చూశాను. 4. దగ్గరికి వెళ్లి కౌగిలించుకున్నాను. 5. ముద్దాడాను. నిజానికి దీని అసలు క్రమం ఇది: 3, 4, 5, 1, 2.

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

దేవుడా...!



బలోచిస్తాన్‌లోని ముస్తాంగ్ ప్రాంతంలో జరిగిన పేలుడులో చనిపోయిన నా సోదరుల కోసం నా హృదయం విలపిస్తోంది. అల్లాహ్ నిలయంలో జరిగిన ఆత్మాహుతి దాడికి ఎవరు బాధ్యులు? బలోచ్ ప్రజల దీనస్థితిని ఐక్యరాజ్యసమితి, అమెరికా గమనించాలి. వారిని కాపాడాలి. పాకిస్తాన్ సైన్యం విఫలమైంది.

– జహీరా బలోచ్, యాక్టివిస్ట్

మితమే హితమా?



చాలామంది తన వయసు భారతీయ మహిళల్లాగే మా అమ్మ కూడా మితంగా భోంచేస్తుంది. పాశ్చాత్య ప్రమాణాల ప్రకారం ఇది చాలినంత కాదు. కానీ ఆమెకిప్పుడు 80 ఏళ్లు, ఐదుగురు సంతానం, ఇప్పటికీ నేను సిగ్గుపడేలా పనిచేస్తుంటుంది. పోషణ శాస్త్రాన్ని మనం పునఃపరిశీలించుకోవాలి.

– శ్రీధర్ వెంబు, ఆంట్రప్రెన్యూర్

కావేరిని కాపాడుకుందాం!



తల్లి కావేరికి మనం ఏ రాష్ట్రం వాళ్లమో తెలియదు. కానీ ఆమె క్రమంగా క్షీణిస్తోంది. వేసవి నెలల్లో ఎండిపోతోంది. భారీ స్థాయి వృక్షాధారిత వ్యవసాయాన్ని చేపట్టడం, 83,000 చదరపు కిలోమీటర్ల కావేరీ పరివాహక ప్రాంతంలో మొక్కలు పెంచడం వల్ల మాత్రమే కావేరీ సమృద్ధిగా ఏడాదంతా పారుతుంది. తగ్గిన నీళ్ల కోసం పోట్లాడటం మాని, కావేరీ తల్లిని శక్తిమంతం చేద్దాం.

– జగ్గీ వాసుదేవ్, ఆధ్యాత్మిక గురువు

అనువాదకులకూ...

ప్రపంచీకరణ పెరిగి లోకలైజేషన్ ప్రక్రియ ఊపందుకున్న నేపథ్యంలో అనువాదాలు ప్రాధాన్యం సంతరించుకొన్నాయి. ఎంతో మంది అనువాదకులు వివిధ భాషలకు మధ్య వారధిలా పనిచేస్తున్నారు. వారందరి సేవలను గుర్తిస్తూ 'అంతర్జాతీయ అనువాద దినోత్సవా'న్ని ప్రతి పాదించారు. ఈ రోజును బైబిల్ అనువాదకుడు 'సెయింట్ జెరోమ్'కు అంకితమిచ్చారు. సెయింట్ జెరోమ్‌ను 'ప్రపంచ అనువాదకుల పితామహుడి'గా పిలుస్తారు. ఈయన ఇటలీకి చెందిన ప్రీస్ట్. గ్రీకు భాషలో ఉన్న బైబిల్‌ను లాటిన్ భాషలోకి అనువాదం చేశారు. ఈయన సెప్టెంబర్ 30, క్రీస్తు పూర్వం 420లో బెత్లెహామ్ నగరానికి సమీపంలో మరణించారు. ఆయన గౌరవార్థం అంతర్జాతీయ అనువాద దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి ప్రకటించింది.

ప్రస్తుతం అనువాదకులకు మంచి ఆదరణ లభిస్తోంది. ఒక భాషలో విషయాన్ని మూల భావం మారకుండా అనువాదం చేయాలంటే సాధన అవసరం. అనువాదకులకు కేవలం రెండు లేదా మూడు భాషలపై పట్టు ఉంటే సరిపోదు. వివిధ భాషలు మాట్లాడే ప్రజల చరిత్ర, సంస్కృతిపై పట్టు ఉండాలి.

– ఎమ్. రామ్ ప్రదీప్ । తిరువూరు

రెండేమిటి మూడు ఎన్నికలైనా జరపవచ్చు...

అభిప్రాయం



బి. ఎస్. రాములు

కేంద్ర, రాష్ట్ర చట్ట సభలకే కాదు, వాటికి స్థానిక సంస్థలను కలిపి మూడింటికీ ఒకేసారి ఎన్నికలు జరుపుకోవచ్చు. తద్వారా, స్థానిక అభివృద్ధి, నియోజక వర్గాల వారీ అభివృద్ధి పట్ల ఆయా పార్టీల వైఖరికి ప్రాధాన్యత పెరుగుతుంది. వికేంద్రీకృత అభివృద్ధి, సమాన అభివృద్ధి దృష్టి పెరుగుతుంది. ఖర్చులు తగ్గుతాయనే మాట రీత్యా, స్థానిక, రాష్ట్ర, కేంద్ర పరిపాలన సమ ప్రాధాన్యత రీత్యా ఆలోచించినపుడు మూడింటికీ ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తే అన్ని విషయాలపై సమగ్ర అవగాహన కలుగుతుంది. ప్రజలు మూడు విధాల పనికి వచ్చే, పని చేసే నాయకత్వాన్ని ఎన్నుకునే అవకాశం కలుగుతుంది. ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎన్నికయ్యాక ప్రజలకు అందుబాటులో లేకుండా పోయే వారి ఎన్నికకు అడ్డుకట్ట పడుతుంది. అయితే ఇటువంటి ఎన్నికల విధానం కోసం కొన్ని పనులు ముందుగా నిర్వర్తించాలి. అందులో ముఖ్యమైనది రాజ్యాంగ సవరణ. జమిలి ఎన్నికలు ఫెడరలిజానికి విరుద్ధం. రాష్ట్ర ప్రయోజనాలకు, స్వేచ్ఛకు, అధికారాలకు విరుద్ధం. అందరు అంగీకరిస్తేనే జమిలి ఎన్నికల ఆలోచనకు కార్యరూపం ఇవ్వాలి.

కొత్త ఎన్నికల విధానం ప్రవేశపెట్టడానికి ప్రస్తుత వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాలి. ప్రభుత్వాల పదవీకాలం ఐదేళ్ల నుంచి మూడేళ్లకు కుదించి ప్రజల తీర్పు మరోసారి తొందరగా పొందడానికి, అవకాశం కల్పించాలి. 200 ఏళ్ల క్రితం నిర్ణయించుకుని 4 ఏళ్లకోసారి అమెరికా ఎన్నికలు జరుపుకొంటున్నది. మనం మూడేళ్లకొకసారి ఎన్నికలు జరుపుకొంటూ అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా ఆదర్శంగా నిలవాలి. రెండవసారి గెలిస్తేనే ఎమ్మెల్యేలకు, ఎంపీలకు పెన్షన్లుంటాయనే నిబంధన పెట్టాలి. ఇలాగైతేనే మొదటిసారి ఎన్నికైనపుడు ప్రజలకు ప్రజాప్రతి నిధులు తమ సేవలతో అందుబాటులో ఉంటారు.

రాజకీయ పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యానికి కట్టుబడి పార్టీలో అన్ని స్థాయుల్లో ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలి. ఆయా దేశాల జనాభాను బట్టి చట్ట సభల్లో సీట్ల సంఖ్య నిర్ణయమవుతోంది. ఆ మేర ప్రజా ప్రతినిధులు ఎన్నికవుతున్నారు. కానీ మనదేశంలో జనాభా పరంగా చూసినప్పుడు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధులు తక్కువనే చెప్పాలి. జనాభా పరంగా చూసినప్పుడు భారత్‌లో 3,200 మంది పార్లమెంటు సభ్యులు (2,600 లోక్‌సభ సభ్యులు, 600 రాజ్యసభ సభ్యులు) ఉండాలి. చైనా, అమెరికా, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ, ఆస్ట్రేలియా, జపాన్ చట్ట సభల్లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించే ప్రతినిధుల సంఖ్యతో పోల్చినప్పుడు... మన చట్ట సభల్లో ప్రజాప్రతినిధుల సంఖ్య పెంచవలసిన అవసరం బోధపడుతుంది.



భారతదేశ జనాభా ప్రకారం సభ్యుల సీట్లే కాదు, ఇప్పటి అసెంబ్లీల సీట్లకు నాలుగైదు రెట్లు పెరగాలి. ఇదేవిధంగా స్థానిక సంస్థల సీట్లూ పెంచాలి. 3,200 పార్లమెంట్ సీట్లలో మహిళలకు సగం, బీసీలకు 27 శాతం, ఎస్సీలకు 17 శాతం, ఎస్టీలకు 7 శాతం ప్రాతినిధ్యం కోసం రాజ్యాంగాన్ని సవరించాలి. వీలైతే అందరి సమ్మతితో ఆధార్ కార్డుతో ఓటర్ కార్డు, పాన్ కార్డు, వృత్తి, మొత్తం ఆస్తిపాస్తుల రికార్డు అనుసంధానించాలి. ఏ నియోజక వర్గంలో ఓటు వేశారో తెలిపే ఒక 'కాలమ్' చేర్చుకోవడం ద్వారా రెండు మూడు చోట్ల ఓటర్ల లిస్టులో పేరుంటే ఏదో ఒక చోట మాత్రమే ఓటు వేసే విధంగా ఎన్నికల సంఘం సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేసుకోవాలి. అపుడే కరెక్టుగా అన్ని ప్రాంతాలకూ, వర్గాలకూ ప్రాతినిధ్యం లభిస్తుంది.

మరీ ముఖ్యంగా ప్రాథమిక హక్కుల్లో ఓటు హక్కును చేర్చాలి. అలాగే పౌర బాధ్యతల్లో ఎన్నికల్లో ఓటుహక్కును వినియోగించుకోవడాన్నీ చేర్చాలి. సంక్షేమ పథకాలు, ప్రణాళికలు నియోజక వర్గాలవారీగా రూపొందించుకోవడం అవసరం. బ్యాంకింగ్, సైనిక, రైల్వే వంటి రంగాలకు నియోజక వర్గాల వారీగా ప్రాతినిధ్యం ఉన్నపుడే అన్ని రంగాలవారి ప్రాతినిధ్యంతో సమంగా ప్రజాస్వామ్యం అందుబాటులోకి వస్తుంది. ఆదాయ పన్ను ఇతర దేశాలలో వలె రాష్ట్రాలకే చెందడం అవసరం. ఈ విధానం అనుసరిస్తే లోక్‌సభ నియోజక వర్గం నుండి ఏటా ఇద్దరు చొప్పున పదేళ్లలో 20 మంది ఐఏఎస్‌లూ, ఐపీఎస్‌లూ ఎన్నికవుతారు. వారు ఎక్కడున్నా తమ ప్రాంత అభివృద్ధిని పట్టించుకుంటారు. అలాగే జడ్జీలు, ఇతర అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సైనికులు అన్ని నియోజక వర్గాల నుండి సమంగా ఎదుగుతారు.

గ్రామ సభల వలె నాలుగు నెలలకోసారి అసెంబ్లీ, లోక్‌సభ నియోజకవర్గాల సభలు ఏర్పాటు చేసి, నిర్వహించే విధంగా రాజ్యాంగంలో మార్పులు చేయాలి. అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాలకు ముందు ఈ సభలు నిర్వహించి స్థానిక అభివృద్ధి, సంక్షేమం, ప్రణాళికలపై చర్చించాలి. ఎంపీ లాడ్స్ ఫండ్స్ దేనికి ఖర్చు చేయాలో ఈ సభల్లో చర్చించి అనుమతి పొందాలి. అప్పుడే ఎక్కడ నిధుల కొరత ఉందో అక్కడికి నిధులను మళ్లించవచ్చు. ఇటువంటి ఏర్పాట్లు చేసిన తర్వాత జమిలి ఎన్నికలే కాదు, మూడు ఎన్నికలు ఒకేసారి జరుపుకోవచ్చు.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ మాజీ ఛైర్మన్, సామాజికవేత్త


సత్యప్రతిష్ఠ

ఆంధ్ర మహా భారతం ఆది పర్వం చతుర్థాశ్వాసంలో శకుంతల, దుష్యంతుడికి ధర్మబోధ చేస్తూ, అన్ని ధర్మాల్లోకి సత్యమే గొప్ప ధర్మమని చెప్పింది.

సర్వ తీర్థాభిగమనంబు సర్వ వేద
సమధిగమము సత్యంబుతో సరియు గావు
ఎరుగుమెల్ల ధర్మంబుల కెందు పెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞులైన మునులు

ఇంతటి మహత్వపూర్ణమైన సత్య ప్రభావం గురించి పతంజలి మహర్షి యోగదర్శనం సాధనపాదం ముప్ఫై ఆరవ సూత్రంలో ఇలా అంటాడు:

'సత్యప్రతిష్ఠాయాం క్రియాఫలాశ్రయత్వామ్'



జ్యోతిర్మయం

ఎవరు సత్యమునందు ప్రతిష్ఠితులవుతారో, ఎవరు సత్యాన్ని నిష్ఠతో త్రికరణశుద్ధిగా, అనగా మనసా వాచా కర్మణా ఆచరిస్తారో, వారు చేసే పనుల మీద, వాటి ఫలితముల మీద, వారికి అధికారం ఏర్పడుతుంది. వారి వాక్కుకు పటిమ కలుగుతుంది. వారి పలుకు అమోఘమవుతుంది. 'ఆరోగ్యవంతుడవు అగుము' అంటే రోగి వెంటనే ఆరోగ్యవంతుడవుతాడు. 'సుఖ పడుము' అంటే దుఃఖితుడు సుఖపడతాడు. 'వర్షం కురవాలి' అంటే కురుస్తుంది. అలా వారు ఏది అంటే అది జరుగుతుంది.

శ్రీమద్రామాయణం యుద్ధకాండలోని సీతమ్మ తల్లి పాతివ్రత్య పరీక్షా వృత్తాంతం ఇందుకు నిదర్శనం. సీత అగ్నిప్రవేశం చేస్తూ ప్రతిజ్ఞాపూర్వకంగా ఒక మాట అంటుంది. 'నా హృదయం ఎప్పుడూ రాముని యందే స్థిరంగా ఉండినట్లయితే, లోక సాక్షి అయిన ఈ అగ్ని నన్ను అన్ని విధాల రక్షించుగాక' అని. సీత అన్నమాట సత్యం అని రుజువు చేస్తూ అగ్ని దేవుడు చితిని తోసి వేసి, సీతను తన అంకంపై కూర్చుండ బెట్టుకొని పైకి వస్తాడు. సీత అగ్ని ప్రవేశం చేసే ముందు ఎలాగున్నదో అలాగే ఉన్నది. సీత పలికిన సత్యవచనం ప్రకారం అగ్నివల్ల ఆమె అన్ని విధాలా రక్షించబడింది.

పతంజలి సూత్రీకరించిన ఈ విషయాన్ని బుద్ధుడి కాలం పాలీ భాషలో 'సచ్చకిరియ' (సంస్కృతం: సత్యక్రియ)గా వ్యవహరించేవారు. 519 సంఖ్యగల 'సంబుల జాతక' కథలో ఇందుకు నిదర్శనం కనిపిస్తుంది. ఈ కథలో యువరాణి తను పతివ్రత అయితే, భర్త కుష్ఠు వ్యాధి నయం కావాలని అంటుంది. ఆమె పలికిన సత్యవచనం వల్ల భర్త వ్యాధి తక్షణం నయం అవుతుంది.

– దీవి సుబ్బారావు

బాలుడి కిడ్నాప్, హత్య కేసులో ఒకరికి ఉరిశిక్ష

మహబూబాబాద్ కోర్టు సంచలన తీర్పు


మంద సాగర్

సాక్షి, మహబూబాబాద్: డబ్బు సంపాదించాలనే అత్యాశతో స్నేహితుడి కుమారుడిని చంపిన కేసులో నిందితుడికి రూ.33 వేల జరిమానా, ఉరిశిక్ష విధిస్తూ మహబూబాబాద్ జిల్లాకోర్టు ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ సంచలన తీర్పు ఇచ్చారు. వివరాల్లోకి వెళితే..మహబూబాబాద్‌లోని కృష్ణకాలనీకి చెందిన కుసుమ రంజిత్‌రెడ్డి కుమారుడు దీక్షిత్‌రెడ్డి (9) అక్టోబర్ 18, 2020లో సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటున్నాడు. మహబూబాబాద్ మండలం శనిగపురం గ్రామానికి చెందిన మందసాగర్(రంజిత్ స్నేహితుడు) ఆయిల్ డబ్బాలు తేవాలని దీక్షిత్‌ను బైక్‌పై ఎక్కించుకున్నాడు. నేరుగా తాళ్లపూసపల్లి శివారు దానమయ్య గుట్టపైకి తీసుకెళ్లాడు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం వెంట తెచ్చిన కూల్‌డ్రింక్‌లో నిద్రమాత్రలు కలిపి తాగించాడు. దీంతో మత్తులో ఉన్న దీక్షిత్ టీషర్ట్‌తో వేలిముద్రలు పడకుండా చాకచక్యంగా గొంతు నులిమి చంపాడు. ఆపై మృతదేహంపై పెట్రోల్ పోసి కాల్చేశాడు. రాత్రి వరకు కొడుకు కనిపించకపోవడంతో తల్లి కుసుమ వసంత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సాగర్ డింగ్‌టోన్ యాప్ ఉపయోగించి రంజిత్‌కు ఫోన్ చేసి రూ.45లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మూడురోజుల చర్చల తర్వాత డబ్బు, బంగారంతో సాగర్ చెప్పిన పట్టణంలోని మూడు కోట్ల సెంటర్‌కు రంజిత్ వచ్చాడు. అక్కడ పోలీసులు ఉన్నారని సాగర్ గమనించి, తాళ్లపూసపల్లి రోడ్డుకు రమ్మని చెప్పాడు. అక్కడికి వెళ్లినా పోలీసులు ఉండటంతో సాగర్ అక్కడకు కూడా రాకుండా వెళ్లిపోయాడు. రంజిత్‌కు డింగ్‌టోన్ యాప్ ద్వారా ఫోన్ చేసి డబ్బు డిమాండ్ చేస్తున్న విషయంపై పోలీసులు ఆరా తీశారు. సేకరించిన ఆధారాలతో నిందితుడు సాగర్ అని గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు. పలు దఫాలుగా వాదనలు జరిగాయి. 48మందిని సాక్షులుగా గుర్తించారు. వీరిలో 43 మందిని కోర్టులో ప్రవేశపెట్టి వారు ఇచ్చిన వాంగ్మూలం తీసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఈ తరహా కేసులపై అధ్యయనం చేసి మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్ ఐపీసీ 368(ఏ) ప్రకారం సాగర్‌పై మోపిన అభియోగం రుజువైనందున ఉరిశిక్ష విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. ఉరిశిక్ష నిర్ధారణ కోసం రాష్ట్ర హైకోర్టుకు నివేదిక సమర్పించినట్టు చెప్పారు. కాగా కోర్టు తీర్పును స్వాగతిస్తూ బాలుడి కుటుంబసభ్యులు న్యాయదేవత, పోలీస్ లోగోకు పాలాభిషేకం చేశారు.

● ఓటర్ల జాబితాలో అభ్యంతరాలను పారదర్శకంగా పరిష్కరించడం లేదని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు జి.నిరంజన్ ఆరోపించారు. బూత్‌స్థాయిలో ఈ దరఖాస్తులను పరిష్కరించాల్సిన అంగన్‌వాడీలు సమ్మెలో ఉన్నారని, అలాంటప్పుడు ఆదరాబాదరగా అభ్యంతర దరఖాస్తులను ఎలా పరిష్కరిస్తారని నిలదీశారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొక్కుబడిగా చేసిన పరిష్కారాలతో వచ్చే నెల 4వ తేదీన ఓటర్ల తుది జాబితా ప్రకటించాలని చూస్తున్నారన్నారు. ఇదే వైఖరి కొనసాగితే కాంగ్రెస్ పార్టీ పక్షాన ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

క్లుప్తంగా...

సూర్యాపేట జిల్లాలో స్వల్ప భూకంపం

హుజూర్‌నగర్: సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని చింతలపాలెం మండలంలో శుక్రవారంరాత్రి మళ్లీ స్వల్ప భూకంపం వచ్చింది. పలు గ్రామాలతో పాటు పులిచింతల ప్రాజెక్టు ప్రాంతంలో కూడా స్వల్పంగా భూ ప్రకంపనలు చోటుచేసుకున్నట్లు పలువురు తెలిపారు. దాదాపు 5 నుంచి 10 సెకండ్లపాటు భూమి కంపించింది. ఈ ప్రకంపనలను కొద్దిమంది మాత్రమే గుర్తించినట్లు చెబుతున్నారు. ఈ నెల 19న ఏపీలోని గుంటూరు జిల్లా సత్తెనపల్లి కేంద్రంగా వచ్చిన భూకంపం 2.3 మ్యాగ్నట్యూడ్‌గా నమోదైంది. కాగా, 2020, 2022 సంవత్సరాల్లో కూడా పలుమార్లు భూప్రకంపనలు సంభవించాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీ ఉదయం వచ్చిన భూకంపం 3.0 మ్యాగ్నట్యూడ్‌గా నమోదైంది. ఇప్పుడు మళ్లీ భూకంపం రావడంతో ఈ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

చనాకా కొరాటా వెట్‌రన్ సక్సెస్

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మిస్తున్న చనాకా కొరాటా ప్రాజెక్టు పరిధిలోని ఒక మోటార్ వెట్‌రన్‌ను నీటిపారుదల శాఖ విజయవంతంగా పూర్తి చేసింది. ప్రాజెక్టు పంపుహౌస్‌లో నిర్మిస్తున్న మొత్తం ఆరు మోటార్లకు గాను ఒక మోటార్ వెట్‌రన్‌ను ప్రాజెక్టు సలహాదారు పెంటారెడ్డి ఆధ్వర్యంలో గురువారం రాత్రి అధికారులు నిర్వహించారు. 35 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ ఆరు మోటార్లను రన్ చేయడం ద్వారా ఎత్తిపోతల ద్వారా 13,500 ఎకరాలు, గ్రావిటీ ద్వారా 47,500 ఎకరాలకు సాగునీరందించాలనేది ప్రాజెక్టు ఉద్దేశం కాగా, 2022 జూన్ కల్లా పూర్తి కావాల్సిన పనులు అనివార్య కారణాల వల్ల పూర్తి కాలేదు. ప్రస్తుతం వెట్‌రన్ పూర్తి చేసిన మోటార్‌తో పాటు మరో 2 మోటార్లను కూడా త్వరలోనే అందుబాటులోకి తెస్తామని నీటిపారుదల అధికారులు చెబుతున్నారు.

'బీసీ విదేశీ' దరఖాస్తుల గడువు పొడిగింపు

● అక్టోబర్ 5 వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. ఈ పథకం కింద విదేశాల్లో ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులకు రూ.20 లక్షల ఆర్థిక సాయం ప్రభుత్వం అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రుల వినతుల మేరకు ఈ పథకం ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియను అక్టోబర్ 5వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పలు రూట్‌లలో రైళ్లు రద్దు



సాక్షి, హైదరాబాద్: వివిధ మార్గాల్లో నడిచే 20 ప్యాసింజర్ రైళ్లను అక్టోబర్ 2 నుంచి 8వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేశ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్-వరంగల్, కాజీపేట-సికింద్రాబాద్, కాజీపేట-బల్లార్ష, విజయవాడ-భద్రాచలం, నాంపల్లి-వరంగల్, సిర్పూర్‌కాగజ్‌నగర్-భద్రాచలం, డోర్నకల్-విజయవాడ, భద్రాచలం-కాజీపేట్ తదితర ప్రాంతాల్లో రాకపోకలు సాగించే రైళ్లు రద్దు కానున్నాయి.

పీఆర్సీ అమలు చేయాలి

సాక్షి, హైదరాబాద్: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఉద్యోగ, పెన్షనర్లకు పీఆర్సీని అమలు చేయాలని తెలంగాణ రిటైర్డ్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఆర్‌జీవోస్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.మోహన్‌నారాయణ, ఎస్.నర్సరాజు కోరారు. హైదరాబాద్‌లో శుక్రవారం టీఆర్‌జీవోస్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. పెన్షనర్లకు నెలకు రూ.500 చొప్పున పెన్షన్‌లో మినహాయించుకొని నగదు రహిత వైద్యం అందించాలని విజ్ఞప్తి చేశారు. 2022 నుంచి రావలసిన రెండు డీఏలను ప్రకటించాలని కోరారు. అక్టోబర్ మొదటి వారంలో అమలు చేయకపోతే ఆందోళనలు, నిరాహార దీక్షలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు.

హామీలను అమలు చేయాలి

● కల్లు గీత కార్మిక సంఘాల డిమాండ్


నీరాతో నిరసన వ్యక్తం చేస్తున్న నేతలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని వారు అన్నారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ కల్లు గీత కార్మికుల సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ, గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజుగౌడ్, కల్లుగీత వృత్తిదారుల సంఘం అధ్యక్షుడు అయిలి వెంకన్నగౌడ్, గౌడ జన హక్కుల పోరాట కమిటీ అధ్యక్షుడు ఎలికట్టె విజయ్‌కుమార్‌గౌడ్, ఐక్య సాధన కమిటీ అధ్యక్షుడు అంబాల నారాయణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన నీరా కేఫ్‌ను ఐదు నెలలు కాకముందే టూరిజం శాఖ వేలం వేయాలని కోరుతూ నోటీసు ఇవ్వడం సరైంది కాదని దీన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని మేకపోతుల వెంకటరమణ కోరారు. నీరా, తాటి, ఈత ఉత్పత్తుల పరిశ్రమలను ప్రతి జిల్లాలో నెలకొల్పాలని, బీసీ కుల వృత్తిదారులకు ఇచ్చిన జీవో 5 ప్రకారం కల్లుగీత వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. బాలగౌని బాలరాజుగౌడ్ మాట్లాడుతూ గీత వృత్తికి లైసెన్స్‌ల నిబంధనలతో పాటు పన్నులతో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిలి వెంకన్నగౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

మత్స్యరంగం అభివృద్ధికి నిధులు ఇవ్వండి

● కేంద్రమంత్రికి రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ వినతి


పిట్టల రవీందర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మత్స్యరంగం అభివృద్ధికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్రం తోడ్పాటు కావాలని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా చేపల వేటపై నిషేధం అమలుపరిచే 45 రోజుల కాలానికి ప్రతి మత్స్యకారునికి ప్రస్తుతం అందజేస్తున్న రూ.4,500 జీవన భృతి మొత్తాన్ని రూ.9 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో కేంద్రమత్స్య శాఖ మంత్రి పురుషోత్తం రూపాలను కలసి మత్స్యకారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ ద్వారా ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై)లో కనీసం 50 శాతం నిధులను సంప్రదాయ మత్స్యకారుల సంక్షేమానికి వినియోగించాలన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద పథకం కింద ఎంపికయ్యే మత్స్య సహకార సంఘాలకు, వాటిలోని సభ్యులకు 60 శాతం సబ్సిడీని అందజేయాలన్నారు. సెంటర్ ఫర్ ఇన్ ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సంస్థకు సంబంధించిన ప్రాంతీయ విభాగాన్ని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ట్యూషన్‌కు వెళ్లమన్నందుకు బాలిక ఆత్మహత్య


ఆహానా

హఫీజ్‌పేట్ (హైదరాబాద్): ట్యూషన్‌కు వెళ్లమన్నందుకు ఓ బాలిక 15వ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సందీప్ కుటుంబంతో కలిసి 10 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి ఐటీ సంస్థలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. 4 నెలల క్రితం నల్లగండ్లలోని అపర్ణ సరోవర్‌లోని ఈ–104 ఫ్లాట్‌కు మారారు. సందీప్‌కు ఒక కుమార్తె ఆహానా (12) తెల్లాపూర్‌లోని గ్లెండేల్ ఇంటర్నేషనల్ పాఠశాలలో 6వ తరగతి చదువుతోంది. మ్యాథ్స్ ట్యూషన్ కోసం అదే అపార్ట్‌మెంట్‌లోని హెచ్–1501లో సాయంత్రం 5 గంటల నుంచి 6 గంటల వరకు వెళ్తుంది. అయితే ఆహానా తనకు ట్యూషన్ ఇష్టం లేదని తల్లిదండ్రులకు చెప్పింది. అయినప్పటికీ వారు ట్యూషన్‌కు వెళ్లాలంటూ కూతురిని బలవంతం చేశారు. దీంతో చిన్నారి యాధావిధిగా శుక్రవారం స్కూల్ నుంచి 3.30 గంటలకు వచ్చి సాయంత్రం 4.50 గంటలకు 15వ అంతస్తులోని బాల్కనీ కిటికీ తీసుకుని కిందకు దూకేసింది. కింద పడటంతో తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. తల్లిదండ్రులు ఈ ఘటనపై చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు ముగ్గురు రైతుల మృతి

● రెండు ఎడ్లు కూడా మృత్యువాత
● ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఓ మహిళ సహా ఇద్దరు
● మంచిర్యాలలో ఓ యువరైతు బలి


రవీందర్


యాసిన్

జైనథ్, వాంకిడి, కోటపల్లి: రాష్ట్రంలో పిడుగుపాటుకు గురై వేర్వేరు జిల్లాల్లో ఓ మహిళ సహా ముగ్గురు రైతులు దుర్మరణం పాలైన ఘటనలు శుక్రవారం చోటుచేసుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం గూడ గ్రామానికి చెందిన రైతు షేక్ యాసిన్(41) తన భార్య అఫ్సానాతో పొలంలో పత్తికి పురుగుల మందు పిచికారీ చేస్తుండగా భారీ వర్షం మొదలైంది. దీంతో ఇంటికి వెళ్లేందుకు ఎడ్లబండిని సిద్ధం చేసేందుకు చెట్టు కిందకు వెళ్లగా ఒక్కసారిగా పిడుగుపడటంతో యాసిన్ అక్కడికక్కడే కుప్పకూలాడు. రెండు ఎడ్లు సైతం అక్కడికక్కడే మృతి చెందాయి. కొంత దూరంలో ఉన్న అఫ్సానాకు తలకు గాయాలై స్పృహ కోల్పోవడంతో చికిత్స నిమిత్తం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కుమురంభీం జిల్లా వాంకిడి మండలం వెల్గి గ్రామ పంచాయతీ పరిధిలో పత్తి చేనులో ఎరువు వేస్తున్న క్రమంలో భారీ వర్షం రావడంతో చింతచెట్టు వద్దకు వెళ్లి పిడుగు పాటుకు గురై మన్నెగూడ గ్రామానికి చెందిన పద్మబాయి(23) మృతి చెందారు. పక్కనే ఉన్న ఆమె భర్త గేడం టుల్లికి తీవ్ర గాయాలు కావడంతో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం రొయ్యలపల్లి గ్రామానికి చెందిన రైతు రావుల రవీందర్(25) పత్తి చేనులో పురుగుల మందు పిచికారీ చేస్తుండగా పిడుగు పడి స్పృహకోల్పోయాడు. దగ్గరలోనే ఉన్న భార్య లావణ్య వెంటనే రవీందర్‌ను చెన్నూర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఏడాది క్రితమే వారికి వివాహమైంది.

క్లుప్తంగా...

మహిళా రిజర్వేషన్ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

న్యూఢిల్లీ: చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఉద్దేశించిన మహిళా రిజర్వేషన్ బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ శాఖ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. బిల్లును ఇకపై అధికారికంగా రాజ్యాంగ(106వ సవరణ) చట్టంగా వ్యవహరిస్తారు. అంటే మహిళా రిజర్వేషన్ బిల్లు రాష్ట్రపతి ఆమోదంతో పూర్తిస్థాయి చట్టంగా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన తేదీ నుంచి అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అమల్లోకి వస్తుంది. నారీశక్తి వందన్ అధినియమ్ పేరిట కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లు లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే.

శృంగారానికి సమ్మతి వయసు మార్చొద్దు

కేంద్రానికి లా కమిషన్ సూచన

న్యూఢిల్లీ: శృంగార కార్యకలాపాల్లో పాల్గొనే విషయంలో 'సమ్మతి వయసు'ను తగ్గించాలన్న వాదనను లా కమిషన్ వ్యతిరేకించింది. ఈ విషయంలో ఎలాంటి మార్పులు చేయొద్దని కేంద్ర ప్రభుత్వానికి తెలియజేసింది. లైంగిక హింస నుంచి చిన్నారులకు రక్షణ కల్పించేందుకు తీసుకొచ్చిన పోక్సో చట్టం ప్రకారం.. శృంగారానికి సమ్మతి వయసు ప్రస్తుతం 18 ఏళ్లుగా ఉంది. దీన్ని 16 ఏళ్లకు తగ్గించాలన్న వినతులు వచ్చాయి. లా కమిషన్ తన నివేదికను తాజాగా కేంద్రప్రభుత్వానికి సమర్పించింది. పోక్సో చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు వయసు వారంతా బాలలే. వారిపై అత్యాచారానికి, లైంగిక నేరాల కు పాల్పడితే 20 ఏళ్లకుపైగా జైలు శిక్ష విధించవచ్చు.

దశల వారీగా ఈ-ఎఫ్ఐఆర్‌ల రిజిస్ట్రేషన్

కేంద్రానికి లా కమిషన్ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలో ఈ-ఎఫ్ఐఆర్‌ల (ఎలక్ట్రానిక్ ప్రాథమిక సమాచార నివేదిక) రిజిస్ట్రేషన్ ప్రక్రియను దశల వారీగా అమల్లోకి తీసుకురావాలని లా కమిషన్ సూచించింది. ఈ మేరకు తన నివేదికను ఇటీవల కేంద్ర ప్రభుత్వానికి సమర్పించింది. తొలుత మూడేళ్ల వరకు జైలు శిక్ష పడే నేరాల్లో ఈ-ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయాలని వెల్లడించింది. ఈ-ఎఫ్ఐఆర్‌ల రిజిస్ట్రేషన్ కోసం దేశవ్యాప్తంగా కేంద్రీకృత జాతీయ పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించింది.

'జాహ్నవి' మృతిపై అనుచిత వ్యాఖ్యలు.. విధుల నుంచి అధికారి తొలగింపు

సియాటెల్: అమెరికాలో రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన తెలుగు విద్యార్థిని కందుల జాహ్నవి(23)పై అనుచిత వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలున్న పోలీసు అధికారిపై వేటు పడింది. పోలీస్ అధికారి డేనియల్ ఆడెరర్‌ను గస్తీ విధుల నుంచి తొలగించినట్లు సియాటెల్ పోలీస్ విభాగం గురువారం ధ్రువీకరించింది. అతడికి ఎలాంటి బాధ్యతలను అప్పగించలేదని కూడా తెలిపింది. అయితే, ఆడెరర్‌పై చర్యలు ఎప్పుడు తీసుకున్నదీ వెల్లడించలేదు. జనవరి 23వ తేదీన సియాటెల్‌లో కెవిన్ డేవ్ పోలీసు అధికారి నడుపుతున్న వాహనం ఢీకొని రోడ్డు దాటుతున్న కందుల జాహ్నవి ప్రాణాలు కోల్పోయింది. సమాచారం అందుకున్న మరో అధికారి డేనియల్ అడెరర్ చులకన చేస్తూ మాట్లాడటంపై తీవ్ర దుమారం చెలరేగింది. ఆడెరర్ బాడీ కెమెరా రికార్డింగ్ ఆధారంగా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు సియాటెల్ పోలీస్ విభాగం పేర్కొంది.

'ఇండియా' కూటమిలోనే ఉంటాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమి నుంచి తాము బయటకు వచ్చే ప్రసక్తే లేదని ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తేల్చిచెప్పారు. ఇండియా కూటమిలోనే భాగస్వామిగా ఉంటామని చెప్పారు. ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కూటమి ధర్మానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. విపక్ష కూటమి తరఫున ప్రధానమంత్రి అభ్యర్థిగా మీ పేరును ఎందుకు ప్రకటించడం లేదని ప్రశ్నించగా... తామే ప్రధానమంత్రి అని దేశంలోని 140 మంది భారతీయులు భావించేలా ఒక వ్యవస్థను తయారు చేయాల్సిన అవసరం ఉందని కేజ్రీవాల్ బదులిచ్చారు. కేవలం ఒక వ్యక్తిని కాదని, పౌరులందరినీ అభివృద్ధిలోకి తీసుకురావాలని చెప్పారు.


'ఇండియా'కు మద్దతు

న్యూఢిల్లీ: విపక్ష ఇండియా కూటమికి 18 చిన్న పార్టీలు, 50కి పైగా పౌర సంఘాలు మద్దతు ప్రకటించాయి. త్వరలో జరగనున్న పలు రాష్ట్రాల అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల్లో ఆ కూటమిలోని పార్టీల తరఫున పోటీ చేసే అభ్యర్థులకు మద్దతివ్వాలని నిర్ణయించాయి. 'ఇండియా గెలుస్తుంది: ప్రజాస్వామ్యం, సామ్యవాదం, సామాజిక న్యాయం కోసం జాతీయ సదస్సు' పేరుతో వాటి నేతలు శుక్రవారం ఇక్కడ భేటీ అయ్యారు. ముఖ్యంగా విపక్ష అభ్యర్థులు స్వల్ప తేడాతో ఓడిపోతున్న 100 నుంచి 150 లోక్‌సభ స్థానాల్లో ఈసారి వారికి దన్నుగా నిలుస్తామని స్వరాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్ పేర్కొన్నారు. 20కి పైగా రాష్ట్రాల నుంచి ప్రతినిధులు సదస్సుకు హాజరైనట్లు చెప్పారు.

'వాలంటీర్' విభాగం చీఫ్‌గా వాగ్నర్ కమాండర్: పుతిన్

మాస్కో: ఉక్రెయిన్ లో సైనిక లోటును పూడ్చుకునేందుకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నానా ప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా తమ సైన్యం తాలూకు 'వాలంటీర్' విభాగం చీఫ్‌గా వాగ్నర్ మాజీ కమాండర్ ఆండ్రే ట్రొషెవ్‌ను నియమించారు. ప్రధానంగా కిరాయి సైన్యం అయిన వాగ్నర్ గ్రూప్ చీఫ్ యెవ్‌గనీ ప్రిగోజిన్ ఇటీవల విమాన ప్రమాదంలో అనుమానాస్పద రీతిలో మరణించడం తెలిసిందే.

పెద్ద టెలీస్కోప్!



గ్రహాంతరవాసుల గుట్టు విప్పేందుకు శరవేగంగా సిద్ధం చేస్తున్న నాసా

జేమ్స్ వెబ్ కంటే 4 రెట్లు పెద్దది!

ఈ అనంత విశ్వంలో మనం ఒంటరి జీవులమేనా? లేక ఇతర గ్రహాల్లోనో, లేదంటే విశ్వాంతరాల్లో సుదూరాల్లోనో మరెక్కడైనా జీవముందా? ఉంటే వాళ్లు మనలాంటి ప్రాణులేనా? మనిషిని ఎంతోకాలంగా వెంటాడుతున్న ఈ ప్రశ్నలకు సమాధానం కనిపెట్టే ప్రయత్నాలకు మరోసారి తెర లేచింది. ఇందుకోసం ప్రపంచంలోకెల్లా అతి పెద్ద ఆప్టికల్ టెలీస్కోప్ అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ నాసా ఆధ్వర్యంలో శరవేగంగా రూపుదిద్దుకుంటోంది..!

ఏమిటీ జీఎంటీ? — జయింట్ మగలాన్ టెలీస్కోప్ (జీఎంటీ)

విశ్వంలో సుదూరంలో ఉన్న నక్షత్రాలు తదితరాల రసాయన విశ్లేషణ ద్వారా వాటి లోగుట్టును కనిపెట్టేందుకు అత్యధిక సామర్థ్యంతో కూడిన ఈ టెలీస్కోప్ నాసా ఆధ్వర్యంలో సిద్ధమవుతోంది...

- దీని ఉపరితలం వైశాల్యమే ఏకంగా 368 చదరపు మీటర్లు!
- జీఎంటీకు ఏడు అతి పెద్ద పట్టకాల సమూహాన్ని బిగిస్తున్నారు. వీటి పొడవు 24.5 మీటర్లు.
- వీటిలో కీలకమైన చివరి, ఏడో ప్రాథమిక పట్టకం పాలిషింగ్ పని చివర్లో ఉందిప్పుడు.

20 టన్నుల ఆప్టికల్ గ్లాస్!

- జీఎంటీ తాలూకు పట్టకాల తయారీ పని అరిజోనా యూనివర్సిటీలోని రిచర్డ్ ఎఫ్.కారిస్ మిర్రర్ ల్యాబ్‌లో పెద్ద ఎత్తున జరుగుతోంది.
- ఇందుకోసం ఏకంగా 20 టన్నుల అత్యంత శుద్ధమైన ఆప్టికల్ గ్లాస్‌ను వాడుతున్నారు.
- దాన్ని 1,185 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద వేడి చేస్తున్నారు.
- ఈ గ్లాస్ కరిగిన కొద్దీ బయటి కొసవైపు కుంభాకారపు పట్టకంగా రూపుదాలుస్తుంది.
- తర్వాత దాన్ని 3 నెలల పాటు చల్లబరుస్తారు.
- అనంతరం పాలిషింగ్ చేస్తారు.
- చివరగా ఏడు అద్దాలనూ కలగలిపి ఒకే పెద్ద పట్టకంగా బిగిస్తారు.
- అప్పుడిక ప్రస్తుతం అందుబాటులో ఉన్న అత్యాధునిక టెలీస్కోప్‌లన్నింటి కంటే జీఎంటీ కనీసం 4 రెట్లు హెచ్చు రిజల్యూషన్, 200 రెట్లు అధిక సున్నితత్వంతో పనిచేసే టెలిస్కోప్‌గా మారుతుంది.
- జేమ్స్‌వెబ్‌తో సహా ఇప్పటిదాకా అందుబాటులో ఉన్న ఏ టెలీస్కోప్‌కూ ఇంత పెద్ద పట్టకం లేదు. అయితే ఇన్ ఫ్రారెడ్ కాంతిలో విశ్వాన్ని పరిశీలించే శక్తి ఇప్పుడు తయారవుతున్న జీఎంటీతో సహా ఏ టెలీస్కోప్‌కూ లేదు. ఆ సామర్థ్యం ఇప్పటిదాకా జేమ్స్ వెబ్ కు మాత్రమే సొంతం.
- జీఎంటీ పొడవు 39 మీటర్లు. దీని తయారీకి 2,100 టన్నుల స్టీలు వాడుతున్నారు!

జీవం ఉనికిని గుర్తించడంలో కీలకం...

సుదూరాల్లోని గ్రహాలు, శకలాలు తదితర గోళాల్లో ఉపరితలాలను ముందెన్నడూ లేనంత స్పష్టంగా పరిశీలించేందుకు జీఎంటీ తోడ్పడుతుందని సైంటిస్టులు చెబుతున్నారు. 'ముఖ్యంగా భూమి మాదిరిగానే వాటిమీద పర్వతమయ ప్రాంతాలు ఉన్నదీ లేనిదీ తెలుస్తుంది. తద్వారా వాటిమీద జీవం ఉనికి తాలూకు జాడ కూడా చిక్కుతుంది' అని వారు అంటున్నారు.

కొసమెరుపు:

ఈ జీఎంటీ టెలిస్కోప్ పూర్తిగా తయారై అందుబాటులోకి రావడానికి కనీసం మరో ఆరేళ్లన్నా పట్టొచ్చట. అంటే, దశాబ్దాంతం దాకా వేచి చూడాల్సిందే!

నేషనల్ డెస్క్, సాక్షి



మస్తుంగ్‌లో బాంబు పేలుడు దృశ్యం

పాక్‌లో ఆత్మాహుతి దాడులు.. 58 మంది మృతి

మరో 100 మందికి గాయాలు

కరాచీ: మసీదుల్లో మిలాదునబి వేడుకలే లక్ష్యంగా పాకిస్తాన్‌లో శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు ఆత్మాహుతి దాడుల్లో 58 మంది మృత్యువాతపడగా మరో 100 మందికి పైగా గాయాలపాలయ్యారు. బలూచిస్తాన్ ప్రావిన్స్ మస్తుంగ్ జిల్లా కేంద్రంలోని ఓ మసీదులో ప్రార్థనల సమయంలో జరిగిన బాంబు దాడిలో 54 మంది చనిపోయారు. మరో 100 మంది గాయపడ్డారు. మృతుల్లో డీఎస్పీ నవాజ్ గష్కోరి కూడా ఉన్నారు. గుర్తు తెలియని దుండగుడు డీఎస్పీ నవాజ్ కారు పక్కనే నిలబడి తనను తాను పేల్చేసుకున్నాడని అధికారులు తెలిపారు. క్షతగాత్రుల్లో సుమారు 20 మంది పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అదేవిధంగా, ఖైబర్ ఫంక్తున్వా ప్రావిన్స్ హంగు నగరంలోని దవోబా పోలీస్ ఠాణాలోకి అయిదుగురు ఉగ్రవాదులు ప్రవేశించారు. భద్రతా బలగాలతో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక ఉగ్రవాది హతం కాగా మరో నలుగురు పారిపోయారు. వారిలో ఒకరు పక్కనే ఉన్న మసీదులోకి చేరుకుని తనను పేల్చేసుకున్నాడు. ఈ దాడిలో మసీదులో ఉన్న నలుగురు ప్రాణాలు కోల్పోగా మరో 12 మంది గాయపడ్డారు. మిగతా ముగ్గురు ఉగ్రవాదుల కోసం వేట సాగుతోందని పోలీసులు చెప్పారు. ఈ దాడులకు తాము కారణం కాదంటూ తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ తెలిపింది. ఉగ్ర సంస్థ ఇస్లామిక్ స్టేట్(ఐఎస్)కు చెందిన కీలక కమాండర్‌ను భద్రతా బలగాలు కాల్చి చంపిన మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడంతో ఐఎస్ పాత్రపై అనుమానాలు తలెత్తుతున్నాయి.

2029 నుంచే జమిలి ఎన్నికలు!

- ఫార్ములాను ప్రతిపాదిస్తున్న లా కమిషన్
- కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని పొడిగించాలి
- మరికొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని తగ్గించాలి
- ఉమ్మడి ఓటర్ల జాబితాతోనే అన్ని రకాల ఎన్నికలు
- కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్న లా కమిషన్

న్యూఢిల్లీ: లోక్‌సభతోపాటు అన్ని రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించడంపై దేశవ్యాప్తంగా చర్చ సాగుతోంది. జమిలి ఎన్నికలు వచ్చే ఏడాది సాధ్యం కాదని లా కమిషన్ తేల్చిచెప్పినట్లు సమాచారం. కేంద్ర ప్రభుత్వ సిఫార్సు మేరకు జమిలి ఎన్నికల సాధ్యాసాధ్యాలపై జస్టిస్ రితూ రాజ్ అవస్థీ నేతృత్వంలోని లా కమిషన్ అధ్యయనం చేస్తోంది. 2029 నుంచి లోక్‌సభతోపాటు రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడానికి వీలుగా కమిషన్ ఓ ఫార్ములాను ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది. దాని ప్రకారం.. కొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని పొడిగించాలి. మరికొన్ని రాష్ట్రాల శాసనసభల కాలపరిమితిని తగ్గించాలి. ఈ ఫార్ములాతోజమిలి ఎన్నికలు నిర్వహించడం సులువేనని లా కమిషన్ నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. జమిలి ఎన్నికలపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని సైతం ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

ఉమ్మడి ఓటర్ల జాబితాతో మేలు

ఓటర్ల జాబితా విషయంలోనూ లా కమిషన్ కీలక సిఫార్సును తెరపైకి తీసుకొస్తోంది. లోక్‌సభ, శాసనసభలు, స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రస్తుతం వేర్వేరు ఓటర్ల జాబితాలను ఉపయోగిస్తున్నారు. వీటిని కేంద్ర ఎన్నికల సంఘం, రాష్ట్రాల ఎన్నికల సంఘాలు రూపొందిస్తున్నాయి. అన్ని రకాల ఎన్నిలకు ఒక ఉమ్మడి ఓటర్ల జాబితా ఉండాలన్నదే లా కమిషన్ ఉద్దేశమని సమాచారం. దీనివల్ల ఖర్చు, మానవ వనరుల వినియోగం గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడుతోంది. ఉమ్మడి ఎన్నికల జాబితా కోసం ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని చెబుతోంది. జమిలి ఎన్నికల ప్రక్రియలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేయడానికి ఓటర్లు పోలింగ్ బూత్‌కు కేవలం ఒకే ఒక్కసారి వెళ్లేలా చర్యలు తీసుకోవాలని లా కమిషన్ సూచిస్తోంది. అంటే ఒకే పోలింగ్ బూత్‌లో ఒకేసారి రెండు ఎన్నికల్లో ఓట్లు వేసేలా ఏర్పాట్లు ఉండాలని చెబుతోంది. జమిలి ఎన్నికలపై లా కమిషన్ సిఫార్సులు కొన్ని అనధికారికంగా బయటకు వచ్చినప్పటికీ తుది నివేదిక ఇంకా సిద్ధం కాలేదు. ఇంకా కొన్ని అంశాలపై మరింత అధ్యయనం చేయాల్సి ఉందని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి.

ఏడాది వ్యవధిలో రెండు దశలు

లోక్‌సభ, శాసనసభలతోపాటు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అధ్యయనం బాధ్యతను రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీకి కేంద్ర ప్రభుత్వం అప్పగించింది. లా కమిషన్ మాత్రం ఏకకాలంలో లోక్‌సభ, శాసనసభల ఎన్నికలు నిర్వహించడంపై అధ్యయనం చేస్తోంది. కోవింద్ కమిటీ ఏర్పాటు నేపథ్యంలో లా కమిషన్ కూడా మూడు రకాల ఎన్నికలపై దృష్టి పెట్టినట్లు సమాచారం. లోక్‌సభ, శాసనసభల ఎన్నికలను ఒక దశలో, స్థానిక సంస్థల ఎన్నికలను రెండో దశలో నిర్వహించాలని లా కమిషన్ అభిప్రాయపడుతోంది.

వరల్డ్ కప్ కాదు.. టెర్రర్ కప్

భారత్‌లో విధ్వంసానికి ఖలిస్తాన్ ఉగ్రవాది గురుపట్వంత్ సింగ్ పన్నూ హెచ్చరికలు

- ప్రజల ఫోన్లకు ప్రి-రికార్డెడ్ వాయిస్ మెసేజ్
- హరిదీప్ సింగ్ నిజ్జర్ హత్యకు ప్రతీకారం తీర్చుకుంటాం
- అక్టోబర్ 5న ప్రపంచ టెర్రర్ కప్ ప్రారంభమవుతుందని హెచ్చరిక

అహ్మదాబాద్: కరడుగట్టిన ఖలిస్తాన్ ఉగ్రవాది, నిషేధిత సిఖ్స్ ఫర్ జస్టిస్(ఎస్ఎఫ్‌జే) సంస్థ అధినేత గురుపట్వంత్ సింగ్ పన్నూపై గుజరాత్ పోలీసుల ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. గుజరాత్ రాష్ట్రం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో అక్టోబర్ 5 నుంచి ప్రారంభమయ్యే క్రికెట్ ప్రపంచ కప్ 'ప్రపంచ టెర్రర్ కప్'గా మారతుందంటూ సోషల్ మీడియాలో పన్నూ చేసిన హెచ్చరికలను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసేలా బెదిరింపులకు పాల్పడినందుకు అతడిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అహ్మదాబాద్ సైబర్ క్రైమ్ విభాగం పోలీసు అధికారులు శుక్రవారం వెల్లడించారు. ముందే రికార్డు చేసిన ఓ వాయిస్ మెసేజ్‌ను విదేశీ ఫోన్ నంబర్‌తో సోషల్ మీడియాలో పన్నూ పోస్టు చేశాడని తెలిపారు. +447418343648 అనే నంబర్‌తో దేశవ్యాప్తంగా చాలామందికి ఈ మెసేజ్ అందిందని పేర్కొన్నారు. మెసేజ్ అందుకున్న వారు ఈ విషయాన్ని తమ దృష్టికి తీసుకొచ్చారని చెప్పారు. సబ్‌ఇన్‌స్పెక్టర్ హెచ్.ఎన్. ప్రజాపతి ఫిర్యాదు మేరకు పన్నూపై కేసు పెట్టినట్లు వివరించారు. +44 అనేది యునైటెడ్ కింగ్‌డమ్(యూకే) కోడ్ కావడం గమనార్హం. అయితే, ఇంటర్నెట్ కాల్ టెక్నాలజీతో ఇలా విదేశీ ఫోన్ నంబర్ల నుంచి సందేశం వస్తున్నట్లు తప్పుదోవ పట్టించవచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే పన్నూ హెచ్చరికల మెసేజ్ ఎక్కడి నుంచి వస్తోందన్న దానిపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

...ఇట్లు గురుపట్వంత్ సింగ్ పన్నూ

విదేశీ ఫోన్ నంబర్‌తో వచ్చిన కాల్‌ను రిసీవ్ చేసుకున్న తర్వాత ప్రి-రికార్డెడ్ వాయిస్ మెసేజ్ వినిపిస్తోందని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీసు జీతూ యాదవ్ తెలియజేశారు. "అమర వీరుడు హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు కచ్చితంగా ప్రతీకారం తీర్చుకుంటాం. మీ బుల్లెట్లకు వ్యతిరేకంగా బ్యాలెట్లు ఉపయోగిస్తాం. మీరు సాగిస్తున్న హింసాకాండకు వ్యతిరేకంగా ఓట్లు వేస్తాం. అక్టోబర్ 5వ తేదీని గుర్తు పెట్టుకోండి. ఆ రోజు క్రికెట్ ప్రపంచ కప్ కాదు, ప్రపంచ టెర్రర్ కప్ ప్రారంభమవుతుంది. సిఖ్స్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో ఖలిస్తాన్ జెండాలతో అహ్మదాబాద్‌ను ముట్టడిస్తాం.. ఇట్లు గురుపట్వంత్ సింగ్ పన్నూ" అంటూ ఆ సందేశంలో హెచ్చరికలు వినిపిస్తున్నాయని వెల్లడించారు. అహ్మదాబాద్ నగర ప్రజలకు గత రెండు రోజులుగా ఈ మెసేజ్ వస్తోందన్నారు.

ఎవరీ పన్నూ?



సిక్కుల కోసం భారత్‌లో ఖలిస్తాన్ అనే ప్రత్యేక దేశం ఏర్పాటే తన జీవితాశయమని ప్రకటించుకున్న గురుపట్వంత్ సింగ్ పన్నూ పంజాబ్ రాష్ట్రంలో అమృత్‌సర్ సమీపంలోని ఖంజోత్ అనే గ్రామంలో జన్మించాడు. న్యాయ విద్య అభ్యసించాడు. అనంతరం కెనడాకు వలస వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. కెనడా పౌరసత్వం కూడా సంపాదించాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే సంస్థను స్థాపించాడు. భారత్‌కు వ్యతిరేకంగా కార్యకలాపాలు సాగిస్తున్నాడు. భారత్‌లో జరిగిన పలు ఉగ్రవాద దాడుల్లో అతడి హస్తం ఉన్నట్లు గుర్తించారు. ఖలిస్తాన్ ఉద్యమానికి మద్దతుగా కెనడాతోపాటు అమెరికా, యూకే, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ర్యాలీలు నిర్వహించాడు. ఖలిస్తాన్‌కు అనుకూలంగా వివిధ దేశాల ప్రభుత్వాల మద్దతును కూడగట్టడానికి లాబీయింగ్ చేస్తున్నాడు. హరిదీప్ సింగ్ నిజ్జర్ హత్యపై పన్నూ తీవ్రంగా రగిలిపోయాడు. కెనడాలోని హిందువులంతా దేశం విడిచి వెళ్లిపోవాలని కొన్ని రోజుల క్రితం హెచ్చరికలు జారీ చేశాడు. 2020 జులైలో పన్నూను భారత ప్రభుత్వం ఉగ్రవాదిగా ప్రకటించింది. ప్రస్తుతం అతడు కెనడాలో అజ్ఞాతంలో ఉన్నాడు.

భారత వ్యతిరేక కార్యకలాపాల అడ్డాగా కెనడా



బ్లింకెన్‌తో జైశంకర్

వాషింగ్టన్: కెనడాలో ఖలిస్తాన్ వేర్పాటువాద నేత హర్‌దీప్ సింగ్ నిజ్జర్ మృతి, దానికి సంబంధించిన రగడపై అమెరికాతో లోతుగా చర్చించినట్లు విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్ తెలిపారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన గురువారం ఆ దేశ విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్‌తో భేటీ అయ్యారు. హత్యపై కెనడా జరుపుతున్న దర్యాప్తుకు పూర్తిగా సహకరించాలని బ్లింకెన్ ఈ సందర్భంగా సూచించినట్లు విదేశాంగ శాఖ ఉన్నతాధికారి ఒకరు శుక్రవారం పేర్కొన్నారు. అనంతరం దీనిపై జై శంకర్ స్పందించారు. భారత్ లక్ష్యంగా వేర్పాటువాదం, హింస, వ్యవస్థీకృత నేరాలు, మనుషుల అక్రమ రవాణా వంటివాటికి కెనడా కొన్నేళ్లుగా అడ్డాగా మారుతోందని మండిపడ్డారు. 'పైగా అక్కడి ప్రభుత్వం కూడా కొన్నేళ్లుగా అలాంటి వాటిని అనుమతిస్తున్న ధోరణి కనబరుస్తోంది. ట్రూడో సర్కారు రాజకీయ అనివార్యతలే ఇందుకు కారణం' అని ఆరోపించారు. 'కెనడాలో భారత దౌత్యవేత్తలను బాహాటంగా బెదిరించే దుస్థితి నెలకొంది! కార్యాలయాలకు వెళ్లడం కూడా రిస్కుగా మారింది. అందుకే ఆ దేశానికి వీసా సేవలను కూడా ఆపేయాల్సి వచ్చింది' అని జైశంకర్ వివరించారు.

సన్నిహిత సంబంధాలకే మొగ్గు: ట్రూడో



టొరంటో: ప్రపంచ రాజకీయాల్లో కీలకంగా మారి, ప్రబల ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్‌తో సన్నిహిత సంబంధాలను మెరుగుపర్చుకునేందుకు కట్టుబడి ఉన్నామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చెప్పారు. అదేసమయంలో, ఖలిస్తాన్ వేర్పాటువాది నిజ్జర్ హత్య ఘటనకు సంబంధించిన వాస్తవాల వెల్లడిలో సహకారానికి భారత్ ముందుకురావాలని కోరారు. భారత్‌పై బలమైన ఆరోపణలున్నప్పటికీ సన్నిహితంగా ఉండేందుకే ప్రాధాన్యం ఇస్తామన్నారు. మాంట్రియల్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ప్రపంచ వేదికపై కీలకంగా మారిన భారత్‌తో కెనడా, మిత్ర దేశాలు నిర్మాణాత్మకంగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతో ఉందని భావిస్తున్నా. ఆర్థిక శక్తిగా ఎదుగుతున్న భారత్ అంతర్జాతీయ రాజకీయాల్లో తనవంతు పాత్ర పోషిస్తోంది. అందుకే భారత్‌తో సన్నిహిత సంబంధాల కొనసాగింపునకు కట్టుబడి ఉన్నాం' అని చెప్పారు. అదే సమయంలో చట్టపాలన కలిగిన దేశంగా, నిజ్జర్ హత్యకు సంబంధించిన పూర్తి వాస్తవాలను వెలుగులోకి తెచ్చేందుకు భారత్ తమతో కలిసి పని చేయాలని భావిస్తున్నామన్నారు. భారత్ విదేశాంగ మంత్రి జైశంకర్‌తో వాషింగ్టన్‌లో జరిగే సమావేశంలో ఇదే విషయాన్ని బ్లింకెన్ ప్రస్తావిస్తారని కూడా బైడెన్ ప్రభుత్వం చెప్పిందన్నారు.

ఈయన పొట్టలో ఏమున్నాయంటే.. ఇయర్ ఫోన్లు.. స్క్రూలు, లాకెట్లు..!



కుల్దీప్ పొట్టలో నుంచి తీసిన వస్తువులు

మోగా: ఇయర్ ఫోన్లు..స్క్రూలు, నట్లు, బోల్టులు, చైన్, లాకెట్లు..మంత్రగాడు గాల్లో నుంచి పుట్టించినట్లుగా, మెజీషియన్ తన టోపీలో నుంచి తీస్తున్నట్లుగా డాక్టర్లు ఓ వ్యక్తి పొట్టలో నుంచి వీటన్నిటినీ బయటకు తీశారు. పంజాబ్‌లోని మోగాకు చెందిన కుల్దీప్ సింగ్(40) రెండేళ్లుగా కడుపు నొప్పి, వాంతులతో బాధపడుతున్నాడు. ఎన్ని ఆస్పత్రులకు తిరిగినా నయం కాలేదు. ఇటీవల మోగాలోని మెడిసిటీ ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ కుల్దీప్‌కు వైద్యులు ఎక్స్ రే పరీక్ష చేశారు. అతడి కడుపులో రకరకాల లోహపు వస్తువులు ఉండటడం చూసి వారు ఆశ్చర్యపోయారు. గురువారం కుల్దీప్ సింగ్‌కు దాదాపు మూడు గంటల పాటు ఆపరేషన్ చేసి, ఇయర్ ఫోన్లు..స్క్రూలు, నట్లు, బోల్టులు, చైన్, లాకెట్లు వంటి రకరకాల వస్తువుల్ని బయటకు తీశారు.


మేనకా గాంధీకి ఇస్కాన్ రూ.100 కోట్ల పరువు నష్టం నోటీస్

కోల్‌కతా: ఇస్కాన్ గోశాలల్లో గోవులను కబేళాలకు అమ్మేస్తున్నారంటూ ఆరోపించిన బీజేపీ ఎంపీ మేనకా గాంధీకి శుక్రవారం రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు పంపినట్లు ఇస్కాన్(ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్సియస్‌నెస్) తెలిపింది. ఆరోపణలు చేస్తున్నట్లుగా ఉన్న కేంద్ర మాజీ మంత్రి మేనకా గాంధీ తేదీ లేని వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'ఆనంద్‌పూర్‌లోని గోశాలకు వెళ్లినట్లు మేనకా గాంధీ చెబుతున్నారు. అక్కడుండే భక్తులకు గానీ, సభ్యులకు గానీ ఆ గోశాల వద్ద ఆమె కనిపించకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడికి వెళ్లి చూడకుండానే అక్కడి పరిస్థితులపై ఆమె ఎలా మాట్లాడగలరు? ఆమె ఆరోపణలు పూర్తిగా నిరాధారాలు'అని కోల్‌కతా ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రాధారామ్ దాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇలాంటి దురుద్దేశపూరిత ఆరోపణల కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇస్కాన్ భక్తులు, మద్దతుదారులు, శ్రేయోభిలాషులు తీవ్ర వేదనకు గురయ్యారని తెలిపారు. ఇస్కాన్‌కు వ్యతిరేకంగా జరిగే తప్పుడు ప్రచారాన్ని తాము ఉపేక్షించేది లేదన్నారు.

టీవీ లైవ్ షోలో కొట్టుకున్న పాక్ నేతలు

ఇస్లామాబాద్: టీవీలో ఇద్దరు నేతల చర్చా కార్యక్రమం అది. పరస్పర విమర్శలు చేసుకున్నారు. ఆగ్రహంతో ముష్టిఘాతాలు కురిపించుకున్నారు. ప్రజాదరణ పొందిన పాకిస్తానీ టాక్ షో 'కల్ తక్' ఈ ఘటనకు వేదికైంది. ఇద్దరు నేతల డిష్యుం..డిష్యుం..వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇద్దరి తీరును నెటిజన్లు తప్పుపట్టారు. గొడవను ఆపలేకపోయిన నిర్వాహకుల తీరును సైతం ఎండగట్టారు. పాకిస్తాన్ తెహ్రీక్-ఇ--ఇన్సాఫ్ చీఫ్, మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ తరఫున షేర్ అఫ్జల్ మర్వాత్ అనే లాయర్, మరో మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్‌కు చెందిన పాకిస్తాన్ ముస్లిం లీగ్‌కు చెందిన సెనేటర్ అఫ్నాన్ ఉల్లా టీవీ చర్చలో పాల్గొన్నారు. మిలటరీతో తెరవెనుక సంప్రదింపులు జరుపుతున్నారంటూ ఇమ్రాన్ ఖాన్‌పై అఫ్నాన్ ఉల్లా ఆరోపణలు చేశారు. ప్రతి ఆరోపణలకు బదులుగా మర్వాత్ లేచి ఖాన్ తలపై గట్టిగా బాదారు. అఫ్నాన్ కూడా మర్వాత్‌పై పిడిగుద్దులు కురిపించారు. లైవ్ షోలోనే ఇదంతా జరిగిపోయింది. నిర్వాహకులు విడదీసేందుకు ప్రయత్నించినా వారిద్దరూ కొట్టుకుంటూనే ఉన్నారు. వీరి వ్యవహారం చూసి జనం నిశ్చేష్టులయ్యారు.

పీటీఐ చైర్మన్‌గా శాంత్ కుమార్



న్యూఢిల్లీ: ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా(పీటీఐ)చైర్మన్‌గా ది ప్రింటర్స్(మైసూర్)కు చెందిన కేఎన్ శాంత్ కుమార్(62) ఎన్నికయ్యారు. పీటీఐ వైస్ చైర్మన్‌గా హిందుస్తాన్ టైమ్స్ సీఈవో ప్రవీణ్ సోమేశ్వర్ ఎన్నికయ్యారు. అవీక్ సర్కార్ స్థానంలో శాంత్ కుమార్ బాధ్యతలు చేపడతారు. శుక్రవారం ఢిల్లీలోని పీటీఐ ప్రధాన కార్యాలయంలో జరిగిన పీటీఐ బోర్డు సభ్యుల వార్షిక సమావేశం కార్యవర్గాన్ని ఎన్నుకుంది. ఈ కార్యవర్గం ఏడాదిపాటు కొనసాగుతుంది. శాంత్ కుమార్ 1983 నుంచి ది ప్రింటర్స్ (మైసూర్) ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్య బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

కర్ణాటక బంద్ సక్సెస్

సాక్షి, బెంగళూరు: తమిళనాడుకు కావేరి జలాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం కన్నడ ఒక్కూట చేపట్టిన కర్ణాటక రాష్ట్ర బంద్ విజయవంతమైంది. చెదురుమదురు ఘటనలు మినహాయించి రాష్ట్రవ్యాప్తంగా శాంతియుతంగా జరిగింది. ఆస్పత్రులు, మెడికల్ షాపులు, పాల బూత్‌లు, అంబులెన్స్‌లు, పెట్రోల్ బంక్‌లు తదితర నిత్యావసర సేవలు యథావిధిగా కొనసాగాయి. ఆటో, క్యాబ్‌లు, సరకు రవాణా వాహనాలు, ప్రైవేటు వాహనాలు, థియేటర్లు, మాల్స్, సూపర్ మార్కెట్లు, వీధి దుకాణాలు, ఆభరణాల షాప్‌లు మూతపడ్డాయి. తమిళనాడు నుంచి వచ్చే బస్సులను మధ్యలోనే ఆపేశారు. బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కర్ణాటక రక్షణ వేదిక కార్యకర్తలు ముట్టడించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బంద్‌కు కన్నడ చలనచిత్ర పరిశ్రమ సంఘీభావం తెలిపింది.

సాక్షి
హైదరాబాద్
శనివారం : 30 : సెప్టెంబర్ : 2023



టీఎస్‌పీఎస్సీ బోర్డు రద్దు చేయాలని ధర్నా

టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలంటూ శుక్రవారం చిక్కడపల్లిలోని కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆవరణలో నిరుద్యోగులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నాకు దిగారు. -8లో



.. గుండె వ్యాధుల్ని సకాలంలో గుర్తించాలి

పుట్టుకతో వచ్చే గుండె వ్యాధులు, నిర్మాణాత్మక లోపాలను సకాలంలో గుర్తించాలని రెయిన్‌బో హార్ట్ ఇనిస్టిట్యూట్ పీడియాట్రిక్ కార్డియాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్వేతా బఖ్రు అన్నారు. -8లో

కామాంధుడికి 20 ఏళ్ల జైలు

బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్లు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నాంపల్లి పోక్సో కోర్టు న్యాయమూర్తి అనిత తీర్పు చెప్పారు. -8లో



న్యూస్‌రీల్

'డబుల్' పథకం ఒక్క తెలంగాణలోనే..

- లబ్ధిదారులతో మంత్రి తలసాని

సాక్షి, సిటీబ్యూరో: అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి ఉచితంగా అందజేసే కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో తప్ప దేశంలో మరెక్కడా లేదని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం తన కార్యాలయం నుంచి ఈ నెల 27న నిర్వహించిన ఆన్‌లైన్ డ్రాలో ఎంపికైన డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సొంతిల్లు లేని పేద, మధ్యతరగతి ప్రజల కలను సాకారం చేయాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి కేసీఆర్ గొప్ప మనసుతో డబుల్ బెడ్రూం ఇళ్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. రూ.9600 కోట్ల వ్యయంతో వీటిని చేపట్టినట్లు తెలిపారు. ఇళ్లను ఎంతో పారదర్శకంగా, రాజకీయ జోక్యం లేకుండా ర్యాండమైజేషన్ పద్ధతిలో ఆన్‌లైన్ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు నిర్మించిన ఇళ్లలో మొదటి విడతలో 11,700 మందికి, రెండో విడతలో 13,200 మందికి పంపిణీ చేశామన్నారు. 3వ విడతలో 36,884 లబ్ధిదారులను ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 2, 5 తేదీల్లో రెండు విడతలుగా ఇళ్లను అందజేస్తామన్నారు.

'చెక్ యువర్ ఓట్' అవగాహనకు విశేష స్పందన

సాక్షి, సిటీబ్యూరో: 'చెక్ యువర్ ఓట్' గురించి జీహెచ్‌ఎంసీ చేపట్టిన ప్రచారానికి విశేష స్పందన లభించిందని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదుల వద్ద, గణేశ్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్‌తో పాటు వివిధ చెరువుల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి అవగాహన కల్పించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన సమాచారం కోసం 1950 హెల్ప్ లైన్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యాలయ పని వేళల్లో స్థానికంగా ఉండే బూత్ లెవెల్ అధికారులు, ఈ ఆర్‌ఓల ద్వారా కూడా కావాల్సిన సమాచారాన్ని తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

మెట్రోకు పోటెత్తిన ప్రయాణికులు



సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనం సందర్భంగా మెట్రో రైళ్లు పోటెత్తాయి. నిమజ్జన వేడుకలను సందర్శించేందుకు సుమారు లక్ష మంది ప్రయాణికులు ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించినట్లు శుక్రవారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. గురువారం ఒక్క రోజే ఈ రెండు స్టేషన్లకు 46,834 మంది ప్రవేశించగా, 50,713 మంది వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. నిమజ్జన వేడుకలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల వరకు మెట్రో సర్వీసులను అందుబాటులో ఉంచిన సంగతి తెలిసిందే. అదనపు సర్వీసులను నడిపేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఖైరతాబాద్ మహాగణపతిని సందర్శించేందుకు వారం, పది రోజుల పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోజుకు 30 వేల మందికి పైగా ఖైరతాబాద్ నుంచి రాకపోకలు సాగించారు. చివరి రోజు గురువారం కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

బైబై గణేశా

రెండో రోజూ..

- రహదారులపై బారులు తీరిన విగ్రహాలు
- 10 వేలకుపైగా భారీ విగ్రహాల నిమజ్జనం
- వేలాది సంఖ్యలో చిన్న ప్రతిమలు
- నిమజ్జన వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్
- వ్యర్థాల తొలగింపును చేపట్టిన హెచ్‌ఎండీఏ



హిమాయత్ నగర్‌లో బారులుతీరిన గణనాథులు

సాక్షి, సిటీబ్యూరో: వినాయక విగ్రహాల నిమజ్జనం శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చాయి. దీంతో ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా వైపు నిమజ్జన వాహనాలు భారీ ఎత్తున బారులు తీరాయి. గురువారం మొదలైన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు నిరాటంకంగా శుక్రవారం కూడా కొనసాగడంతో పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

- రామంతాపూర్, అంబర్‌పేట్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి విగ్రహాలు తరలివచ్చాయి. రెండు రోజులుగా సుమారు 10 వేలకుపైగా భారీ విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసు వర్గాలు అంచనా వేశాయి. మరోవైపు 5 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు సుమారు 30 వేలకుపైగా నిమజ్జనం చేసినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ఆరంభమైన మూడో రోజు నుంచే నిమజ్జన వేడుకలు మొదలయ్యాయి. 5వ రోజు కూడా భారీ సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉత్సవాల అనంతరం గురువారం పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేయగా, శుక్రవారం కూడా అన్ని వైపులా నుంచి విగ్రహాలు తరలి వచ్చాయి. శుక్రవారం రాత్రి వరకూ నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా వైపు విగ్రహాల నిమజ్జనం కొనసాగింది.

నిమజ్జనమైన విగ్రహాలు 91,154

జోన్	28వ తేదీ	29వ తేదీ	మొత్తం
ఎల్‌బీనగర్	9,381	1071	10,452
చార్మినార్	2,625	0	2,625
ఖైరతాబాద్	9,494	12,299	21,793
శేరిలింగంపల్లి	21,043	5,159	26,202
కూకట్‌పల్లి	18,941	29	18,970
సికింద్రాబాద్	4,531	6,581	11,112
మొత్తం	66,015	25,139	91,154

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది గ్రేటర్‌లో వివిధ ప్రాంతాల్లో దాదాపు 91,154 గణేశ్ విగ్రహాలు నిమజ్జనమైనట్లు జీహెచ్‌ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. శుక్రవారం సాయంత్రం వరకు 91,154 విగ్రహాలు నిమజ్జనాలైనట్లు తెలిపింది. వినాయకచవితి ప్రారంభమైనప్పటి నుంచి 28వ తేదీ వరకు, 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిమజ్జనాలైన విగ్రహాల సంఖ్య జోన్ల వారీగా..



తెలుగు తల్లి ఫ్లైఓవర్ నుంచి నిమజ్జనానికి వస్తున్న గణేష్ విగ్రహాలు

మహాగణపతి నిమజ్జనంతో మొదలు..

ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసిన తర్వాత మిగతా విగ్రహాల తరలింపు క్రమంగా పెరిగింది. గురువారం సాయంత్రం వరకు మందకొడిగా సాగిన తరలింపు ప్రక్రియ రాత్రి నుంచి వేగంగా సాగింది. బాలాపూర్ విగ్రహాన్ని తరలించిన అనంతరం వరుసగా పాతబస్తీలోని వివిధ ప్రాంతాలకు చెందిన విగ్రహాలు బారులు తీరాయి.భారీ విగ్రహాలు కావడంతో నెమ్మదిగా ముందుకు కదిలాయి. అదే సమయంలో రామంతాపూర్, అంబర్‌పేట్ వైపు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు కూడా ప్రధాన శోభాయాత్రలో చేరడంతో నిమజ్జనం నెమ్మదిగా సాగింది. కొన్నిచోట్ల అర్ధరాత్రి తర్వాత నిమజ్జన ఏర్పాట్లు చేయగా, కొన్ని విగ్రహాలను శుక్రవారం ఉదయం తరలించారు. దీంతో గురువారం మొదలైన నిమజ్జన శోభాయాత్ర నిరాటంకంగా సాగింది. అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సిటీబస్సులు, ఇతర వాహనాలు స్తంభించడంతో నగరవాసులు ఇబ్బందులకు గురయ్యారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మొదటి రోజే ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం అవుతాయి. రెండో రోజు మిగిలిన విగ్రహాలను ఉదయం పదింటి వరకే పూర్తి చేస్తారు.కానీ అందుకు పూర్తిగా భిన్నంగా రెండు రోజులు నిమజ్జనం కొనసాగింది. శుక్రవారం రాత్రి కూడా విగ్రహాలను నిమజ్జనం చేశారు.



33 వేల టన్నుల వ్యర్థాలు..

మరోవైపు నిమజ్జన వ్యర్థాల తరలింపు ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నాటికి పీపుల్స్‌ప్లాజా, నెక్లెస్ రోడ్డు వైపు 33వేల టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు హెచ్‌ఎండీఏ అధికారులు తెలిపారు. విగ్రహాల నిమజ్జనం కొనసాగుతున్న దృష్ట్యా తొలగింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని శని, ఆదివారాల్లోనూ వ్యర్థాలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. మరో 15 వేల టన్నులకు పైగా వ్యర్థాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

లంబో'ధర' లడ్డూ!

- ఈసారి గ్రేటర్ పరిధిలో 2 లక్షలకుపైగా విగ్రహాలు
- రూ.15 కోట్లకుపైనే పలికిన వేలం పాటలు
- ప్రతి ఏటా గణేశ్ లడ్డూకు పెరుగుతున్న డిమాండ్
- 1954లో ఖైరతాబాద్‌లో మొదలైన ఉత్సవాలు
- 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ ప్రసాదం వేలం



సాక్షి, సిటీబ్యూరో: భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఖైరతాబాద్ వినాయకుడు. ఆ తర్వాత బాలాపూర్ లడ్డూ వేలం పాట. 1954లో తొలిసారిగా ఒక్క అడుగుతో ఖైరతాబాద్ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఎత్తయిన గణేష్ విగ్రహం (63 అడుగులు) కూడా ఇదే. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి తొలిసారిగా 1994లో లడ్డూ వేలం పాట ప్రారంభించింది. తొలి వేలం పాటలో రూ.450కి దక్కించుకున్నారు. ఈ లడ్డూను దక్కించున్న వారికి మంచి జరిగిందనే ప్రచారంతో ఆ తర్వాత ప్రసాదానికి మరింత డిమాండ్ పెరిగింది. 2002 నుంచి లక్షల్లో ధర పలకడం మొదలైంది. ఒకప్పుడు కేవలం బాలాపూర్‌నకు మాత్రమే పరిమితమైన ఈ లడ్డూ వేలం పాట ప్రస్తుతం ఇంతింతై అన్నట్లు గ్రేటర్ అంతా విస్తరించింది.

పోటాపోటీగా వేలం పాటలు..

- నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా కొనసాగాయి. వినాయకుడి చేతిలో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న ఈ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. గురువారం గ్రేటర్ జిల్లాల పరిధిలోని ప్రముఖ మండపాల్లో నిర్వహించిన వేలం పాటల్లో రూ.15 కోట్లకుపైగా ఉత్సవ కమిటీలకు సమకూరినట్లు తెలిసింది.
- ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో రూ.5 కోట్లు, ఖైరతాబాద్‌లో రూ. 33.75 లక్షలు, సికింద్రాబాద్‌లో రూ.19 లక్షలు, శేరిలింగంపల్లిలో రూ.1.25 కోట్లు, అంబర్‌పేటలో రూ.25 లక్షలు, మల్కాజిగిరిలో రూ.48 లక్షలు, కుత్బుల్లాపూర్‌లో రూ.2.13 కోట్లు, చార్మినార్ ఏరియాలో రూ.56.88 లక్షలు, ఉప్పల్‌లో 1.50 కోట్లు, సనత్‌నగర్‌లో రూ.12 లక్షలు, గోషామహాల్‌లో రూ.45 లక్షలు, మలక్‌పేటలో రూ.20 లక్షలు, మేడ్చల్‌లో రూ.1.50 కోట్లు, ముషీరాబాద్ నియోజకవర్గంలో రూ.20 లక్షల వరకు వేలం పాటలు కొనసాగాయి.

రూ.1.25 కోట్లు పలికి..

- ఖైరతాబాద్ గణేషుడితో మొదలైన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన సంస్కృతి.. క్రమంగా నగరమంతటా విస్తరించింది. ఈ ఏడాది గ్రేటర్‌లో చిన్నా పెద్దా కలిపి మొత్తం రెండు లక్షలకుపైగా విగ్రహాలు నెలకొల్పినట్లు అంచనా. రెండు మూడేళ్ల క్రితం వరకు బాలాపూర్ లడ్డూకు మాత్రమే రికార్డు స్థాయిలో ధర పలికేది. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలోని గణనాథుడి లడ్డూ ప్రసాదం ఆ రికార్డును బద్దలు కొట్టింది. రూ.1.25 కోట్లు పలికి భక్తులందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. నిత్యం రికార్డుల్లో నిలిచే బాలాపూర్ లడ్డూ మాత్రం ఈసారి రూ.27 లక్షలు పలికింది.

- కాగా.. బడంగ్‌పేట వీరాంజ నేయ భక్త సమాజం గణనాథుడి లడ్డూ కూడా రూ.17 లక్షలు.. చేవెళ్ల రచ్చబడం గణేషుడి చేతిలోని లడ్డూ ప్రసాదం రూ.22.11 లక్షలు, ఆదిబట్లలోని చైతన్య యూత్ అసోసియేషన్ వినాయకుడి లడ్డు రూ.12.50 లక్షలు, ఫరూక్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని లడ్డు రూ.11.11 లక్షలు, కొంపల్లి అపర్ణ మెడల్స్‌లోని లడ్డూ ధర రూ.13 లక్షలు పలికింది.
- వేలం పాటలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని తినడం, కుటుంబ సభ్యులు, బంధువులకు పంపిణీ చేయడం, పంట పొలాల్లో చల్లడం ద్వారా మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది. అంతే కాదు స్థానికంగా గుర్తింపుతో పాటు ప్రచార, ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కూడా లభిస్తుండటంతో లడ్డూను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

నిమజ్జన వేళ అపశ్రుతులు

- వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు మృతి
- నారాయణగూడ, సంజీవయ్య పార్కు వద్ద, పాతబస్తీ ప్రాంతాల్లో ప్రమాదాలు
- అసువులు బాసిన ఇద్దరు యువకులు సహా ఓ బాలుడు



షేక్ షబాజ్ అహ్మద్



ప్రణీత్

హిమాయతనగర్: గణనాథులను నిమజ్జనానికి తరలించే టస్కర్ (లారీ) డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా రెండు నిండు ప్రాణాలు గాలిలో కలిశాయి. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ దుర్ఘటనలు రెండు కుటుంబాల్లో విషాదాన్ని మిగిల్చాయి. బండ్లగూడకు చెందిన షేక్ షబాజ్ అహ్మద్ తన స్నేహితులతో కలిసి డీఆర్‌డీఏ టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్దకు గురువారం వెళ్లారు. వీరంతా నిమజ్జనంలో పాల్గొని శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో నారాయణగూడ ప్రధాన రహదారిపై ఉన్న మసీదు వద్దకు వచ్చారు. పాన్ తెచ్చుకునేందుకు షేక్ షబాజ్ అహ్మద్ టస్కర్ దిగాడు. పదిహేను నిమిషాల అనంతరం వచ్చి టస్కర్ ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా దీని డ్రైవర్ హఠాత్తుగా స్టార్ట్ చేసి ముందుకు పోనిచ్చాడు. షబాజ్ అహ్మద్ ఒక్కసారిగా కింద పడిపోవడంతో వెనక చక్రాలు కాలుపై నుంచి వెళ్లాయి. దీంతో తీవ్ర రక్తస్రావమైంది. తోటి స్నేహితులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో మృతి చెందినట్లు నారాయణగూడ పోలీసులకు వైద్యులు సమాచారం ఇచ్చారు.

బలవంతంగా వచ్చి బలయ్యాడు..

బహదూర్‌పురాలోని ఎస్సీనగర్‌కు చెందిన చాపల బండ ప్రణీత్ స్నేహితులతో కలిసి నిమజ్జనానికి ట్యాంక్‌బండ్‌కు వచ్చాడు. శుక్రవారం తెల్లవారుజామున సంజీవయ్య పార్క్ వద్ద ప్రణీత్ మరో ముగ్గురు మూత్ర విసర్జన కోసం టస్కర్ దిగారు. అయిదు నిమిషాల తర్వాత ప్రణీత్‌తో ఉన్న ముగ్గురు టస్కర్ ఎక్కగా.. ప్రణీత్ ఎక్కుతున్న సమయంలో డ్రైవర్ వాహనాన్ని ఒక్కసారిగా కదిలించాడు. దీంతో వెనక్కి పడ్డ ప్రణీత్ తలపై నుంచి టస్కర్ వెళ్లడంతో తల నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సెక్రటేరియ (లేక్) ఎస్‌హెచ్‌ఓ దెబోరా తెలిపారు. నిమజ్జనానికి రానంటూ మారాం చేసిన వ్యక్తిని మొదటిసారి తీసుకొచ్చి తప్పు చేశామే అంటూ తోటి స్నేహితులు కన్నీటిపర్యంతమయ్యారు.

నాలుగేళ్లకే ఆయుష్షు తీరింది..

లక్డీకాపూల్: నిమజ్జనోత్సవాన్ని తిలకించేందుకు సంతోష్‌నగర్ గవర్నమెంట్ ప్రెస్ కాలనీకి చెందిన రాజశేఖర్, సాయిప్రియ దంపతులు తమ నాలుగేళ్ల కుమారుడు అయాన్ష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. బషీర్‌బాగ్‌లోని లిబర్టీ సిగ్నల్ ప్రాంతంలో రాగానే బైక్ స్కిడ్ అయ్యింది. తల్లిదండ్రుల మధ్యలో కూర్చున్న అయాన్ష్ రోడ్డుపై పడిపోయాడు. అదే సమయంలో హుస్సేన్‌సాగర్ వైపు సాగిపోతున్న గణేష్ నిమజ్జన టస్కర్ బాలుడిపై నుంచి వెళ్లింది. గాయపడిన అయాన్ష్‌ను చికిత్స నిమిత్తం నిలోఫర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బాలుడి తండ్రి రాజశేఖర్ ఫిర్యాదు మేరకు సైఫాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశంలో ఏటా గుండెపోటు మరణాలు 15 లక్షలు

అందరికీ సీపీఆర్‌పై అవగాహన అవసరం

- వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు
- దుర్గం చెరువు వద్ద వరల్డ్ హార్ట్ డే



మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు

మాదాపూర్: దేశంలో ఏటా గుండెపోటుతో సుమారు 15 లక్షల మంది మృతి చెందుతున్నారని, సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాల్సిన అవసరముందని వైద్యారోగ్య శాఖ హరీష్‌రావు అన్నారు. మాదాపూర్‌లోని దుర్గం చెరువు వద్ద శుక్రవారం కార్డియాలజిస్ట్ సొసైటీ తెలంగాణ స్టేట్ చాప్టర్ అధ్వర్యంలో నిర్వహించిన వరల్డ్ హార్ట్‌డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గుండె సంబంధిత వ్యాధులకు మారిన జీవనశైలి, కనీస వ్యాయామం లేకపోవడం, మానసిక ఒత్తిళ్లు వంటివి కారణమన్నారు. జిమ్, పనులు, డ్యాన్స్ చేస్తుండగా.. నడుస్తూ కొంత మంది సడెన్‌గా పడిపోవడం, ప్రాణాలు కోల్పోవడం వంటి వీడియోలు సోషల్ మీడియాల్లో , టీవీల్లో చూస్తున్నామన్నారు. ఘటనా స్థలంలో సీపీఆర్ తెలిసిన వారు ఉంటే బాధితులను కాపాడే అవకాశముందన్నారు. అత్యవసర సమయంలో ప్రాణాలు కాపాడే అతిముఖ్యమైన సీపీఆర్ విధానం గురించి మన దేశంలో 98 శాతం మందికి తెలియదన్నారు. ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్‌పై అవగాహన కల్పించాలని, శిక్షణ ఇప్పించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం అవసరమైన 1262 ఏఈడీ మిషన్లు ప్రొక్యూర్ చేసుకుని అన్ని సీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు బస్తీ దవాఖానాల్లో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. బాడీ మాస్ ఇండెక్స్‌ను పరిమితిలో ఉంచుకోవాలని సూచించారు. బీపీ, షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, రోజు కొంతసేపు సమయం వ్యాయామం, ధ్యానం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



హైలైఫ్ ఎగ్జిబిషన్ ప్రారంభం

మాదాపూర్: ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వస్త్రాభరణాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శుక్రవారం ఏర్పాటు చేసిన హైలైఫ్ ఎగ్జిబిషన్‌ను నటి చాందిని బగ్వానాని, సీఈఓ డొమినిక్ పలువురు మోడల్స్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఎగ్జిబిషన్‌లో దాదాపు 350 మంది ప్రముఖ డిజైనర్లు రూపొందించిన వస్త్రాభరణాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మిస్ దివ్య సుప్ర నేషనల్ 2023 సోనాల్ కుక్రెజా, పలువురు మోడల్స్, డిజైనర్లు పాల్గొన్నారు.



నిమజ్జనం సందర్భంగా గ్రేటర్‌లో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య సిబ్బంది శుక్రవారం ఇలా శుభ్రం చేస్తూ కనిపించారు. - సాక్షి, సిటీబ్యూరో

డేంజర్ హోర్డింగ్! ఎప్పుడు కూలునో..?

- చర్యలు తీసుకోని బల్దియా
- గాలిలో దీపంలా ప్రాణాలు



సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో ఎప్పుడు గాలి వీస్తే ఏ హోర్డింగు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. సీజన్లతో సంబంధం లేకుండా వర్షాలతో పాటు ఈదురుగాలులు సైతం వీస్తున్నాయి. శిథిల భవనాలపై, సామర్థ్యం లేని పిల్లర్లపై సైతం హోర్డింగులున్నాయి. జీహెచ్‌ఎంసీ యంత్రాంగం యాడ్ ఏజెన్సీల ఒత్తిళ్ల వల్లనో, దిగువ స్థాయి సిబ్బంది ఆమ్యామ్యాల వల్లనో కానీ చూసీ చూడనట్లు వదిలేసింది. ఏదైనా ప్రమాదం జరిగితే మాత్రం ఎక్కడ లేని హడావుడి చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి, అనంతరం ఆ విషయం మరచిపోతోంది. దాదాపు ఏడేళ్ల క్రితం జూబ్లీహిల్స్‌లో యూనిపోల్ కూలి పలు కార్లు ధ్వంసమయ్యాయి. అనుమతి లేని హోర్డింగులు, యూనిపోల్స్‌ను తొలగించడంతో పాటు.. అనుమతి పొందినవైనా సరే కూలితే వాటిని ఏర్పాటు చేసిన ఏజెన్సీలపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటనలు జారీ చేసింది. నగరంలో గంటకు 100–150 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీచిన ఘటనలు కూడా ఉన్నాయి. ఈదురు గాలులకు పెద్ద చెట్లే నేలకూలుతున్నాయి. ఇటీవలే హిమాయత్‌నగర్‌లో చెట్టు కూలి ఆటోపై పడటంతో డ్రైవర్ ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అంతకంటే ప్రమాదకరంగా ఉన్న, అక్రమంగా వెలసిన హోర్డింగులు మాత్రం నగరంలో కుప్పలు తెప్పలుగా ఉన్నాయి.

చర్యలకు సిద్ధం

గ్రేటర్ నగరంలో అక్రమంగా వెలసిన హోర్డింగులతో పాటు ప్రకటనల ద్వారా వచ్చే ఆదాయం కోసం అక్రమంగా ఏర్పాటు చేసిన యూనిపోల్స్, బస్ షెల్టర్లు, గ్లో సైన్‌బోర్డులు, లాలీపాప్స్, ఆర్చీలు తదితర ప్రాంతాల్లో ప్రకటనలున్న నిర్మాణాలన్నింటినీ కూడా కూల్చి వేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు టెండర్లు కూడా ఆహ్వానించినట్లు పేర్కొన్నారు. అక్రమంగా ఏర్పాటైన వాటినన్నింటినీ త్వరలోనే తొలగించనున్నట్లు పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ జోన్ల వారీగా ఈ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఇందుకుగాను జీహెచ్‌ఎంసీ కాంట్రాక్టర్లకు చెల్లించేదేమీ ఉండదు. వాటిని తొలగించే కాంట్రాక్టర్లే సదరు ఇనుప సామగ్రిని తీసుకుంటాయని, జీహెచ్‌ఎంసీకే అవి నిర్ణీత ధరను చెల్లించాల్సి ఉంటుందని, ఎవరు ఎక్కువ ధర చెల్లిస్తే వారికి కాంట్రాక్టు పనులు అప్పగించనున్నట్లు తెలిపారు. కాంట్రాక్టర్లు వాటిని స్క్రాప్‌గా విక్రయించుకోవడం ద్వారా వారికి లాభముంటుందన్నారు.

సీఎం సారూ.. ఈ రోడ్డు జర చూడరూ!



నందినగర్‌లో సీఎం కేసీఆర్ ఇంటికి వెళ్లే రోడ్డు దృశ్యం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెంబ‌ర్-14లోని నందినగర్ రోడ్డు పరిస్థితి దయనీయంగా తయారైంది. మూడు సంవత్సరాల నుంచి ఈ రోడ్డును నిర్మించాలని స్థానికులు జీహెచ్ఎంసీ అధికారులకు విన్నవిస్తున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. కేన్సర్ హాస్పిటల్ వెనుక ఉన్న ఈ రోడ్డు మీదుగా సీఎం కేసీఆర్ తన స్వగృహానికి వెళ్లాల్సి ఉంటుంది. ఓ వైపు హాస్పిటల్‌కు వచ్చే రోగులు వారి సహాయకులతోనూ షాపింగ్‌లకు వచ్చే వారితోనూ ఈ ప్రధాన రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. దీనికి తోడు పక్కనే ఉన్న బ్రహ్మకుమారి ఆశ్రమానికి వచ్చే భక్తులు కూడా అనేక ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు చిన్న చిన్న రిపేర్లు చేసినా ఫలితం లేదు. ఈ రిపేర్ల వల్ల రోడ్డు మరింత శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రూపురేఖలు మారిపోయి చెరువులా తయారైంది. చిన్నపాటి వర్షం పడినా రోడ్డు నీటితో నిండిపోతోంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ మార్గంలో కొత్త రోడ్డు నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రేమికుల మధ్య గొడవ..యువకుడి ఆత్మహత్యాయత్నం

ఉప్పల్ స్కైవాక్ వంతెన మెట్ల దారి నుంచి దూకిన వైనం..

ఉప్పల్: ఉప్పల్ స్కైవాక్ వంతెన మెట్లదారి నుంచి దూకి ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. అదృష్టవశాత్తు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసుల సహాయంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. బోరబండ ప్రాంతానికి చెందిన శివకుమార్ (21), చేర్యాల ప్రాంతానికి చెందిన యువతి (21)..ఇద్దరు కలిసి యూట్యూబ్ రీల్స్ చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఇద్దరి మధ్య రిలేషన్ ఏర్పడి ప్రేమగా మారింది. శుక్రవారం రీల్స్ కోసమని ఉప్పల్ మెట్రో స్కైవాక్ వద్దకు ఇద్దరు చేరుకున్నారు. ఇద్దరి మధ్య ప్రేమ..పెళ్లి విషయం ప్రస్తావనకు వచ్చి గొడవ పెరిగింది. పెళ్లి చేసుకోమని యువతి ఒత్తిడి చేయడంతో మనస్తాపానికి గురైన శివకుమార్ పోలీస్ స్టేషన్ స్కైవాక్ మెట్ల దారి వద్ద మెట్లు ఎక్కి రెండవ స్టెప్‌కు చేరుకుని అక్కడి నుంచి దూకాడు. దీంతో శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని 108 ద్వారా ఆసుపత్రికి తరలించినట్లు తెలిసింది.

కార్డియాక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా అపోలో

అరుదైన ఘనత సాధించామన్న ఆస్పత్రి చైర్మన్ డా.ప్రతాప్ సి రెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: ఆరోగ్య సంరక్షణ సేవల పరంగా అంతర్జాతీయ స్థాయిలో సేవలందిస్తున్న అపోలో సంస్థ భారత్‌లో అతిపెద్ద కార్డియాక్ కేర్ ప్రోగ్రామ్(కార్డియాక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)గా తన స్థానాన్ని ప్రకటించింది. అపోలో ఆధ్వర్యంలో మూడు లక్షల యాంజియోప్లాస్టీలు, రెండు లక్షల కార్డియాక్ సర్జరీలతో తన ప్రస్థానాన్ని వెల్లడించింది. ఈ సందర్భంగా అపోలో చైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి రెడ్డి మాట్లాడుతూ..కార్డియాక్ సైన్సెస్ వృద్ధి కోసం స్వయంగా ప్రత్యేకమైన పెట్టుబడి పెట్టామని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో 1986లో చేసిన మొదటి యాంజియోప్లాస్టీ, బైపాస్ సర్జరీ తమ అద్భుతమైన ప్రయాణానికి నాంది పలికిందన్నారు. ఇప్పటి వరకు 375కి పైగా కన్సల్టెంట్లతో 38 ఆసుపత్రులతో ఆరోగ్య సంరక్షణ పట్ల నిబద్ధతతో పనిచేస్తున్నామని పేర్కొన్నారు. సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో భాగంగా రోబోటిక్ సర్జరీ, ఎండోవాస్కులర్ రోబోటిక్ సూట్‌లు, హై-ఎండ్ కరోనరీ ఇమేజింగ్, ప్రెసిషన్ ఇంటర్వెన్షన్ పద్ధతులు, త్రీడీ ఎలక్ట్రో ఫిజియాలజీ సూట్, హై ఎండ్ క్రిటికల్ కేర్, అధునాతన సాంకేతికతతో మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయన్నారు. దేశంలో కార్డియాక్ థెరపీల పెరుగుదలకు ఆవిష్కర్తలుగా, అతిపెద్ద రోబోటిక్ కార్డియాక్ సర్జరీ ప్రోగ్రామ్‌ను కలిగి ఉందని, ఇందులో భాగంగా 500 కంటే ఎక్కువ శస్త్రచికిత్సలు జరిగాయన్నారు.

పుట్టుకతో వచ్చే గుండె వ్యాధుల్ని సకాలంలో గుర్తించాలి

గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ శ్వేత



గుండె సంబంధిత చికిత్సలు చేయించుకున్న చిన్నారులతో రెయిన్‌బో వైద్యులు

సాక్షి, సిటీబ్యూరో: పుట్టుకతో వచ్చే గుండె వ్యాధులు, నిర్మాణాత్మక లోపాలను సకాలంలో గుర్తించడం అవసరమని రెయిన్‌బో హార్ట్ ఇనిస్టిట్యూట్ పీడియాట్రిక్ కార్డియాలజీ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ శ్వేతా బక్షు అన్నారు. శుక్రవారం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హార్ట్ ఇనిస్టిట్యూట్ (ఆర్‌సీహెచ్‌ఐ)లో వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పుట్టుకతో వచ్చే గుండె లోపాలపై విజయం సాధించిన లిటిల్ చాంపియన్స్‌తో కలిసి ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. గర్భంలో ఉండగానే గుండె జబ్బుకు చికిత్స చేయించుకున్న కొందరు చిన్నారులు తమ తల్లిదండ్రులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పిండ దశలోనే గుండె సమస్యలను గుర్తించడం ద్వారా శిశువు ప్రాణాలను కాపాడవచ్చన్నారు. పుట్టకతో వచ్చే గుండె సమస్యలు కలిగిన శిశువుల తల్లిదండ్రులు ఆశ కోల్పోవద్దని డాక్టర్ శ్వేత భరోసా కల్పించారు. లారస్ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, సీఎఫ్‌ఓ వి.వి రవికుమార్ మాట్లాడుతూ..చిన్నారుల గుండె వైద్య చికిత్సల్లో తాము భాగస్వాములం అయినందుకు సంతోషంగా ఉందన్నారు. ఈ ఏడాదికి గుండె సమస్యలతో బాధపడుతున్న 50 మందికి అవసరమైన శస్త్ర చికిత్సల కోసం లారస్ ల్యాబ్స్ ఆర్థికంగా చేయూతనందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్‌సీహెచ్‌ఐ చీఫ్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ చిన్న స్వామి రెడ్డి, డాక్టర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతో హృదయం పదిలం

పద్మభూషణ్ అవార్డు గ్రహీత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి

బంజారాహిల్స్: మారుతున్న జీవనశైలి యువతలో గుండె జబ్బుల ప్రమాదానికి ఆజ్యం పోస్తున్నదని, 40 ఏళ్లలోపు అంతకంటే ఎక్కువ వయసున్న వారు ఏడాదికోసారి గుండె పరీక్షలు చేయించుకోవడం మంచిదని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, శాంతా బయోటిక్స్ చైర్మన్ డాక్టర్ కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి సూచించారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా శుక్రవారం బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రి ఓపీ విభాగంలో కార్డియాక్ పేషెంట్లను సన్మానించారు. ఈ సందర్భంగా హాజరైన డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ... గుండె ఆరోగ్యంపై క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. గుండెను పదిలంగా ఉంచుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. గుండె ఆరోగ్యంపై అవగాహన పెంచడం కోసమే గుండె జబ్బులతో ధైర్యంగా పోరాడిన రోగులను సత్కరించినట్లు రూఫస్ మందా తెలిపారు. కార్యక్రమంలో నీలేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

సొంతింటికే యజమానుల కన్నం!

- తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్‌కు చెందిన డబ్బు మాయం
- రూ.6.5 కోట్లు కొట్టేసిన ప్రెసిడెంట్, జీఎస్, ట్రెజరర్‌లు
- సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేసిన సభ్యులు

హిమాయత్‌నగర్: సొంత ఇంటికి యజమానులే కన్నం వేశారు. బ్యాంకు అధికారులతో కలసి 'తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్' ఎఫ్‌డీ అకౌంట్స్‌లో ఉన్న కోట్లాది రూపాయలు గుట్టుచప్పుడు కాకుండా కొట్టేశారు. ఈ విషయాన్ని తెలుసుకున్న కొందరు సభ్యులు ఆ ఇంటి దొంగల్ని ప్రశ్నించగా వారిపై ఎదురుదాడికి దిగారు. దీంతో పక్కా ఆధారాలతో యూనియన్‌లోని సభ్యులు రాందాస్ ధన్‌రాజ్, వెంకటేశ్వరరావులు సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు యూనియన్ అధ్యక్షుడు సత్యనారాయణ దొర, ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ సుధాకర్, ట్రెజరర్ రాజేష్‌లపై హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు 420 రెడ్ విత్ 34 ఐపీసీ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జూబ్లీహిల్స్‌లోని 'తెలుగు సినీ ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్' ఎన్నో సంవత్సరాలుగా ఉంది. దీనిలో అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్, ఉపాధ్యక్షులతో కలపి దాదాపు 700 మంది సభ్యులు ఉన్నారు. వీరికి జూబ్లీహిల్స్‌లో 'యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో ఖాతా ఉంది. దీనిలో ఎఫ్‌డీ, ఇతర లావాదేవీలు కలిపి మొత్తం రూ. 7 కోట్లు ఉన్నాయి. యూనియన్ బైలా ప్రకారం యూనియన్‌లో ఉన్న వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే ప్రతిపాదన ఎంతో కాలం నుంచి ఉంది. అయితే ఈ ఏడాది మే నెలలో ప్రెసిడెంట్ సత్యనారాయణ దొర, ప్రధాన కార్యదర్శి కాట్రగడ్డ సుధాకర్, ట్రెజరర్ రాజేష్‌లు ఇళ్ల స్థలాల కోసం ల్యాండ్ చూశామంటూ రాంపూర్ వద్దకు సభ్యులు రాందాస్ ధన్‌రాజ్, వెంకటేశ్వరరావు తదితరులను తీసుకెళ్లారు. శ్రీనివాస్ అనే వ్యక్తిని పరిచయం చేసి ఓనర్ నుంచి ఇతను అగ్రిమెంట్ చేసుకున్నట్లు చెప్పారు. అడ్వాన్స్ కూడా నాలుగు రోజుల ముందే ఇచ్చినట్లు చెప్పడంతో రాందాస్ ధనరాజ్, వెంకటేశ్వరరావులు అలా ఏకపక్షంగా ఎలా ఇస్తారని ప్రెసిడెంట్, జీఎస్, ట్రెజరర్‌లను నిలదీశారు. దీంతో వీరు పొంతన లేని సమాధానాలు చెప్పండతో మరిన్ని అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ఈ క్రమంలోనే యూనియన్‌లో ఉన్న 60 మంది అనుకూలమైన వ్యక్తులకు ప్రెసిడెంట్, ట్రెజరర్, జీఎస్‌లు కొత్త అకౌంట్‌లు ఓపెన్ చేయించారు. ఆ అకౌంట్‌లలో యూనియన్‌కు చెందిన ఎఫ్‌డీలోని రూ.7 కోట్లలో ఒక్కొక్కరికీ రూ.9 లక్షల చొప్పున బదిలీ చేశారు. ఈ 60 మందికి వచ్చిన దాదాపు రూ.5 కోట్ల 40 లక్షలు క్యాష్ రూపంలో డ్రా చేయించి ముగ్గురూ తీసుకున్నారు. మరికొంత కూడా వివిధ కారణాలు చెప్పి డ్రా చేశారు. ఇలా పలు దఫాలుగా రూ. 6 కోట్ల 50 లక్షలు యూనియన్ అనుమతి లేకుండా అనధికారికంగా బ్యాంకు అధికారుల ప్రమేయంతో కాజేశారు. దీనిపై పక్కా ఆధారాలతో రాందాస్ ధనరాజ్, వెంకటేశ్వరరావు, మరి కొందరు సీసీఎస్ పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు ఇన్‌స్పెక్టర్ చింతపల్లి మల్లికార్జున చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

టీఎస్‌పీఎస్సీ బోర్డు రద్దు చేయాలని ధర్నా

- సిటీ లైబ్రరీ ఆవరణలో నిరుద్యోగుల నిరసన
- యూపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని డిమాండ్



ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు

చిక్కడపల్లి: టీఎస్‌పీఎస్సీ బోర్డును రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం చిక్కడపల్లిలోని హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ ఆవరణలో నిరుద్యోగుల, పోటీ పరీక్షల అభ్యర్థులు ధర్నాకు దిగారు. గ్రూప్-1 పరీక్ష మళ్లీ రద్దు కావడంతో తమకు బోర్డుపైనే అనుమానం కలుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. యూపీఎస్సీ ద్వారా గ్రూప్-1 పరీక్ష నిర్వహించాలని కోరారు. గ్రూప్-4 పరీక్షలో 1,000 నుంచి 1,800 ర్యాంకు వరకు ఓఎంఆర్ ఆన్సర్‌షీట్లు ఎక్కువ ఎలా వస్తాయని వారు ప్రశ్నించారు. గ్రూప్-4 పరీక్షపై కూడా అనుమానం కలుగుతోందని, దీనిని కూడా రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని నినదించారు. టీఎస్‌పీఎస్సీ బోర్డును ప్రక్షాళన చేయాలని, చైర్మన్ జనార్దన్‌రెడ్డిని తొలగించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగుల జేఏసీ నేత లక్ష్మణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో అభ్యర్థులు సురేశ్, రవి, సలీం, మహేష్, సుమంత్, కిషన్, రామకృష్ణ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రూప్-1 పరీక్షలో కూడా 258 ఓఎంఆర్ ఆన్సర్‌షీట్లు అదనంగా స్కాన్ అయ్యాయని ఆరోపించారు. నిరుద్యోగుల జీవితాలతో తెలంగాణ ప్రభుత్వం ఆటలాడుకుంటోందని ఆరోపించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల అభ్యర్థులు, నిరుద్యోగులు లైబ్రరీ అవరణతోపాటు ఓపెన్ ఆడిటోరియం వద్ద నిరసన తెలిపి, ప్రధాన గేటు బయట మెయిన్‌రోడ్డుపైకి వచ్చి నినాదాలు చేశారు.

కామాంధుడికి 20 ఏళ్ల జైలు

బాలికపై లైంగిక దాడి కేసులో న్యాయమూర్తి తీర్పు



మాణిక్యరావు(ఫైల్)

చిలకలగూడ: బాలికపై పలుమార్లు లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తూ నాంపల్లి పోక్సో కోర్టు న్యాయమూర్తి అనిత శుక్రవారం తీర్పు చెప్పారు. 2018లో జరిగిన సంఘటపై పోలీస్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం..సికింద్రాబాద్ చిలకలగూడకు చెందిన బాలిక అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇంటి పక్కన అద్దెకు ఉంటున్న మాణిక్యరావు (40) కన్ను బాలికపై పడింది. బాలిక స్నానం చేస్తుండగా, డ్రస్ చేంజ్ చేసుకుంటున్న సమయంలో చాటుగా తన సెల్‌ఫోన్‌లో వీడియోను రికార్డు చేశాడు. తీసిన వీడియో దృశ్యాలను బాలికకు చూపించి..బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. 2018 ఏప్రిల్ నెలలో బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. కడుపు నొప్పితో బాధపడుతున్న ఆమెను ఆస్పత్రిలో చేర్పించగా లైంగిక దాడి జరిగినట్లు వైద్యులు వెల్లడించారు. దీనిపై బాలికను ప్రశ్నించగా..మాణిక్యరావు చేసిన దురాగతాలను వెల్లడించింది. దీంతో బాలిక అమ్మమ్మ చిలకలగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోక్సో చట్టం ప్రకారం కేసు నమోదు చేసిన పోలీసులు బాలికను భరోసా కేంద్రానికి తరలించి వాంగ్మూలం నమోదు చేసి నిందితుడు మాణిక్యరావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సమగ్ర విచారణ అనంతరం దర్యాప్తు అధికారులైన చిలకలగూడ ఎస్ఐ కట్టా వెంకటరెడ్డి, గోపాలపురం ఏసీపీ వెంకటరమణలు ఛార్జిషీట్ దాఖలు చేశారు. సుమారు ఐదేళ్ల పాటు వాదోపవాదాలు జరిగాయి. తగిన ఆధారాలు సమర్పించడంతో నేరం రుజువైంది. నిందితుడు చింతల మాణిక్యరావుకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా న్యాయమూర్తి శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితునికి శిక్ష పడేందుకు కృషి చేసిన అప్పటి గోపాలపురం ఏసీపీ వెంకటరమణ, చిలకలగూడ ఎస్ఐ వెంకటరెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ప్రతాప్‌రెడ్డి, భరోసా లీగల్ సపోర్ట్ అధికారి కల్పన, కోర్టు డ్యూటీ ఆఫీసర్ తులసీదాస్, భరోసా సెంటర్ అధికారులతోపాటు కేసును పర్యవేక్షించిన హైదరాబాద్ మహిళా భద్రతా విభాగం డీసీపీ కవిత, ఏసీపీ ప్రసన్నలక్ష్మీ తదితరులను నగర కొత్వాల్ సీవీ ఆనంద్ అభినందించి రివార్డులు అందించారు.

ఎడ్యుకేషన్ హబ్

సరస్వతీ నిలయంగా మహేశ్వరం

- అందుబాటులో ఇంటర్, డిగ్రీ, పీజీ, బిజినెస్, లా కాలేజీలు
- కందుకూరులో అక్టోబర్ 1న మెడికల్ కాలేజీకి శంకుస్థాపన
- రూ.176 కోట్ల అంచనా వ్యయంతో 450 పడకల భవనం
- హాజరు కానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల స్థాపనలోనే కాదు వృత్తి విద్యా కోర్సుల ఏర్పాటులోనూ మహేశ్వరం ముందంజలో ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఇంటర్మీడియెట్, డిగ్రీ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయం కూడా ఇదే నియోజకవర్గంలో ఏర్పాటైంది. తాజాగా పాలిటెక్నిక్, బిజినెస్, డైట్, లా సహా మెడికల్ వంటి వృత్తివిద్యా కోర్సుల ఏర్పాటుతో సరస్వతీ నిలయంగా మారుతోంది. తాజాగా మెడికల్ కాలేజీ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.176 కోట్ల అంచనా వ్యయంతో కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 112లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీ భవనానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సహా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరు కానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా..

స్వాక్షాత్తూ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కనీసం చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఉండేవి కావు. ఉన్నవాటిలోనూ సరైన సదుపాయాలు కనిపించేవి కాదు. కొత్త కాలేజీల కోసం విద్యార్థి సంఘాలు తరచూ ఆందోళనలు చేపడుతుండేవి. నియోజకవర్గంలో విద్యా సంస్థలు లేని లోటును పూడ్చాలని మంత్రి భావించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన వృత్తి విద్యను అందించాలని ఆశించారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అప్పటి వరకు ఒక్క కాలేజీ కూడా లేని నియోజకవర్గంలో కొత్తగా నాలుగు జూనియర్ కాలేజీలను ప్రారంభించారు. ఒక్క డిగ్రీ కాలేజీ కూడా లేని చోట ప్రస్తుతం మూడు కాలేజీ ఉండడం విశేషం. రెండు పాలిటెక్నిక్ కాలేజీలు ప్రారంభించారు. ఇటీవలే డైట్ కాలేజీ, ఒక పాలిటెక్నిక్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన చేశారు. న్యాయ విద్యను చేరువ చేయాలనే ఆలోచనతో లా కాలేజీని మంజూరు చేయించారు. అత్యాధునిక లైబ్రరీని ఏర్పాటు చేయించి, అందులో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. మన ఊరు, మనబడి పథకంలో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న అనేక ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

విద్యా సంస్థలకు నిధుల వరద

రూ.6.55 కోట్లతో నాలుగు జూనియర్ కళాశాల్లో నూతన తరగతి గదులు, ప్రహరీ సహా ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో మీర్‌పేట జూనియర్ కాలేజీకి రూ.1.33 కోట్లు కేటాయించగా, కందుకూరు జూనియర్ కాలేజీకి రూ.2 కోట్లు, మహేశ్వరం జూనియర్ కాలేజీకి రూ.1.20 కోట్లు, సరూర్‌నగర్ జూనియర్ కళాశాలకు రూ.2 కోట్లు మంజూరు చేయించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బడంగ్‌పేట్, మహేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలకు రూ.24 కోట్లు, డైట్ కాలేజీ ఏర్పాటుకు రూ.4 కోట్లు, రూ.4కోట్లతో జిల్లా గ్రంథాలయాలను ఇప్పటికే ప్రారంభించారు. మహేశ్వరం డిగ్రీ కళాశాలకు రూ.కోటి, మోడల్ స్కూల్‌కు రూ.4 కోట్లు మంజూరు చేయించారు. మన ఊరు -మన బడి కింద మొదటి విడతలో 26 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలలు, మొత్తం 54 ఎంపిక చేసి రూ.16 కోట్లతో 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మిగిలిన పాఠశాలలకు మరో రూ.9.13 కోట్లు మంజూరు చేయించి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఇటీవల రాష్ట్రంలో 16 డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరు కాగా, వీటిలో మన జిల్లాకే రెండు (షాద్‌నగర్ బాలికల, కందుకూరు బాలుర గురుకులాలు) మంజూరయ్యాయి. కేసీతండా పరిధిలో రూ.కోటితో కొత్తగా నిర్మించిన డిగ్రీ కాలేజీ భవనాలను ఇటీవలే ప్రారంభించారు.

క్లుప్తంగా...

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



బంజారాహిల్స్: భాద్రపద పౌర్ణమి సందర్భంగా బంజారాహిల్స్ రోడ్ నెంబర్–12 శ్రీ విశ్వ సాయి మందిరంలోని శ్రీ సాయిబాబా వారికి విశేషముగా గుడొదకం (బెల్లం నీరు)తో అభిషేకం, పుష్పాలతో సహస్రనామార్చన జరిగింది.

హ్యాండీక్రాఫ్ట్స్ మేళాకు విశేష స్పందన



మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన ఆల్ ఇండియా హ్యాండ్‌లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్స్ మేళాకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని మేళా వ్యవస్థాపక చైర్మన్ అక్బర్‌ఆలీ, ప్రధాన కార్యదర్శి గంగాదర్లు పేర్కొన్నారు. ఈ మేళాలో దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కార్మికులచే స్వయంగా నేయబడిన వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. రోజూ ఉదయం 10.30 నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ మేళా అందుబాటులో ఉంటుందని తెలిపారు.

2న ఆందోళనను జయప్రదం చేయండి

లిబర్టీ: దేశంలో మీడియా రక్షణ చట్టాన్ని అమలు చేసి, మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని, అక్రిడిటెడ్ జర్నలిస్టులకు రైల్వే పాస్ అమలును పునరుద్ధరించాలనే డిమాండ్లతో అక్టోబర్ 2న (గాంధీ జయంతి) ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా హైదరాబాద్‌లో హెచ్‌యూజే ఆధ్వర్యంలో నిర్వహించే నిరసన కార్యక్రమాన్ని జర్నలిస్టులు విజయవంతం చేయాలని అధ్యక్షుడు శిగా శంకర్‌గౌడ్, కార్యదర్శి షౌకత్ హమీద్, ఉపాధ్యక్షుడు జె.పుండరీచారి పిలుపునిచ్చారు. లిబర్టీలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద నిర్వహించ తలపెట్టిన ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విరాహత్‌అలీ, ఐజేయూ జాతీయ కార్యదర్శి వై.నరేందర్‌రెడ్డి, ఐజేయూ స్టీరింగ్ కమిటీ సభ్యులు ఎం.ఎ.మాజీద్‌లతో పాటు యూనియన్ సీనియర్ సభ్యులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి జర్నలిస్టులు పెద్ద ఎత్తున తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

యాంటీ డ్రగ్ కమిటీ నియామకం

ఉస్మానియా యూనివర్సిటీ: వీసీ ప్రొ.రవిందర్ చైర్మన్‌గా ఆరుగురు సభ్యులతో యాంటీ డ్రగ్ కమిటీని నియమించారు. సభ్యుల్లో ఓయూ సీఐ ఆంజనేయులు, న్యాయకళాశాల ప్రిన్సిపల్ ప్రొ. రాధిక యాదవ్, ఇంజినీరింగ్ కాలేజీ ఈసీఈ విభాగం ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.సాయిచరణ్‌తో పాటు యూత్ వెల్ఫేర్ ఆఫీసర్‌తో పాటు ఉద్యోగ సంఘనేతను నియమించారు.

మంగళవారం.. మహిళలకు ప్రత్యేకం!

మారిన ఆహార అలవాట్లు, తీవ్రమైన ఒత్తిడి, ఆందోళన వల్ల మహిళల్లో ఎక్కువగా థైరాయిడ్ హార్మోన్ అసమతుల్యత సమస్యలు వెలుగు చూస్తున్నాయి. ఆరోగ్య మహిళా కేంద్రాలకు వస్తున్న వారిలో ఎక్కువగా మూత్రాశయ సమస్యలు, పోషకాహార లోపాలు, థైరాయిడ్ హార్మోన్ అసమతుల్యత సమస్యలు తదితర రుగ్మతలను వైద్యనిపుణులు గుర్తిస్తున్నారు. దీనికి ఆరోగ్యపరమైన సలహాలు ఇస్తూనే పోషకాహారం తీసుకోవడం, వ్యాయామం అలవాటుగా చేసుకోవడం ఒత్తిడి తగ్గించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కలిగిస్తున్నారు.



ఆరోగ్య మహిళా కార్యక్రమంపై అవగాహన కలిగిస్తున్న వైద్య సిబ్బంది

- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ఆరోగ్య మహిళా కేంద్రాలకు విశేష స్పందన
- బస్తీ దవాఖానాలు, యూపీహెచ్‌సీల్లో మహిళలకు ప్రత్యేక వైద్య పరీక్షలు

బంజారాహిల్స్: అవగాహన కల్పిస్తున్న నేపథ్యంలో ఆరోగ్య మహిళా కేంద్రాలకు మంచి స్పందన వస్తోంది దీంతో ఇటీవలే బస్తీ దవాఖానాల్లో కూడా ఆరోగ్య మహిళా కేంద్రాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

◆ ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ కేంద్రాల్లో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు కూడా చేస్తున్నారు. అనుమానితులు, లక్షణాలు ఉన్న వారిని బయాప్సీ, మామోగ్రామ్ తదితర పరీక్షల కోసం పెద్దాస్పత్రులకు సిఫారసు చేస్తున్నారు.

◆ బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, సోమాజిగూడ, ఖైరతాబాద్, సోమాజిగూడ పరిధిలో ఉన్న ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాల్లో ఆరోగ్య మహిళా కేంద్రాలు అందుబాటులోకి తీసుకురాగా ఈ కేంద్రాలకు వచ్చే మహిళల వివరాలను ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో నమోదు చేస్తున్నారు.

ప్రతి మంగళవారం.. 8 రకాల సేవలు

అన్ని వయసుల మహిళలకు ఎనిమిది రకాల సర్వీసు ప్యాకేజీలను మహిళా ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అందిస్తున్నారు. రోగ నిర్ధారణ, కేన్సర్, ఇతర రోగాల స్క్రీనింగ్, సూక్ష్మ పోషక లోపాల గుర్తింపు, మూత్ర నాళ ఇన్ఫెక్షన్లు, హార్మోన్ అసమతుల్యతలు, మోనోపాజ్ నిర్వహణ, లైంగిక వ్యాధుల నిర్వహణ, శరీర బరువు నిర్వహణ వంటి అంశాలను ప్రత్యేకంగా ఆరోగ్య కార్డులు నమోదు చేస్తున్నారు.

◆ ప్రతి మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేకంగా అతివల కోసమే మహిళా వైద్య ఆరోగ్య సిబ్బంది సేవలు అందిస్తున్నారు. పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, మందుల పంపిణీతో పాటు ఫాలోఅప్ సేవలు కూడా అందిస్తున్నారు.

◆ విటమిన్–డి లోపాలు, రక్తపోటు సమస్యలు, థైరాయిడ్ లక్షణాలు తదితర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలకు తగిన మందులు అందజేస్తున్నారు. ఆరోగ్య మహిళ కార్యక్రమానికి మహిళల నుంచి విశేష స్పందన లభిస్తుండటంతో ఇటీవలనే పీహెచ్‌సీలలో కూడా సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

◆ మహిళలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు మొదటిసారి పూర్తి మహిళా సిబ్బందితో పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం మహిళలు పెద్ద సంఖ్యలో ముందుకు వస్తున్నారని ప్రశాసన్‌నగర్ బస్తీ దవాఖానా వైద్యురాలు అమూల్య వెల్లడించారు.

◆ పీహెచ్‌సీలలో మహిళా సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు బంజారాహిల్స్ రోడ్ నెం.7లోని యూపీహెచ్‌సీ వైద్యాధికారి కార్తీక్ తెలిపారు. బాధితుల ఆరోగ్యపరమైన వివరాలు తెలుసుకుంటూ ఏదైనా సమస్య ఉంటే పరీక్షలు నిర్వహించుకునేందుకు మహిళా సిబ్బంది ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.

◆ మరోవైపు ఫలితాల కోసం శాంపిల్స్‌ను ల్యాబ్‌లకు పంపిస్తున్నారు. దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించే తీరును మహిళలకు వివరిస్తున్నారు.

గణేష్ ఉత్సవాలతో నగరానికి కొత్త శోభ

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



గణనాథులకు స్వాగతం పలుకుతున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రహమత్‌నగర్: గణేష్ నవరాత్రి ఉత్సవాలతో హైదరాబాద్ నగరం సరి కొత్త శోభ సంతరించుకుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రహమత్‌నగర్ కూడలిలో బీజేవైఎం నగర కార్యవర్గ సభ్యుడు, రహమత్‌నగర్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లయ్యగారి శ్రీజిత్‌రాజ్ కిట్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వాగత వేదిక నుంచి ఆయన గరువారం రాత్రి గణనాథులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగుతుండటం అభినందనీయన్నారు. అలాగే ముస్లింలకు మీలాద్ ఉన్ నబీ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, బీజేపీ జూబ్లీహిల్స్ నాయకుడు లంకాల దీపక్‌రెడ్డి, ప్రేమ్, కొలన్ సత్యనారాయణ, శివరాజ్ మల్లయ్య, రాంధారిబాబా ,సాగర్,విక్కి,మహేందర్, ఆనంద్, మహేష్, దినేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

‘విరించి’లో వరల్డ్ హార్ట్ డే



బంజారాహిల్స్: విరించి ఆస్పత్రిలో శుక్రవారం వరల్డ్ హార్టడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్న వారితోపాటు, ప్రస్తుతం చికిత్స పొందుతున్న హృద్రోగులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారికి, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆస్పత్రి గ్రూపు వైస్ చైర్మన్ వేదుల సత్యనారాయణ మాట్లాడుతూ... హృద్రోగానికి సంబంధించి ఏర్పడే ఇబ్బందులను సరైన సమయంలో గుర్తించగలిగితే..అది ప్రాణాంతకంగా మారకుండా చూసుకోవచ్చన్నారు. హార్ట్ ఎటాక్‌కు సంబంధించి మన శరీరం ఇచ్చే సంకేతాలను సరైన సమయంలో గుర్తించి వెంటనే నిపుణులైన వైద్యులున్న హాస్పిటల్‌కు రాగలగితే ప్రాణాన్ని కాపాడవచ్చని చెప్పారు. ఈ సంకేతాలపై ప్రజలలో అవగాహన లేదని, దానిని కల్పించడానికే విరించి హాస్పిటల్స్ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. ఆస్పత్రి సీఈఓ డాక్టర్ సాయి రవిశంకర్ మాట్లాడుతూ... బీపీ, డయాబెటిస్ వంటి జీవన శైలి వ్యాధులు అదుపులో లేక గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయన్నారు. నిరంతరం వ్యాయామం, మంచి ఆరోగ్య అలవాట్లు, ఆరోగ్యకరమైన జీవన శైలితో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

సమగ్ర అధ్యయనంతోనే పురోగతి

మంత్రి హరీష్‌రావు



సనత్‌నగర్: సమగ్రమైన ఆర్థిక, సామాజిక అధ్యయనం చేసినప్పుడే ఏ రాష్ట్రమైనా, దేశమైనా పురో గతి చెందుతుందని మంత్రి హరీష్‌రావు అన్నారు. ఆయా అంశాల సర్వే నివేదికల ఆధారంగానే మంచి పరిపాలన అందించడం సాధ్యపడుతుందని అభిప్రాయపడ్డారు. బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్)లో రూ.5 కోట్లతో నిర్మించిన విద్యార్థినుల వసతి గృహాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు, పథకాల రూపకల్పన, అమలు చేయడంలో సామాజిక అధ్యయనాలు ఎంతగానో అవసరమన్నారు. ఆ దిశగా సెస్ అధ్యయనాలు ప్రభుత్వాలకు వెన్నెముకగా పనిచేస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం సెస్‌ను ఎంతగానో ప్రోత్సహిస్తోందన్నారు. సీఎం కేసీఆర్ ఒక పథకం అమలుచేసే ముందు ప్రజా కోణంలో ఆలోచిస్తారన్నారు. అందుకే ఆ పథకాలు విజయవంతమై దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. కేసీఆర్ కిట్‌లో భాగంగా ట్రాకింగ్ సిస్టంను తీసుకువచ్చి మూడో నెల నుంచే గర్భిణీ మహిళల ఆరోగ్యంపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామన్నారు. జాతీయ స్థాయిలో సెస్‌లో పీహెచ్‌డీ కోర్సుకు డిమాండ్ ఉన్న దృష్ట్యా వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు వస్తున్నారని, వారి అవసరాల నిమిత్తం బాలికల వసతి గృహాన్ని ఏర్పాటుచేసుకున్నట్లు తెలిపారు. హాస్టల్ భవనం కార్పొరేట్ స్థాయిలో నిర్మించడంతో పాటు ఎకో ఫ్రెండ్లీ, గ్రీన్ కాన్సెప్ట్ విధానంలో ప్లాన్ చేసిన ఆర్కిటెక్చర్‌ను ఆయన అభినందించారు. సెస్ ఫౌండర్ మెంబర్ మహేందర్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (ఫైనాన్స్) డాక్టర్ జీఆర్ రెడ్డి, ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా వర్శిటీ వీసీ రవీందర్, సెస్ డైరెక్టర్ రేవతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మానస్‌కుమార్ డే తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో...1743 మందికి ‘డబుల్’ ఇళ్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాగంటి

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

వెంగళరావునగర్: డబుల్ బెడ్ రూం గృహాలకు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఇప్పటి వరకు 1743 మంది లబ్ధిదారులను ప్రభుత్వ ఎంపిక చేసినట్టు బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ వెల్లడించారు. యూసుఫ్‌గూడలోని మహమూద్ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం డబుల్ బెడ్‌రూం ఇళ్ల మూడో దశ లబ్ధిదారుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాగంటి మాట్లాడుతూ... లబ్ధిదారులకు అక్టోబర్ 2న పొజిషన్ సర్టిఫికెట్లను ప్రదానం చేస్తామన్నారు. డబుల్ బెడ్‌రూం గృహాల కోసం ఎవరికీ ఒక్క రూపాయి కూడా ఇవ్వవద్దని, దళారులను నమ్మవద్దని ఆయన సూచించారు. నియోజకవర్గంలో అర్హులందరికీ త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించనున్నట్లు గోపీనాథ్ స్పష్టం చేశారు. కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, సి.ఎన్.రెడ్డి, వివిధ డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులైన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు మెగా జాబ్ మేళా

సనత్‌నగర్: సెయింట్ థెరిస్సా చర్చి ప్రాంగణంలోని డాన్‌బాస్కో దిశ ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కో–ఆర్డినేటర్లు ఐవన్ వాజ్, స్టీఫెన్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. చర్చి ప్రాంగణంలో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ జాబ్ మేళాలో రిలయన్స్, శుభగృహ, అపోలో ఫార్మసీ, ది ముత్తూట్ గ్రూప్ వంటి దాదాపు 25 కంపెనీలకు చెందిన ప్రముఖులు హాజరై మూడు వేల పైచిలుకు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, అండర్ గ్రాడ్యుయేట్, పీజీ విద్యార్హత కలిగిన వారికి అవకాశాలు ఉంటాయన్నారు. వివరాలకు 94940 92219, 94946 98219 నెంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

అంబేడ్కర్ వర్సిటీ ‘ఇన్-హౌస్ సర్టిఫికెట్’ ప్రింటింగ్ ప్రారంభం



ప్రింటింగ్ విభాగాన్ని ప్రారంభిస్తున్న వీసీ సీతారామారావు

బంజారాహిల్స్: డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.సీతారామారావు స్మార్ట్ సర్టిఫికెట్ల ఇన్‌హౌస్ ప్రింటింగ్ సదుపాయాన్ని విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ సీతారామారావు మాట్లాడుతూ... డిగ్రీ, పీజీ, ఇతర కోర్సుల అన్ని సర్టిఫికెట్‌లను విద్యార్థులకు మరింత వేగంగా జారీ చేయడానికి ఇన్‌హౌస్ ప్రింటింగ్ సదుపాయంలో లేటెస్ట్ టెక్నాలజీ హై స్పీడ్ ప్రింటర్‌ల సహాయంతో ధ్రువపత్రాలు ప్రత్యేక కాగితంపై ముద్రించనున్నారు. ఇలా ప్రింట్ అయిన సర్టిఫికెట్స్ వాటర్ ప్రూఫ్, దీర్ఘకాల మన్నికను కలిగి ఉంటాయన్నారు. డిజిటల్ క్యూఆర్ కోడ్‌తో నకిలీ సర్టిఫికెట్‌ల తయారీని నివారించడానికి ఆన్‌లైన్ ధ్రువీకరణ వ్యవస్థతో సర్టిఫికెట్ భద్రతలను కలిగి ఉంటుందన్నారు. కార్యక్రమానికి విశ్వవిద్యాలయ అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, రిజిస్ట్రార్ డాక్టర్ ఎ.వి.ఆర్.ఎన్.రెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ పి.వెంకటరమణ, డైరెక్టరేట్ మెటీరియల్స్–పబ్లికేషన్స్ ప్రొఫెసర్ గుంటి రవీందర్, అదనపు కంట్రోలర్లు వీఎం టెక్నాలజీస్, సీఈఓ ఎస్.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన నిమజ్జనాలు





బంజారాహిల్స్: గణనాథుల నిమజ్జనాలు శుక్రవారం సాయంత్రం వరకు కొనసాగాయి. తెల్లవారుజామున హుస్సేన్‌సాగర్ వైపుకు పెద్ద ఎత్తున గణనాథులు రావడంతో పోలీసులు ఆ విగ్రహాలను అంబేడ్కర్ విగ్రహం పక్కన ఉన్న మైదానంలో ఉంచారు. ఒక వైపు నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్ బండ్‌లలోని అన్ని రహదారులు ఫుల్ రద్దీగా కనిపించాయి.

ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలో...

పంజగుట్ట: వినాయక నిమజ్జన ఊరేగింపులు శుక్రవారం కూడా కొనసాగాయి. ఖైరతాబాద్, సోమాజిగూడ, బంజారాహిల్స్, శ్రీనగర్‌కాలనీ, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, చింతల్‌బస్తీ తదితన ప్రాంతాల నుంచి గురువారం రాత్రి అత్యంత కోలాహలంగా నిమజ్జన ఊరేగింపులు ప్రారంభం అయ్యాయి. తెల్లవారు జాము రెండు మూడు గంటల వరకు హుస్సేన్‌సాగర్‌లో గణపయ్యలను నిమజ్జనం చేశారు. గణేష్ శోభాయాత్ర యువతి, యువకుల ఆట పాటలు, చిన్నారుల కేరింతలు, డప్పు వాయిద్యాల మధ్య కనులపండువగా సాగింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజగుట్ట, సైఫాబాద్, ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 200లకు పైగా విగ్రహాలు ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాల నడుమ నిమజ్జనం అయ్యాయి.







నెక్లెస్ రోడ్డు, ఎన్టీఆర్ మార్గ్, ట్యాంక్‌బండ్‌లలో బారులు తీరిన గణనాథులు

సందడిగా గణేష్ లడ్డూల వేలం



ఎల్లారెడ్డిగూడలో కవిత...



లడ్డూ దక్కించుకున్న తిరుపతి



పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో దేవేంద్ర నాయక్



గౌతంనగర్‌లో గుంటి గోపాలకృష్ణ



మధురానగర్ బీ బ్లాక్‌లో వెంకటప్రసాద్, విజయలక్ష్మి దంపతులు



హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–1లో మహేష్‌యాదవ్..



బంజారాహిల్స్ రోడ్ నెం.5లోని దేవరకొండ బస్తీలో లడ్డూను దక్కించుకున్న మహిళలు

ఫిలింనగర్: వినాయక మండపాల వద్ద లడ్డూల వేలం పాటలు శుక్రవారం తెల్లవారుజాము వరకు ఉత్సాహభరిత వాతావరణంలో కొనసాగాయి. యువకుల ఉత్సాహం మధ్య గణేష్ లడ్డూ వేలం పాటల్లో వేలాది రూపాయలు వెచ్చించి భక్తులు లడ్డూలు కొనుగోలు చేసి స్థానికులకు పంపిణీ చేశారు.

◆ ఫిలింనగర్‌లోని గౌతంనగర్ బస్తీలో గుంటి గోపాలకృష్ణ సూర శివ శంకర్ రూ. 49,216కు లడ్డూ దక్కించుకున్నారు.

◆ ఫిలింనగర్ పద్మాలయ అంబేద్కర్‌నగర్ బస్తీలో జై శ్రీరాం యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను స్థానిక దేవేంద్రనాయక్ రూ. 3 లక్షలకు కొనుగోలు చేశారు.

◆ జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ పటేల్‌నగర్ బస్తీ అధ్యక్షుడు డేరంగుల తిరుపతి వినాయక లడ్డూను రూ. 2,01,016లకు దక్కించుకున్నారు. సిద్ధి వినాయక యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ఈ గణనాథుడి వద్ద లడ్డూ గతేడాది రూ. 1.50 లక్షలకు పోయింది. డేరంగుల తిరుపతి బస్తీలో ఇది మూడోసారి లడ్డూను కైవసం చేసుకోవడం.

దక్కించుకుని.. భక్తులకు పంచేసి...

ఫిలింనగర్ వినాయక నగర్ బస్తీలో వినాయక యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూను వేలం పాటలో దిలీప్ సింగ్ రూ. 1.25 లక్షలకు దక్కించుకున్నారు. అక్కడే ఉన్న భక్తులందరికీ ఈ లడ్డూ ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

రహమత్‌నగర్ డివిజన్‌లో...

రహమత్‌నగర్: రహమత్‌నగర్ డివిజన్ హెచ్‌ఎఫ్‌నగర్ ఫేజ్–1లోని సీతారామ భక్త సమాజం గణేష్ మండపం వద్ద లడ్డూను కె.పి.మోహన్ రూ. 1.15 లక్షలకు సొంతం చేసుకున్నారు. ఎన్ఎస్‌బీ నగర్‌లో యువజన సంఘం లడ్డూను రూ. 1.16 లక్షలకు ఉత్సవ కమిటీ నిర్వాహకుడు, యాదవ యువజన సంఘం నేత మహేష్ యాదవ్ దక్కించుకున్నారు.

యూసఫ్‌గూడ, వెంగళరావునగర్ డివిజన్‌లలో..

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ వెంకటగిరి యూత్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వినాయక లడ్డూను వేలం పాటలో వెంకటగిరి వ్యాపారి ఆవుల చంద్రమోహన్ రూ. 1,27,501లకు సొంతం చేసుకున్నారు. వెంగళరావునగర్ డివిజన్ జవహర్‌నగర్ గాంధీ బొమ్మ వద్ద భజరంగ్‌యూత్ అసోసియేషన్ లడ్డూను ఎంఎంసీసీ స్కూల్ కరస్పాండెంట్ తమ్మినేని సత్యనారాయణ రూ. 2.50 లక్షలకు పొందారు.

ఎల్లారెడ్డిగూడలో...

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడలోని గంగాధర భక్తసమాజ్ గణనాథుని లడ్డూను అమీర్‌పేట సోనా బా యి టెంపుల్ చైర్మన్ కొత్లాపురం కవిత రూ.18 వేలకు దక్కించుకున్నారు. లడ్డూను సంతోష్‌గౌడ్ అందజేశారు.

మధురానగర్ బీ బ్లాకులో...

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ మధురానగర్ బీ బ్లాక్‌లో నవయువ నాగ గణపతి వినాయక మంటపం వద్ద శుక్రవారం నిర్వహించిన వేలం పాఆటలో లడ్డూను కాలనీకి చెందిన వెంకట్‌ప్రసాద్, విజయలక్ష్మి దంపతులు రూ. 1.26 లక్షలకు సొంతం చేసుకున్నారు.



జవహర్‌నగర్ గాంధీబొమ్మ వద్ద సత్యనారాయణ



వెంకటగిరి వ్యాపారి ఆవుల చంద్రమోహన్



ముద్దంగుల వినోద్ దుర్గాభవానీ నగర్ గణేశుడి లడ్డూను రూ. 1.47 లక్షలకు దక్కించుకున్న భక్తులు

క్లుప్తంగా...

రాష్ట్రంలో భూగర్భ జలాలు పెరిగాయి

సాగునీటిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్

సాక్షి, హైదరాబాద్: గత తొమ్మిదేళ్ల కాలంలో రాష్ట్రంలో 267 టీఎంసీల మేర భూగర్భజలాలు పెరిగాయని, నాలుగు మీటర్ల మేర ఈ పెరుగుదల నమోదయిందని సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ వెల్లడించారు. శుక్రవారం భూగర్భజల శాఖ రాష్ట్ర కమిటీ సమావేశమై భూగర్భ జలాల పెరుగుదలపై సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా రజత్‌కుమార్ మాట్లాడుతూ మిషన్ కాకతీయ పథకం ద్వారా 27వేల చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం ఎత్తిపోతల పథకం ద్వారా 1000కి పైగా చెరువులు, చెక్‌డ్యాముల్లో నీటి నిల్వలు పెరిగిన కారణంగా భూగర్భజలం పెరిగిందని చెప్పారు. 2013లో 472 టీఎంసీల భూగర్భ జలాలుంటే వివిధ కార్యక్రమాల ద్వారా తొమ్మిదేళ్ల తర్వాత అది 739 టీఎంసీలకు చేరిందని చెప్పారు. 2013లో భూగర్భ జలాల వినియోగం 58% కాగా, ప్రస్తుతం అది 38.65 శాతానికి తగ్గిందని వివరించారు.

సాఫీగా నిమజ్జనం.. డీజీపీ హర్షం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ నిమజ్జనం ప్రశాంతంగా ముగియడంపై డీజీపీ అంజనీకుమార్ సంతోషం వ్యక్తం చేశారు. పోలీస్ శాఖలోని హోంగార్డు మొదలు.. ఐపీఎస్ అధికారులు, ఇతర ప్రభుత్వ విభాగాల సమన్వయంతోనే గణేశ్ నిమజ్జనం విజయవంతమైందని శుక్రవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిని డీజీపీ అభినందించారు.

వాలంతరీ పాలక మండలి పునర్వ్యవస్థీకరణ

చైర్మన్‌గా సీఎం, వైస్‌చైర్మన్‌గా సాగునీటి పారుదల శాఖ మంత్రి

సాక్షి, హైదరాబాద్: నీరు, భూమి నిర్వహణ శిక్షణ పరిశోధన సంస్థ (వాలంతరీ) పాలక మండలి చైర్మన్‌గా ముఖ్యమంత్రి, వైస్ చైర్మన్‌గా సాగునీటి పారుదల శాఖ మంత్రి వ్యవహరించనున్నారు. ఈ మేరకు వాలంతరీ పాలక మండలిని పునర్వ్యవస్థీకరిస్తూ సాగునీటి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం వాలంతరీ డైరెక్టర్ జనరల్ సభ్య కార్యదర్శిగా, సాగునీటి శాఖ ప్రధాన కార్యదర్శి, ఇరిగేషన్ అండ్ కమాండ్ కంట్రోల్ ఏరియా డెవలప్‌మెంట్ ఈఎన్‌సీ (అడ్మిన్), నీటిపారుదల శాఖ ఈఎన్‌సీలు సభ్యులుగా వ్యవహరించనున్నారు.

111 జీవో రద్దు అమలుపై స్తబ్ధత

ప్రత్యేక కమిటీ నివేదిక వచ్చేదాకా ఆంక్షలు కొనసాగింపు

- హైకోర్టుకు స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- క్షేత్ర స్థాయిలో మాత్రం అక్రమార్కుల ఇష్టారాజ్యం
- యథేచ్ఛగా లగ్జరీ విల్లాలు, భారీ భవన నిర్మాణాలు
- సామాన్యులకు మాత్రం ఆంక్షల నిబంధనలు
- సర్కారు లక్ష్యానికి తూట్లు పొడుస్తున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: జీవో 111 రద్దు అమలుపై స్తబ్ధత నెలకొంది. ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిరక్షణకు ఉద్దేశించిన 111 జీవోను రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది ఏప్రిల్‌లో నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అయితే ఈ విషయంలో కొన్ని అభ్యంతరాలు రావడంతో ప్రభుత్వం నిబంధనల సడలింపులపై అధ్యయనం చేసేందుకు జీవో 69ను జారీ చేస్తూ, ప్రత్యేకంగా ఓ కమిటీని కూడా ఏర్పాటు చేసింది. ఆ కమిటీ నివేదిక అందించే దాకా 111 జీవో పరిధిలోని ప్రాంతాల్లో నిబంధనలు కొనసాగుతాయని ప్రభుత్వం హైకోర్టుకు స్పష్టం చేసింది. దీంతో 111జీవో పరిధిలోని 84 గ్రామాల్లో మళ్లీ స్తబ్ధత నెలకొంది. అయితే ప్రభుత్వం విధించిన ఆంక్షలు కేవలం సామాన్యులకే పరిమితమవుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల చేయి తడిపే అక్రమార్కుల నిర్మాణాలు మాత్రం జోరుగా సాగుతున్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

కాలయాపన కమిటీ..

హైదరాబాద్‌కు తాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జంట జలాశయాల పరిధిలో సుమారు 1.32 లక్షల ఎకరాలలో భూమి ఉంది. ఇక్కడ 84 గ్రామాలకు కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ప్రణాళిక ప్రకారం హరిత నగరాన్ని నిర్మించాలని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే 111 జీవోను రద్దు చేసింది. అయితే ఈ జలాశయాల పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలపై మార్గదర్శకాలు రూపొందించేందుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేశారు. మున్సిపల్, ఆర్థిక, నీటి పారుదల శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, జలమండలి ఎండీ, కాలుష్య నియంత్రణ బోర్డు సభ్య కార్యదర్శి, హెచ్‌ఎండీఏ డైరెక్టర్ (ప్లానింగ్) సభ్యులుగా ఉండే ఈ కమిటీలో.. ఏయే అంశాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలన్న దానిపై విధివిధానాలను ప్రభుత్వం ఖరారు చేసింది. అయితే కమిటీ ఏర్పాటై నెలలు గడుస్తున్నా నేటికీ ఎలాంటి విధానాలను రూపొందించకపోవడం గమనార్హం.

ఆగని నిర్మాణాలు..

ఇప్పటికే 111 జీవో పరిధిలోని భూముల్లో సంపన్న వర్గాలు, పారిశ్రామికవేత్తలు, సినీ, రాజకీయ ప్రముఖులు, బ్యూరోక్రాట్స్ తక్కువ ధరకే పెద్ద ఎత్తున స్థలాలను కొనుగోలు చేసి, ఫామ్‌హౌస్‌లు, రిసార్ట్‌లను నిర్మించుకున్నారు. శంషాబాద్, మెయినాబాద్, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాబాద్, కొత్తూరు శంకర్‌పల్లి మండలాల పరిధిలో అక్రమంగా లగ్జరీ విల్లాలు, హైరైజ్ నిర్మాణాలు జరుగుతున్నాయి. 111 జీవో ఎత్తివేశాక ఒక్క శంషాబాద్ పట్టణంలో దాదాపు 400 అక్రమ నిర్మాణాలు చేపట్టారని అంచనా. మొయినాబాద్ మండలంలో కొందరు రియల్టర్లు భూములను 10, 25 గుంటల చొప్పున ఫామ్ ల్యాండ్లుగా విక్రయిస్తున్నారు. వీటిని కొనుగోలు చేసిన చాలా మంది ఆయా ఫామ్ ల్యాండ్లలో అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారని తెలుస్తోంది. వీటిని ఫామ్ హౌస్, వీకెండ్ హోమ్స్‌గా మార్చేసి అద్దెకు ఇస్తున్నారని స్థానికులు చెపుతున్నారు.

రేటు పెట్టి మరీ వసూళ్లు..

అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు వస్తే నోటీసులు జారీ, క్షేత్ర స్థాయిలో విచారించి చర్యలు తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నా.. అవి అంతంతమాత్రమేనని విమర్శలు వస్తున్నాయి. ఎందుకంటే 111 జీవో పరిధిలో చాలా వరకు అక్రమ నిర్మాణాలు నేతలు, ప్రముఖులవే కావడంతో అధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు స్థానిక మున్సిపల్ అధికారుల చేతులు తడపడంతో వారూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఒక్కో భవనానికి రూ.2–5 లక్షల వరకు మున్సిపల్ అధికారులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి.

జీవో రద్దు తర్వాత రియల్ బూమ్..

జీవో111 పరిధిలోని పాత వెంచర్లలో గజం ధర రూ.3–4 వేల వరకు ఉండేది. కాగా, ఈ జీవోను రద్దు చేశాక ధరలు ఒక్కసారిగా గజానికి రూ.12 వేలకు పైగానే చెబుతున్నారు. శంషాబాద్ మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న భూములు ఎకరం ధర రూ.8 కోట్లకు పైగానే చెబుతున్నారు. విమానాశ్రయానికి దగ్గర్లోని గ్రామాల్లో ఎకరం రూ.3–5 కోట్ల వరకు పలుకుతున్నాయని చెపుతున్నారు.



సాంకేతికతను వినియోగించుకోవాలి

నీటి వనరుల సంరక్షణ పేరుతో అభివృద్ధికి అడ్డుకట్ట వేయకూడదు. జలాశయాల ఆక్రమణలు, కాలుష్య నియంత్రణకు సాంకేతికతను వినియోగించుకోవాలి. నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినచర్యలు తీసుకుంటే వ్యవస్థ బాగుంటుంది.

– కంచర్ల సంతోష్ రెడ్డి, సీఎండీ, డ్రీమ్ వ్యాలీ గ్రూప్

తెలంగాణలో ఇద్దరికి జాతీయ సేవాపథకం అవార్డులు

- ఢిల్లీలో అందజేసిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము



శుక్రవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీముర్ము నుంచి అవార్డులు అందుకుంటున్న పరశురాములు, మనోజ్ ఖన్నా.

సాక్షి, న్యూఢిల్లీ: స్వచ్ఛంద సేవకు గుర్తింపుగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ ఏటా ఇచ్చే జాతీయ సేవా పథకం అవార్డు– 2021–22ను తెలంగాణకు చెందిన ఇద్దరు దక్కించుకున్నారు. హనుమకొండకు చెందిన గుండె పరశురాములు, హైదరాబాద్‌కు చెందిన దావెర మనోజ్ ఖన్నా చేపట్టిన స్వచ్ఛంద సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము వారికి అవార్డులు అందజేశారు.

గుండె పరశురాములు స్వచ్ఛంద సేవ

హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీరు గుండె పరశురాములు మొక్కలు నాటడం, రక్తదాన శిబిరాలపై చొరవ చూపేవారు. 1,300 మొక్కలు నాటిన పరశురాములు 10 రక్తదాన శిబిరాల్లో పాల్గొన్నారు. స్వచ్ఛభారత్ ప్రచారంలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై కార్యక్రమాలు చేపట్టారు. కరోనా సమయంలో వాల్‌పోస్టర్లు, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా అవగాహన కల్పించారు. ఉజ్వల యోజన, పీఎం జీవన్‌బీమా యోజన, పీఎం జన్‌ధన్ యోజన తదితర పథకాల ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. డిజిటల్ అక్షరాస్యత, పోక్సో చట్టాల గురించి దత్తత గ్రామాల్లో అవగాహన కల్పించారు.

పథకాలపై మనోజ్ ఖన్నా ప్రచారం

మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీకి చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీరు మనోజ్ ఖన్నా ఉజ్వల యోజన, పీఎం జీవన్‌బీమా యోజన, పీఎం జన్‌ధన్ యోజన వంటి ప్రచార కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. డిజిటల్ అక్షరాస్యత, పోక్సో చట్టాలపై దత్తత గ్రామాల్లో 650పైగా కార్యక్రమాలు నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపులు నిర్వహించారు. ఇతర వలంటీర్లతో కలిసి శానిటరీ ప్యాడ్లు పంపిణీ చేయడం, కోవిడ్ వేళ పేద పిల్లలకు ఆహారం సేకరించి అందించడం వంటి పనులు చేశారు. మనోజ్ రక్తదాన శిబిరాల ద్వారా 150 యూనిట్ల రక్తాన్ని సేకరించారు.

ఆరువారాల్లో రూ.17.5 కోట్లు డిపాజిట్ చేయండి

హెచ్‌సీఏకు హైకోర్టు ఆదేశం.. అటాచ్ చేసిన ఆస్తుల విడుదల

సాక్షి, హైదరాబాద్: ఆరువారాల్లో రూ.17.5 కోట్లు వాణిజ్య న్యాయస్థానంలో డిపాజిట్ చేయాలని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ను హైకోర్టు ఆదేశించింది. ఉప్పల్ స్టేడియం, హెచ్‌సీఏ బ్యాంక్ అకౌంట్లు సహా ఆస్తులన్నింటినీ అటాచ్ నుంచి విడుదల చేయాలని స్పష్టం చేసింది. స్థిర, చరాస్తులపై థర్డ్ పార్టీకి ప్రయోజనాలు కల్పించొద్దని హెచ్‌సీఏకు సూచించింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. ఉప్పల్ స్టేడియం, హెచ్‌సీఏ బ్యాంక్ అకౌంట్లు సహా ఆస్తులన్నింటినీ రంగారెడ్డి జిల్లా కోర్టు గత వారం అటాచ్ చేయడాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టు నియమించిన హెచ్‌సీఏ అడ్మినిస్ట్రేటర్, జస్టిస్ ఎల్.నాగేశ్వర్ రావు హైకోర్టును ఆశ్రయించారు. తమ వాదనలు వినకుండానే చేసిన ఆ అటాచ్‌మెంట్లు రద్దు చేయాలని కోరారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ.శ్రవణ్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. మధ్యవర్తిత్వ తీర్పు ఏకపక్షమని హెచ్‌సీఏ తరఫున సీనియర్ న్యాయవాది రాజాశ్రీపతి వాదనలు వినిపించారు. దీన్ని వాణిజ్య న్యాయస్థానం ముందు సవాలు చేశామని, ఇదే సమయంలో విశాఖ ఇండస్ట్రీస్ వేరొక చోట ఎగ్జిక్యూషన్ పిటిషన్ వేసిందన్నారు. దాని ఫలితంగా అటాచ్‌మెంట్ ఆర్డర్ వచ్చిందని చెప్పారు. విశాఖ ఇండస్ట్రీస్ తరఫున సీనియర్ న్యాయవాది సునీల్ వాదనలు వినిపిస్తూ.. 2016లో మధ్యవర్తిత్వ తీర్మానం ఆమోదించగా, ఏడేళ్లుగా ఈ తతంగం కొనసాగుతోందని.. విశాఖ ఇండస్ట్రీస్‌కు చెల్లించకుండా ఉండేందుకు హెచ్‌సీఏ ఉద్దేశపూర్వకంగానే విస్మరించిందని చెప్పారు. వాదనలు విన్న ధర్మాసనం.. విశాఖ ఇండస్ట్రీస్‌కు అనుకూలంగా ఇచ్చిన మధ్యవర్తిత్వ తీర్పులో భాగంగా హెచ్‌సీఏ రూ.17.5 కోట్లు డిపాజిట్ చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది.

ఇషాసింగ్‌ను ప్రశంసించిన సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్ : చైనాలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో తెలంగాణ క్రీడాకారిణి ఇషాసింగ్ మరో రెండు సిల్వర్ మెడల్స్ సాధించడం పట్ల ముఖ్యమంత్రి కేసీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఎయిర్ పిస్టల్ షూటింగ్ విభాగంలో రెండు వెండి పతకాలు గెలిచి, ఆసియా క్రీడల్లో వరుసగా మొత్తం నాలుగు పతకాలు దక్కించుకున్న క్రీడాకారిణిగా ఇషా చరిత్ర సృష్టించిందని సీఎం ప్రశంసించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకుంటూ ఆసియా క్రీడల్లో ఇషాసింగ్ రాణిస్తూ, తెలంగాణతో పాటు దేశఖ్యాతిని మరోమారు చాటిందన్నారు.

నిమ్స్‌ను సందర్శించిన నిజాం మనవడు



సాక్షి, సిటీబ్యూరో: నిజాం మనవడు నవాబ్ నజీఫ్ అలీ ఖాన్ శుక్రవారం నిమ్స్ ఆసుపత్రిని సందర్శించారు. పిల్లల గుండె శస్త్ర చికిత్సల శిబిరాన్ని విజయవంతం చేసినందుకు నిమ్స్ డైరెక్టర్ బీరప్పను అభినందించారు. యూకే నుంచి వచ్చిన కార్డియోథెరపిక్ వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. పేద రోగులు, సమాజానికి ప్రయోజనం చేకూరేలా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ విభాగం ఇంచార్జ్, ఆర్ఎంఓ డాక్టర్ సల్మాన్ పాల్గొన్నారు.

సాక్షి రియల్టీ

మాల్స్ అదుర్స్



- పుంజుకుంటున్న రిటైల్ రంగం
- ఈ ఏడాది 55–60 లక్షల చ.అ. లీజు

సాక్షి, హైదరాబాద్: కరోనా మహమ్మారి ప్రభావం రిటైల్ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపించింది. దీంతో షాపింగ్ మాల్స్ విలవిల్లాడిపోయాయి. ఆన్‌లైన్ కొనుగోళ్ల వృద్ధి చూశాక ఇక ఆఫ్‌లైన్‌లోని రిటైల్ రంగం కోలుకోవడం కష్టమేమో అనిపించింది. కానీ, ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. కరోనా ప్రభావం నుంచి షాపింగ్ మాల్స్ శరవేగంగా కోలుకున్నాయి. మాల్స్‌లోని రిటైల్ దుకాణాలలో కొనుగోలుదారుల సందడి, మల్టిప్లెక్స్‌లలో వీక్షకుల తాకిడి పెరగడంతో మాల్స్ నిర్వాహకులలో కొత్త ఉత్సాహం నెలకొంది. మరోవైపు దేశవ్యాప్తంగా కొత్త షాపింగ్ మాల్స్ వస్తున్నాయి.

- షాపింగ్ మాల్స్, హైస్ట్రీట్‌లలో వాణిజ్య కార్యకలాపాలు పెరిగాయి. ఈ ఏడాది ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో రిటైల్ లీజులు 137 శాతం పెరిగాయని సీబీఆర్ఈ నివేదిక వెల్లడించింది. అయితే రిటైల్ మార్కెట్ పరిమాణం ఇంకా పెరగాల్సి ఉందని, ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్ రిటైల్ రంగం చాలా వెనకబడి ఉంది.
- ఫ్యాషన్, హోమ్‌వేర్, డిపార్ట్‌మెంటల్ స్టోర్స్ వంటి రిటైలర్ల డిమాండ్‌ను బట్టి షాపింగ్ మాల్స్‌లో లీజు లావాదేవీలు జరుగుతుంటాయి. ఈ ఏడాది ముగింపు నాటికి దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాలలో రిటైల్ లీజులు 17–28 శాతం మేర పెరిగి 55–60 లక్షల చ.అ.లకు చేరుతుందని అంచనా వేసింది. 20 19లో అత్యధికంగా 68 లక్షల చ.అ. లీజు లావాదేవీ లు జరిగాయి. 2021లో 39 లక్షలు, 2022లో 47 లక్షల చ.అ. రిటైల్ లీజు కార్యకలాపాలు పూర్తయ్యాయి.
- హైదరాబాద్‌లో పలు ప్రాంతాలలో షాపింగ్ మాల్స్ నిర్మాణం తుదిదశలో ఉన్నాయి. డిమాండ్ ఉన్న ప్రాంతాలలో నిర్మాణం పూర్తికాకముందే లీజులు జరుగుతున్నాయి. గత ఏడాది డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండటంతో పూర్తయ్యే దశకు చేరినా లీజు లావాదేవీలు ఆశించిన స్థాయిలో జరగలేదు. అయితే ఈ ఏడాది కొంత సానుకూల వాతావరణం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు నగరంలో 2.5 లక్షల చ.అ. రిటైల్ స్థల లీజు లావాదేవీలు జరిగాయి. గత ఏడాది ఇదే కాలంలో కేవలం లక్ష చ.అ. స్థలం మాత్రమే లీజుకు పోయింది. రిటైల్ లీజులలో స్టోర్‌ల వాటా 33 శాతం ఉండగా.. ఫ్యాషన్, అపరెల్స్ షోరూమ్‌ల వాటా 30 శాతం, ఫుడ్ కోర్టుల వాటా 11 శాతంగా ఉంది.

నగర వార్తలు

కేంద్ర ఎన్నికల బృందం రాక కోసం ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అక్టోబర్ 3, 4, 5 తేదీల్లో రాష్ట్రంలో కేంద్ర ఎన్నికల బృందం పర్యటించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్, జాయింట్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్, కలెక్టర్ హరీశ్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి మాదాపూర్‌లోని టెక్ మహీంద్రాలో నిర్వహించే సమావేశాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపై అక్టోబర్ 4న ఉదయం 6 గంటలకు కేంద్ర ఎన్నికల బృందం సహకారంతో నిర్వహించే సైకిల్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలించారు.

పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్, ఏఐజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

గచ్చిబౌలి: ఉదయాన్నే తిండి తినకుండా చెత్తలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. వరల్డ్ హార్ట్ డే ను పురస్కరించుకొని శుక్రవారం గచ్చిబౌలిలోని సంధ్య కన్వెన్షన్‌లో 500 మంది జీహెచ్‌ఎంసీ కార్మికులకు ఉచితంగా గుండె పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వచ్చిన జీతంలో 50 నుంచి 60 శాతం వైద్య ఖర్చులకే పోతుందన్నారు. ఏఐజీ హాస్పిటల్ జీహెచ్‌ఎంసీ కార్మికుల వైద్యం కోసం ముందుకు రావడం అభినందనీయమన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 25 వేల మంది కార్మికులు పని చేస్తున్నారని, ఇన్సూరెన్స్ ద్వారా వైద్య ఖర్చులు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. జబ్బులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం ప్రతి ఒక్కరికి అవసరమన్నారు. ఏఐజీ ఆస్పత్రి చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను బెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్న జీహెచ్‌ఎంసీ కార్మికుల ఆరోగ్యాన్ని ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. 500 మంది కార్మికులకు పరీక్షలు చేయగా 20 శాతం మందికి రక్తహీనత, 10 శాతం మందికి గుండె సమస్యలున్నాయని తెలిపారు. ఏఐజీ కార్డియాలజీ విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ రాజీవ్ మీనన్ మాట్లాడుతూ బీపీ, షుగర్, కొలెస్ట్రాల్ వల్ల అన్ని వయస్సుల వారిలో గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందన్నారు. స్మోకింగ్, గుట్కా మానేయాలని, చెక్కర కలిపిన పదార్థాలను తినవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఐజీ డైరెక్టర్ డాక్టర్ జి.వి.రావు, వెస్ట్ జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ఫీవర్ ఆస్పత్రిలో రోగి మృతి

- వైద్యులు సకాలంలో స్పందించలేదని బంధువుల ఆరోపణ
- అందుబాటులో ఉండని డీఎంవోలు
- ఆలస్యంగా విధులకు హాజరవుతున్న డాక్టర్లు
- పట్టించుకోని ఉన్నతాధికారులు

నల్లకుంట: ధర్మాసుపత్రిగా పేరుగాంచిన నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా చికిత్స కోసం వచ్చిన ఓ రోగి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే..సికింద్రాబాద్ బన్సీలాల్ పేటకు చెందిన మల్లేష్(40) తీవ్ర జ్వరంతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు అతడి శుక్రవారం ఉదయం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రికి తీసుకు వచ్చారు. ఆ సమయంలో ఓపీ చీటీలు ఇచ్చే సిబ్బందితో పాటు అసుపత్రి ఎమర్జెన్సీ ఓపీలో వైద్యులెవరూ అందుబాటులో లేరు. కేవలం నర్సింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారని, ఆసుపత్రిలో డ్యూటీ మెడికల్ ఆఫీసర్(డీఎంవో) కూడా అందుబాటులో లేడని సమాచారం. చాలా సేపు అక్కడే నిరీక్షించిన అతను ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. 8.30 గంటలకు మార్నింగ్ షిఫ్ట్ డ్యూటీకి వచ్చిన ఓ వైద్యురాలు ఈ విషయం తెలుసుకుని అపస్మారక స్థితిలో ఉన్న రోగిని పరీక్షించగా హై బీపీ ఉన్నట్లు గుర్తించింది. అదే సమయంలో కార్డియాక్ అరెస్టు కావడంతో రోగి పరిస్థితి మరింత విషమించింది. దీంతడో సీపీఆర్ చేసినప్పటికీ ప్రయోజనం లేక పోవడంతో ఎమర్జెన్సీ ఓపీకి తరలించగా కొద్దిసేపటికే అతను మృతి చెందాడు. వైద్యులు అందుబాటులో ఉండి సకాలంలో స్పందించి సరైన వైద్యం అందించి ఉంటే అతడి ప్రాణాలు దక్కేవని రోగి బంధువులు ఆరోపిస్తున్నారు.

సమయ పాలన పాటించని వైద్యులు..!

ఫీవర్ ఆసుపత్రి ఎమర్జెన్సీ ఓపీలో ఎల్లవేళలా రోగులకు ఓ డీఎంవో అందుబాటులో ఉండాలి. అయితే అధికారుల అలసత్వం, పర్యవేక్షణాలోపం కారణంగా డ్యూటీలో ఉండాల్సిన వైద్యులు ఎమెర్జెన్సీ ఓపీని నర్సింగ్ సిబ్బందికి వదిలేసి విశ్రాంతి గదులకే పరిమితమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఓపీ విధులకు హాజరు కావాల్సిన వైద్యులు కొందరు గదులకే పరిమితమవుతున్నారే విమర్శలు ఉన్నాయి.

సకాలంలో స్పందించాం

ఆసుపత్రిలో ఓపీ విభాగంలో రౌండ్ ద క్లాక్ ఓ డీఎంవో అందుబాటులో ఉంటారు. శుక్రవారం ఉదయం అనారోగ్యంతో ఫీవర్ ఆసుపత్రికి వచ్చిన వ్యక్తిని ఆ సమయంలో డ్యూటీలో ఉన్న డాక్టర్ రాజేశ్వరి పరీక్షించారు. అతనికి బీపీ ఎక్కువగా ఉండటంతో కార్డియాక్ అరెస్టుకు గురయ్యాడని గుర్తించిన ఆమె అతడికి సీపీఆర్ చేశారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో అతను మృతి చెందాడు. చికిత్స అందించడంలో వైద్యుల ఆలస్యం చేశారనేది అవాస్తవం.

– డాక్టర్ చంద్రశేఖర్, డిప్యూటీ ఆర్ఎంవో

మృతురాలి ఆచూకీ లభ్యం

- మేడిబావికి చెందిన వరలక్ష్మిగా గుర్తింపు
- కుటుంబసభ్యులకు మృతదేహం అప్పగింత

బౌద్ధనగర్: ప్రమాదవశాత్తు నాలాలో పడి మృతి చెందిన మహిళ వివరాలను ఎట్టకేలకు పోలీసులు తెలుసుకుని శుక్రవారం మృతదేహాన్ని ఆమె బంధువులను అప్పగించారు.వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ శంకర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడిబావికి చెందిన వరలక్ష్మి అలియాస్ వెంకటమ్మ(50) ఇళ్లలో పని చేసేది. ఈమెకు ముగ్గురు కుమార్తెలు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కూతురితో కలిసి అద్దె ఇంట్లో నివాసముం ఉంటోంది. గురువారం సాయంత్రం వరలక్ష్మి అన్నానగర్ ప్రాంతంలో నడిచి వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి నాలాలో పడి కొట్టుకుపోయింది. మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న ఎల్ఎన్ నగర్‌లోని నాలాలో శవమై తేలింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతురాలి వివరాలు తెలుసుకునేందుకు గురువారం రాత్రి నుంచి అన్ని గ్రూపుల్లో పోస్టులు చేయగా, విషయం తెలుసుకున్న మృతురాలి కుటుంబసభ్యులు శుక్రవారం ఉదయం వారాసిగూడ పోలీసులను సంప్రదించారు. పోస్టుమార్టం అనంతరం, మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.



వరలక్ష్మి(ఫైల్)

వైద్య విద్యార్థుల ప్రయోగాల కోసం శరీరదానం



బంజారాహిల్స్: చిత్ర పరిశ్రమలో పీఆర్ఓగా పని చేస్తున్న గొట్టిపాటి శ్రీధర్‌చౌదరి(57) అనారోగ్యంతో బంజారాహిల్స్‌లోని విరించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం కన్నుమూశారు. ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యుల సూచనల మేరకు మెడిసిటీ వైద్య కళాశాలకు అందజేశారు. ఆయన బతికుండగానే వైద్య ప్రయోగాల కోసం శరీర దానం చేస్తూ నగరానికి చెందిన అమ్మ నేత్ర అవయవ శరీరదాన ప్రోత్సాహకుల సంఘానికి దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు సంఘ సభ్యుల సమక్షంలో మెడిసిటీ మెడికల్ కాలేజీకి శరీరాన్ని అందజేశారు. శరీర దానం గొప్ప కార్యక్రమమని దాతలు మరణం తర్వాత కూడా సమాజానికి ఉపయోగకరమైన సేవలు అందిస్తారని సంఘం అధ్యక్షుడు గంజి ఈశ్వరలింగం పేర్కొన్నారు.

ఆటోను ఢీకొన్న కారు చిన్నారి మృతి

శంషాబాద్ రూరల్: రహదారిపై ఆటోను కారు ఢీకొనడంతో చిన్నారి మృతి చెందింది. ఇన్‌స్పెక్టర్ శ్రీధర్‌కుమార్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. వనపర్తి జిల్లా, చెవులతండాకు చెందిన మెగావత్ భీముడు, మధు నగరానికి వలసవచ్చి జీడిమెట్ల ప్రాంతంలో నివాసముంటున్నారు. వీరికి ఏడాదిన్నర కుమార్తె కావ్యశ్రీ ఉంది. భీముడు ఫ్లిప్‌కార్టులో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్నాడు. నాలుగు రోజుల క్రితం స్వగ్రామానికి వెళ్లిన వీరు ఈ నెల 28న హైదరాబాద్ బయలుదేరారు. తన బావ మున్యకు చెందిన ఆటోలో చెల్లెలు, వారి పిల్లలతో పాటు భార్య, చిన్నారి కూడా ఉన్నారు. పాల్మాకుల సమీపంలో వెనక నుంచి వేగంగా వచ్చిన కారు వీరి ఆటోను ఢీకొనడంతో ఆటో బోల్తాపడి అందులో ఉన్న మధు, చిన్నారి కావ్యశ్రీకి గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే కావ్యశ్రీ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

5న కృష్ణాబోర్డు భేటీ

సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలపై నిర్ణయం తీసుకునేందుకు త్వరలోనే కృష్ణా బోర్డు సమావేశం కానుంది. అక్టోబర్ 5న బోర్డు త్రిసభ్య కమిటీ హైదరాబాద్ వేదికగా సమావేశమవుతుందని తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుల ద్వారా తెలంగాణ, ఏపీ పెట్టిన ఇండెంట్ మేరకు నీటి విడుదల అంశంపై చర్చించి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. సుమారు 32 టీఎంసీల నీటి విడుదలకు ఇప్పటికే ఏపీ ఇండెంట్ పెట్టగా, త్వరలోనే తెలంగాణ కూడా బోర్డుకు తమ ఇండెంట్ సమర్పించనుంది.

సర్‌చార్జి రూ.1.98కి మించి వసూలు చేయొద్దు

సాక్షి, హైదరాబాద్: ఓపెన్ యాక్సెస్ విద్యుత్ కొనుగోళ్లలో అదనపు సర్‌చార్జీ కింద యూనిట్‌కు రూ.1.98కు మించి వసూలు చేయవద్దని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసింది. అదనపు సర్‌చార్జీ కింద యూనిట్‌కు రూ.3.43 వసూలు చేసుకునేందుకు అనుమతినివ్వాలని డిస్కమ్‌లు జారీ చేసిన పిటిషన్‌పై ఈఆర్సీ చైర్మన్ టి.శ్రీరంగారావు, సభ్యులు మనోహర్‌రాజు, బండారు కృష్ణయ్యలు శుక్రవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రత్యక్ష పద్ధతిలో లష్కర్లు, హెల్పర్ల నియామకం

ఇరిగేషన్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ సబార్డినేట్ రూల్స్ విడుదల

సాక్షి, హైదరాబాద్: నీటి పారుదల శాఖలోని లష్కర్లు, హెల్పర్ల నియామకానికి సంబంధించిన సబార్డినేట్ రూల్స్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. తెలంగాణ ఇరిగేషన్ ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (అన్‌స్కిల్డ్) సబార్డినేట్ రూల్స్–2023 పేరుతో శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వుల మేరకు ఇక నుంచి ప్రత్యక్ష పద్ధతిలోనే లష్కర్లు, హెల్పర్లను నియమించనున్నారు. నియామకం తర్వాత మూడేళ్లలో రెండేళ్ల పాటు ప్రొబేషన్ వర్తించనుండగా, క్రమం తప్పకుండా వీరికి శిక్షణ కూడా ఇవ్వనున్నారు. రెవెన్యూ శాఖ నుంచి వీఆర్‌వోలు నీటిపారుదల శాఖలో విలీనమైన నేపథ్యంలో ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది.

హైదరాబాద్ చేరిన బీఆర్‌ఎస్ 'అసమ్మతి'

మంత్రి హరీశ్‌తో అసమ్మతి నేతల చర్చలు

ఇల్లెందు: ఇల్లెందు నియోజకవర్గ బీఆర్‌ఎస్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే హరిప్రియకు కాకుండా ఇంకెవరికైనా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న అసమ్మతి నేతల పంచాయితీ హైదరాబాద్‌కు చేరుకుంది. గతేడాది ఆగస్టు 19న ఇల్లెందులో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఎమ్మెల్యే విషయంలో అసమ్మతి తెలిపారు. నాటి నుంచి పలువురు ఎమ్మెల్యే టికెట్ హరిప్రియకు కాకుండా ఇంకెవరికైనా ఇవ్వాలని పట్టుపడుతున్నారు. ఈ విషయమై చర్చించేందుకు మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావును అపాయింట్‌మెంట్ కోరుతున్నారు. ఈనేపథ్యంలో మరిపెడలో గురువారం జరిగిన కార్యక్రమాలకు హాజరైన మంత్రి హరీశ్‌రావును ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే హరిప్రియ కలిసి అసమ్మతి నేతలతో చర్చించి చక్కదిద్దాలని కోరారు. దీంతో శుక్రవారం హైదరాబాద్‌కు రావాలని మంత్రి హరీశ్‌రావు నుంచి సూచనలు రావడంతో శుక్రవారం ఉదయం మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి పులిగళ్ల మాధవరావు, బయ్యారం సొసైటీ చైర్మన్ మూల మధుకర్‌రెడ్డి తదితర నేతలు హైదరాబాద్‌కు వెళ్లారు. వీరంతా హరిప్రియకు అనుకూలంగా పని చేయలేమని, ఆమెకు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని చెబుతున్నారు. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావుతో జరిగే చర్చల్లో ఏం తేలుతుంది, అసమ్మతి నేతలు ఎమ్మెల్యే అభ్యర్థికి సహకరిస్తారా, లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.

బీజేపీకి సోమారపు రాజీనామా!

సాక్షి, పెద్దపల్లి: మాజీ ఎమ్మెల్యే, బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు సోమారపు సత్యనారాయణ ఆ పార్టీకి రాజీనామా చేసే యోచనలో ఉన్నట్లు సమాచారం. రాష్ట్రంలో బీజేపీకి రోజురోజుకూ తగ్గుతున్న ఆదరణ, కార్యకర్తల ఒత్తిడి మేరకు పార్టీని వీడేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ టికెట్ ఇస్తే.. ఆ పార్టీ తరపున పోటీకి సోమారపు ఆసక్తి చూపుతుండగా, కార్యకర్తలు, అనుచరులు ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తుపై పోటీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. మరోవైపు.. నామినేటెడ్ పోస్టు ఇస్తామని బీఆర్‌ఎస్ నుంచి ఆఫర్ వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో సోమారపు ఏ పార్టీలో చేరతారనేది చర్చనీయాంశంగా మారింది. ఇదే విషయమై సోమా రపు సత్యనారాయణను ఫోన్‌లో సంప్రదించగా.. ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేద న్నారు.

బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా పార్థసారథి

సాక్షి, న్యూఢిల్లీ: బీజేపీ తెలంగాణ ఓబీసీ మోర్చా ఇన్‌చార్జిగా ఏపీకి చెందిన డాక్టర్ పార్థసారథి నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఈ ప్రత్యేక బాధ్యతలను అధిష్టానం అప్పగించింది. తనపై నమ్మకం ఉంచి నూతన బాధ్యతలు అప్పగించిన బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె.లక్ష్మణ్, ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, సంఘటనా కార్యదర్శి మధుకర్‌కు పార్థసారథి ధన్యవాదాలు తెలిపారు.


ఆమెపై ఆగని అకృత్యాలు

2011	2021
2,28,650	4,28,478

- భారత్‌లో పెరుగుతున్న గృహ హింస, వేధింపులు, వివక్ష.. ఉత్తరాది రాష్ట్రాలు, పశ్చిమబెంగాల్‌లో ఎక్కువగా అఘాయిత్యాలు
- కేంద్ర నేర గణాంక సంస్థ నివేదికలో ఆందోళనకర అంశాలు.. ప్రపంచవ్యాప్తంగా కూడా మహిళలపై పెరుగుతున్న నేరాలు
- ఇటీవలి నివేదికలో డబ్ల్యూహెచ్‌వో ఆందోళన

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ఆకాశంలో సగం, అవకాశాల్లో సగం అని గొప్పగా చెప్తున్నా.. ఆధునికంగా ప్రపంచం ఎంత వేగంగా ముందుకు పయనిస్తున్నా.. మహిళలపై వేధింపులు, హింస తగ్గడం లేదు. వివక్ష అంతరించడం లేదు. పరువు హత్యలు, వరకట్న హత్యలు, అత్యాచారాలు, వేధింపులు.. ఎక్కడా మహిళలకు రక్షణ లేని దుస్థితి. తాజాగా మధ్యప్రదేశ్ రాజధాని ఉజ్జయినిలో జరిగిన సంఘటన దీనికి మరో నిదర్శనం. అత్యాచారానికి గురైన పన్నెండేళ్ల బాలిక భయంతో వణికిపోతూ, అర్ధనగ్నంగా కిలోమీటర్ల దూరం సాయం కోసం పరుగెత్తడం.. సమాజం తలదించుకోవాల్సిన పరిస్థితి. మణిపూర్‌లో ఇద్దరు మహిళలపై అత్యాచారం చేసి నగ్నంగా ఊరేగించిన ఘటనా ఇలాంటిదే. పోలీసు వ్యవస్థ ఎంత ఆధునిక పోకడలు పోతున్నా.. దేశంలో ఇంకా అనాగరిక దుష్కృత్యాలు కొనసాగడం ఆందోళనకరం.



2011-2021 మధ్య 87 శాతం పెరుగుదల..

గత దశాబ్దంలో మహిళలపై హింసాత్మక సంఘటనలు దాదాపు 87 శాతం మేర పెరగడం ఏ అభివృద్ధికి సంకేతమన్న అభిప్రాయాలు నెలకొన్నాయి. మన దేశంలోనేగాక ప్రపంచవ్యాప్తంగా మహిళలపై హింస/వేధింపులు కొనసాగడంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ) గణాంకాల ప్రకారం.. పోలీస్‌స్టేషన్లలో నమోదైన కేసుల సంఖ్య ఆధారంగానే 2011లో 2,28,650 మంది మహిళలపై హింసాత్మక ఘటనలు జరిగితే.. 2021నాటికి ఈ సంఖ్య 4,28,478కు అంటే.. 87శాతం మేర పెరగడం ఆందోళనకరం. అయితే దీనిని పోలీసు యంత్రాంగం మరో విధంగా చూస్తున్నట్టు సమాచారం. గతంలో మహిళలు కేసులు పెట్టడానికి ముందుకు వచ్చేవారు కాదని.. పెరిగిన విద్యావకాశాలు, పోలీసుల ఔట్‌రీచ్ కారణంగా ముందుకొచ్చి కేసులు పెడుతున్నారని అభిప్రాయం వ్యక్తం చేస్తుండటం గమనార్హం. దేశ మహిళా జనాభాలో 7.5శాతం పశ్చిమ బెంగాల్‌లో ఉంటే.. అక్కడ మహిళలపై జరిగిన నేరాలు 12.7 శాతమని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మహిళలు హింసను భరించాలని దేశంలోని దాదాపు 65శాతం మంది పురుషులు అభిప్రాయంతో ఉన్నారని 'ఇంటర్నేషనల్ మెన్ అండ్ విమెన్ జెండర్ ఈక్వాలిటీ సర్వే (ఇమేజెస్)'స్పష్టం చేసింది. కుటుంబం కలసి ఉండాలంటే మహిళలు ఈ హింసను భరించాల్సిందేనన్న ధోరణి ప్రమాదకరంగా మారుతోందని పేర్కొంది. ఇక గృహ హింసకు సంబంధించి కుటుంబ పరువు పేరిట చాలా వరకు మహిళలు కేసులు పెట్టడం లేదని నిపుణులు చెప్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం.. ప్రపంచ మహిళా జనాభాలో కనీసం 33.7% మంది ఏదో ఒక సమయంలో నేరాలు/వేధింపులకు గురైనవారే.

వరకట్నం కోసం దారుణాలు

భారత్, పాకిస్థాన్, బంగ్లాదేశ్, ఇరాన్‌లలో వరకట్న హత్యలు అధికంగా జరుగుతున్నట్టు నివేదికలు చెప్తున్నాయి. మన దేశంలో ఉత్తరప్రదేశ్ వరకట్న హత్యల్లో మొదటి స్థానంలో ఉంది. 2021లో దేశవ్యాప్తంగా వరకట్న హత్యలు 3.85 శాతం తగ్గాయని ఎన్‌సీఆర్‌బీ-2021 గణాంకాలు పేర్కొంటున్నాయి. 2020లో 6,843 వరకట్న హత్యలు జరిగితే, 2021లో 6,589 మంది ఈ దారుణానికి బలయ్యారు. ఇందులోనూ ఉత్తరప్రదేశ్ 2,222 హత్యలతో అగ్రస్థానంలో ఉంది. దీనికితోడు వరకట్నం కోసం పెట్టే వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్న మహిళలు పెద్ద సంఖ్యలో ఉన్నారు.

పరువు పేరిట హత్యలెన్నో..

దేశంలో ఇటీవలి కాలంలో పరువు హత్యలు పెరిగిపోయాయి. కుటుంబ పెద్దల అంగీకారం లేకుండా ప్రేమించి కుల, మతాంతర వివాహాలు చేసుకుంటున్నవారిని.. పరువుకు భంగం కలిగించారనే భావనతో వారి కుటుంబాలే హత్య చేయిస్తున్నాయి. ఉత్తరాది రాష్ట్రాల్లో అయితే ఖాప్ పంచాయతీలు నిర్వహించి మరీ మరణ శాసనాలు లిఖిస్తున్నారు. ప్రధానంగా ఉత్తరప్రదేశ్, హరియాణా, రాజస్థాన్, బీహార్, జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నాయి. తెలంగాణ సహా దక్షిణాది రాష్ట్రాల్లోనూ ఇలాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి.

అత్యాచార దారుణాలు..

మహిళలు, బాలికలపై అత్యాచార ఘటనలూ దారుణంగా పెరుగుతున్నాయి. ఎన్‌సీఆర్‌బీ గణాంకాల ప్రకారం.. గత దశాబ్దకాలంలో ఇలాంటి దారుణాలపై కేసులు బాగా పెరిగాయి. 2008లో దేశంలో 21,467 అత్యాచార కేసులు నమోదవగా.. 2021లో ఈ సంఖ్య 31,677కు పెరిగింది.

జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదులు కూడా..

తమపై వేధింపులకు సంబంధించి జాతీయ మహిళా కమిషన్‌కు వస్తున్న ఫిర్యాదులూ పెరిగాయి. 2022లో మొత్తం 33,906 నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి. ఇందులో అత్యధికంగా ఒక్క ఉత్తరప్రదేశ్ నుంచే 54.5 శాతం ఫిర్యాదులు ఉండగా.. తర్వాతి స్థానాల్లో ఢిల్లీ, మహారాష్ట్ర, బిహార్, హరియాణా వంటి రాష్ట్రాలు ఉన్నాయి.

ప్రజల్లో చైతన్యం పెరిగితేనే ప్రయోజనం



వి.సంధ్య
సామాజిక కార్యకర్త, పీవోడబ్ల్యూ

దేశంలో మహిళలపై అకృత్యాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో మహిళలపై హింస మరింత పెరిగి క్రూరమైన రూపాలను సంతరించుకుంటోంది. కరోనా లాక్‌డౌన్ కాలంలో స్త్రీలపై హింస విపరీతంగా పెరిగినట్టు మేం గమనించాం. మతం పేరిట, ఇతర రూపాల్లో ద్వేషం, విషపూరిత వాతావరణం నెలకొని గతంలోని స్నేహపూర్వక పరిస్థితి లేకుండా పోయింది. ఇది అన్నిరకాల హింసలకూ దారితీస్తోంది. నిర్భయ చట్టం తీసుకొచ్చినపుడు.. స్త్రీల హక్కులేమిటి? వారిపై హింసకు ఎందుకు పాల్పడకూడదన్న అంశాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం రూ.వెయ్యికోట్లు కేటాయించింది. ఇప్పుడైతే మహిళల హక్కులు అనే స్పృహ లేకుండా చేస్తున్నారు. మహిళలకు సంబంధించిన రంగాలు, అంశాలపై బడ్జెట్ కేటాయింపులను కూడా తగ్గించడం దురదృష్టకరం. మహిళలపై ఎలాంటి దాడులకు పాల్పడినా తమకేమీ కాదులే అన్న మొండి ధైర్యం హింసకు దారితీస్తోంది. చట్టాలను అమలుచేయాల్సిన పోలీసు, ఇతర వ్యవస్థలు అవినీతితో పారదర్శకతను కోల్పోతున్నాయి. ప్రజల్లో చైతన్యం పెరిగినప్పుడే చట్టాలను అమలు చేసేందుకు ప్రభుత్వాలు దిగొస్తాయి.

రెండు రోజుల్లో నిర్ణయం వెల్లడిస్తా: ఎమ్మెల్సీ కసిరెడ్డి

పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరే యోచన

ఆమనగల్లు: పార్టీ మార్పుపై ప్రజాభీష్టం, మద్దతుదారుల సూచన ప్రకారం రెండురోజుల్లో తన నిర్ణయం ప్రకటిస్తానని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణ రెడ్డి ప్రకటించారు. బీఆర్‌ఎస్ తరపున కల్వకుర్తి అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడ్డ ఆయన కొద్దిరోజులుగా అసంతృప్తిగా ఉన్నారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శుక్రవారం సాయంత్రం తన అనుచరులు, బీఆర్‌ఎస్ కార్యకర్తలు, నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనుచరులు, అభిమానులు, నాయకుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అందరూ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తనతో కలిసి రావాలని కోరారు. కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏనాడూ నియోజకవర్గాన్ని పట్టించుకోలేదని, దీంతో ఇక్కడ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని మండిపడ్డారు. అంతకుముందు కడ్తాల మండలం మైసిగండి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఎమ్మెల్సీ పదవికి రాజీనామా

కసిరెడ్డి నారాయణరెడ్డి ఒకటి రెండు రోజుల్లో ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి కల్వకుర్తి నుంచి పోటీదిగే అవకాశమున్నట్లు తెలుస్తోంది. కసిరెడ్డి పార్టీని వీడకుండా మంత్రి కేటీఆర్ ప్రయత్నం చేసినప్పటికీ ఫలించలేదు. తన భవిష్యత్తు కన్నా నమ్ముకున్న కార్యకర్తలే తనకు ముఖ్యమని ఆయన చెప్పారు. కాగా కొత్తగా వచ్చిన వారికి టికెట్లు ఇస్తే పార్టీనే నమ్ముకుని ఏళ్ల తరబడి పనిచేస్తున్న తమ పరిస్థితి ఏమిటని పలువురు కాంగ్రెస్ నాయకులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

వేణుగోపాల్‌తో బీసీ నేతల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: అసెంబ్లీ ఎన్నికల సీట్ల కేటాయింపు విషయంలో తమకు న్యాయమైన వాటా ఇవ్వాలన్న డిమాండ్‌తో ఢిల్లీలో పర్యటిస్తున్న తెలంగాణ బీసీ నేతల బృందం శుక్రవారం ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలోని 17 పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఒక్కో నియోజకవర్గంలో 2 సీట్ల చొప్పున కనీసం 34 అసెంబ్లీ స్థానాలు బీసీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. టికెట్ల పరిశీలన జరుగుతోందని...బీసీలకు సాధ్యమైనన్ని ఎక్కువ స్థానాలు ఇవ్వడానికి కృషి చేస్తామని వేణుగోపాల్ హామీ ఇచ్చారు. సీనియర్ నేతలు వి.హనుమంతరావు, పొన్నాల లక్ష్మయ్య, మహేశ్ కుమార్ గౌడ్, షబ్బీర్ అలీ, మాజీ ఎంపీలు మధు యాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్ సహా ఇతర నేతలు కేసీతో జరిగిన భేటీలో పాల్గొన్నారు.

..గ్యారంటీని నమ్మొద్దు



మంత్రులు కేటీఆర్, నిరంజన్‌రెడ్డి సమక్షంలో షాదీఖానా భవనాన్ని ప్రారంభిస్తున్న మహిళ




వనపర్తిలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో జరిగిన బహిరంగ సభకు హాజరైన ప్రజలు

▶ మొదటి పేజీ తరువాయి

క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన 'వనపర్తి పదేళ్ల ప్రగతి మహాసభ'లో కేటీఆర్ ప్రసంగించారు. బీఆర్‌ఎస్‌ను నమ్మి పదేళ్ల అధికారం ఇస్తే అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగాన నిలిపి చూపించామని చెప్పారు. బీఆర్‌ఎస్ వచ్చాకే సాగునీటితో పాలమూరు పచ్చబడిందన్నారు. కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే.. మళ్లీ మూడు గంటల కరెంటు, తాగునీటి కోసం కుళాయిల వద్ద మహిళల కొట్లాటలు చూడాల్సి వస్తుందని, ఏడాదికో సీఎం మారుతూ.. ఢిల్లీ నుంచి సీల్డ్ కవర్‌లో రాష్ట్రానికి సీఎంలు దిగుమతి అవుతారన్నారు. కృష్ణానది నీటిలో రాష్ట్రానికి దక్కాల్సిన న్యాయమైన వాటా 575 టీఎంసీలను కేటాయిస్తామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం పాలమూరులో నిర్వహించనున్న సభలో హామీ ఇవ్వాలని మంత్రి కేటీఆర్ డిమాండ్ చేశారు. కృష్ణా నీటిలో రాష్ట్రవాటా తేల్చాలని ఎన్నిసార్లు రాష్ట్ర ప్రభుత్వం తరపున లేఖలు రాసినా, కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవటం తెలంగాణపై వారికున్న కక్ష్య సాధింపునకు నిదర్శనమేనన్నారు. రాష్ట్రంలో ఎన్నికలొస్తున్న సమయంలో ఓట్ల కోసం ప్రధాని నరేంద్రమోదీ మాయగాడి పర్యటనలు చేసేందుకు వస్తున్నారని విమర్శించారు. ఎగువన ఉన్న కర్ణాటక అప్పర్‌భద్రకు జాతీయహోదా కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మాణం చేపట్టిన పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయహోదా కల్పించటంలో వివక్ష చూపిస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను ఒకేలా చూడాలని కానీ తెలంగాణ ప్రస్తావన వచ్చే సరికి 'తల్లిని చంపి బిడ్డను వేరు చేశారు' అంటూ నిర్దయ వ్యాఖ్యలు చేస్తారని, తెలంగాణ సమాజం ఈ విషయాన్ని గమనించి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఎంపీల మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయలేని పరిస్థితి రావాలన్నారు. వాల్మీకిలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిస్తే.. కనీసం ఆ విషయాన్ని ఇప్పటి వరకు పట్టించుకోలేదని మండిపడ్డారు. అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామి జిల్లాలుగా పేరొందిన సిరిసిల్ల, సిద్దిపేటలను అనుసరిస్తూ.. వాటితో పోటీ పడుతున్నామని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి చెప్పారు. సీఎం కేసీఆర్ అందించిన శక్తి, ప్రోత్సాహంతో దశాబ్దాలుగా చేసిన అభివృద్ధికి మించి పదేళ్లలో వనపర్తిని అభివృద్ధి చేసి చూపించామన్నారు. 2014కు ముందు చెంతనే జీవనది కృష్ణమ్మ ఉన్నా.. సాగునీటి కష్టాలు ఉండేవని, ఈ పదేళ్లలో రెండు గ్రామాలు మినహా వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో కృష్ణానది జల సవ్వడి వినిపించేలా చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు పోతుగంటి రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అబ్రహం, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టుడేస్ గ్రాఫిక్



ఆరు రోజులే

2.5 లక్షల మందితో జాబితా సిద్ధం చేయాలి

- 'గృహలక్ష్మి'లబ్ధిదారుల ఎంపికపై అధికారులకు మౌఖిక ఆదేశాలు..
- శుక్రవారం నాటికి లక్ష మంది లబ్ధిదారుల ఖరారు

సాక్షి, హైదరాబాద్: ఆరు రోజుల్లోనే గృహలక్ష్మి పథకానికి సంబంధించి రెండున్నర లక్షల మంది లబ్ధిదారుల ఎంపిక చేయనున్నారు. వచ్చే నెల ఐదో తేదీ నాటికి మొత్తం మూడున్నర లక్షల మంది లబ్ధిదారుల జాబితా ప్రభుత్వానికి అందాలన్నది ఉద్దేశం. ఈ మేరకు సచివాలయం నుంచి కలెక్టర్లకు మౌఖిక ఆదేశాలు వెళ్లాయి. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోపు ఈ కసరత్తు పూర్తి చేయాలనే అక్టోబర్ 5 డెడ్‌లైన్‌గా పెట్టినట్టు ప్రచారం జరుగుతోంది.

దరఖాస్తులు 15 లక్షలు.. అర్హత ఉన్నవి 11లక్షలు

సొంత జాగా ఉన్నవారికి రూ.3 లక్షలు ఆర్థిక సాయం అందించి.. వారే ఇళ్లు నిర్మించుకునేలా గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. నియోజకవర్గానికి 3 వేల ఇళ్ల చొప్పున రాష్ట్రవ్యాప్తంగా 3.57 లక్షల ఇళ్లు, సీఎం కోటాలో మరో 43 వేల ఇళ్లు మొత్తంగా 4 లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆర్థిక సాయం చేయాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా ఇటీవల కలెక్టర్ల ఆధ్వర్యంలో దరఖాస్తులు ఆహ్వానించగా 15 లక్షల వరకు అందాయి. వాటిల్లో 11 లక్షల దరఖాస్తులు అర్హమైనవిగా ఎంపిక చేశారు. వాటి నుంచి లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయాల్సి ఉంది.

ఏ ఊరు.. ఎవరు లబ్ధిదారులు

నియోజకవర్గంలో ఏఏ ఊళ్ల నుంచి ఎవరెవరిని లబ్ధిదారులుగా ఎంపిక చేయాలనే విషయంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు చొరవ చూపాలని గతంలోనే మౌఖికంగా ఆదేశాలందాయి. ఇప్పుడు అధికారులకు ఎమ్మెల్యేలు అందించే వివరాల ఆధారంగా జాబితాలు రూపొందుతున్నాయి. ఏఏ ప్రాంతాల్లో ఎమ్మెల్యేలు వేగంగా వివరాలు అందిస్తున్నారో, ఆయా ప్రాంతాల్లో జాబితాలు అంత వేగంగా సిద్ధమవుతున్నాయి. శుక్రవారంనాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్ష మందితో జాబితా సిద్ధమైంది. మిగతా లబ్ధిదారుల జాబితా వచ్చే నెల ఐదో తేదీ సాయంత్రం లోపు ఖరారు చేయాలని తాజాగా సచివాలయం నుంచి కలెక్టర్లకు మౌఖికంగా ఆదేశాలందినట్టు తెలిసింది. దీంతో అధికారులు ఆ పనిలో వేగం పెంచారు.

ఇప్పటికీ దరఖాస్తుల స్వీకరణ

గతంలో అందిన దరఖాస్తులే కాకుండా ఇంకా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు తెలిసింది. అందిన దరఖాస్తులు కాకుండా, కొత్త ప్రాంతాల్లో ఇళ్ల కేటాయింపు 'అవసరం'అని భావిస్తే, ఆయా ప్రాంతాల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకొని జాబితాలో పేరు చేరుస్తున్నట్టు సమాచారం. దరఖాస్తులు స్వీకరించేది నిరంతర ప్రక్రియే అన్న మాటతో ఈ తంతు కానిస్తున్నట్టు సమాచారం.

'చెంచు' చిచ్చరపిడుగు

▶ మొదటి పేజీ తరువాయి

దినేష్ దేశంలోనే మొదటిస్థానంలో నిలిచాడు.

దినేష్ బతకడమే కష్టమన్నారు...

నాగర్‌కర్నూల్ జిల్లా మన్ననూరుకు చెందిన దినేష్ తండ్రి కరమ్‌చంద్ కొన్నాళ్లు కాంట్రాక్ట్ టీచర్‌గా పనిచేశాడు. ఈయన భార్య మహేశ్వరి దినేష్‌కు ఊహ తెలియకముందే కన్నుమూసింది. తల్లి ప్రేమకు దూరమై పెరిగిన దినేష్ నాలుగేళ్ల వయసులో ఇంట్లో స్టవ్ దగ్గర ఆడుకుంటుండగా ప్రమాదం జరిగింది. ముఖం, కాళ్లు, చేతులు 60 శాతం కాలిపోయాయి. చికిత్స చేసే ముందే డాక్టర్లు దినేష్ బతకడమే కష్టమన్నారు. ఐదేళ్లకు ఒక ఆపరేషన్, ఆరేళ్ల వయసులో దినేష్‌కు రెండు మేజర్ ఆపరేషన్లు జరిగాయి. తర్వాత కొంతవరకు శరీరం సాధారణ స్థితికి వచ్చింది. ఇప్పటికీ ముఖం, చేతులు మామూలు స్థితికి చేరుకోలేదు. కాళ్లు పూర్తి స్థాయిలో పనిచేయడానికి మరో శస్త్రచికిత్స చేయాలని డాక్టర్లు చెప్పారు.

ఐదో తరగతి నుంచి 'ట్రైబల్ వేల్ఫేర్'లోకి

మన్ననూర్ గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో దినేష్ ఐదోతరగతిలో చేరాడు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నాడు. క్లాస్‌లో తనే టాపర్. ఆంగ్లంపై ఉన్న మక్కువ, పట్టు గుర్తించిన టీచర్లు ఉదయ్‌కుమార్, ఆంజనేయులు దినేష్‌పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అతడి పరిజ్ఞానాన్ని పెంచుతున్నారు. ఫలితంగా ట్రైబల్ సొసైటీ సారథ్యంలో జరిగిన పలు డిబేట్లు, ఇగ్నైట్ ఫెస్ట్‌ల్లో అనేక బహుమతులు పొందాడు.

2,500 పాఠశాలలు... పదిలక్షల మంది విద్యార్థులు

డెటాల్ సంస్థ అపోలో ఫౌండేషన్‌తో కలిసి బాలబాలికల్లో స్వీయ, పరిసరాల పరిశుభ్రతతో పాటు కాలుష్య నియంత్రణపై అవగాహనకు ప్రతి ఏటా హైజీన్ ఒలింపియాడ్ నిర్వహిస్తుంది. ఈ ఏడాది సెప్టెంబర్ 4–15 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ఈ పరీక్ష జరిగింది. ఒకటి నుంచి పదోతరగతి వరకు ప్రతి రెండు తరగతులను ఒక కేటగిరిగా చేసి మొత్తంగా ఐదు కేటగిరిలో పరీక్ష నిర్వహిస్తారు. 9–10 తరగతుల కేటగిరిలో దేశ వ్యాప్తంగా 2500 పాఠశాలల నుంచి పది లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. 50 మార్కులకు ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష జరిగింది. దినేష్ పూర్తి మార్కులతో పాటు చేతిరాత, పరీక్ష రాసిన విధానం ఆధారంగా అదనపు మార్కులతో కలిపి 51 మార్కులు సాధించాడు. దీంతో జాతీయస్థాయిలో దినేష్‌కు ప్రథమస్థానం వచ్చినట్లు డెటాల్ సంస్థ ప్రకటించింది. అక్టోబర్ 2న ముంబైలో జరిగే కార్యక్రమంలో దినేష్ రూ. లక్ష నగదుతో పాటు పురస్కారం అందుకోనున్నాడు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యార్థి దినేష్‌ను నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మన్ననూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ పద్మావతి, ఉపాధ్యాయులు ఆంజనేయులు, చంద్రశేఖర్, గణేష్, విద్యార్థి తండ్రి కరంచంద్ పాల్గొన్నారు.



విద్యార్థి దినేష్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్

నిక్ వుజిసిక్ నాకు స్ఫూర్తి

తన అంగవైకల్యాన్ని అధిగమించి ప్రపంచ ప్రఖ్యాత మోటివేషనల్ స్పీకర్‌గా మారిన నిక్ వుజిసిక్ నాలో స్ఫూర్తి నింపారు. అవకాశాలు అనేవి అందరికీ సమానమే. వాటిని అందిపుచ్చుకోవడమే మనవంతు అని నేర్చుకున్నా. అదే స్ఫూర్తితో ముందుకు వెళుతున్నా. చదువుతోపాటు క్రికెట్ నా హాబీ. బెస్ట్ కీపర్‌గా నా మార్కు చూపిస్తున్నా. సివిల్స్ రాసి ఐఏఎస్ సాధించాలని అనుకుంటున్నా. – దినేష్

తగ్గిన పప్పు ధాన్యాల సాగు

- 58.46 శాతానికే పరిమితం
- వానాకాలం సీజన్లో కేవలం వరి మాత్రమే పెరిగింది

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ వానాకాలం సీజన్‌లో పప్పుధాన్యాల సాగు గణనీయంగా తగ్గడం ఆందోళన కలిగిస్తోంది. నేటి(శనివారం)తో వానాకాలం సీజన్ ముగియనుంది. ఆదివారం నుంచి యాసంగి సీజన్ మొదలుకానుంది. ఈ నేపథ్యంలో వ్యవసాయ శాఖ ఒక నివేదిక విడుదల చేసింది. వానాకాలం సీజన్‌లో అన్ని పంటల సాధారణ సాగు విస్తీర్ణం 1.24 కోట్ల ఎకరాలు కాగా, గతేడాది ఇదే సీజన్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈ ఏడాది మాత్రం 1.26 కోట్ల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అందులో అత్యధికంగా వరి సాగు విస్తీర్ణం ఆల్ టైం రికార్డును సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. వరి సాధారణ సాగు విస్తీర్ణం 49.86 లక్షల ఎకరాలు కాగా, ఏకంగా 65 లక్షల ఎకరాల్లో (130.37 శాతం) సాగైంది. ఇక సోయాబీన్ సాధారణ సాగు విస్తీర్ణం 4.13 లక్షల ఎకరాలు కాగా, 4.67 లక్షల (113%) విస్తీర్ణంలో సాగైంది.

వరి మినహా పెరగని ప్రధాన పంటల విస్తీర్ణం

వరి, సోయాబీన్ మినహా ఇతర ముఖ్యమైన పంటల విస్తీర్ణం పెరగలేదు. పత్తి సాధారణ సాగు విస్తీర్ణం 50.59 లక్షల ఎకరాలు కాగా, 44.77 లక్షల (88.51 శాతం) విస్తీర్ణంలోనే సాగైంది. ఇక పప్పు ధాన్యాల సాగు మాత్రం గణనీయంగా తగ్గిందని నివేదిక వెల్లడించింది. పప్పుధాన్యాల సాధారణ సాగు విస్తీర్ణం ఈ వానాకాలం సీజన్‌లో 9.43 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 5.51 లక్షల ఎకరాల్లోనే సాగైంది. అంటే 58.46 శాతానికే పరిమితమైంది. అందులో కంది సాధారణ సాగు విస్తీర్ణం 7.69 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటివరకు 4.74 లక్షల (61.62 శాతం) ఎకరాల్లోనే సాగైంది.

జొన్న సాధారణ సాగు విస్తీర్ణం 81,389 ఎకరాలు కాగా, ఇప్పటివరకు కేవలం 31,107 ఎకరాల్లో (38.22 శాతం) సాగైంది. రాగులు దాని సాధారణ సాగు విస్తీర్ణంలో కేవలం 19.70 శాతం, కొర్రలు, సామలు, కోడో వంటి మిల్లెట్ల సాగు 16.15 శాతానికే పరిమితమైంది.

తెలంగాణ

అసెంబ్లీ వద్దు... లోక్‌సభనే ముద్దు!

- ఎమ్మెల్యేగా పోటీచేసేందుకు ఇష్టపడని బీజేపీ ముఖ్యనేతలు, మాజీ ఎంపీలు
- శాసనసభ ఎన్నికల్లో ముఖ్యనేతలంతా పోటీచేయాల్సిందేనన్న అధిష్టానం

సాక్షి, హైదరాబాద్‌: బీజేపీలో ముఖ్యనేతలకు, జాతీయ కార్యవర్గసభ్యుల స్థాయి నాయకులకు కొత్త చిక్కు వచ్చి పడింది. వీరిలో చాలామంది గతంలో ఎంపీలుగా జాతీయ రాజకీయాల్లో తమ వంతు పాత్రను నిర్వహించిన వారే. 2024లోనూ కేంద్రంలో మళ్లీ మోదీ ప్రభుత్వమే వస్తుందన్న ఆశాభావంతో ఉన్న పలువురు కీలక నాయకులు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి సుముఖంగా లేనట్లు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ ప్రజాకర్షక శక్తితో సులభంగా ఎంపీలుగా గెలవొచ్చనే ఆశల్లో ఉన్నారు. అయితే, లోక్‌సభ ఎన్నికల కంటే ముందే తెలంగాణ శాసనసభ ఎన్నికలు వస్తుండటంతో... ముఖ్యనేతలు, రాష్ట్రంలో పలుకుబడి ఉన్న నాయకులు, మాజీ ఎంపీలతో సహా అందరూ అసెంబ్లీకి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే బీజేపీ జాతీయనాయకత్వం సంకేతాలిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి రాష్ట్రంలో పార్టీ పరిస్థితి అంతగా సానుకూలంగా లేదనే అభిప్రాయం ముఖ్య నాయకుల అంతర్గత సంభాషణల్లో వస్తున్నట్లు తెలిసింది. కొందరు అసెంబ్లీకి పోటీకి నిరాసక్తతను వ్యక్తంచేయడంతోపాటు, దానికి సంబంధించి అనేక కారణాలు చెబుతున్నట్టు తెలుస్తోంది. తాము ఎంపీలుగానే పోటీ చేస్తామని నాయకత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అసంతృప్త నేతలు వరుసగా భేటీలు కూడా నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే అసెంబ్లీకి తప్పనిసరిగా పోటీచేయాల్సిందేనని అధినాయకత్వం ఆదేశిస్తే ఏంచేయాలనే దానిపై ఈ నేతలు మల్లగుల్లాలు పడుతున్నట్లు వారి సన్నిహితులు చెబుతున్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపోటములతో నిమిత్తం లేకుండా ముఖ్యనేతలు పోటీచేయడం ద్వారా కేడర్‌లో, ఓటర్లలో ఒక నమ్మకాన్ని కలిగించవచ్చనే అభిప్రాయంతో నాయకత్వం ఉంది. ప్రస్తుతమున్న కీలక నేతలంతా అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా, గెలిచినా అసెంబ్లీ ఎన్నికల తరువాత రెండు మూడు నెలల్లో జరిగే పార్లమెంట్‌ ఎన్నికల్లోనూ తిరిగి పోటీ చేయాల్సిన పరిస్థితి ఉంటుందని వారు ఆందోళనతో ఉన్నారు. కీలక నేతలంతా అసెంబ్లీకి పోటీ చేస్తే..మరీ ఎంపీ స్థానాల్లో పోటీకి ఎవరుంటారనే ప్రశ్నను వారు లేవనెత్తుతున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అసెంబ్లీ కంటే కూడా పార్లమెంట్‌కు వెళ్లడానికే వారు మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

కేసీఆర్, కేటీఆర్‌వి స్థాయికి మించిన మాటలు: ఈటల



సుభాష్‌నగర్‌(నిజామాబాద్‌): సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ స్థాయికి మించిన మాటలు మాట్లాడుతున్నారని, వారి మాటలకు తెలంగాణ సమాజం సిగ్గుపడుతోందని బీజేపీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ అన్నారు. ఈ నెల 3న నిజామాబాద్‌ జిల్లా కేంద్రానికి ప్రధాని నరేంద్ర మోదీ రానున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం స్థానిక గిరిరాజ్‌ కళాశాల గ్రౌండ్‌లో సభాస్థలి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను ఈటల పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ తెలంగాణ అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారని, ఇప్పటివరకు ఇక్కడి అభివృద్ధి పనుల కోసమే తప్ప రాజకీయాల కోసం ప్రధాని రాలేదని పేర్కొన్నారు. విద్యుత్, ఎరువులు, రోడ్ల కష్టాలు తీర్చిన ప్రధాని మోదీని ఏం ముఖం పెట్టుకుని తెలంగాణకు వస్తున్నారనడం కేటీఆర్‌ అహంకారానికి నిదర్శనమన్నారు. రాబోయే రోజుల్లో ఆయన అహంకారం తగ్గే విధంగా ప్రజలు కర్రుకాల్చి వాత పెడతారని, బీఆర్‌ఎస్‌ను బొందపెట్టి బీజేపీని ఆదరిస్తారని ఈటల పేర్కొన్నారు. ఆయన వెంట నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌ ధర్మపురి, రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, నిజామాబాద్, జగిత్యాల్‌ జిల్లా అధ్యక్షులు బస్వా లక్ష్మీనర్స య్య, మోరేపల్లి సత్యనారాయణ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌కు మాజీ మంత్రి చిత్తరంజన్‌దాసు గుడ్‌బై

విలువ ఇవ్వని పార్టీలో ఉండలేను

కల్వకుర్తి రూరల్‌: ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేశానని, అప్పటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును ఓడించి చరిత్ర సృష్టించానని మాజీమంత్రి చిత్తరంజన్‌దాసు పేర్కొన్నారు. కల్వకుర్తిలో తన నివాసంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలవాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్‌ పార్టీలో చేరానని, అయితే ప్రజలకు సేవ చేయాలనుకున్న తన లక్ష్యం నెరవేరకపోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నానని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ సూచనలు, సలహాలు ఎవరు తీసుకోవడం లేదని, అభివృద్ధి గురించి పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాలనే చెప్పడానికి, ఇవ్వడానికి ఎమ్మెల్యేలు, మంత్రులు ఎందుకని ప్రశ్నించారు. తనకు విలువ, గౌరవం ఇవ్వని పార్టీలో ఉండకూడదనే ఆలోచనతో రాజీనామా చేశానని తెలిపారు. ప్రపంచ దేశాలలో బలమైన నేతగా గుర్తింపు తెచ్చుకోవడంతో పాటు దేశాన్ని అన్ని రంగాలలో ప్రగతిపథం వైపు తీసుకెళుతున్న ప్రధాని నరేంద్రమోదీ అడుగుజాడల్లో నడిచేందుకు బీజేపీలో చేరుతున్నట్లు ప్రకటించారు.



ప్రభుత్వ భూములూ మింగేశారు!

అమరావతిలో చంద్రబాబు ముఠా అరాచకాలు

భూసమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లు స్వాహా.. పచ్చ గద్దల అసైన్డ్‌ భూదోపిడీ–2

సాక్షి, అమరావతి: మాజీ సీఎం చంద్రబాబు అమరావతిలో సాగించిన భూదోపిడీలో తవ్వుతున్న కొద్దీ కొత్త అక్రమాలు గుట్టలు గుట్టలుగా బయట పడుతున్నాయి. అసైన్డ్‌ భూములే కాకుండా ప్రభుత్వ భూములనూ వదల్లేదు. చంద్రబాబు, పి.నారాయణ, లోకేశ్‌ త్రయం బినామీల పేరిట కొల్లగొట్టిన భూముల జాబితా చేంతాడులా సాగుతోంది. అసైన్డ్‌ రైతులకు ఎలాంటి పరిహారం ఇవ్వకుండానే వారి భూములను రాజధాని కోసం టీడీపీ సర్కారు తీసుకుంటుందని బెదిరించి రూ.3,370 కోట్ల విలువైన 617 ఎకరాలను కొల్లగొట్టిన కుంభకోణాన్ని 'సాక్షి' ఇప్పటికే బట్టబయలు చేయడం తెలిసిందే. అయితే అసైన్డ్‌ రైతులే కాకుండా అమరావతిలోని ప్రభుత్వ భూములను సైతం తమ బినామీల పేరిట నమోదు చేసి చంద్రబాబు బృందం భూదోపిడీకి పాల్పడటం 'సాక్షి' పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. ఏకంగా 328 ఎకరాల ప్రభుత్వ భూమిని 522 మంది బినామీల పేరిట హస్తగతం చేసుకున్నారు. అనంతరం భూ సమీకరణ ప్యాకేజీ కింద రూ.760.25 కోట్లను కాజేశారు. చంద్రబాబు, నారాయణ, లోకేశ్‌ అసైన్డ్‌ భూదోపిడీలో ఆ అవినీతి పర్వం ఇదిగో ఇలా ఉంది....

రెండు కేటగిరీలుగా వర్గీకరించి..

రాజధాని పేరుతో అమరావతి పరిధిలో సర్వే చేయించిన చంద్రబాబు, నారాయణ దృష్టి ఆ ప్రాంతంలోని ప్రభుత్వ భూములపై పడింది. అసైన్డ్‌ భూములను 1 నుంచి 4 కేటగిరీల కింద విభజించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, పేద రైతులను బెదిరించి తీసుకోగా ఎవరి ఆధీనంలోనూ లేని ప్రభుత్వ భూములను దక్కించుకునేందుకు మరో పన్నాగం పన్నారు. ఆ ప్రభుత్వ భూములన్నీ గుర్తు తెలియని రైతుల ఆధీనంలో ఉన్నట్లు రికార్డుల్లో చూపించారు. వాటిని అసైన్డ్‌ భూముల జాబితాలో 5, 6 కేటగిరీల కింద పేర్కొన్నారు. అన్యాక్రాంతమైనప్పటికీ అభ్యంతరాలు లేని భూములను కేటగిరీ 5 కింద, అన్యాక్రాంతమై అభ్యంతరాలున్న భూములను కేటగిరీ 6 కింద చూపిస్తూ జీవో 41 జారీ చేశారు. ఆ భూములకు భూసమీకరణ ప్యాకేజీని ప్రకటించారు. కేటగిరీ 5 కింద భూములకు 500 చ.గజాల నివాస స్థలం, 100 చ.గజాల వాణిజ్య స్థలాన్ని ప్యాకేజీగా పేర్కొన్నారు. కేటగిరీ 6 కింద భూములకు 260 చ.గజాల నివాస స్థలాన్ని ప్యాకేజీగా ఇస్తామని ప్రకటించారు. అంతేకాదు ఎకరా కంటే తక్కువ ఉన్న భూములకు కూడా కనీసం ఎకరా ప్యాకేజీ వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు.

ఆ గ్రామాల్లో ఒక్కరూ లేరు

అమరావతి భూదోపిడీపై దర్యాప్తు జరుపుతున్న సీఐడీ ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్‌) దర్యాప్తులో అసైన్డ్‌ భూకుంభకోణం ఆధారాలతో సహా వెలుగులోకి వచ్చింది. రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్న భూముల రికార్డులు, సీఆర్‌డీయే భూసమీకరణ ప్యాకేజీ ప్రకటించిన రైతుల జాబితాలను సిట్‌ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేటగిరీ 5, 6లలో చూపించిన 522 మంది రైతుల్లో ఒక్కరు కూడా అమరావతి గ్రామాల్లోనే లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. అంటే ప్రభుత్వ భూములను ఆక్రమించిన రైతులెవరూ లేరు. భూసమీకరణ ప్యాకేజీ కింద రాజధానిలో అత్యంత విలువైన స్థలాలను కాజేసేందుకే చంద్రబాబు ముఠా ఈ పన్నాగానికి పాల్పడిందన్నది ఆధారాలతోసహా నిర్ధారణ అయ్యింది.

328 ఎకరాలు... రూ.760.25 కోట్ల ప్యాకేజీ

అనంతరం అసలు కథను తెరపైకి తెచ్చారు. అమరావతి పరిధిలో కేటగిరీ 5 కింద 237.60 ఎకరాలను గుర్తించారు. ఆ భూములన్నీ 295 మంది ఆధీనంలో ఉన్నట్టుగా చూపించారు. ఇక కేటగిరీ 6 కింద 90.52 ఎకరాలను చూపించారు. ఆ భూములు 227 మంది స్వాధీనంలో ఉన్నట్టుగా కనికట్టు చేశారు. వాస్తవానికి ఆ రెండు కేటగిరీల భూములు ఎవరి ఆధీనంలోనూ లేవు. కానీ ఆ భూములు 522 మంది తమ బినామీల ఆధీనంలో ఉన్నట్టుగా చూపించి భూసమీకరణ ప్యాకేజీని కొల్లగొట్టారు. అమరావతిలో ప్యాకేజీ ప్రకటించే నాటికి నివాస స్థలం చ.గజం రూ.30 వేలు, వాణిజ్య స్థలం చ.గజం రూ.50 వేలు చొప్పున మార్కెట్‌ ధర పలికింది. అమరావతి నిర్మాణం పూర్తయితే మార్కెట్‌ ధర మరింత పెరుగుతుంది.

- అప్పటి ధరనే తీసుకుంటే కేటగిరీ 5 కింద ఒక్కొక్కరికీ రూ.1.50 కోట్ల విలువైన నివాస స్థలం, రూ.50 లక్షలు విలువైన వాణిజ్య స్థలం వెరసి రూ.2 కోట్లు చొప్పున ప్యాకేజీ దక్కింది. ఆ ప్రకారం కేటగిరీ 5 కింద ఉన్న 295 మంది రూ.590 కోట్ల విలువైన స్థలాలను పొందారు.
- కేటగిరీ 6 కింద ఒక్కొక్కరికీ రూ.75 లక్షలు విలువైన నివాస స్థలం ఇచ్చారు. ఆ ప్రకారం 227 మందికి రూ.170.25 కోట్ల విలువైన స్థలాలు దక్కాయి.
- మొత్తం మీద కేటగిరీ 5, 6లలో రైతులుగా చూపించిన తమ బినామీలు 522 మంది ముసుగులో చంద్రబాబు, నారాయణ రూ.760.25 కోట్ల విలువైన స్థలాలను కొల్లగొట్టినట్లు స్పష్టమైంది.

దోపిడీ చేసి సానుభూతి నాటకమా!?

ప్రజల సొమ్మును దోచేసి అడ్డంగా దొరికిన గజదొంగ చంద్రబాబు

- బలమైన సాక్ష్యాధారాలు ఉండటంతోనే ఆయన్ను కోర్టు రిమాండ్‌కు పంపింది
- ఇది దేశానికి అరిష్టమన్నట్లుగా టీడీపీ, ఎల్లో మీడియా దుష్ప్రచారం: సజ్జల



సాక్షి, అమరావతి: స్కిల్‌ స్కాంలో ప్రభుత్వ ఖజానాను దోచేసి అడ్డంగా దొరికిపోయిన గజదొంగ టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును అరెస్టుచేయడం దేశానికి అరిష్టమన్నట్లుగా ఆ పార్టీ నేతలతో కూడిన దొంగల ముఠా పచ్చి అబద్ధాలు వల్లిస్తోందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ఏపీ ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. ఇటు రాష్ట్రంలో అటు ఢిల్లీలో గత 20 రోజులుగా ఆ ముఠా ఏం మాట్లాడినా వాటిని ప్రచురించి, ప్రసారం చేస్తూ ఐదుకోట్ల మంది ప్రజల చెవుల్లో పువ్వులు పెట్టడానికి ఎల్లో మీడియా శక్తివంచన లేకుండా కృషిచేస్తోందని ఎద్దేవా చేశారు. లక్ష మంది గోబెల్స్‌ కలిస్తే చంద్రబాబు అవుతాడని.. ఆయనకు రామోజీరావు, రాధాకృష్ణలు కలిస్తే గోబెల్స్‌ ముఠా అవుతుందంటూ ఘాటుగా విమర్శించారు. ఈ దొంగలందరూ కలిసిన టీడీపీని తోడు దొంగల పార్టీగా సజ్జల అభివర్ణించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దొంగే బాధితుడన్నట్లుగా భ్రమింపజేయడం ద్వారా ప్రజల సానుభూతి పొందేందుకు ప్రయత్నించడం ఘోరమన్నారు. కక్ష సాధించాలనుకుంటే ప్రాథమిక ఆధారాలతో అధికారంలోకి వచ్చిన తొలిరోజుల్లోనే చంద్రబాబును అరెస్టుచేయించే వారన్నారు. స్కిల్‌ స్కాంలో ప్రభుత్వ ఖజానా నుంచి రూ.371 కోట్లు దోచేయడానికి చంద్రబాబే సూత్రధారి అనడానికి బలమైన సాక్ష్యాధారాలు దొరకడంతోనే సీఐడీ పోలీసులు ఆయన్ను అరెస్టుచేశారని.. వాటి ఆధారంగానే ఆయనను కోర్టు రిమాండ్‌పై జైలుకు పంపిందని సజ్జల గుర్తుచేశారు. న్యాయవ్యవస్థ చంద్రబాబును జైలుకు పంపితే.. అది అక్రమ కేసు అంటూ రాష్ట్రపతికి ఫిర్యాదుచేసే స్థాయికి టీడీపీ చేరిందంటూ విమర్శించారు. చంద్రబాబు కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించి.. టీడీపీని వేధిస్తున్నారన్న భావనను తీసుకురావడానికి మేధావుల ముసుగులో మొన్న సీబీఐ మాజీ డైరెక్టర్‌.. నిన్న మణిపూర్‌ మహిళతో ఆ పార్టీ నేతలు, ఎల్లో మీడియా ప్రకటనలు ఇప్పిస్తున్నారని.. వాటిని నమ్మవద్దని ప్రజలకు సజ్జల విజ్ఞప్తి చేశారు. ఆయన ఇంకా ఏమన్నారంటే..

ప్రజా ధనాన్ని దోచేసిన గజదొంగ బాబు..:

- టీడీపీ సర్కార్‌ హయాంలో జరిగిన ఏ స్కాంకైనా చంద్రబాబే సూత్రధారి. స్కిల్‌ స్కాం ఒప్పందాన్ని కొవ్వొత్తి కాంతిలో ఒప్పందం చేసుకున్నారట.. మరి చంద్రబాబు కనిపెట్టిన సెల్‌ఫోన్‌ లైట్‌ లేదా?
- ఫైబర్‌ గ్రిడ్‌లో ఈవీఎంల దొంగ వేమూరి హరికృష్ణప్రసాద్‌ను ముందుపెట్టి.. అక్రమంగా టెరాసాఫ్ట్‌కు పనులు కట్టబెట్టి.. రూ.114 కోట్లు కొట్టేసినట్లు ఆధారాలున్నాయి.
- రాజధాని అమరావతిలో అసైన్డ్‌ భూములకు పరిహారం ఇవ్వబోమని తొలుత పేదలను బెదిరించి, భయపెట్టి.. ఆ తర్వాత వాటిని కారుచౌకగా కాజేశారు.

మధురవాడలో ఏపీ పన్నుల శాఖ కార్యాలయం!

దసరా నుంచి విశాఖ కేంద్రంగా సీఎం జగన్‌ పరిపాలన నేపథ్యంలో చర్యలు వేగవంతం

సాక్షి, విశాఖపట్నం: దసరా నుంచి పరిపాలన రాజధానిగా మారనున్న విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి కార్యాలయాలకు భవనాల ఎంపిక కోసం అధికారులు కసరత్తు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయాన్ని మధురవాడలో ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దసరా నుంచి రాష్ట్ర పరిపాలన రాజధాని విశాఖ కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి కార్యకలాపాలు ప్రారంభించనున్నట్లు ఇటీవల క్యాబినెట్‌ సమావేశంలో స్పష్టం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రితోపాటు విశాఖ వచ్చే ఉన్నతాధికారులు, ప్రభుత్వ కార్యాలయాల కోసం భవనాలను సిద్ధం చేసేందుకు అధికార యంత్రాంగం ప్రయత్నాలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా రాష్ట్ర పన్నుల శాఖ కార్యాలయాల ఏర్పాటు, పని విభజనపై కసరత్తు వడివడిగా జరుగుతోంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాలు విశాఖ డివిజన్‌ పరిధిలోకి వస్తాయి. ప్రస్తుతం జాయింట్‌ కమిషనర్‌(జేసీ)–1, 2 కార్యాలయాలు, కొన్ని సర్కిల్‌ కార్యాలయాలు ముడసర్లోవ సమీపంలో ఉన్నాయి. ఈ భవనాన్నే రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి కేటాయించాలని భావించారు. కానీ, సరిపడా గదులు లేకపోవడంతో సీఎం కార్యాలయానికి సమీపంలో భవనాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులు స్పష్టంచేశారు. దీంతో విశాఖ డివిజన్‌ జాయింట్‌ కమిషనర్‌ కార్యాలయ అధికారులు మధురవాడలో ఉన్న భవనాలను పరిశీలించారు. నాలుగు అంతస్తులు ఉన్న మూడు భవనాలను పరిశీలించి వాటి వివరాలను ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

బాబు కనుసన్నల్లోనే ఐఆర్‌ఆర్‌ అలైన్‌మెంట్‌ మార్పు

ముందుగా నిర్ణయించుకొన్న విధంగా అలైన్‌మెంట్‌ తయారు చేయించారు

- లింగమనేని రమేశ్‌కు చంద్రబాబు లబ్ధి చేకూర్చారు
- అందుకు ప్రతిగా చంద్రబాబుకు ఆయన తన ఇంటిని ఇచ్చారు
- ఈ ప్రాజెక్టు వెనుక క్విడ్‌ ప్రో కో ఉంది
- హైకోర్టుకు నివేదించిన ఏజీ శ్రీరామ్‌
- సీఐడీ దర్యాప్తు పక్షపాతంతో సాగుతోంది
- బాబు తరఫు సీనియర్‌ న్యాయవాదులు
- బాబు ముందస్తు బెయిల్‌ పిటిషన్‌పై తదుపరి విచారణ 3కి వాయిదా

సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు (ఐఆర్‌ఆర్‌) అలైన్‌మెంట్‌లో మార్పులు అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కనుసన్నల్లోనే జరిగాయని సీఐడీ హైకోర్టుకు తెలిపింది. అలైన్‌మెంట్‌ ఎలా ఉండాలో ముందే ఓ నిర్ణయానికి వచ్చి, దానికి అనుగుణంగా ప్రాజెక్టు పనులు దక్కించుకున్న సంస్థ చేత అలైన్‌మెంట్‌ను తయారు చేయించారని వివరించారు. ఈ మార్పుల ద్వారా వ్యాపారవేత్త లింగమనేని రమేష్‌కు చంద్రబాబు లబ్ధి చేకూర్చారని చెప్పింది. అందుకు ప్రతిఫలంగా రమేష్‌ కృష్ణానది కరకట్ట సమీపంలో ఉన్న తన ఇంటిని చంద్రబాబుకు ఇచ్చారని తెలిపింది. ఇది క్విడ్‌ ప్రోకోయేనని వెల్లడించింది.

ఇప్పటికే స్కిల్‌ కుంభకోణం కేసులో అరెస్టయి రిమాండ్‌ ఖైదీగా ఉన్న చంద్రబాబు.. ఐఆర్‌ఆర్‌ ముసుగులో జరిగిన భూదోపిడీ కేసులో ముందస్తు బెయిలు కోరుతూ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై న్యాయమూర్తి జస్టిస్‌ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా సీఐడీ తరఫున అడ్వొకేట్‌ జనరల్‌ (ఏజీ) ఎస్‌.శ్రీరామ్‌ వాదనలు వినిపించారు. అలైన్‌మెంట్‌ మార్పు వల్ల రమేష్‌ భూములను కాపాడటమే కాక, వాటి విలువ ఎంతో పెరిగేలా చేశారని ఆయన వివరించారు. రమేష్‌ బ్యాంకు ఖాతాల్లో పెద్ద ఎత్తున డబ్బు కూడా జమ చేశారని, అందుకు లెక్కలు కూడా చూపలేదన్నారు. దానిని ఇంటి అద్దెగా చంద్రబాబు తదితరులు చెబుతున్నారని తెలిపారు. రెండేళ్ల తరువాత అద్దె చెల్లించడంలో అంతరార్థం ఏమిటో తెలుసుకోవాల్సి ఉందని అన్నారు. ఇందు కోసం చంద్రబాబును కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు ప్రాజెక్టు అమలు వెనుక అవినీతి జరిగింది కాబట్టే అవినీతి నిరోధక చట్టం కింద కూడా చంద్రబాబుపై కేసు నమోదు చేశామని చెప్పారు. ఐఆర్‌ఆర్‌ అలైన్‌మెంట్‌ ప్రాజెక్టును నామినేషన్‌ పద్ధతిలో అప్పగించడాన్ని అప్పటి సీఆర్‌డీఏ అధికారులు వ్యతిరేకించారని, వాటిని పట్టించుకోకుండా చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. దురుద్దేశంతో అర్హత నిబంధనలు కుదించేశారన్నారు. అలైన్‌మెంట్‌ పరిధిలోకి కావాల్సిన వారి భూములు రాకుండా జాగ్రత్త పడ్డారని తెలిపారు. మాస్టర్‌ ప్లాన్‌ను సైతం అలాగే రూపొందించారని వివరించారు. ప్రాజెక్టు రూపకల్పన, అమలు, దాని వెనుక ఉన్న ఉద్దేశాలను చూడాలని కోర్టును కోరారు. ఈ ప్రాజెక్టు వెనుక క్విడ్‌ ప్రో కో ఉందన్నారు. ఐఆర్‌ఆర్‌ పేరుతో ఆస్తులు అమ్ముకుని, డబ్బు గడించారని తెలిపారు. స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కుంభకోణం కేసులో చంద్రబాబు అరెస్టయి రిమాండ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ కేసులో కూడా ఆయన అరెస్ట్‌ అయినట్లు భావించడానికి వీల్లేదన్నారు. అలా భావిస్తే దర్యాప్తునకు తీవ్ర విఘాతం కలుగుతుందని చెప్పారు. అందువల్ల ఈ కేసులో చంద్రబాబుకు బెయిల్‌ మంజూరు చేయవద్దని కోర్టును కోరారు.

చంద్రబాబు తరఫున సీనియర్‌ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా, దమ్మాలపాటి శ్రీనివాస్‌ వాదనలు వినిపిస్తూ.. లింగమనేనికి చెల్లించిన అద్దెపై సీఐడీకి అనుమానాలుంటే చంద్రబాబుకు నోటీసులు జారీ చేసి వివరణ కోరితే పూర్తి వివరాలు సమర్పించే వారిమని అన్నారు. ఇంత చిన్న దానికి కస్టోడియల్‌ విచారణ అవసరం ఏముందన్నారు. తాము చెల్లించిన డబ్బుకు రమేష్‌ లెక్కలు చూపకుంటే అది చంద్రబాబు తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. ఈ కేసులో సీఐడీ వాస్తవాలను కప్పిపుచ్చుతోందన్నారు. సీఐడీ దర్యాప్తు మొత్తం పక్షపాతంతో సాగుతోందన్నారు. కోర్టు సమయం ముగియడంతో న్యాయమూర్తి తదుపరి విచారణను అక్టోబర్‌ 3కి వాయిదా వేశారు.





విజయవాడలోని విద్యాధరపురంలో జరిగిన వైఎస్సార్‌ వాహనమిత్ర సభకు హాజరైన లబ్ధిదారులు.. వారికి అభివాదం చేస్తున్న సీఎం జగన్‌

యుద్ధానికి సిద్ధం

- మనం వేసే ప్రతి అడుగు, ప్రతి ఓటూ.. పేదవాడిని రక్షించుకోవడానికే: సీఎం జగన్‌
- ఐదో విడత 'వైఎస్సార్‌ వాహనమిత్ర'తో 2,75,931 మంది ఖాతాల్లోకి రూ.279.93 కోట్లు

సాక్షి, అమరావతి: ఎన్నికల మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావిస్తూ అమలు చేస్తున్న మీ బిడ్డ ప్రభుత్వం ఒకవైపున నిలిస్తే.. ప్రజలను మోసగించేందుకే మేనిఫెస్టోను తీసుకొచ్చి ఆ తరువాత చెత్తబుట్టలో పడేసిన చరిత్ర ఉన్నవారు మరోవైపున మోహరించారని ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నిరుపేదలకు అండగా నిలిచిన మనసున్న ప్రభుత్వం ఓ వైపు.. పేదలను వంచించిన మనసు లేని గత పాలకులు మరోవైపు ఉన్నారని చెప్పారు. నీతివంతంగా అన్ని సామాజిక వర్గాలు, అన్ని ప్రాంతాలకు మంచి చేస్తున్న మన ప్రభుత్వం ఒకవైపున ఉంటే.. మరోవైపున సామాజిక అన్యాయాలు, ప్రాంతాలకు అన్యాయాలు చేయడమే చరిత్రగా ఉన్న ప్రత్యర్థులు మరోవైపున ఉన్నారని తెలిపారు. శుక్రవారం విజయవాడలో వైఎస్సార్‌ వాహనమిత్ర పథకం ద్వారా వరుసగా ఐదో విడత కింద 2,75,931 మంది లబ్ధిదారులకు రూ.275.93 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్‌ నొక్కి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన అనంతరం నిర్వహించిన సభలో సీఎం జగన్‌ మాట్లాడారు. మేనిఫెస్టోను పవిత్ర భగవద్గీత, బైబిల్, ఖురాన్‌లా భావిస్తూ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజు నుంచి చెప్పిన ప్రతీది అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే 99 శాతం వాగ్దానాలను పూర్తి చేసి మన ప్రభుత్వం మాట నిలబెట్టుకుందని చెప్పారు. సభలో సీఎం జగన్‌ ఇంకా ఏమన్నారంటే..

కులమతాలు లేవు.. పేదలు – పెత్తందారులే

ఈ రోజు మనం వేసే ప్రతి అడుగు, ప్రతి ఓటు.. పేదవాడిని రక్షించుకోవడానికే వేస్తున్నాం. పేదవాడికి, పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతోంది. ఈ యుద్ధంలో కులాలు లేవు... మతాలు లేవు. పేదవాడు ఒకవైపు, పెత్తందారులు మరోవైపు ఉన్నారన్నదే గుర్తు పెట్టుకోండి. వాళ్ల మాదిరిగా నాకు ఒక గజదొంగల ముఠా తోడుగా లేదు. ఈనాడు, ఆంధ్రజ్యోతి తోడుగా లేదు. టీవీ 5 అండగా లేదు. ఒక దత్తపుత్రుడు తోడు అంతకన్నా లేదు. దోచుకుని, పంచుకుని, తినుకోవడం నా విధానం కాదు. నేను నమ్ముకున్నది పైన దేవుడిని, ఆ తర్వాత మిమ్మల్నే. అదే నా విధానం. వారికి అధికారం కావాల్సింది దోచుకోవడానికి.. దోచుకున్నది పంచుకోవడానికి.. పంచుకున్నది తినడానికే! రాబోయే రోజుల్లో వాళ్లు మీ ఇంటికి వస్తారు. ఒక్కో ఇంటికి కేజీ బంగారం, ఒక బెంజ్‌ కారు కూడా ఇస్తామని కూడా చెబుతారు. అటువంటి వాళ్లు చెబుతున్న అబద్ధాలను నమ్మకండి. మీ ఇంటిలో మీకు మంచి జరిగిందా.. లేదా? అన్నదే కొలమానంగా తీసుకొండి. మీ ఇంట్లో మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికుడిలా అండగా నిలబడండి.

తిరుమల ఘాట్‌ రోడ్లలో ఆంక్షల సడలింపు

టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి

తిరుమల: తిరుమల ఘాట్‌ రోడ్లలో ద్విచక్ర వాహనాల రాకపోకలపై విధించిన ఆంక్షలను టీటీడీ సడలించింది. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం టీటీడీ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఈవో ఏవీ ధర్మారెడ్డి ఈ విషయాన్ని ప్రకటించారు. అలిపిరి కాలినడక మార్గంలో చిరుతల సంచారం నేపథ్యంలో భక్తుల భద్రత దృష్ట్యా సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ద్విచక్ర వాహనాల రాకపోకలను టీటీడీ నిలిపివేసిన విషయం తెలిసిందే. టీటీడీ అటవీశాఖతో అధికారులతోపాటు రాష్ట్ర అటవీశాఖ అధికారులు ఆ ప్రాంతంలో 6 చిరుతలను బంధించడంతో పాటు వారం రోజుల పాటు పూర్తిగా పరిశీలించిన తర్వాత ఎలాంటి ముప్పు లేదని నిర్ధారించారు. దీంతో శుక్రవారం నుంచి ఘాట్‌ రోడ్లలో రాత్రి 10 గంటల వరకు ద్విచక్ర వాహనాలను అనుమతించనున్నారు. అక్టోబర్‌ 14న అంకురార్పణ, అక్టోబర్‌ 15–23 వరకు జరగనున్న నవరాత్రి బ్రహ్మోత్సవాల సంసిద్ధతపై శాఖల వారీగా అధికారులతో ఈవో సమీక్షించారు. కాగా, తిరుమలలో శుక్రవారం రాత్రి పౌర్ణమి గరుడసేవ వైభవంగా జరిగింది. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడునిపై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు.



ఘటాటోపం కింద గరుడవాహనంపై ఊరేగుతున్న గోవిందుడు

శ్రీవారి ఆలయ సమీపంలో విమానాలు

తిరుమల శ్రీవారి ఆలయ సమీపంలో పైనుంచి విమానం మరోమారి వెళ్లిన ఘటన శుక్రవారం ఉదయం జరిగింది. ఉదయం 6.30, 8.15 గంటల సమయంలో విమానాలు ఆలయం పైభాగాన సమీపంలో వెళ్లాయి. ఆగమశాస్త్ర నియమం ప్రకారం తిరుమలపై ఎటువంటి విమానాలు వెళ్ళకూడదు. అయితే తరచూ తిరుమల పైభాగంలో పలు విమానాలు వెళుతున్నాయి. ప్రస్తుతం విమానాలు తిరుమలపై వెళ్లడంపై టీటీడీ భద్రతాధికారులు పరిశీలిస్తున్నారు.

లోకేశ్‌ ముందస్తు బెయిల్‌ పిటిషన్‌ను మూసివేసిన హైకోర్టు

- ఆయనకు సీఆర్‌పీసీ సెక్షన్‌ 41ఏ నోటీసు ఇస్తామని ఏజీ నివేదన
- అవసరమైనప్పుడు విచారణకు రావాలని కోరతామని వెల్లడి



సాక్షి, అమరావతి: అమరావతి ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్‌ మాటున సాగించిన భూ దోపిడీపై సీఐడీ నమోదు చేసిన కేసులో 14వ నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి నారా లోకేశ్‌ దాఖలు చేసిన ముందస్తు బెయిల్‌ పిటిషన్‌ను హైకోర్టు మూసివేసింది. లోకేశ్‌కు సీఆర్‌పీసీ సెక్షన్‌ 41ఏ కింద నోటీసు జారీ చేసి, అవసరమైనప్పుడు విచారణకు రావాలని కోరతామని సీఐడీ తరఫున అడ్వొకేట్‌ జనరల్‌ (ఏజీ) ఎస్‌.శ్రీరామ్‌ హైకోర్టుకు వివరించారు. ఈరోజు వరకు ఆయన అరెస్టు విషయంలో భయపడాల్సిన అవసరంలేదని చెప్పారు. ఏజీ వాదనలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, వాటిని రికార్డ్‌ చేసింది. తప్పనిసరిగా సీఆర్‌పీసీ సెక్షన్‌ 41ఏను అనుసరించే ముందుకు వెళతామని ఏజీ స్పష్టంగా చెప్పిన నేపథ్యంలో, లోకేశ్‌ ముందస్తు బెయిల్‌ పిటిషన్‌పై తదుపరి ఉత్తర్వులు అవసరం లేదని స్పష్టం చేసింది. అందువల్ల పిటిషన్‌ను మూసివేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి మాస్టర్‌ ప్లాన్, ఇన్నర్‌ రింగ్‌ రోడ్డు అలైన్‌మెంట్‌ డిజైన్ల ముసుగులో అప్పటి ప్రభుత్వ పెద్దలు సాగించిన భూదోపిడీపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదు చేసింది. ఇందులో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ, చంద్రబాబు సన్నిహితులు, వ్యాపారవేత్తలు లింగమనేని రమేష్, లింగమనేని వెంకట సూర్య రాజశేఖర్, రామకృష్ణ హౌసింగ్‌ లిమిటెడ్‌ డైరెక్టర్‌ అంజనీ కుమార్‌ తదితరులను నిందితులుగా చేర్చింది. చంద్రబాబు కుమారుడు, అప్పటి మంత్రి నారా లోకేశ్‌ను సైతం 14వ నిందితునిగా చేర్చింది. ఈ నేపథ్యంలో ముందస్తు బెయిల్‌ కోరుతూ లోకేశ్‌ హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు.

ఫైబర్‌గ్రిడ్‌ కేసులో ముందస్తు బెయిల్‌ ఇవ్వండి

- హైకోర్టులో చంద్రబాబు పిటిషన్‌
- పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీకి హైకోర్టు ఆదేశం
- విచారణ 4కి వాయిదా

సాక్షి, అమరావతి: ఫైబర్‌ గ్రిడ్‌ ప్రాజెక్టులో పెద్ద ఎత్తున ఆర్థిక అక్రమాలు జరిగాయంటూ సీఐడీ నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్‌ కోరుతూ మాజీ ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు శుక్రవారం హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఫైబర్‌ గ్రిడ్‌ కేసు పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీఐడీని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్‌ 4కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్‌ కంచిరెడ్డి సురేష్‌రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు తరఫున సీనియర్‌ న్యాయవాది దమ్మాలపాటి శ్రీనివాస్‌ వాదనలు వినిపిస్తూ.. 2021 సెప్టెంబర్‌లో నమోదు చేసిన కేసులో చంద్రబాబును సీఐడీ ఇటీవల 25వ నిందితునిగా చేర్చిందని తెలిపారు. ఆ మేర ఏసీబీ కోర్టులో పీటీ వారెంట్‌ దాఖలు చేసిందన్నారు.

ఇదీ కేసు..: చంద్రబాబు ప్రభుత్వం హయాంలో ఫైబర్‌ గ్రిడ్‌ ప్రాజెక్టుకు సంబంధించి రూ.321 కోట్ల మేర కుంభకోణం జరిగింది. ఈ ప్రాజెక్టు టెండర్‌ను టెరాసాఫ్ట్‌ కంపెనీకి అప్పగించారని, ఇందులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, దీని వెనుక అప్పటి ప్రభుత్వ పెద్దల పాత్ర ఉందంటూ ఏపీ ఫైబర్‌ నెట్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ ఎండీ 2021లో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సీఐడీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.



ఆవులే ఆమె సర్వస్వం

డాక్టర్ పద్మ జీవనయానం

**"ఆవు పైన ప్రేమ...
లెక్చరర్ ఉద్యోగాన్ని వదులుకునేలా..
నగరం నుంచి పల్లెతల్లికి దగ్గరయ్యేలా
కొండకోనల వెంట ప్రయాణించేలా
వరదలను తట్టుకొని నిలబడేలా చేసింది"
అని వివరిస్తుంది డాక్టర్ చెన్నమనేని పద్మ.
హైదరాబాద్‌లో పుట్టి పెరిగినా, వృత్తి ఉద్యోగాల్లో కొనసాగుతున్నా ఊరు ఆమెను ఆకట్టుకుంది. 200 ఆవులకు సంరక్షకురాలిగా మార్చింది. పదేళ్లుగా చేసిన ఈ ప్రయాణంలో నేర్చుకున్న విషయాలను, వరించిన జాతీయస్థాయి అవార్డులను వివరించారు పద్మ.**

''నా చిన్ననాటి రోజులకు ఇప్పటికీ ఆహారంలోనూ, వాతావరణంలోనూ చాలా తేడా కనిపించేది. తెలుగు లెక్చరర్‌గా హైదరాబాద్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ఉన్న ఎయిడెడ్ గర్ల్స్ కాలేజీలో ఉద్యోగం చేసేదాన్ని. వ్యవసాయం, ఆహారం ప్రాముఖ్యతను నేను చదువు చెప్పే అమ్మాయిలకు ప్రత్యక్షంగా చూపాలనుకున్నాను. మా నాన్నగారి ఊరు జగిత్యాలకు ఎప్పుడో ఒకసారి వెళ్లేదాన్ని. ఊరి ప్రయాణం, అక్కడి వాతావరణం నాకు బాగా నచ్చేది. ఇదే విషయాన్ని మా క్లాస్ అమ్మాయిలకు చెప్పి, ఆసక్తి ఉన్నవాళ్లు పేర్లు ఇస్తే, తీసుకెళతాను అని చెప్పాను. ఒకేసారి యాభైమంది పేర్లు ఇచ్చారు. వారందరికీ బస్ ఏర్పాటు చేసి, తీసుకెళ్లాను. వ్యవసాయంలో ఏమేం పనులు ఉంటాయో అన్నీ పరిచయం చేశాను. అక్కడి గోశాలకు తీసుకెళితే పిల్లలంతా కలిసి, లక్ష గొబ్బెమ్మలు తయారు చేశారు.

ఎరువుగా గొబ్బెమ్మలు

కొన్నిరోజుల తర్వాత గోశాల వాళ్లు గొబ్బెమ్మలను తీసుకెళ్లమని చెప్పారు. అప్పటివరకు ఆలోచన చేయలేదు. కానీ, వాటిని హైదరాబాద్ తీసుకొచ్చి ఏం చేయాలో అర్థం కాలేదు. ఏదైతే అది అయ్యిందని వ్యాన్‌లో లక్షగొబ్బెమ్మలను తీసుకొచ్చి, ఇంట్లో పెట్టించాను. ఎక్కడ చూసినా గొబ్బెమ్మలే. ఇంట్లోవాళ్లు ఏంటిదంతా అన్నారు. కొన్ని రోజులు వాటిని అలాగే చూస్తూ ఉన్నాను. గోమయాన్ని ఎరువుగా వాడితే పంట బాగా వస్తుంది. అయితే, నగరంలో ఇదెలా సాధ్యం అవుతుంది అనుకున్నాను. రూఫ్ గార్డెన్‌వాళ్లకు ఇస్తే అనే ఆలోచన వచ్చిన వెంటనే వాట్సప్ గ్రూపుల్లో గొబ్బెమ్మలు కావాల్సిన వాళ్లు తీసుకెళ్లొచ్చు మొక్కలకు ఎరువుగా అని మెసేజ్ చేశాను. రెండు, మూడు రోజుల్లో మొత్తం గొబ్బెమ్మలు ఖాళీ అయ్యాయి.

ఆవుల కొనుగోలు...

ఊరు వెళ్లినప్పుడల్లా దారిలో గోవుల గుంపు ఉన్న చోట ఆగి, కాసేపు అక్కడ ఉండి వెళ్లడం ఒక అలవాటుగా ఉండేది. అలా ఒకసారి 80 ఏళ్ల వ్యక్తి నా అడ్రస్ కనుక్కొని వచ్చాడు. తన దగ్గర ఉన్న ఆవులను బతికించలేకపోతున్నానని, పిల్లలు వాటిని వదిలించుకోమని చెబుతున్నారని ఏడ్చాడు. నాకేం చేయాలో అర్థం కాలేదు. అంత పెద్ద వ్యక్తి గోవుల గురించి బాధపడుతుంటే చూడలేకపోయాను. ఏదైతే అది అవుతుందని 55 గోవులను అతను చెప్పిన మొత్తానికి నా పొదుపు మొత్తాల నుంచి తీసి, కొనేశాను.

అర్థం చేసుకుంటూ...

కొనడంలో ధైర్యం చేశాను కానీ, ఆ ఆవులను ఎలా సంరక్షించాలో అర్థం కాలేదు. వర్కర్లను, వాటికి గ్రాసం ఏర్పాటు చేయడం తలకు మించి భారమైంది. వాటిని చూసుకోవడానికి ఉద్యోగం మానేశాను. అయినవాళ్లంతా తప్పు పట్టారు. 'కాలేజీకి త్వరలో ప్రిన్సిపల్ కాబోతున్నావ్.. ఇలాంటి టైమ్‌లో ఉద్యోగం వదులుకొని ఇదేం పని' అన్నారు. కానీ, ఆవు లేని వ్యవసాయం లేదు. ఆవు లేకుండా మనిషి జీవనం లేదనిపించేది నాకు. ఇంట్లోవాళ్లకు చెప్పి జగిత్యాలలోనే ఆవులతో ఉండిపోయాను. కానీ, ఊళ్లో అందరినుంచీ కంప్లైంట్లే! ఆవులు మా ఇళ్ల ముందుకు వస్తాయనీ, వాకిళ్లు పాడుచేస్తున్నా



గోవులతో...

యని, పోలీసు కేసులు కూడా అయ్యాయి. ఆ ఊళ్లో పుట్టి పెరిగిన దాన్ని కాదు కాబట్టి, నాకెవరూ సపోర్ట్ చేసేవాళ్లు లేరు. దీంతో ఆవులను తీసుకొని గోదావరి నదీ తీరానికి వెళ్లిపోయాను. అక్కడ ఓ పది రోజులు గడిచాయో లేదో విపరీతమైన వానలు, వరదలు. ఆ వరదలకు కొన్ని ఆవులు కొట్టుకుపోయాయి కూడా. నాకైతే బతుకుతానన్న ఆశ లేదు. ఎటు చూసినా బురద, పాములు.. కృష్ణుడిని వేడుకున్నాను. 'ఈ ఆవులు నీవి, నీవే కాపాడుకో..' అని వేడుకున్నాను. అక్కణ్ణుంచి బోర్నపల్లి అటవీ ప్రాంతంలో 15 రోజులు ఆవులతో గుట్టలపైనే ఉన్నాను. మూగజీవాల గురించి, ప్రకృతి గురించి నాకేమీ తెలియదు. ఏం జరిగినా వెనక్కి వెళ్లేది లేదు అనుకున్నాను. నా మొండితనం ప్రకృతిని అర్థం చేసుకునేలా చేసింది. ఎప్పుడో వీలున్నప్పుడు హైదరాబాద్ వచ్చి వెళ్లేదాన్ని. మా ఇద్దరు అబ్బాయిలు జీవితాల్లో సెటిల్ అయ్యారు. ఇక నా జీవితం ఆవులతోనే అనుకున్నాను. కరోనా టైమ్‌లో మా కుటుంబం అంతా హైదరాబాద్‌లో ఉంది. నేను గోవులతో అడవుల్లో ఉన్నాను. ఓసారి కుటుంబం అంతా కూర్చుని ఆవులు కావాలా, మేం కావాలో తేల్చుకోమన్నారు. ఆవులే కావాలి అన్నాను. నాకు ఉన్న ఈ ఇష్టాన్ని గమనించిన మా వారు తను చేస్తున్న సెంట్రల్‌గవర్నమెంట్ జాబ్ నుంచి వీఆర్ఎస్ తీసుకొని వచ్చేశారు. తన పొదుపు మొత్తాలను కూడా ఆవుల సంక్షేమానికి వాడాం.

వరించిన అవార్డులు

పట్టణప్రాంతాల వారిని పల్లెకు తీసుకెళ్లి చేయిస్తున్న సేవకు 2012లో నేషనల్ సర్వీస్ స్కీమ్ అవార్డ్‌ను రాష్ట్రపతి ప్రణవ్ ముఖర్జీ చేతుల మీదగా అందుకున్నాను. 2013లో చైనాలో జరిగే యూత్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్‌కి ప్రభుత్వం టాప్ 100 మెంబర్స్‌ని పంపించారు. వారిలో నేనూ ఒకరిగా ఆ సోషల్ యాక్టివిటీస్‌లో



● అవార్డు అందుకుంటూ...

పాల్గొనడం మర్చిపోలేనిది. ఈ యేడాది ఇందిరాగాంధీ అవార్డు సెలక్షన్‌కి కమిటీ మెంబర్‌గా ఆహ్వానం అందుకున్నాను. నిస్వార్థంగా చేసే సేవ ఏ కొద్దిమందికైనా ఉపయోగపడినా చాలు. రైతులు ఎవరైనా ఆవు కావాలని వస్తే వారి వివరాలన్నీ తీసుకొని, ఉచితంగా అందజేస్తున్నాం.

మహిళలకు ఉపాధి...

ప్రతి యేటా ఆవుల సంఖ్య పెరుగుతూ ఇప్పుడు 200 వరకు చేరింది. 50 ఆవులను గుట్టల ప్రాంతాల వారికి ఉచితంగా ఇచ్చేశాను. మిగతా వాటి గోమయంతో పళ్ల పొడి నుంచి వందరకాల ఉత్పత్తులను తయారు చేయిస్తున్నాను. ఇక్కడి గిరిజన ప్రాంత స్త్రీలు వీటి తయారీలో పాల్గొంటున్నారు. గోమయ ప్రమిదలు, పిడకలు, యజ్ఞసమిధలు.. ఇలా ఎన్నో వీటి నుంచి తయారు చేస్తున్నాం. చిన్నా పెద్ద టౌన్లలో గోమయం ఉత్పత్తుల తయారీలో వర్క్‌షాప్స్ నిర్వహిస్తున్నాం. ఈ ఉత్పత్తులతో ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేసి, నగర ప్రజలకు చేరువ చేస్తుంటాను. వీటి ద్వారా వచ్చే ఆదాయాన్ని గిరిజన మహిళలకు ఇస్తుంటాను. పట్టణాల్లో ఉన్నవాళ్లు ఎవరైనా వచ్చి ఆవులను చూసుకోవచ్చని 'స్వధర్మ' పేరుతో ఆన్‌లైన్‌లో ప్రాజెక్ట్ స్టార్ట్ చేశాను. వీడియోలు చూసి ముందు చాలా మంది ఉత్సాహం చూపారు. కానీ, చివరకు ముగ్గురు మాత్రమే వచ్చారు. వీడియోల్లో ఆవులను, ఇక్కడి వాతావరణం చూడటం వేరు. కానీ, నేరుగా ఈ పరిస్థితులను ఎదుర్కోవడం వేరు. 'మేమూ వస్తాం, కానీ బెడ్‌రూమ్ ఉందా, అటాచ్డ్ బాత్‌రూమ్ ఉందా' అని అడుగుతుంటారు. కానీ, మేమున్న చోట అలాంటి వసతులేవీ లేవు. దొరికినవి తింటూ, ఆవులతోనే జీవనం సాగిస్తూ ఉంటాం. ఆరు నెలలు గుట్ట ప్రాంతాల్లో, ఆరు నెలలు గోదావరి నదీ తీర ప్రాంతాల వెంబడి తిరుగుతుంటాను. ఈ జీవనంలో ఓ కొత్త వెలుగు, స్వచ్ఛత కనిపిస్తుంటుంది.

నేర్చుకున్న వైద్యం..

మనుషుల మాదిరిగానే ఆవులు కూడా ఎంతో ప్రేమను చూపుతాయి. జబ్బు పడతాయి. వాటికి ఆరోగ్యం బాగోలేకపోతే 'నన్ను చూడు' అన్నట్టుగా దగ్గరగా వచ్చి నిలబడతాయి. కనిపించకపోతే బెంగ పెట్టుకుంటాయి. వాటికి జబ్బు చేస్తే సీనియర్ డాక్టర్స్‌ని పిలిపించి చికిత్స చేయిస్తుంటాను. నేనే వాటి జబ్బుకు తగ్గ చికిత్స చేయడం కూడా నేర్చుకున్నాను. ఆవులకు సంబంధించి మురళీధర గో విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నాను. దీని ద్వారా రేపటి తరం పిల్లలకు మూగ జీవాల విలువ... ముఖ్యంగా ఆవు గొప్పతనాన్ని తెలియజేయాలనుకుంటున్నాను'' అని వివరించారు పద్మ.

– నిర్మలారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

అదర్ సైడ్



– దియా మీర్జా

లైట్స్... కెమెరా... క్లైమేట్ యాక్షన్

**లైట్స్, కెమెరా, యాక్షన్ అనేవి సుప్రసిద్ధ నటి దియా మీర్జాకు సుపరిచిత పదాలు.
అయితే ఆమెకు సంబంధించి ఈ పదాలు సినీ స్టూడియోలకే పరిమితం కాలేదు.
తన కంటి కెమెరాతో ప్రకృతిని చూస్తుంది. పర్యావరణ నష్టానికి సంబంధించిన విధ్వంస చిత్రాలపై నలుగురి దృష్టి పడేలా 'లైట్స్' ఫోకస్ చేస్తోంది. తన వంతు కార్యాచరణగా క్లైమేట్ యాక్షన్ అంటూ నినదిస్తోంది...**

నటిగా సుపరిచితురాలైన దియా మీర్జా గ్లామర్ ఫీల్డ్ నుంచి పర్యావరణ స్పృహకు సంబంధించిన ప్రచారం వైపు అడుగులు వేసింది. 'క్లైమేట్ యాక్టివిస్ట్'గా ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. యూఎస్ ఎన్విరాన్‌మెంట్ గుడ్‌విల్ అంబాసిడర్‌గా ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పర్యావరణ ఉద్యమకారులతో కలిసి పనిచేస్తోంది.

పర్యావరణానికి సంబంధించిన చర్చలు జరిగే ఇంట్లో పెరిగిన దియాకు సహజంగానే పర్యావరణ విషయాలపై ఆసక్తి మొదలైంది. దీనికితోడు స్కూల్లో టీచర్ ద్వారా విన్న పర్యావరణ పాఠాలు కూడా ఆమె మనసుపై బలమైన ప్రభావాన్ని వేసాయి. ఇక కాలేజీ రోజుల్లో పర్యావరణ సంబంధిత చర్చాకార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేది.

'ప్రకృతిపై ప్రేమ అనే విలువైన బహుమతిని తల్లిదండ్రులు నాకు ఇచ్చారు' అంటున్న దియ చిన్నప్పుడు చెట్లు, కొండలు ఎక్కేది. పక్షుల గానాన్ని ఎంజాయ్ చేసేది. మర్రిచెట్టు ఊడలతో ఉయ్యాల ఊగేది. ఉడతలతో గంతులు వేసేది. ఇల్లు దాటి చెట్ల మధ్యకు వెళ్లినప్పుడల్లా తనకు మరో ప్రపంచంలోకి వెళ్లినట్లుగా ఉండేది.

బాలీవుడ్‌లోకి అడుగుపెట్టాక దియాకు పర్యావరణ సంబంధిత అంశాలపై ఎన్నో సామాజిక సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం దొరికింది. ఆ సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా ఎన్నో విషయాలపై అవగాహన ఏర్పడింది. ఆ అవగాహనతోనే పర్యావరణ సంబంధిత కార్యక్రమాలలో పాల్గొనాలని నిర్ణయించుకుంది.

'ప్రజలకు మేలు చేసేదే పర్యావరణానికి మేలు చేస్తుంది' అనే నినాదంతో పర్యావరణ ఉద్యమాలలో భాగం అయింది.

'వాతావరణంలో మార్పు అనేది భవిష్యత్‌కు సంబంధించిన విషయం మాత్రమే కాదు వర్తమానాన్ని కలవరపెడుతున్న విషయం. ప్రకృతిమాత చేస్తున్న మేలును గుర్తుంచుకోలేకపోతున్నాం. పర్యావరణ సంరక్షణ అనేది కేవలం ప్రభుత్వం, స్వచ్ఛందసంస్థలు, శాస్త్రవేత్తలకే పరిమితమైనది కాదు. అన్ని వర్గాల ప్రజలు, అన్ని వయసుల వారు శాస్త్రీయ విషయాలపై అవగాహన పెంచుకోవాలి' అంటుంది దియ.

వాయు కాలుష్యానికి సంబంధించిన అధ్యయనం దియాను ఆందోళనకు గురి చేసింది. 'వాయు కాలుష్యం అనగానే ఢిల్లీ గురించే ఎక్కువగా మాట్లాడతాం. అయితే లక్నో నుంచి ముంబై వరకు ఎన్నో పట్టణాలలో వాయు కాలుష్య సమస్య తీవ్రంగా ఉంది' అంటున్న దియా తన ఎజెండాలో 'స్వచ్ఛమైన గాలి'కి అధిక ప్రాధాన్యత ఇచ్చింది.

ఇక ఆమెను కలవరపెట్టిన మరో సమస్య ప్లాస్టిక్. షూటింగ్ నిమిత్తం మహా పట్టణాల నుంచి మారుమూల పల్లెటూళ్లకు వెళ్లినప్పుడు ప్లాస్టిక్ కనిపించని చోటు అంటూ ఉండేది కాదు.

'ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలను అన్వేషిస్తున్నప్పుడు వాటికి సంబంధించిన కంపెనీలు మన దేశంలోనే ఉన్నాయనే విషయాన్ని తెలుసుకున్నాను. బ్యాంబు బ్రష్‌లు, ఇయర్ బడ్స్ వాడుతున్నాను. నా దగ్గర ఆకర్షణీయమైన బ్యాంబు పోర్టబుల్ స్పీకర్ ఉంది' అంటున్న దియా తాను వాడుతున్న ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువులను స్నేహితులకు కూడా పరిచయం చేస్తుంది.

పర్యావరణ సంరక్షణకు సంబంధించిన ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు పర్యావరణ స్పృహతో కూడిన జీవనవిధానాన్ని ప్రచారం చేయడానికి ఎకో–ఫ్రెండ్లీ సంస్థల్లో పెట్టుబడులు పెడుతుంది దియా మీర్జా. తాను పెట్టుబడులు పెట్టిన అయిదు కంపెనీలు మన దేశానికి చెందినవి. మహిళల నాయకత్వంలో నడుస్తున్నవి.

'నేను కష్టపడి సంపాదించిన డబ్బు, పొదుపు మొత్తాలను పర్యావరణ హిత కంపెనీలలో పెట్టుబడి పెట్టడం గర్వంగా ఉంది' అంటుంది దియా.

దియా మీర్జాకు సొంత నిర్మాణ సంస్థ ఉంది. ఆ ప్రొడక్షన్ హౌజ్ ద్వారా ప్రజల్లో మార్పును తీసుకువచ్చే చిత్రాలను వినోదం మేళవించి తీయాలనుకుంటోంది.

అవును... ఈరోజే మంచిరోజు



అత్యుత్తమ రోజు అంటే ఈ రోజే... అనే సామెత ఉంది. మంచి పని చేయడానికి మరో రోజుతో పనిలేదు. మన భూమిని కాపాడుకోడానికి ప్రతిరోజూ విలువైన రోజే. పిల్లలను పార్క్‌లు, వనాల దగ్గరకు తీసుకువెళ్లడం ద్వారా వారికి ప్రకృతి పట్ల ఆసక్తి కలిగించవచ్చు. పచ్చటి గడ్డిలో పాదరక్షలు లేకుండా నడిపించడం, అప్పుడే మొదలైన వానలో కొంచెంసేపైనా గంతులేసేలా చేయడం...ఇలా చిన్న చిన్న పనుల ద్వారానే వారిని ప్రకృతి నేస్తాలుగా తీర్చిదిద్దవచ్చు. పిల్లలకు వినోదం అంటే సినిమాలు మాత్రమే కాదు. ప్రకృతితో సాన్నిహిత్యానికి మించి పిల్లలకు వినోదం ఏముంటుంది!

– దియా మీర్జా, నటి,
క్లైమేట్ యాక్టివిస్ట్

బ్యూటిప్స్

చేయమన్నారని చేసేయకండి

వారానికి మూడుసార్లు లేదా రోజూ తలస్నానం చేయండి, జుట్టుకు మంచిది అని చెబుతుంటారు. చెప్పారు కదాని చేసేయకండి. ఎందుకంటే మన జుట్టు తత్వాన్ని బట్టి తలస్నానం చేయాలి లేదంటే ఉన్న జుట్టు కూడా ఊడిపోవచ్చు సుమీ.

- పదేపదే జుట్టుని కడగడం వల్ల... జుట్టు పొడిగా మారిపోతుంది. అందువల్ల జుట్టు తత్వాన్ని బట్టి తలస్నానం చేయాలి.
- భరించలేనంత జిడ్డుకారుతుంటే రోజూ తలస్నానం చేయాలి.
- పని ప్రదేశంలో బాగా చెమటలు పడుతుంటే రోజూ తలస్నానం చేయాలి. అయితే షాంపుతో కాకుండా సాధారణ నీటితో తలను కడగాలి. ఇలా తగు జాగ్రత్తలు తీసుకుంటూ తలస్నానం చేస్తే కురులు ఆరోగ్యంగా అందంగా ఉంటాయి.



- మాడు నూనె కారుతుంటే తలస్నానం చేయడం మంచిది కాదు. తలలో సహజ సిద్ధంగా విడుదలయ్యే నూనెలు జుట్టుకు చాలా ముఖ్యం. జిడ్డుగా ఉందని పదేపదే తలస్నానం చేస్తే మాడు పొడి బారి చుండ్రు, ఇతర సమస్యలు చుట్టుముడతాయి.

బొమ్మల భాష

సైన్స్ చిత్రకారుడు మన్నాన్ ప్రస్థానం



**అక్షరం పుట్టక ముందే చిత్రం రూపుదిద్దుకుంది.
ప్రపంచంలో సైగల తర్వాత భాష బొమ్మలదే.
పది వాక్యాల విషయాన్ని ఒక బొమ్మ చెప్తుంది.
ఆ బొమ్మలతోనే శాస్త్రాన్ని బోధిస్తే ఎలా ఉంటుంది?
విజ్ఞాన శాస్త్రం వినోద శాస్త్రమవుతుంది.
ఆనందంగా మెదడుకు చేరుతుంది.
మరిచిపోలేని జ్ఞానంగా మిగులుతుంది.**

అధ్యయనానికి అక్షర రూపమిస్తే మహాగ్రంథమవుతుంది. అధ్యయనానికి చిత్రరూపమిస్తే అద్భుతమైన చిత్రకావ్యం అవుతుంది. అలాంటి వందల చిత్రకావ్యాలకు రూపమిచ్చారు అబ్దుల్ మన్నాన్. డెబ్బై ఏళ్ల మన్నాన్ ఐదు వేలకు పైగా బొమ్మలు వేశారు. ''నా వయసులో నుంచి మూడేళ్లు తగ్గిస్తే నాలోని చిత్రకారుడి వయసది. నా బొమ్మల్లో ఒక్కొక్క థీమ్‌తో కొన్ని వందల చిత్రాలున్నాయి. ఆ చిత్రాల్లో ఒక్కటి చేజారినా చిత్రకావ్యంలో అనుసంధానత లోపిస్తుంది. అందుకే నా బొమ్మలను ఎవరికీ ఇవ్వలేదు, డబ్బు కోసం అమ్మనూ లేదు'' అన్నారు అబ్దుల్ మన్నాన్







బొమ్మల చదువు!

మా సొంతూరు ఆంధ్రప్రదేశ్, మచిలీపట్నం, బంటుమిల్లి దగ్గర చిన పాండ్రాక. ఐదవ తరగతి వరకు అక్కడే చదువుకున్నాను. ఆ తర్వాత నా చదువు గుడివాడలో సాగింది. ఏఎన్నార్ కాలేజ్‌లో బీఎస్సీ చదివాను. బొమ్మల మీదున్న ఆసక్తి కొద్దీ చెన్నైకి వెళ్లి 'శంతనుస్ చిత్ర విద్యాలయం'లో ఆర్ట్ డిప్లమో చేశాను. చెన్నైలోనే బాలమిత్ర, బాలభారతి, బుజ్జాయి వంటి పిల్లల పత్రికల్లో ఇలస్ట్రేటర్‌గా ఐదారేళ్లపాటు ఉద్యోగం చేశాను. అక్కడి నుంచి నా అడుగులు సినీఫీల్డ్ వైపు పడ్డాయి. అసిస్టెంట్ ఆర్ట్ డైరెక్టర్‌గా సుమారు ఐదేళ్లు చేశాను. చెన్నైలో కవి సమ్మేళనాలు ఎక్కువగా జరిగేవి. మహాలక్ష్మి క్లబ్‌లో తెలుగు వాళ్ల కార్యక్రమాలు జరిగేవి. దాదాపుగా అన్నింటికీ హాజరయ్యేవాడిని. అలా శ్రీశ్రీ,, దేవులపల్లి కృష్ణశాస్త్రి, ఆరుద్ర వంటి కవులతోపాటు సినీ పరిశ్రమలో ఎన్టీఆర్, ఏఎన్నార్, ఆర్ నారాయణమూర్తి వంటి చాలామందితో పరిచయాలయ్యాయి. దక్షిణాది భాషలు వచ్చాయి. ఇలా కొంత వైవిధ్యంగానే మొదలైంది నా కెరీర్.

'చిత్ర' ప్రమాదాలు

చిత్రకారుడు తన దేహానికి గాయమైనా పట్టించుకోడు. కానీ తన బొమ్మలకు ప్రమాదం వాటిల్లితే ప్రాణం పోయినట్లు విలవిలలాడుతాడు. అందుకు నా జీవితమే పెద్ద ఉదాహరణ. నా చిత్రకార జీవితంలో మూడు ప్రమాదాలను ఎదుర్కొన్నాను. గుడివాడలో ఇల్లు అగ్ని ప్రమాదానికి గురయ్యి చిన్నప్పటి నుంచి వేసిన బొమ్మలన్నీ కాలిపోయాయి. మరోసారి చెన్నైలో ఇంట్లో దొంగలు పడి నా పెయింటింగ్స్ పెట్టెను కూడా దోచుకుపోయారు. ఇక మూడవది హైదరాబాద్‌లో. ఈ ఏడాది వరదల్లో టోలిచౌకిలోని మా ఇంట్లో మూడు రోజులు నీళ్లు నిలిచిపోయాయి. అప్పుడు తడిసిపోయినవి పోగా మళ్లీ వేసిన బొమ్మలు ఐదు వందలు ఎగ్జిబిషన్‌కు సిద్ధంగా ఉన్నాయి. ఒక్కొక్క ప్రమాదం తర్వాత నాలోని చిత్రకారుడు మళ్లీ మళ్లీ పుట్టాడు.


– అబ్దుల్ మన్నాన్, సైన్స్ చిత్రకారుడు

వైవిధ్యత ఆకట్టుకుంది!

సైన్స్ చిత్రాల చిత్రకారుడిగా మారడానికి బీజం పడింది మాత్రం ఇంటర్‌లోనే. డార్విన్ సిద్ధాంతం 'ఆరిజిన్ ఆఫ్ స్పీసీస్' చదవడం నా మెదడులో కొత్త ప్రపంచానికి ఆవిష్కారం జరిగింది. అలాగే మరో పుస్తకం 'ఫేమస్ ఫైవ్ హండ్రెడ్ ఆర్టిస్ట్స్ ఇన్ ద వరల్డ్'. ప్రపంచంలోని చిత్రకారులను చదివినప్పుడు పికాసో నుంచి డావిన్సీ వరకు ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులెవ్వరూ సైన్స్ ఇతివృత్తంగా బొమ్మలు వేయలేదని అవగతమైంది. దాంతో ఆ ఖాళీని పూరించాలనుకున్నాను. అలా నా చిత్రాలకు సైన్స్, నేచర్ ప్రధానమైన టాపిక్స్ అయ్యాయి. జీవ వైవిధ్యత నన్ను కట్టి పడేసే అంశం. దాంతో ప్రతి జీవి గురించి క్షుణ్ణంగా అధ్యయనం చేశాను. డార్విన్ సిద్ధాంతం చదివినప్పుడు కలిగిన సందేహాలకు సమాధానాల కోసం లెక్కలేనన్ని పుస్తకాలు చదివాను. ఉదాహరణకు క్యాట్ ఫ్యామిలీ గురించి మాట్లాడాల్సి వస్తే ఏ ఖండంలో ఎలాంటి జాతి క్యాట్‌లుంటాయో అనర్గళంగా చెప్పగలను. శిలాజాలను అధ్యయనం చేసి ఆ ప్రాణి ఊహాచిత్రాన్ని వేయడం, ఎండమిక్ స్పీసీస్ బొమ్మలేయడంలో అనంతమైన సంతృప్తి కలగడం మొదలైంది. ఇక ఆ అలవాటును కొనసాగించాను.









సైన్స్ పాఠాల బోధన!

నా వృత్తి ప్రవృత్తి రెండూ సైన్స్‌లోనే వెతుక్కున్నాను. ఎనిమిదవ తరగతి నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైన్స్ పాఠాలు చెప్పేవాడిని. నా భార్య గవర్నమెంట్ టీచర్. నేను జగిత్యాల జిల్లా మెట్‌పల్లిలో ట్యూటోరియల్స్ నిర్వహించాను. స్కూళ్లలో డ్రాయింగ్ టీచర్‌గా పిల్లలకు బొమ్మలు వేయడం నేర్పించాను. నేను అందుకున్న అవార్డులకంటే నా విద్యార్థులు అందుకున్న అవార్డులే ఎక్కువ. నేను పీటీరెడ్డి అవార్డు, మూడు జాతీయ స్థాయి అవార్డులందుకున్నాను. నా బొమ్మలు ఆహ్లాదం కోసం చూసేవి కాదు. అవి అధ్యయన మాధ్యమాలు. శాతవాహన, కాకతీయ యూనివర్సిటీలు, వైజాగ్‌లో కాలేజీలు, కరీంనగర్ ఉమెన్స్ కాలేజ్, చాలాచోట్ల స్కూళ్లలోనూ ప్రదర్శనలు నిర్వహించాను'' అని తన చిత్రప్రస్థానాన్ని వివరించారు అబ్దుల్ మన్నాన్.

– వాకా మంజులారెడ్డి, సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఫొటోలు : అనిల్ కుమార్ మోర్ల



భారత చెస్ జట్ల శుభారంభం

ఆసియా క్రీడల చెస్ టీమ్ ఈవెంట్‌లో భారత పురుషుల, మహిళల జట్లు శుభారంభం చేశాయి. శుక్రవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో భారత పురుషుల జట్టు 3.5-0.5తో మంగోలియాపై... భారత మహిళల జట్టు 3.5-0.5తో ఫిలిప్పీన్స్‌పై గెలుపొందాయి. భారత పురుషుల జట్టుకు ఆడుతున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్‌తోపాటు ప్రజ్ఞానంద, విదిత్ తమ గేముల్లో గెలుపొందగా... దొమ్మరాజు గుకేశ్ తన గేమ్‌ను 'డ్రా' చేసుకున్నాడు. భారత మహిళల జట్టుకు ఆడుతున్న ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారికతోపాటు వైశాలి, సవితా శ్రీ తమ గేముల్లో నెగ్గగా... వంతిక అగర్వాల్ తన గేమ్‌ను 'డ్రా' చేసుకుంది.

భారత స్విమ్మర్లకు నిరాశ

ఆసియా క్రీడల నుంచి భారత స్విమ్మర్లు రిక్తహస్తాలతో వెనుదిరిగారు. శుక్రవారంతో స్విమ్మింగ్ ఈవెంట్స్ ముగియగా... భారత స్విమ్మర్లు కాంస్యం కూడా గెలవలేకపోయారు. శుక్రవారం పురుషుల 200 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఈవెంట్ ఫైనల్లో సజన్ ప్రకాశ్ ఐదో స్థానంలో... 200 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్ ఫైనల్లో అద్వైత్ ఏడో స్థానంలో నిలిచారు. మహిళల 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో హైదరాబాద్ స్విమ్మర్ వ్రితి అగర్వాల్ హీట్స్‌లో ఐదో స్థానంలో నిలిచింది.

పతకాల పట్టిక (టాప్-10)

దేశం	స్వ	ర	కాం	మొ
చైనా	105	63	32	200
జపాన్	27	35	37	99
దక్షిణ కొరియా	26	28	48	102
భారత్	8	12	13	33
థాయ్‌లాండ్	8	3	9	20
ఉజ్బెకిస్తాన్	7	10	15	32
హాంకాంగ్	5	13	18	36
చైనీస్ తైపీ	5	6	9	20
ఇరాన్	3	10	10	23
ఉత్తర కొరియా	3	6	4	13

నోట్: స్వ-స్వర్ణం, ర-రజతం, కాం-కాంస్యం, మొ-మొత్తం.

పతకాల మోత...

ఒకే రోజు భారత్‌కు ఎనిమిది పతకాలు

- షూటింగ్‌లో రెండు స్వర్ణాలు, మూడు రజతాలు
- టెన్నిస్ డబుల్స్‌లో రజతం
- అథ్లెటిక్స్, స్క్వాష్‌లో కాంస్యాలు

- మెరిసిన తెలంగాణ షూటర్ ఇషా సింగ్
- 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రెండు రజతాలు

- పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో భారత జట్టు ప్రపంచ రికార్డు


ఇషా సింగ్, పలక్

చైనా గడ్డపై భారత క్రీడాకారుల పతకాల వేట అప్రతిహతంగా కొనసాగుతోంది. పోటీల ఆరో రోజు భారత్ ఏకంగా ఎనిమిది పతకాలతో అదరగొట్టింది. ఇందులో రెండు స్వర్ణాలు, నాలుగు రజతాలు, రెండు కాంస్య పతకాలు ఉన్నాయి. పురుషుల డబుల్స్ టెన్నిస్‌లో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ జోడీ రజతం నెగ్గింది. మహిళల స్క్వాష్ టీమ్ ఈవెంట్‌లో భారత జట్టు సెమీస్‌లో ఓడి కాంస్యం సాధించింది. అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో కిరణ్ బలియాన్ కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ఫలితంగా పతకాల పట్టికలో భారత్ నాలుగో స్థానానికి ఎగబాకింది. 1986 సియోల్ ఆసియా క్రీడల్లో ఐదో స్థానంలో నిలిచిన భారత్ ఆ తర్వాత మళ్లీ టాప్-5లోకి రావడం ఇదే తొలిసారి. తదుపరి అథ్లెటిక్స్, ఆర్చరీ, రెజ్లింగ్, హాకీ, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్‌లోనూ మరిన్ని పతకాలు వచ్చే అవకాశముండటంతో భారత్ ఈసారి నాలుగో స్థానంతో ఆసియా క్రీడలను దిగ్విజయంగా ముగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

72 ఏళ్ల తర్వాత...

- మహిళల షాట్‌పుట్‌లో భారత్‌కు తొలి పతకం
- కిరణ్ బలియాన్ ఘనత



సుదీర్ఘ నిరీక్షణకు తెరపడింది. ఆసియా క్రీడల అథ్లెటిక్స్ మహిళల షాట్‌పుట్ ఈవెంట్‌లో భారత్‌కు 72 ఏళ్ల తర్వాత మళ్లీ పతకం లభించింది. శుక్రవారం జరిగిన షాట్‌పుట్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన 24 ఏళ్ల కిరణ్ బలియాన్ మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం సొంతం చేసుకుంది. కిరణ్ ఇనుప గుండును 17.36 మీటర్ల దూరం విసిరింది. ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ ప్రాంతానికి చెందిన ట్రాఫిక్ పోలీస్ హెడ్ కానిస్టేబుల్ కూతురైన కిరణ్ తొమ్మిదేళ్ల క్రితం ఈ ఆటలో ప్రవేశించింది. 1951లో న్యూఢిల్లీ వేదికగా జరిగిన తొలి ఆసియా క్రీడల్లో మహిళల షాట్‌పుట్ క్రీడాంశంలో ఆంగ్లో ఇండియన్ బార్బరా వెబ్‌స్టర్ కాంస్య పతకం గెల్చుకుంది. ఆ తర్వాత ఈ క్రీడాంశంలో కిరణ్ బలియాన్ రూపంలో భారత్‌కు రెండో పతకం లభించడం విశేషం. లిజియావో గాంగ్ (చైనా; 19.58 మీటర్లు) స్వర్ణం... జియాయువాన్ సాంగ్ (చైనా; 18.92 మీటర్లు) రజతం సాధించారు. భారత్‌కే చెందిన మరో షాట్‌పుటర్ మన్‌ప్రీత్ కౌర్ (16.25 మీటర్లు) ఐదో స్థానంలో నిలిచింది. మహిళల హ్యామర్ త్రో ఈవెంట్‌లో భారత క్రీడాకారిణులు తాన్యా చౌదరీ (60.50 మీటర్లు) ఏడో స్థానంలో, రచనా కుమారి (58.13 మీటర్లు) తొమ్మిదో స్థానంలో నిలిచి నిరాశపరిచారు. మహిళల 20 కిలోమీటర్ల నడక రేసులో ప్రియాంక గోస్వామి (1గం:43ని:7 సెకన్లు)... పురుషుల 20 కిలోమీటర్ల నడక రేసులో వికాశ్ సింగ్ (1గం:27ని:33 సెకన్లు) ఐదో స్థానంలో నిలిచారు.

హాంగ్జౌ: ఆసియా క్రీడల్లో మరోసారి భారత తుపాకీ గురి అదిరింది. శుక్రవారం భారత షూటర్లు రెండు స్వర్ణాలు, మూడు రజత పతకాలతో మెరిపించారు. ముందుగా పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, స్వప్నిల్ కుసాలె, అఖిల్ షెరాన్‌లతో కూడిన భారత జట్టు 1769 పాయింట్లు స్కోరు కొత్త ప్రపంచ రికార్డు సృష్టించింది. అంతేకాకుండా స్వర్ణ పతకాన్ని కూడా సొంతం చేసుకుంది. 2022లో 1761 పాయింట్లతో అమెరికా నెలకొల్పిన ప్రపంచ రికార్డును భారత జట్టు బద్దలు కొట్టింది. క్వాలిఫయింగ్‌లో స్వప్నిల్ (10 పాయింట్ల షాట్‌లు 33), ఐశ్వరీ ప్రతాప్ సింగ్ (10 పాయింట్ల షాట్‌లు 27) 591 పాయింట్ల చొప్పున స్కోరు చేసి వరుసగా తొలి రెండు స్థానాల్లో నిలిచి వ్యక్తిగత విభాగం ఫైనల్‌కు అర్హత పొందారు. అఖిల్ షెరాన్ 587 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో నిలిచాడు. అయితే ఒక దేశం నుంచి గరిష్టంగా ఇద్దరు షూటర్లు మాత్రమే ఫైనల్లో ఆడాలి. దాంతో అఖిల్ ఫైనల్‌కు దూరమయ్యాడు. టాప్-8లో నిలిచిన షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ 459.7 పాయింట్లు సాధించి రెండో స్థానంలో నిలిచి రజత పతకం గెల్చుకున్నాడు. స్వప్నిల్ 438.9 పాయింట్లతో నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నాడు.

పలక్ 'పసిడి'...

మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్, వ్యక్తిగత ఈవెంట్లలో భారత షూటర్లు అద్భుత ప్రతిభతో ఆకట్టుకున్నారు. పలక్, ఇషా సింగ్, దివ్యలతో కూడిన భారత జట్టు 1731 పాయింట్లు స్కోరు చేసి రజత పతకం దక్కించుకుంది. క్వాలిఫయింగ్‌లో తెలంగాణ షూటర్ ఇషా సింగ్ 579 పాయింట్లు సాధించి ఐదో స్థానంలో, పలక్ 577 పాయింట్లు సాధించి ఏడో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత పొందారు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో పలక్ 242.1 పాయింట్లు స్కోరు చేసి పసిడి పతకం సొంతం చేసుకోగా... ఇషా సింగ్ 239.7 పాయింట్లతో రజత పతకాన్ని గెల్చుకుంది. పాకిస్తాన్ షూటర్ తలత్ కిష్మలా 218.2 పాయింట్లతో కాంస్య పతకం సాధించింది. ఈ ఆసియా క్రీడల్లో ఇషా సింగ్ ఓవరాల్‌గా నాలుగు పతకాలు సాధించడం విశేషం.


పురుషుల 50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్ ఈవెంట్‌లో కొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పి స్వర్ణ పతకాన్ని సాధించిన భారత షూటర్ల బృందం స్వప్నిల్ కుసాలె, ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, అఖిల్ షెరాన్

సాకేత్-రామ్ జోడీకి రజతం


రామ్‌కుమార్ సాకేత్ మైనేని

పురుషుల టెన్నిస్ డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-రామ్‌కుమార్ రామనాథన్ జంట భారత్‌కు రజత పతకం అందించింది. ఫైనల్లో సాకేత్-రామ్‌కుమార్ ద్వయం 4-6, 4-6తో జేసన్ జంగ్-యు సియో సు (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓటమి చవిచూసింది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాకేత్‌కిది ఆసియా క్రీడల్లో మూడో పతకం. 2014 ఇంచియోన్ ఆసియా క్రీడల్లో సాకేత్ పురుషుల డబుల్స్‌లో సనమ్ సింగ్‌తో కలిసి రజతం... మిక్స్‌డ్ డబుల్స్‌లో సానియా మీర్జాతో కలిసి స్వర్ణ పతకం సాధించాడు. మరోవైపు మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బోపన్న-రుతుజా భోస్లే (భారత్) జోడీ ఫైనల్లోకి దూసుకెళ్లింది. సెమీఫైనల్లో బోపన్న-రుతుజా ద్వయం 6-1, 3-6, 10-4తో 'సూపర్ టైబ్రేక్'లో చాన్ హావో చింగ్-యు సియో సు (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. నేడు జరిగే ఫైనల్లో లియాంగ్ ఎన్ షువో-హువాంగ్ సుంగ్ హావో (చైనీస్ తైపీ)లతో బోపన్న-రుతుజా తలపడతారు.

37 ఏళ్ల తర్వాత మళ్లీ పతకం

సెమీస్‌లో భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు



అందివచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు ఆసియా క్రీడల్లో 37 ఏళ్ల తర్వాత మళ్లీ సెమీఫైనల్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. తద్వారా కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. అత్యంత సులువైన 'డ్రా' పొందిన భారత పురుషుల జట్టు క్వార్టర్ ఫైనల్లో నేపాల్ జట్టుపై 3-0తో గెలిచింది. తొలి సింగిల్స్‌లో లక్ష్య సేన్ 21-5, 21-8తో ప్రిన్స్ దహాల్‌పై... రెండో సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 21-4, 21-3తో సునీల్ జోషిపై... మూడో సింగిల్స్‌లో మిథున్ మంజునాథ్ 21-2, 21-17తో బిష్ణు కతువాల్‌పై నెగ్గారు. నేడు జరిగే సెమీఫైనల్లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది. భారత పురుషుల జట్టు ఇప్పటి వరకు ఆసియా క్రీడల్లో మూడుసార్లు సెమీఫైనల్లో ఓడిపోయి (టెహ్రాన్; 1974లో, న్యూఢిల్లీ; 1982లో, సియోల్; 1986లో) కాంస్య పతకాలు సాధించింది. మరోవైపు భారత మహిళల జట్టు కథ ముగిసింది. క్వార్టర్ ఫైనల్లో భారత్ 0-3తో థాయ్‌లాండ్ చేతిలో ఓడిపోయింది. తొలి మ్యాచ్‌లో పీవీ సింధు 21-14, 15-21, 14-21తో చోచువోంగ్ చేతిలో... రెండో మ్యాచ్‌లో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ 19-21, 5-21తో జాంగ్‌కోల్ఫాన్-రవింద ప్రజోంగ్‌జయ్ చేతిలో... మూడో మ్యాచ్‌లో అష్మిత చాలిహా 9-21, 16-21తో బుసానన్ చేతిలో పరాజయం పాలయ్యారు.

నిఖత్ 'డబుల్' ధమాకా

పతకంతోపాటు పారిస్ ఒలింపిక్స్ బెర్త్ ఖరారు



తన పంచ్ పవర్ ఎలా ఉంటుందో భారత మహిళా స్టార్ బాక్సర్ నిఖత్ జరీన్ మరోసారి చాటుకుంది. ఆసియా క్రీడల్లో తొలిసారి పాల్గొంటున్న ఈ తెలంగాణ బాక్సర్ 50 కేజీల విభాగంలో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకోవడంతోపాటు వచ్చే ఏడాది జరిగే పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో నిఖత్ కేవలం 53 సెకన్లలో రిఫరీ స్టాప్స్ కంటెస్ట్ (ఆర్‌ఎస్‌సీ) పద్ధతిలో విజయాన్ని అందుకుంది. హనన్ నాసర్ (జోర్డాన్)తో జరిగిన ఈ బౌట్‌లో నిఖత్ సంధించిన పంచ్‌లకు ఆమె ప్రత్యర్థి బెంబేలెత్తిపోయింది. దాంతో మూడు నిమిషాల నిడివి గల తొలి రౌండ్‌లో 53 సెకన్లు ముగియగానే రిఫరీ బౌట్‌ను నిలిపివేసి నిఖత్‌ను విజేతగా ప్రకటించారు. గత ఏడాది బర్మింగ్‌హమ్ కామన్వెల్త్ గేమ్స్‌లో.. 2022, 2023 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు గెలిచిన నిఖత్ ఆసియా క్రీడల పతకాన్ని కూడా ఖాయం చేసుకుంది. 'క్వార్టర్ ఫైనల్లో గెలవడంతోపాటు తొలిసారి ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించినందుకు చాలా ఆనందంగా ఉంది. నా తదుపరి లక్ష్యం పారిస్ ఒలింపిక్స్‌లో స్వర్ణం సాధించడమే' అని 27 ఏళ్ల నిఖత్ వ్యాఖ్యానించింది. ఆదివారం జరిగే సెమీఫైనల్లో చుథామట్ రక్సత్ (థాయ్‌లాండ్)తో నిఖత్ తలపడుతుంది. మరోవైపు 57 కేజీల విభాగంలో పర్వీన్ క్వార్టర్ ఫైనల్ చేరగా... పురుషుల 80 కేజీల విభాగంలో లక్ష్య చహర్ ఓడిపోయాడు. పర్వీన్ 5-0తో జిచున్ జు (చైనా)పై నెగ్గగా... లక్ష్య చహర్ 1-4తో ఒమురబెక్ (కిర్గిస్తాన్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

స్క్వాష్‌లో మహిళల జట్టుకు కాంస్యం పసిడి పోరుకు పురుషుల జట్టు



ఆసియా క్రీడల స్క్వాష్ క్రీడాంశంలో భారత జట్లకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. జోష్నా చినప్ప, తన్వీ ఖన్నా, అనాహత్ సింగ్, దీపిక పల్లికల్‌లతో కూడిన భారత మహిళల జట్టు సెమీఫైనల్లో 1-2తో డిఫెండింగ్ చాంపియన్ హాంకాంగ్ జట్టు చేతిలో ఓడిపోయి కాంస్య పతకాన్ని దక్కించుకుంది. తొలి మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 6-11, 7-11, 3-11తో చాన్ సిన్ యుక్ చేతిలో ఓడిపోగా... రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7-11, 11-7, 9-11, 11-6, 11-8తో హో జె లోక్‌పై గెలిచి స్కోరును 1-1తో సమం చేసింది. నిర్ణాయక మూడో మ్యాచ్‌లో అనాహత్ సింగ్ 8-11, 7-11, 10-12తో లీ కా యి చేతిలో ఓడిపోయింది. 2010 ఆసియా క్రీడల్లో కాంస్యం నెగ్గిన భారత జట్టు 2014, 2018 క్రీడల్లో రజతం సాధించింది. మరోవైపు భారత పురుషుల జట్టు 2-0తో డిఫెండిగ్ చాంపియన్ మలేసియాను ఓడించి పసిడి పతక పోరుకు అర్హత సాధించింది. తొలి మ్యాచ్‌లో అభయ్ సింగ్ 11-3, 12-10, 9-11, 11-6తో అదీన్ ఇద్రాకీపై... రెండో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 11-8, 11-6, 10-12, 11-3తో ఎన్జీ ఎయిన్‌పై గెలిచారు. నేడు జరిగే ఫైనల్లో పాకిస్తాన్‌తో భారత్ ఆడుతుంది.

భారత మహిళల హాకీ జట్టుకు రెండో గెలుపు

ఆసియా క్రీడల మహిళల హాకీలో భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. తొలి మ్యాచ్‌లో సింగపూర్‌పై 13-0తో నెగ్గిన టీమిండియా... శుక్రవారం జరిగిన రెండో లీగ్ మ్యాచ్‌లో 6-0తో మలేసియా జట్టును ఓడించింది. భారత్ తరఫున మోనిక (7వ ని.లో), వైస్ కెప్టెన్ దీప్ గ్రేస్ ఎక్కా (8వ ని.లో), నవ్‌నీత్ కౌర్ (11వ ని.లో), వైష్ణవి విఠల్ ఫాల్కే (15వ ని.లో), సంగీత కుమారి (24వ ని.లో), లాల్‌రెమ్‌సియామి (50వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. ఆదివారం జరిగే తమ తదుపరి మ్యాచ్‌లో దక్షిణ కొరియాతో భారత్ ఆడుతుంది.



అన్ని అస్త్రాలతో సిద్ధం

- నేడు భారత్ తొలి వామప్ పోరు
- ఇంగ్లండ్‌తో ఆడనున్న టీమిండియా
- మధ్యాహ్నం 2 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం

వన్డే ప్రపంచకప్ మరో 5 రోజుల్లో



గువహటి: ఆసియా కప్‌లో విజేత, ఆపై ఆస్ట్రేలియా లాంటి పటిష్టమైన జట్టుపై సిరీస్ విజయం... సరిగ్గా చెప్పాలంటే వన్డే వరల్డ్ కప్‌కు ముందు భారత జట్టుకు సరైన సన్నాహకం లభించింది. కొత్తగా టీమిండియా ప్రాక్టీస్ మ్యాచ్‌లో పరీక్షించుకునేందుకు ఏమీ లేదు. వరల్డ్ కప్ జట్టులోని ఆటగాళ్లంతా సత్తా చాటి తమ స్థానాలను ఖాయం చేసుకోగా, చివరి నిమిషంలో జట్టుతో చేరిన అశ్విన్ కూడా ఆసీస్‌తో తొలి రెండు వన్డేల్లో తన విలువేంటో చూపించాడు. అయితే ప్రపంచకప్‌కు ముందు మరో అగ్రశ్రేణి జట్టుతో పోరు అంటే ఉదాసీనతకు తావు లేకుండా మరోసారి తమ అస్త్రాలను చక్కదిద్దుకునేందుకు ఉపకరిస్తుంది. ఈ నేపథ్యంలో నేడు తమ తొలి వామప్ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌తో భారత్ తలపడనుంది. తమ రెండో వామప్ మ్యాచ్‌లో చిన్న జట్టయిన నెదర్లాండ్స్ ప్రత్యర్థి కావడంతో ఈ తొలి పోరు టీమిండియాకు సరైన సాధన కానుంది. రాజ్‌కోట్ నుంచి నేరుగా గువహటి చేరిన భారత జట్టుకు శుక్రవారం ఆప్షనల్ ప్రాక్టీస్‌కు అవకాశం ఇచ్చారు. అయితే నలుగురు భారత ఆటగాళ్లు గిల్, ఇషాన్ కిషన్, శార్దుల్ ఠాకూర్, అశ్విన్ దీనికి హాజరయ్యారు.

అశ్విన్ తన ఆటకు మరింత పదును పెట్టుకుంటూ సుదీర్ఘ సమయం పాటు ప్రాక్టీస్ చేశాడు. వామప్ మ్యాచే అయినా ఇంగ్లండ్‌లాంటి భారీ హిట్టర్లు ఉన్న టీమ్‌పై అతను ఎలా ప్రభావం చూపిస్తాడనేది ఆసక్తికరం. తుది జట్టులో ఎనిమిదో స్థానం కోసం పిచ్ పరిస్థితులను బట్టి అశ్విన్, శార్దుల్ మధ్యే పోటీ ఉంది. ఈ నేపథ్యంలో శార్దుల్ కూడా తన బౌలింగ్‌లో సత్తా చాటాల్సి ఉంది. ఆసీస్‌తో చివరి మ్యాచే ఆడిన రోహిత్, కోహ్లి... ఆ మ్యాచ్‌కు దూరమైన గిల్, పాండ్యా మరింత ప్రాక్టీస్ కోసం కచ్చితంగా ఈ మ్యాచ్ బరిలోకి దిగవచ్చు. నిబంధనల ప్రకారం 11 మంది బ్యాటింగ్, 11 మంది బౌలింగ్ చేయవచ్చు కాబట్టి అందరినీ పరీక్షించుకునేందుకు కూడా ఇది తగిన అవకాశం. మరోవైపు 38 గంటల పాటు ప్రయాణించిన తర్వాత గురువారం రాత్రి గువహటి చేరిన ఇంగ్లండ్ జట్టు సభ్యులు తీవ్ర అలసటతో ఉన్నారు. వారు కోలుకొని మ్యాచ్‌లో సత్తా చాటగలరా లేక ప్రధాన ఆటగాళ్లంతా మైదానంలోకి దిగకుండా తప్పుకుంటారా చూడాలి. జేసన్ రాయ్‌లాంటి హిట్టర్ స్థానంలో చివరి నిమిషంలో చోటు దక్కించుకున్న హ్యారీ బ్రూక్‌కు వరల్డ్ కప్ పెద్ద పరీక్ష. వామప్‌లో అతను భారత స్పిన్నర్లను ఎలా ఎదుర్కోగలడనేది ఆసక్తికరం. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ తరఫున ఒక్క సెంచరీ చేసిన మ్యాచ్ మినహా మిగతా అన్నింటిలో అతను విఫలమయ్యాడు. పదో నంబర్ వరకూ బ్యాటింగ్ చేయగల ఆటగాళ్లు ఉండటం ఆ జట్టు బలం. ఇటీవల సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను ఇంగ్లండ్ 2-1తో గెలుచుకుంది.

పరుగుల జోరులో కివీస్‌దే పైచేయి

- తొలి వామప్ మ్యాచ్‌లో విజయం
- ఐదు వికెట్లతో ఓడిన పాకిస్తాన్
- రిజ్వాన్ సెంచరీ వృథా


రచిన్ రవీంద్ర

సాక్షి, హైదరాబాద్: ఊహించినట్లుగానే ఉప్పల్ స్టేడియం భారీ స్కోర్లకు వేదికైంది. బ్యాటింగ్‌కు బాగా అనుకూలంగా ఉన్న పిచ్‌పై పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు పరుగుల వరద పారించాయి. అయితే చివరకు ఛేదనలో సత్తా చాటిన కివీస్‌దే పైచేయి అయింది. శుక్రవారం రాజీవ్‌గాంధీ స్టేడియంలో జరిగిన తొలి వామప్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ ఐదు వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 50 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 345 పరుగులు చేసింది. మొహమ్మద్ రిజ్వాన్ (94 బంతుల్లో 103 రిటైర్డ్‌హర్ట్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీ సాధించగా... కెప్టెన్ బాబర్ ఆజమ్ (84 బంతుల్లో 80; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), సౌద్ షకీల్ (53 బంతుల్లో 75; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధసెంచరీలు చేశారు. చివర్లో ఆగా సల్మాన్ (23 బంతుల్లో 33 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా ధాటిగా ఆడాడు. అనంతరం న్యూజిలాండ్ 43.4 ఓవర్లలో 5 వికెట్లకు 346 పరుగులు సాధించి గెలిచింది. రచిన్ రవీంద్ర (72 బంతుల్లో 97; 16 ఫోర్లు, 1 సిక్స్), మార్క్ చాప్‌మన్ (41 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), డరైల్ మిచెల్ (57 బంతుల్లో 59 రిటైర్డ్ నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), కేన్ విలియమ్సన్ (50 బంతుల్లో 54 రిటైర్డ్ నాటౌట్; 8 ఫోర్లు) విజయంలో కీలక పాత్ర పోషించారు. భద్రతా కారణాలతో పోలీసు యంత్రాంగం సూచనల కారణంగా ఈ మ్యాచ్‌కు ప్రేక్షకులను అనుమతించలేదు. ఖాళీ మైదానంలో ఇరు జట్ల బ్యాటర్లు భారీ షాట్లు బాదారు. ఈ స్టేడియంలో అక్టోబర్ 3న పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య మరో వామప్ మ్యాచ్ జరుగుతుంది.


రిజ్వాన్

తొలి మ్యాచ్‌కు విలియమ్సన్ దూరం

పాక్‌తో వామప్ మ్యాచ్‌లో సత్తా చాటినా... అసలు పోరు సమయానికి విలియమ్సన్ పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండే అవకాశం కనిపించడం లేదు. అందుకే అక్టోబర్ 5న ఇంగ్లండ్‌తో జరిగే వరల్డ్ కప్ ఆరంభ మ్యాచ్‌కు అతను దూరమయ్యాడు.

శ్రీలంకకు బంగ్లాదేశ్ షాక్

గువహటి: మరో వామప్ మ్యాచ్‌లో బంగ్లాదేశ్ ఏడు వికెట్లతో శ్రీలంకను ఓడించింది. శ్రీలంక 49.1 ఓవర్లలో 263 పరుగులకు ఆలౌటైంది. నిసాంక (68), ధనంజయ (55) అర్ధ సెంచరీలు చేయగా... మెహదీ హసన్ 3 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బంగ్లాదేశ్ 42 ఓవర్లలో 3 వికెట్లకు 264 పరుగులు సాధించి నెగ్గింది.తన్‌జీద్ (84), మిరాజ్ (67 నాటౌట్), లిటన్ దాస్ (61) కలిసి జట్టును గెలిపించారు. మరోవైపు తిరువనంతపురంలో దక్షిణాఫ్రికా, అఫ్గానిస్తాన్ మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲ 320	65,828	
నిఫ్టీ ▲ 115	19,638	

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	13,218	▲ 17
డోజోన్స్	33,536	▼ 130
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,608	▲ 6
డాక్స్	15,387	▲ 63
షాంఘై (గురువారం ముగింపు)	3,110	▲ 3
నికాయ్	31,858	▼ 15

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (24 క్యారెట్)	57,719 ▼ 279
బంగారం (22 క్యారెట్)	57,488 ▼ 278
వెండి (కేజీ)	71,603 ▲ 1,171

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.53	84.39
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	100.34	103.16
€	యూరో	ఎస్‌బీఐ	86.56	89.45
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	55.67	57.98
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	52.01	55.29
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	60.76	63.69
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.19	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.71	23.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.25	12.33

ఆరు కంపెనీలుగా వేదాంతా

బిలియనీర్ అనిల్ అగర్వాల్ గ్రూప్.. వేదాంతా రిసోర్సెస్.. సరికొత్త ప్రణాళికలకు తెరతీసింది. వీటి ప్రకారం డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ ఆరు లిస్టెడ్ కంపెనీలుగా విడిపోనుంది. ఇక మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ విభిన్న విభాగాల కార్పొరేట్ నిర్మాణాన్ని పూర్తిస్థాయిలో సమీక్షించనుంది. తద్వారా ఓవైపు రుణ భారాన్ని తగ్గించుకోవడం, మరోపక్క వాటాదారులకు అధిక విలువను రాబట్టడం లక్ష్యాలుగా పెట్టుకుంది. వివరాలు చూద్దాం..

కీలక వ్యాపారాల విడదీత, లిస్టింగ్

న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ కీలక బిజినెస్‌లను ప్రత్యేక కంపెనీలుగా విడదీయనుంది. అల్యూమినియం, ఆయిల్– గ్యాస్, స్టీల్, ఫెర్రస్ మెటల్స్, బేస్ మెటల్స్ పేరుతో ఐదు విభాగాలను విడదీసేందుకు ప్రణాళికలు వేసింది. వీటిని విడిగా లిస్ట్ చేయడం ద్వారా వాటాదారులకు మరింత విలువ చేకూర్చనున్నట్లు వేదాంతా తాజాగా వెల్లడించింది. దీనిలో భాగంగా సరళతర విభజనకు తెరతీయనుంది. వెరసి వేదాంతా వాటాదారులకు తమవద్దగల ప్రతీ 1 షేరుకీ విడదీయనున్న 5 కంపెనీలకు చెందిన ఒక్కో షేరు చొప్పున కేటాయించనున్నారు. ఆపై వీటిని స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ చేయనున్నట్లు వేదాంతా తెలియజేసింది. వెరసి వేదాంతాసహా.. ఆరు లిస్టెడ్ కంపెనీలకు తెరలేవనుంది. ఇక మరోవైపు హిందుస్తాన్ జింక్‌సహా.. కొత్తగా ఏర్పాటు చేసిన స్టెయిన్ లెస్ స్టీల్, సెమీకండక్టర్ డిస్‌ప్లే బిజినెస్‌లలో 65 శాతం చొప్పున వాటాను కలిగి ఉండనుంది. ఈ మొత్తం ప్రణాళికల అమలును 12–15 నెలలలోగా పూర్తిచేయాలని వేదాంతా భావిస్తోంది. గ్రూప్‌నకు మాతృ సంస్థ వేదాంతా రిసోర్సెస్.. హోల్డింగ్ కంపెనీగా కొనసాగనుంది.

హింద్ జింక్ కార్పొరేట్ సమీక్ష

వేదాంతా గ్రూప్ కంపెనీ హిందుస్తాన్ జింక్ పూర్తిస్థాయిలో కార్పొరేట్ నిర్మాణాన్ని సమీక్షించనుంది. కంపెనీ విలువలో మరింత వృద్ధికి వీలుండటంతో కార్పొరేట్ నిర్మాణ సమీక్షకు బోర్డు నిర్ణయించినట్లు మైనింగ్ దిగ్గజం హిందుస్తాన్ జింక్ వెల్లడించింది. ప్రధానంగా జింక్, లెడ్, సిల్వర్, రీసైక్లింగ్ బిజినెస్‌లను ప్రత్యేక చట్టబద్ధ సంస్థలుగా ఏర్పాటు చేసే లక్ష్యంతో ఉన్నట్లు తెలియజేసింది. కంపెనీకిగల భిన్న విభాగాల పరిమాణం, కార్యకలాపాలు, వృద్ధి అవకాశాలను పరిగణనలోకి తీసుకుని తాజా ప్రతిపాదనలకు తెరతీసినట్లు వివరించింది. వీటిలో బిజినెస్ అవసరాలరీత్యా మూలధన నిర్మాణం, పెట్టుబడి కేటాయింపుల విధానాలు, కీలక అంశాలపై ప్రత్యేక దృష్టి తదితర అంశాలున్నట్లు తెలియజేసింది. తద్వారా విభిన్న బిజినెస్‌లు తమ మార్కెట్ పొజిషన్‌ను వినియోగించుకుని దీర్ఘకాలిక వృద్ధి సాధించేందుకు వీలు కల్పించనున్నట్లు తెలియజేసింది. వెరసి అన్ని రకాల వాటాదారులకు విలువ చేకూర్చే వ్యూహంతో ఉన్నట్లు పేర్కొంది.



నిధుల సమీకరణ..

ప్రతీ ప్రత్యేక విభాగాన్నీ ఒక్కొక్క కంపెనీగా విడదీయడం ద్వారా వేదాంతా గ్రూప్ కార్పొరేట్ నిర్మాణాన్ని సరళతరంగా మార్చివేయనుంది. ఆయా రంగాలపై పూర్తిస్థాయిలో దృష్టిసారించే బాటలో స్వతంత్ర సంస్థలుగా ఏర్పాటు చేయనుంది. దీంతో సావరిన్ వెల్త్‌ఫండ్స్ తదితర గ్లోబల్ ఇన్వెస్టర్లతోపాటు.. సంస్థాగత, రిటైల్ ఇన్వెస్టర్లకు పెట్టుబడి అవకాశాలను కల్పించే యోచనలో ఉంది. వెరసి దేశ ఆర్థిక వృద్ధిని అవకాశాలుగా మలచుకునే ప్యూర్‌ప్లే కంపెనీలలో పెట్టుబడులకు వ్యూహాత్మక ఇన్వెస్టర్లను ఆకట్టుకోనుంది. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్న భారత్‌లో కమోడిటీలకు భారీ డిమాండ్ కనిపించనున్నట్లు వేదాంతా భావిస్తోంది. ఇటీవలే సెమీకండక్టర్లు, డిస్‌ప్లే తయారీలోకి సైతం ప్రవేశించింది.

బిజినెస్‌ల విడదీత వార్తలతో ఎన్‌ఎస్‌ఈలో వేదాంతా షేరు 7 శాతం దూసుకెళ్లి రూ. 223 వద్ద నిలవగా.. హిందుస్తాన్ జింక్ 3.5 శాతం జంప్‌చేసి రూ. 308 వద్ద ముగిసింది.

ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ రేటు పెంపు

- 6.5% నుంచి 6.7 శాతానికి అప్
- మిగిలిన చిన్న పొదుపు స్కీమ్‌ల రేట్లు యథాతథం



న్యూఢిల్లీ: ఐదేళ్ల రికరింగ్ డిపాజిట్ పథకంపై వడ్డీ రేటును కేంద్రం శుక్రవారం 6.5 శాతం నుంచి 6.7 శాతానికి పెంచింది. అన్ని ఇతర చిన్న పొదుపు పథకాల రేట్లను యథాతథంగా ఉంచింది. డిసెంబర్ త్రైమాసికానికి సంబంధించి తాజా రేట్ల విధానంపై ఆర్థికశాఖ ఒక సర్క్యులర్ జారీ చేసింది. డిసెంబర్ త్రైమాసికానికి యథాతథంగా కొనసాగుతున్న మిగిలిన పొదుపు పథకాల రేట్లు ఇలా...

స్కీమ్	వడ్డీ(%లో)
సేవింగ్ డిపాజిట్	4
ఏడాది టర్మ్ డిపాజిట్	6.9
రెండు, మూడేళ్ల టర్మ్ డిపాజిట్	7.0
ఐదేళ్ల టర్మ్ డిపాజిట్	7.5
సీనియర్ సిటిజన్ సేవింగ్స్	8.2
మంత్లీ ఇన్‌కమ్ అకౌంట్	7.4
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.7
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.1
కిసాన్ వికాస్ పత్ర	7.5
సుకన్య సమృద్ధి యోజన	8.0

ఇంధన, మెటల్ షేర్లు మెరిశాయ్

- కలిసొచ్చిన ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ
- 19,600 ఎగువకు నిఫ్టీ
- సెన్సెక్స్ లాభం 320 పాయింట్లు
- సూచీలకు 3 వారాల్లో అతిపెద్ద లాభం



ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సెప్టెంబర్ నెలకు లాభాలతో వీడ్కోలు పలికాయి. ఇటీవల పతనంలో భాగంగా కనిష్ట స్థాయిలకు దిగివచ్చిన ఇంధన, మెటల్, బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల షేర్లలో వాల్యూ బైయింగ్ సూచీలను లాభాల బాట పట్టించింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్ల రికవరీ కలిసొచ్చింది. ఉదయం సానుకూలంగా మొదలైన సూచీలు ట్రేడింగ్‌లో అధిక భాగం లాభాల్లో ట్రేడయ్యాయి. అయితే శని, ఆది, సోమవారాలు ఎక్స్ఛేంజీలకు సెలవు కావడంతో ఇన్వెస్టర్ల ఆఖర్లో అప్రమత్తత వహిస్తూ కొంత లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 320 పాయింట్లు పెరిగి 65,828 వద్ద స్థిరపడింది. ఒక దశలో 643 పాయింట్లు లాభపడి 66,152 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 115 పాయింట్లు బలపడి 19,638 వద్ద నిలిచింది. ఒక్క ఐటీ మినహా అన్ని రంగాల షేర్లు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్ క్యాప్, స్మాల్ సూచీలు వరుసగా 1.31%, 0.57 శాతం చొప్పున రాణించాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,686 కోట్ల షేర్లను అమ్మారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2,751 కోట్ల షేర్లను కొన్నారు. ఈ వారం మొత్తంగా సెన్సెక్స్ 181 పాయింట్లు, నిఫ్టీ 36 పాయింట్లు నష్టపోయాయి. యూరోజోన్, అమెరికా సెప్టెంబర్ ద్రవ్యోల్బణ అంచనాలకు తగ్గట్లే దిగిరావడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు రికవరీ బాటపట్టాయి.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- ఇంధన రంగ షేర్లైన రిలయన్స్ (0.50%), ఓఎన్‌జీసీ (2%), ఎన్‌టీపీసీ (3.50%), ఐఓసీఎల్ (1.28%), గెయిల్ (2.50%), బీపీసీఎల్ (1%), ఎస్‌హెచ్‌పీసీ (2%), హెచ్‌పీసీఎల్ (2%), పెట్రోనెట్ ఎల్‌ఎన్‌జీ (2%), ఇంద్రప్రస్థ గ్యాస్ (1%) రాణించాయి.
- ఎంసీఎక్స్ వచ్చే వారం(అక్టోబర్ 3) నుంచి ప్రారంభించాలనుకున్న కొత్త కమోడిటీ డెరివేటివ్స్ ప్లాట్‌ఫామ్ లైవ్ ట్రేడింగ్‌ని వాయిదా వేయాలని సెబీ కోరడంతో షేరు 2.50% నష్టపోయి రూ.2049 వద్ద స్థిరపడింది.
- లాభాల మార్కెట్లోనూ ఐటీ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ ఐటీ సేవల దిగ్గజం యాక్సెంచర్ తన వార్షిక, తొలి త్రైమాసిక ఆదాయ అంచనాలను తగ్గించుకోవడంతో దేశీయ ఐటీ షేర్లపై అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఎల్‌టీఐఎం, ఎల్‌టీటీఎస్, ఇన్ఫోసిస్ షేర్లు 3–1% పతనమయ్యాయి. కోఫోర్జ్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా, టీసీఎస్ షేర్లు అరశాతం వరకు నష్టపోయాయి.
- ఇటీవల వరుస నష్టాలు చవిచూస్తున్న ఫార్మా షేర్లు లాభాల బాటపట్టాయి. అత్యధికంగా గ్లెన్ మార్క్ ఫార్మా 10% ర్యాలీ చేసింది. అరబిందో ఫార్మా 5%, గ్రాన్యూల్స్ 4% లాభపడ్డాయి. లుపిన్, డాక్టర్ రెడ్డీస్, ఆల్కెమ్, సన్‌ఫార్మా, సిప్లా, బయోకాన్ లారస్ ల్యాబ్స్ షేర్లు 3–1% చొప్పున పెరిగాయి. రంగాల వారీగా బీఎస్ఈలో అత్యధికంగా ఫార్మా ఇండెక్స్ 2.60% ర్యాలీ చేసింది.

మౌలిక రంగం భేష్

- ఆగస్టులో 12.1 శాతం వృద్ధి
- 14 నెలల గరిష్ట స్థాయి

న్యూఢిల్లీ: ఎనిమిది పారిశ్రామిక రంగాలతో కూడిన మౌలిక పరిశ్రమ ఆగస్టులో మంచి పనితీరును ప్రదర్శించింది. మౌలిక రంగం సమీక్షా నెల్లో 12.1 శాతం వృద్ధిని (2022 ఇదే నెల గణాంకాలతో పోల్చి) నమోదుచేసుకుంది. గడచిన 14 నెలల్లో (2022 జూన్‌లో వృద్ధి రేటు 13.2 శాతం) ఈ స్థాయి భారీ వృద్ధిరేటు నమోదుకావడం ఇదే తొలిసారి. సిమెంట్ (18.9 శాతం), బొగ్గు (17.9 శాతం), విద్యుత్ (14.9 శాతం), స్టీల్ (10.9 శాతం), సహజ వాయువు (10 శాతం) రంగాలు రెండంకెల్లో వృద్ధి సాధించగా, రిఫైనరీ ప్రొడక్టులు 9.5 (శాతం), క్రూడ్ ఆయిల్ (2.1 శాతం), ఎరువుల (1.8 శాతం) రంగాల్లో వృద్ధి రేటు ఒక అంకెకు పరిమితమైంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24) ఏప్రిల్ నుంచి ఆగస్టు ఎనిమిది రంగాల వృద్ధి రేటు 7.7 శాతంగా నమోదయ్యింది. మొత్తం పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ ఎనిమిది పరిశ్రమల వెయిటేజ్ 40.27 శాతం.



అధిక పెన్షన్ కోసం సంస్థలకు గడువు పెంపు

డిసెంబర్ 31 వరకు అవకాశం



న్యూఢిల్లీ: అధిక పెన్షన్ కోరుకుంటూ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగుల తరఫున, వేతన వివరాలను అప్‌లోడ్ చేసేందుకు గడువును డిసెంబర్ 31 వరకు పొడిగించినట్టు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈ గడువు సెప్టెంబర్ 30తో ముగియనుండగా, సంస్థల యాజమాన్యాలు, యాజమాన్య సంఘాలు చేసిన వినతి మేరకు ఈపీఎఫ్‌వో ఈ నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా సెప్టెంబర్ 29 నాటికి 5.52 లక్షల పెన్షన్ దరఖాస్తులు యాజమాన్యాల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది. అధిక పెన్షన్ కోసం ఈపీఎఫ్‌వో దరఖాస్తులు ఆహ్వానించగా.. జూలై 11 నాటికి మొత్తం 17.49 లక్షల దరఖాస్తులు వ్యాలిడేషన్ ఆఫ్ ఆప్షన్/జాయింట్ ఆప్షన్ కోసం వచ్చినట్టు ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈ దరఖాస్తుదారులకు సంబంధించి వేతన వివరాలను సంస్థలు అప్‌లోడ్ చేసి, తమవైపు ఆమోదం తెలియజేస్తే అప్పుడు వాటిని ఈపీఎఫ్‌వో ప్రాసెస్ చేయడానికి వీలుంటుంది.

జెట్ ఎయిర్‌వేస్ పునరుద్ధరణకు మరో 100 కోట్లు

ఇన్వెస్ట్ చేసిన జలాన్ కల్రాక్ కన్సార్షియం



ముంబై: జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలను పునరుద్ధరించే దిశగా జలాన్ కల్రాక్ కన్సార్షియం (జేకేసీ) మరో రూ. 100 కోట్లు సమకూర్చింది. దీనితో, కోర్టు ఆమోదిత పరిష్కార ప్రణాళిక ప్రకారం మొత్తం రూ. 350 కోట్లు సమకూర్చినట్లయిందని జేకేసీ తెలిపింది. కంపెనీపై పూర్తి అధికారాలు దక్కించుకునేందుకు అవసరమైన నిబంధనలన్నింటినీ పాటించినట్లయిందని పేర్కొంది. ఎయిర్‌లైన్ కార్యకలాపాల పునరుద్ధరణ ప్రణాళికలో ఎటువంటి మార్పులు ఉండవని, వచ్చే ఏడాది (2024) నుంచి ప్రారంభించేందుకు కొత్త ప్రమోటర్లు దృఢనిశ్చయంతో ఉన్నట్లు జేకేసీ వివరించింది. లాంచ్ తేదీని రాబోయే వారాల్లో ప్రకటించనున్నట్లు పేర్కొంది. ఆర్థిక సంక్షోభంతో దివాలా తీసిన జెట్ ఎయిర్‌వేస్ కార్యకలాపాలు 2019 ఏప్రిల్ 17 నుంచి నిల్చిపోయిన సంగతి తెలిసిందే.

మంగోలియాలో మేఘా భారీ ప్రాజెక్ట్

- క్రూడ్ ఆయిల్ రిఫైనరీ నిర్మాణం
- డీల్ విలువ రూ.5,400 కోట్లు



పి.వి.కృష్ణారెడ్డి

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మేఘా ఇంజనీరింగ్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ (ఎంఈఐఎల్) తాజాగా మంగోలియాలో మరో భారీ ప్రాజెక్టును చేజిక్కించుకుంది. ఇందులో భాగంగా అత్యాధునిక ముడిచమురు శుద్ధి కేంద్రాన్ని నిర్మించనుంది. డీల్ విలువ సుమారు రూ. 5,400 కోట్లు. ప్రాజెక్టు పూర్తయితే ఏటా 15 లక్షల టన్నుల ముడిచమురు ఉత్పత్తి చేయనుందని కంపెనీ ప్రకటించింది. మేఘా ఇంజనీరింగ్ ఇప్పటికే మంగోలియాలో రూ.6,500 కోట్ల విలువైన రెండు ప్రాజెక్టులను చేపట్టింది. మంగోలియా రాజధాని ఉలాన్‌బటోర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంఈఐఎల్, మంగోల్ రిఫైనరీ స్టేట్ ఓన్డ్ ఎల్ఎల్‌సీ మధ్య ఒప్పందం జరిగింది. మంగోలియాలో తొలి గ్రీన్ ఫీల్డ్ క్రూడ్ రిఫైనరీ నిర్మాణంలో భాగస్వామ్యం అయినందుకు గర్వంగా ఉందని ఎంఈఐఎల్ ఎండీ పి.వి.కృష్ణారెడ్డి తెలిపారు.

సినిమా



● హన్సిక

పోరాటం.. పోరాటం..

హన్సిక టైటిల్ రోల్‌లో నటించిన లేడీ ఓరియంటెడ్ చిత్రం 'మై నేమ్ ఈజ్ శృతి'. శ్రీనివాస్ ఓంకార్ దర్శకత్వంలో వైష్ణవి ఆర్ట్స్ పతాకంపై బురుగు రమ్యా ప్రభాకర్ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మార్క్ కె. రాబిన్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'పోరాటం పోరాటం..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. కృష్ణకాంత్ రచించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, హారిక నారాయణన్, సత్య యామిని ఆలపించారు. శ్రీనివాస్ ఓంకార్ మాట్లాడుతూ– ''విభిన్నమైన కథాంశంతో రూపొందుతున్న 'మై నేమ్ ఈజ్ శృతి' చిత్రంలో ప్రతి సన్నివేశం ఉత్కంఠభరితంగా ఉంటుంది'' అన్నారు. ''తన భావాల్ని ధైర్యంగా వెల్లడించే శృతిగా విభిన్నమైన పాత్ర చేశాను. ఆద్యంతం మలుపులతో ఈ సినిమా ఆసక్తికరంగా సాగుతుంది'' అన్నారు హన్సిక. ఈ చిత్రానికి కెమెరా: కిశోర్ బోయిడపు, సహనిర్మాత: పవన్‌కుమార్ బండి.



● శ్రద్ధా శ్రీనాథ్

ఏమవుతుంది?

ప్రపంచ మానవాళికి 2064 సంవత్సరంలో ఏం అవుతుంది? ఏం మార్పులు సంభవిస్తాయి? అనే అంశంతో రూపొందిన చిత్రం 'కలియుగం'. శ్రద్ధా శ్రీనాథ్, కిశోర్ ప్రధాన పాత్రల్లో నటించారు. ప్రమోద్ సుందర్ దర్శకత్వంలో కేఎస్ రామకృష్ణ నిర్మించిన ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో త్వరలో రిలీజ్ కానుంది. ''హారర్ థ్రిల్లర్‌గా 'కలియుగం' రూపొందింది'' అని మేకర్స్ పేర్కొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: డాన్ విన్సెంట్, కెమెరా: కె. రామ్‌చరణ్.

నిశ్చితార్థం పూర్తి



● ప్రవీర్, ఐశ్వర్య

ప్రవీర్ శెట్టి, ఐశ్వర్యా గౌడ జంటగా రాజు బొనగాని దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఎంగేజ్‌మెంట్'. రోడియమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సమర్పణలో జయరామ్ దేవ సముద్ర నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. జయరామ్ దేవ సముద్ర మాట్లాడుతూ– ''యూత్‌ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'ఎంగేజ్‌మెంట్'. సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చింది. రాజు బొనగాని అద్భుతంగా తీశాడు. ఈ చిత్రాన్ని తెలుగు, కన్నడ, తమిళ, మలయాళ, హిందీ, బెంగాలీ, ఒడియా భాషల్లో రిలీజ్ చేస్తాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: దిలీప్ బండారి, రజత్ గోష్, కెమెరా: వెంకట్ మన్నం, సహనిర్మాతలు: లక్ష్మీకాంత్ ఎస్ఆర్, నారాయణ స్వామి .ఎస్.

తాంత్రికుడు వస్తున్నాడు



● మహేందర్, వేణుగోపాల చారి

మహేందర్ వడ్లపట్ల, సన్నీ కునాల్, రాజేష్, అనూష, త్రివేణి నటించిన చిత్రం 'తాంత్రికుడు'. సౌమ్య వడ్లపట్ల సమర్పణలో మహేందర్ వడ్లపట్ల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా త్వరలో రిలీజ్ కానుంది. ఈ చిత్రం టీజర్‌ని మాజీ కేంద్ర మంత్రి, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ సముద్రాల వేణుగోపాల చారి రిలీజ్ చేశారు. ''మంచి చిత్రం తీయాలని అమెరికా నుండి వచ్చి, 'తాంత్రికుడు' తీశా'' అన్నారు మహేందర్ వడ్లపట్ల. ఈ చిత్రానికి సంగీతం: కె. ఆనంద్, కెమెరా: వంశీ.

తొలి పోరుడు తనే!



● అక్సా, సమర సింహారెడ్డి

సమర సింహారెడ్డి, అక్సా ఖాన్ జంటగా తెలుగు శ్రీను దర్శకత్వంలో 'మగపులి' సినిమా ఆరంభమైంది. 'ఫార్మర్ ఈజ్ ద ఫస్ట్ సిటిజన్ ఆఫ్ ద వరల్డ్' (రైతే ప్రపంచంలో తొలి పౌరుడు) ఉపశీర్షిక. ఎమ్‌బీడబ్ల్యూడీపీ సమర్పణలో నారాయణ స్వామి నిర్మిస్తున్నారు. తొలి సీన్‌కి రైతు టి. రంగడు కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు సుమన్ క్లాప్ ఇచ్చారు. ''నిరుద్యోగులు, రైతులు, రాజకీయ నాయకుల నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది'' అన్నారు తెలుగు శ్రీను. ''ఆంధ్ర, కర్ణాటక సరిహద్దులో ఉండటం వల్ల కన్నడలో సినిమాలు చేశాను. ఇప్పుడు మాతృ భాషలో సినిమా చేస్తుండటం హ్యాపీ'' అన్నారు సమర సింహారెడ్డి. ఈ చిత్రానికి సంగీతం: భానుప్రసాద్. జె, కెమెరా: శివారెడ్డి యస్వీ.

నవ్వుల జాతర



● కక్షీ, క్రిష్

క్రిష్ సిద్ధిపల్లి, కక్షీ జంటగా 'జంధ్యాలగారి జాతర 2.0' సినిమా షురూ అయింది. వాల్మీకి దర్శకత్వంలో శ్రీ నిధి క్రియేషన్స్ సమర్పణలో సన్ స్టూడియో బ్యానర్‌పై రూపొందుతోన్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. వాల్మీకి మాట్లాడుతూ– ''పూర్తి హాస్యభరిత చిత్రంగా 'జంధ్యాలగారి జాతర 2.0' ఉంటుంది. ఈ సినిమాకు జంధ్యాలగారి పేరు పెట్టడంతో మంచి అంచనాలుంటాయి. ఆ అంచనాలను అందుకునేలా మా చిత్రం ఉంటుంది'' అన్నారు. ''విందు భోజనం లాంటి చిత్రమిది'' అన్నారు క్రిష్ సిద్ధిపల్లి. నటులు రఘుబాబు, పృథ్వీ, యాని మాస్టర్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి సంగీతం: వంశీ కృష్ణ, కెమెరా: విజయ్ ఠాగూర్.

రెఢీ



● షారుక్ ఖాన్



● 'సలార్'లో ప్రభాస్

రెండు పాన్ ఇండియా సినిమాలు ఒకేరోజు థియేటర్లకు వస్తే.. ఏ సినిమా చూడాలి? అనేది ప్రేక్షకుల ముందుండే ప్రశ్న. ఏ సినిమాకి ఎక్కువ థియేటర్లు ఇవ్వాలి? అనేది ఎగ్జిబిటర్ల ముందుండే ప్రశ్న? ఏ సినిమాని ఏ ఏరియాకి ఎంత ఇచ్చి కొనాలి? అనేది డిస్ట్రిబ్యూటర్ల ముందుండే ప్రశ్న.. అసలు రెండు పెద్ద సినిమాలు ఒకేసారి రావడం కరెక్టేనా? బిజినెస్ ఎఫెక్ట్ అవుతుందేమో.. ఇది నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ప్రొడ్యూసర్లు.. ఇలా అందరి ముందుండే ప్రశ్న. శుక్రవారం వచ్చిన 'సలార్' విడుదల తేదీ (డిసెంబర్ 22) ప్రకటన ఈ ప్రశ్నలకు కారణమైంది. అదే రోజు షారుక్ ఖాన్ 'డంకీ' కూడా రిలీజ్ కానుంది. బాక్సాఫీస్‌ను ఢీ కొట్టడానికి రెడీ అవుతున్న 'సలార్', 'డంకీ'... చిత్రాల్లో ఏది వసూళ్లను కొల్లగొడుతుంది? ఈ రెండింటి కారణంగా వేరే చిత్రాలు వాయిదా పడతాయా? ఓ లుక్కేద్దాం.

● డంకీ వర్సెస్ సలార్

ఇండియన్ సినిమా బడా సూపర్ స్టార్స్ ప్రభాస్, షారుక్ ఖాన్ బాక్సాఫీస్ ఫైట్‌కి రెఢీ అయ్యారు. పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ హీరోగా 'కేజీఎఫ్' ఫేమ్ ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్న 'సలార్'లోని తొలి భాగం 'సలార్: సీజ్ ఫైర్'ను డిసెంబరు 22న ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేస్తున్నట్లుగా ఈ చిత్ర యూనిట్ శుక్రవారం ప్రకటించింది. నిజానికి 2022 ఏప్రిల్ 14న విడుదల చేయాలనుకుని, ఆ తర్వాత 2023 సెప్టెంబరు 28కి వాయిదా వేశారు. తాజాగా డిసెంబర్ 22 అంటున్నారు. ఇంకో వైపు మరో పాన్ ఇండియన్ స్టార్ షారుక్ ఖాన్ నటిస్తున్న తాజా చిత్రం 'డంకీ'. హిందీలో 'మున్నాభాయ్ ఎమ్‌బీబీఎస్', '3 ఇడియట్స్', 'పీకే' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్స్ తీసిన అగ్రశ్రేణి దర్శకుడు రాజ్‌కుమార్ హిరాణి ఈ సినిమాకు దర్శకుడు. షారుక్, రాజ్‌కుమార్.. ఈ ఇద్దరికీ విడివిడిగా రికార్డులు ఉండటంతో తొలిసారి ఇద్దరూ కలిసి చేస్తున్న 'డంకీ' చిత్రంపై మంచి అంచనాలున్నాయి. గౌరీ ఖాన్, రాజ్‌కుమార్ హిరాణి, జ్యోతి దేశ్ పాండే ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 2022 ఏప్రిల్ 19న 'డంకీ' సినిమాను ప్రకటించిన రోజే విడుదల తేదీని (22 డిసెంబరు 2023) కూడా ప్రకటించారు. ఇప్పుడు ప్రభాస్ అండ్ టీమ్ ఇదే రోజున 'సలార్' విడుదలను నిర్ణయించడం ఇటు తెలుగు అటు హిందీతో పాటు పాన్ ఇండియా సినిమాలు కాబట్టి.. ఇతర భాషల ఇండస్ట్రీల్లోనూ చర్చనీయాంశమైంది.

ఎవరి రికార్డులు వారివి...

'బాహుబలి: ది కన్‌క్లూజన్' తర్వాత ప్రభాస్ చేసిన 'సాహో (2019)', 'రాధేశ్యామ్ (2022)', 'ఆదిపురుష్ (2023)' చిత్రాలకు ఆశించిన ఫలితాలు రాలేదు. దీంతో ప్రభాస్‌కు 'సలార్' హిట్ కీలకంగా మారింది. ఇటు 'జీరో (2018)' రిజల్ట్‌తో షారుక్ ఖాన్ డీలా పడ్డప్పటికీ ఆ తర్వాత చేసిన రెండు సినిమాలు 'పఠాన్', 'జవాన్' బాక్సాఫీస్ వద్ద కొత్త రికార్డులను క్రియేట్ చేశాయి. ముఖ్యంగా 'జవాన్' చిత్రం కలెక్షన్స్‌లో హిందీ హయ్యెస్ట్ గ్రాసర్‌గా నిలిచిందని యూనిట్ పేర్కొంది. ఇవి షారుక్ ఖాన్ సూపర్ ఫామ్‌ను స్పష్టం చేస్తున్నాయి. అలా అని ప్రభాస్, ప్రశాంత్ నీల్ సినిమాలనూ తక్కువ చేయలేం. ఎందుకంటే ప్రభాస్ 'బాహుబలి: ది కన్‌క్లూజన్' మొత్తం వసూళ్లను షారుక్ ఏ సినిమా కూడా ఇంకా అధిగమించలేదని ట్రేడ్ విశ్లేషకులు చెబుతున్నారు. అలాగే షారుక్ కెరీర్‌లో ఓ డిజాస్టర్‌గా నిలిచిన 'జీరో' రిలీజైన రోజున.. అంటే డిసెంబరు 21నే 'కేజీఎఫ్: ఛాప్టర్ 1' (యశ్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందింది) విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచి, కొత్త రికార్డులను సృష్టించింది. ఇలా ప్రశాంత్ నీల్, షారుక్ ఖాన్ మరోసారి బాక్సాఫీస్ వద్ద ఢీ కొనడానికి రెడీ కావడం ఆసక్తికరమైన విశేషం. ఎవరి రికార్డులు వారికి ఉన్న నేపథ్యంలో తాజా పోటీలో రికార్డ్ ఎవరిదనేది ఆసక్తికరంగా మారింది.

ఆ తేదీకే ఎందుకు?

ఓ సినిమా బాక్సాఫీస్ సరికొత్త రికార్డులను సృష్టించాలంటే సరైన రిలీజ్ డేట్ కూడా ముఖ్యం. ఇప్పుడు 'సలార్', 'డంకీ' చిత్రాలు డిసెంబరు 22ను ఎంచుకోవడం సరైనదే. ఎందుకంటే ఆ రోజు నుంచి వారాంతం ఆరంభమవుతుంది. సరిగ్గా క్రిస్మస్ సెలవులు కూడా మొదలవుతాయి. దీంతో ప్రేక్షకులు థియేటర్స్‌కు రావడం ఖాయం. ఒకవేళ ఈ చిత్రాలు హిట్ టాక్ తెచ్చుకుంటే.. న్యూ ఇయర్, ఆ తర్వాత సంక్రాంతి వరకూ ప్రదర్శనకు స్కోప్ ఉంటుంది. సంక్రాంతి సెలవుల టార్గెట్‌గా కొత్త చిత్రాలు వస్తాయి. అప్పుడు 'సలార్', 'డంకీ'కి థియేటర్లు తగ్గే అవకాశం ఉంది. ఒకవేళ పండగ టైమ్‌లో వచ్చే చిత్రాలకన్నా ఈ రెండూ బంపర్ హిట్ టాక్ తెచ్చుకుంటే అప్పుడు సంక్రాంతి సెలవులను కూడా క్యాష్ చేసుకుంటాయి. ఈ చిత్రాల టాక్ ముందే తెలిసిపోతుంది కాబట్టి.. సంక్రాంతికి వచ్చే చిత్రాల్లో ఏదైనా వాయిదా పడే అవకాశం కూడా లేకపోలేదు.



● 'సైంధవ్'లో వెంకటేశ్



● 'ఎక్స్‌ట్రా'లో నితిన్



● 'హాయ్ నాన్న'లో మృణాల్, బేబీ కియారా, నాని



● 'హరోం హర'లో సుధీర్‌బాబు

ఫుల్ కన్‌ఫ్యూజన్

నో కన్‌ఫ్యూజన్..'సలార్: సీజ్ ఫైర్'ను డిసెంబరు 22న విడుదల చేస్తున్నాం అంటూ 'సలార్' టీమ్ ప్రకటించింది. అయితే 'సలార్'కు కన్‌ఫ్యూజన్ అక్కర్లేకపోవచ్చు కానీ 2023 క్రిస్మస్‌కు ఆల్రెడీ రిలీజ్‌ను కన్ఫార్మ్ చేసుకున్న తెలుగు చిత్రాల విడుదల విషయం ఇప్పుడు ఫుల్ కన్‌ఫ్యూజన్. డిసెంబరు 21న నాని 'హాయ్ నాన్న', 22న వెంకటేశ్ 'సైంధవ్', సుధీర్‌బాబు 'హరోం హర', 23న నితిన్ 'ఎక్స్‌ట్రా' చిత్రాలు విడుదలకు షెడ్యూల్ అయ్యాయి. ఇప్పుడు 'సలార్' ఎఫెక్ట్‌తో ఈ సినిమాల విడుదల వాయిదా పడే అవకాశం ఉంటుంది. ఒకవేళ అప్పుడు వాయిదా వేసి, సంక్రాంతికి వద్దామనుకుంటే ఆల్రెడీ పండగ బరిలో నాగార్జున 'నా సామిరంగ', మహేశ్‌బాబు 'గుంటూరు కారం', రవితేజ 'ఈగల్', విజయ్ దేవరకొండ 'ఫ్యామిలీ స్టార్ (ప్రచారంలో ఉన్న టైటిల్), తేజా సజ్జ 'హనుమాన్' చిత్రాలతో పాటు అనువాద చిత్రాలు శివ కార్తికేయన్ 'అయలాన్', సుందర్. సి 'అరణ్మనై 4' ఉన్నాయి. అయితే ఒకేసారి ఇన్ని సినిమాలంటే థియేటర్ల సంఖ్య ప్రశ్నార్థకమవుతుంది... దాంతో పాటు వసూళ్లు కూడా షేర్ అయిపోతాయి కాబట్టి వీటిలో ఏదైనా వాయిదా పడే అవకాశమూ లేకపోలేదు. ఇక ప్రభాస్ నటిస్తున్న మరో చిత్రం 'కల్కి 2898 ఏడీ' కూడా సంక్రాంతి బరిలో ఉంది. ఈ సినిమా వాయిదా పడే చాన్స్ ఉందని తెలుస్తోంది. **'సలార్', 'డంకీ'... ప్రకటించిన ప్రకారం డిసెంబర్ 22నే వస్తాయా? ఇవి వస్తే ఏ చిత్రాలు వెనక్కి వెళతాయి? సంక్రాంతి బరిలో నిలిచే చిత్రాలేంటి? అనేది తెలియాలంటే కొంత సమయం వేచి ఉండక తప్పదు.**

పీజీ సీట్ల తొలి జాబితా విడుదల

- 22,599 సీట్లలో 18 వేల మంది అమ్మాయిలు
- వర్సిటీల క్యాంపస్ కళాశాలల్లో సీట్ల భర్తీ
- ఎంఈడీ, ఎంపీడీ కోర్సుల్లో ప్రవేశాలు నిలిపివేత

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో పీజీ, పీజీ డిప్లొమా, అయిదేళ్ల పీజీ కోర్సుల్లో సీట్లు సాధించిన విద్యార్థుల మొదటి జాబితాను శుక్రవారం విడుదల చేశారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎల్ఐసీ (లైబ్రరీ సైన్స్), ఎంఎస్‌డబ్ల్యూ (సోషల్ వర్క్), ఎంసీజే (జర్నలిజం) కోర్సుల్లో 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం టీఎస్‌సీపీజీఈటీ-2023లో భాగంగా తొలి విడత కౌన్సెలింగ్ చేపట్టింది. ఓయూతో పాటు కాకతీయ, శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీ, పాలమూరు, తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయాలతో పాటు జేఎన్‌టీయూలోని 45 వేల సీట్లకు 30,176 మంది నమోదు చేసుకోగా 22,599 సీట్లను కేటాయించారు. వారిలో 16,496 మంది అమ్మాయిలు కాగా, 6,103 మంది అబ్బాయిలున్నట్లు టీఎస్‌సీపీజీఈటీ-2023 కన్వీనర్ ప్రొఫెసర్ పాండురంగారెడ్డి వివరించారు. యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలల్లోని సీట్లన్నీ కేటాయించినట్లు చెప్పారు. బీఈడీ, బీపీడీ పరీక్షల ఫలితాలు విడుదల కానందున ఎంఈడీ, ఎంపీడీ సీట్ల కేటాయింపును నిలిపివేశారు. ఎంఏ మరాఠీ, థియేటర్ ఆర్ట్స్, పర్షియన్ కోర్సులకు ఒక్క దరఖాస్తు కూడా రానందున.. సీట్ల కేటాయింపు నుంచి మినహాయించారు. సీట్లు సాధించిన విద్యార్థులు అక్టోబర్ 4 వరకు ఆయా కళాశాలల్లో రిపోర్టు చేయాలని సూచించారు.

దోస్త్ ద్వారా 6,843 సీట్ల కేటాయింపు

ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్, తెలంగాణ (దోస్త్) ఖాళీ సీట్ల భర్తీకి చేపట్టిన ప్రత్యేక దశ కేటాయింపులో 6,843 మంది సీట్లు పొందినట్లు ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్ లింబాద్రి శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. వీరిలో మొదటి ప్రాధాన్యత ద్వారా 6,061 మందికి, రెండో ప్రాధాన్యత ద్వారా 782 సీట్లు వచ్చినట్టు తెలిపారు. ఆర్ట్స్‌లో 1,026, కామర్స్‌లో 2,131, లైఫ్ సైన్స్‌లో 2,240, ఫిజికల్ సైన్స్‌లో 618, డేటా సైన్స్‌లో 61, బీఎస్సీ ఆనర్స్ (కంప్యూటర్ సైన్స్)లో 43, బీఎస్సీ (బయో-టెక్నాలజీ)లో 20, అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ ప్రోగ్రామ్‌లో 104, ఇతర బ్రాంచీల్లో 600 సీట్లు కేటాయించినట్టు వెల్లడించారు. సీట్లు పొందిన వారు శనివారంలోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఇదే రోజు నుంచి అక్టోబర్ 3 వరకూ అన్ని కాలేజీల్లో ఇంట్రా-కాలేజ్ ఫేజ్-2కి వెబ్ ఆప్షన్లు ఇచ్చే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీతో జేఎన్‌టీయూహెచ్ ఒప్పందం

బాలానగర్ (హైదరాబాద్): ఒక ఏడాది పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా కోర్సు ఇన్ మేనేజ్‌మెంట్ ఇన్ ఆర్బిటరేషన్‌లో, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ సైబర్ సెక్యూరిటీ కోర్సుల నిర్వహణకు హైదరాబాద్‌లోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియాతో, జేఎన్‌టీయూహెచ్ శుక్రవారం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ మేరకు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ చాంబర్‌లో జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ డాక్టర్ మంజూరు హుస్సేన్, వీసీ డాక్టర్ కట్టా నరసింహారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

తెలుగు వర్సిటీ కోర్సులకు దరఖాస్తులు

నాంపల్లి (హైదరాబాద్): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2023-24వ విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందడానికి దరఖాస్తులు కోరుతున్నట్టు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లలిత కళారంగంలో ఎంపీఏ (కూచిపూడి, జానపదం, రంగస్థలం, సంగీతం), సామాజిక తదితర శాస్త్రాల విభాగంలో ఎంఏ (జ్యోతిషం), భాషాభివృద్ధి శాఖలో ఎంఏ(లింగ్విస్టిక్స్) కోర్సులలో చేరడానికి ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుండి తక్షణ ప్రవేశాల కోటా కింద దరఖాస్తులను కోరుతున్నట్లు వివరించారు.

చోటు.. నీకు సెల్యూట్!

గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్న ముస్లిం యువకుడు

రహమత్‌నగర్(హైదరాబాద్) : ఓ ముస్లిం యువకుడు తొమ్మిదేళ్లుగా గణేశ్ నవరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తూ మత సామరస్యాన్ని చాటుకుంటున్నాడు. కార్మికనగర్‌కు చెందిన షేక్ చోటు స్థానికంగా స్టార్ కేబుల్‌ను నిర్వహిస్తుంటాడు. ఆటో స్టాండ్ వద్ద ఏటా గణేశ్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తుంటాడు. గణనాథుడిని ప్రతిష్ఠించినప్పటి నుంచి నిమజ్జనం వరకు అన్నీ తానై చూసుకుంటాడు. ఈ క్రమంలోనే మట్టితో తయారు చేయించిన గణపతి విగ్రహాన్ని గురువారం రాత్రి మండపం వద్ద నిమజ్జనం చేశాడు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



రేపు 'భారత్ దాల్' ప్రారంభం

- హాకా ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా పంపిణీ
- 5000 వాహనాల్లో పంపిణీకి ఏర్పాట్లు

సాక్షి, హైదరాబాద్: పప్పుధాన్యాలకు ప్రత్యామ్నాయంగా శనగపప్పు (చనా) వినియోగాన్ని పెంచే ప్రయత్నంలో భాగంగా భారత ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ, ఆహార, ప్రజాపంపిణీ సంస్థ 'భారత్ దాల్' బ్రాండ్ పేరుతో ప్యాక్ అందుబాటులోకి తెస్తోంది. కేంద్రం వద్ద ఉన్న శనగపప్పు స్టాక్‌లో 20 శాతం రిటైల్ సరఫరాగా మార్చి సబ్సిడీ ధరలకు అందించనుంది. ఈ మేరకు వన్ నేషన్ వన్ ప్రైస్ ధరలను అమలు చేస్తోంది. కిలో కేజీ శనగపప్పు ప్యాకెట్ రూ.60, 30 కిలోల ప్యాకెట్‌కు కిలోకు రూ.55 చొప్పున రూ.1,650కి అందించనున్నారు.

హాకాకు 50 వేల టన్నులు..

ఇక దేశ వ్యాప్తంగా 18 రాష్ట్రాలలో 'భారత్ దాల్' బ్రాండ్ శనగపప్పు పంపిణీ బాధ్యతలను రాష్ట్రానికి చెందిన హైదరాబాద్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ అసోసియేషన్ లిమిటెడ్ (హాకా)కు అప్పగించింది. రిటైలర్లు, హోల్‌సేల్ వ్యాపారులకు, ప్రాథమిక సహకార సంఘాలు (ప్యాక్స్), మెట్రో, రిలయన్స్, టాటా రిటైల్ చైన్ హైపర్ మార్కెట్‌లు, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, స్విగ్గీ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లకు హాకా నేరుగా సరఫరా చేయనుంది.

రేపు అధికారికంగా ప్రారంభం

హాకా పంపిణీ చేసే శనగపప్పు భారత్ దాల్ బ్రాండ్‌ను ఆదివారం అధికారికంగా ప్రారంభించనున్నారు. నెక్లెస్‌రోడ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద హాకాచైర్మన్ మచ్చా శ్రీనివాస్‌రావు అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, కేంద్ర ప్రభుత్వ కార్యదర్శి రోహిత్‌కుమార్ సింగ్ పాల్గొననున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.